




# మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక






ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 108: గురువారం 04 డిసెంబర్ 2025:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు24:- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్

## రైతన్నకు అండగా ఉండడమే

# మా విధానం



### రైతు సమస్యలపైనే ప్రధాన దృష్టి

**నీటి వనరులు పెంచేందుకు అనేక ప్రయత్నాలు**

**గోదావరి జలాలను కృష్ణా నదికి కలిపి చూపాం**

**విద్యుత్ ఛార్జీలు పెంచే ఆలోచన లేదు**

**వైసిపి హయాంలో వ్యవసాయ రంగాన్ని భ్రష్టు పట్టించారు**

**నల్లజర్లలో రైతన్నా మీకోసంలో సీఎం చంద్రబాబు**

**నల్లజర్ల :** ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఆధారిత రాష్ట్రం కనుక రైతుల సమస్యలపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నాం అని సిఎం చంద్రబాబు అన్నారు. రైతన్నకు అండగా ఉంటామనేది మా మొదటి నినాదం అన్నారు.. నీటి వనరులు పెంచేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లలో సీఎం చంద్రబాబు బుధరం పర్యటించారు. 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో భాగంగా రైతులు, రైతు కుటుంబాలతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వ పంచ సూత్రాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి.. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడారు. అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చాం.. అమలు చేస్తున్నాం. ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం.సూపర్

మిగతా 2 లో



## బెంగాల్‌లో సర్ సక్రమంగా

# సాగేలా చూడండి

**భాజపా ఎంపీలకు మోడీ హితోక్తులు**

**న్యూఢిల్లీ :** పశ్చిమబెంగాల్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతోంది. దాని నిర్వహణపై బెంగాల్‌కు చెందిన భాజపా ఎంపీలకు ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచనలు చేశారని సమాచారం. ఆ పక్రియ సరళంగా, పారదర్శకంగా

మిగతా 3 లో





## ఆర్టీసీలో దివ్యాంగులకు

# ఉచిత ప్రయాణం

**అన్ని కమిటీల్లో దివ్యాంగులకు ఒకరికి అవకాశం**

**దివ్యాంగుల పెన్షన్ 6వేలకు పెంచిన ఘనత మాదే**

**రాష్ట్ర స్థాయిలో అమరావతిలో 'దివ్యాంగ్ భవన్' ఏర్పాటు**

**ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి**

2




## సంచార్ సాథీ యాప్‌పై


# వెనక్కి తగ్గిన కేంద్రం

**ఆందోళన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం**

**ప్రీ-ఇన్‌స్టలేషన్ తప్పనిసరి కాదని స్పష్టీకరణ**

**ఈ యాప్ ద్వారా ఫోన్‌లలోని వ్యక్తిగత గోప్యతకు భంగమన్న విపక్షాలు**

3




## పల్నాడు జిల్లాలో

# స్క్రబ్ టైఫస్ కలకలం

**ఇప్పటికే ఇద్దరు మృతి చెందగా.. కొందరికి లక్షణాలు**

**పల్నాడు :** పల్నాడు జిల్లాలో స్క్రబ్ టైఫస్ కలకలం సృష్టిస్తుంది. ఈ లక్షణాలతో ఇద్దరు మహిళలు మృతి చెందారు. అలానే మరొకరు చికిత్స పొందుతున్నారు. ముప్పాళ్ల మండలం రుద్రవరం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని జ్యోతి జ్వరం, ఒంటినొప్పులతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 20 రోజుల క్రితం మరణించింది. రాజుపాలెంకు చెందిన వృద్ధురాలు నాగమ్మ కూడా జ్వరంతో చికిత్స పొందుతూ 20 రోజుల క్రితం మృతి చెందింది. అలానే రాజుపాలెం

మిగతా 2 లో

## మౌలిక సదుపాయాల కల్పనలో

# క్రియాశీలకంగా ఉండాలి



**అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి**

**గ్రామస్థాయి నుంచి అభివృద్ధి కమిటీల ఏర్పాటు**

**జనసేన ముఖ్యనేతల సమావేశంలో పవన్ దిశానిర్దేశం**

**మంగళగిరి :** జనసేన పార్టీ నాయకులు, శ్రేణులు తమ పంచాయతీల నుంచి పార్లమెంట్ నియోజకవర్గం వరకు అభివృద్ధిలో భాగం కావాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్యనేతలతో పవన్ సమావేశం నిర్వహించారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రాంత అభివృద్ధిలో అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో క్రియాశీలకంగా వ్యవహరించేలా పార్టీ శ్రేణులను ముందుకు తీసుకువెళ్దామన్నారు. జనసేన పార్టీ కమిటీల నిర్మాణంలో భాగంగామన్నారు. గ్రామ స్థాయిలో అయిదుగురు సభ్యులతో కమిటీని నియమించాలని, వారు గ్రామాభివృద్ధిలో భాగమయ్యేలా చేద్దామని తెలిపారు. అదే విధంగా మండల, అసెంబ్లీ, లోక్ సభ నియోజకవర్గాల అభివృద్ధిపై ఆయా కమిటీలు దృష్టి కేంద్రీకరించేలా ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకూ

మిగతా 2 లో



## ఇండిగో విమాన సేవల్లో

# అంతరాయం

**షెడ్యూల్‌ను సర్దుబాటు చేసిన సంస్థ**

**అంతరాయంపై ప్రయాణికులకు క్షమాపణలు**

3

## ఛత్తీస్‌గడ్‌లో

# మరో ఎన్‌కౌంటర్

**ఐదుగురు మావోలు.. ఒక పోలీస్ మృతి**



3

# డాలర్ దెబ్బకు విలవిల



**మరింత క్షీణించిన రూపాయి విలువ**

**తొలిసారి రూ.90 దాటిన డాలర్**

యుఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కనిష్ట స్థాయికి పడిపోయింది. ఉదయం ట్రేడింగ్‌లో 6 పైసలు తగ్గి చరిత్రలో తొలిసారిగా 90.02కి చేరుకుంది. గ్రీన్‌బ్యాక్‌తో పోలిస్తే 89.96 వద్ద ప్రారంభమైన రూపాయి, రికార్డు స్థాయిలో 90.15కి చేరుకుంది. తరువాత కొంత కోలుకుని 90.02 వద్ద ట్రేడవుతోంది. ఇది దాని మునుపటి ముగింపు కంటే 6 పైసలు తగ్గింది. బ్యాంకులు అధిక స్థాయిలో యుఎస్ డాలర్లను నిరంతరం కొనుగోలు చేయడం, ఎఫ్ఐఐ ఇన్‌ఫ్లోలు కొనసాగడం దీనికి కారణమని చెబుతున్నారు.

వివరాలు3వ పేజీలో

## వివేకా హత్యపై సీబీఐ కోర్టులో

# సునీత కేసు



**త్వరగా విచారణ జరపాలని వినతి**

**కడప :** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సమగ్ర దర్యాప్తు జరపాలని సీబీఐ కోర్టులో ఆయన కూతురు సునీతారెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై

మిగతా 2 లో

# రైతు సమస్యలపైనే ప్రధాన దృష్టి

మొదటి పేజీ తరువాయి

సిక్స్.. సూపర్ హిట్ అయ్యింది. గోదావరి జలాలను కృష్ణా నదికి కలిపాం. రాబోయే రోజుల్లో గోదావరిని వంశధారకు కలుపుతాం. పెన్నా వరకూ తీసుకెళ్తాం. విద్యుత్ ఛార్జీలను పెంచేది లేదని మరోసారి స్పష్టం చేస్తున్నా. ఛార్జీలను పెంచకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం అని అన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఈ సదర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో వ్యవసాయం అస్తవ్యస్థం అయ్యిందని విమర్శలు చేశారు. వైసీపీ హయాంలో భూ రికార్డులు తారుమారు చేశారని ఆరోపించారు. ఇష్టం ఉంటే భూరికార్డులు అలాగే ఉంచారని.. భూములు కబ్జా చేయాలనుకుంటే 22ఏ విధానం అనుసరించారని ఆరోపించారు. వైసీపీ నేతలు ప్రభుత్వ భూములను ఆక్రమించారని విమర్శించారు. గత జగన్ ప్రభుత్వం పశువులకు దాణా కూడా ఇవ్వలేదు. వైసీపీ అక్రమాలను అరికట్టేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పవన్ కల్యాణ్‌లతో కూటమి కట్టి ఎన్నికలకు వెళ్లామని గుర్తుచేశారు. చరిత్రలో ఎప్పుడు లేనంతగా రికార్డు సీట్లను తమకు ప్రజలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. 90 శాతం సీట్లను తమకు ప్రజలు ఇచ్చారని గుర్తుచేశారు. మొదటగా రైతుల సమస్యలు పరిష్కరించాలని అనుకున్నామని దాని తర్వాత మిగతా సమస్యలపై దృష్టి సారించామని తెలిపారు. వ్యవసాయంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తోందని పేర్కొన్నారు. వ్యవసాయం ద్వారా రాష్ట్రానికి ఆరు శాతం ఆదాయం వస్తుంది. వ్యవసాయంలో ఖర్చులెక్కువ ఆదాయం తక్కువ. వ్యవసాయమే మన బలం.. ఈరంగంలో అనేక సమస్యలు వస్తున్నాయి. వ్యవసాయంలో జూదం వద్దు. సమస్యలు అన్ని ఒకేసారి పరిష్కారం అయిపోతాయని భావించి ముందుకు వెళ్తే, నష్టపోయే పరిస్థితి వస్తుంది. రైతుల్లో కూడా మార్పు రావాలి. మేము రూపాయి ఇస్తే, మీరు రుపాయి ఖర్చుపెట్టాలి. చదువుకునే పిల్లలు కూడా వ్యవసాయం అంటే పొలాల నుంచే నేర్చుకోవాలి. ప్రస్తుతం వ్యవసాయ పనులు చేయడానికి ప్రజలు ముందుకు రావడం లేదు.. అందుకే యాంత్రికరణ జరగాలి. మీరు పండించే పంట విలువ ఇక్కడ పరిస్థితిపై ఆధారపడి ఉండదు. ఇతర దేశాలు, ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలపై ఆధారపడి ఉంటాయి. రైతులకు గిట్టుబాటు ధర రావాలి.. ఆదాయం పెరగాలి. ఇప్పుడు ఉభయ గోదావరి జిల్లాల వాసులతో పాటు రాయలసీమ వాసులకు డయాబెటిస్ వస్తోంది. రాష్ట్రాన్ని ఒక మోడల్ స్టేట్‌గా మారుస్తాం. విశాఖపట్నం సమ్మిట్‌లో ఎప్పుడూ రానంత పెట్టుబడులు వచ్చాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.. జఠిలమైన వ్యవసాయ సమస్య పరిష్కరించడానికి ఐదు సూత్రాలు అమలు చేస్తున్నాం. ఇందులో భాగంగానే నీటి భద్రత కల్పించాలని భావించాం. గంగా, కావేరి నదులను అనుసంధానం చేయాలని అప్పుడే నిర్ణయించాం. ఇప్పట్లో సాధ్యం కాదని, కనీసం మన రాష్ట్రంలో నదులను అనుసంధానం చేయాలని నిర్ణయించాం. గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు ఎట్టి పరిస్థితుల్లోనైనా తరలిస్తాం. భూమిని జలాశయంగా చేసి, భూగర్భ జలాలు పెంచితే నీటి సమస్య ఉండదు. నేను చాలా సమస్యలు పరిష్కరించగలను. రైతుల సమస్యలు పరిష్కరించడానికి కొంత సమయం పడుతుంది. గతంలో రాష్ట్రాన్ని అస్తవ్యస్థం చేశారు. కరెంటు చార్జీలను పెంచబోం. గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేస్తున్నాం. పెన్నా నది వరకు తీసుకువెళ్తాం. ప్రతీ ఎకరానికి నీరు అందేలా చేస్తాం. ఏపీలో తాగడానికి, వ్యవసాయానికి, పారిశ్రామికరంగానికి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటాం' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మంతరి అచ్చన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

మొదటి పేజీ తరువాయి



జనసేన పొందిన నామినేటెడ్ పదవుల వివరాలను పరిశీలించారు పవన్ కల్యాణ్. మిగిలిన పదవుల భర్తీపై పలు సూచనలు చేశారు. కూటమి ధర్మాన్ని అనుసరించి ముందుకు వెళ్లడంతోపాటు, పార్టీ కోసం చిత్తశుద్ధితో పని చేసినవారికి వివిధ దశల్లో గుర్తింపు, బాధ్యతలను అందించే దిశగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. పార్టీ కమిటీల నియామకంపై పవన్ పలు సూచనలు ఇచ్చారు. పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ స్థాయి నుంచి నియోజక వర్గ స్థాయి వరకూ పార్టీ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలకు అయిదుగురు చొప్పున సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేయాలి. ఆ సభ్యులు స్థానికంగా అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలి. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్ట్ గా పిఠాపురంలో నియోజకవర్గ స్థాయిలో అయిదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటైంది.. ఆ కమిటీ పని తీరును మదింపు చేసి రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, మండల, నియోజకవర్గ కమిటీలు రూపకల్పన చేయాలి. పార్టీ అంతర్గత వ్యవహారాలకు సంబంధించి నెలకొనే అంశాలను పరిష్కరించేందుకు ఉద్దేశించిన కాన్ ఫ్లిక్ట్ మేనేజ్మెంట్ విభాగాన్ని కేంద్ర కార్యాలయం నుంచే పర్యవేక్షించాలి. ఈ విభాగంలో 11 మంది వరకు సభ్యులను నియమించాలి. ఈ విభాగం ముందుకు వచ్చే అంశం ప్రాధాన్యం, తీవ్రతను బట్టి ముగ్గురు లేదా మొత్తం విభాగంలోని సభ్యులు చర్చించి పరిష్కరించాలని పార్టీ అధినేత పవన్ దిశానిర్దేశర చేశారు. ఇకపై ప్రతి కమిటీలో మహిళలకు స్థానం కల్పించాలని స్పష్టం చేశారు. అయిదుగురు సభ్యులు ఉండే కమిటీలో తప్పనిసరిగా ఒకరు, గరిష్టంగా ఇద్దరు వీర మహిళలు సభ్యులుగా ఉండాలి.. 11మంది సభ్యులు ఉండే కమిటీ ముగ్గురు వీర మహిళలకు స్థానం ఇస్తూ కమిటీలు ఉండాలని నిర్ణయించారు.

# పల్నాడు జిల్లాలో స్క్రబ్ టైఫస్ కలకలం

మొదటి పేజీ తరువాయి

మండలం కొత్తూరుకు చెందిన మరో వృద్ధురాలు సాలమ్మ కూడా స్క్రబ్ టైఫస్ లక్షణాలతో ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. చనిపోయిన జ్యోతి, నాగమ్మల శాంపిల్స్ ను టెస్టుల కోసం ముంబై పంపించారు. పరీక్షల్లో స్క్రబ్ టైఫస్‌తో మృతిచెందినట్లు రిపోర్టుల్లో తేలినట్లు ప్రచారం జరుగుతుంది. దీని గురించి స్పష్టత రావాల్సి ఉంది. స్క్రబ్ టైఫస్ వ్యాధి గురించి వైద్యులు పలు వివరాలు తెలిపారు. నల్లిని పోలిన చిన్న కీటకం స్క్రబ్ టైఫస్. గత కొన్నేళ్లుగా జిల్లాలో తన ఉనికిని చాటుకుంటూనే ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దీని బారినపడి ఇబ్బంది పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. స్క్రబ్ టైఫస్ కాటుతో సోకే బ్యాక్టీరియా ప్రభావాన్ని గుర్తించేందుకు గుంటూరు సమగ్రాసుపత్రిలో ప్రయోగశాల ఉందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి తెలిపారు. అనుమానిత లక్షణాలున్న వారి రక్త నమునాలు పంపితే నిర్ధారణ పరీక్షలు చేస్తామని వైద్యులు తెలిపారు. పాజిటివ్‌గా గుర్తిస్తే చికిత్స అందిస్తారని వైద్యాధికారి డాక్టర్ రవి తెలిపారు. ఇది మనుషుల నుంచి మనుషులకు వ్యాపించదని వివరించారు. తగిన జాగ్రత్తలు తప్పనిసరి అని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

# వివేకా హత్యపై సీబీఐ కోర్టులో సునీత కేసు

మొదటి పేజీ తరువాయి

బుధవారం న్యాయస్థానం విచారణ చేసింది. ఈ క్రమంలో సునీత వేసిన పిటిషన్‌పై వాదనలు పూర్తి అవడంతో తీర్పును రిజర్వ్ చేసింది సీబీఐ కోర్టు. ఈ నెల 10వ తేదీన తీర్పు వెల్లడించనుంది సీబీఐ కోర్టు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు జరిపించేలా సీబీఐకు న్యాయస్థానం ఆదేశాలు ఇవ్వాలంటూ సునీత న్యాయవాదులు వాదనలు వినిపించారు. తన తండ్రి హత్య కేసులో సమగ్ర దర్యాప్తు జరపకపోతే అసలైన వ్యక్తులు తప్పించుకునే ప్రమాదం ఉందని పేర్కొన్నారు సునీత. ఇదే కేసులో సప్లమెంటరీ ఛార్జ్‌షీట్ దాఖలు చేసేలా సీబీఐకి ఆదేశాలు ఇవ్వాలని సీబీఐ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు సునీత తరుపు న్యాయవాది. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు జరిపితే ఇప్పటివరకు వెలుగు చూడని సంచలన విషయాలు బయటకు వస్తాయని అభిప్రాయపడ్డారు సునీతారెడ్డి.

# ఆర్టీసీలో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం

**విజయవాడ :** ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఇకపై దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కూటమి ప్రభుత్వం తరఫున సీఎం.. 7 వరాలు ప్రకటించారు. స్థానిక సంస్థలు, కార్పొరేషన్లు, పబ్లిక్ సెక్టార్ ఎంటర్ ప్రైజెస్‌లో కనీసం ఒక దివ్యాంగ ప్రతినిధిని నామినేట్ చేస్తామని తెలిపారు. ఆర్థిక సబ్సిడీ పథకాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అందించినట్టుగానే దివ్యాంగులకు మళ్లీ ప్రారంభిస్తామని అన్నారు. శాప్ ద్వారా అన్ని క్రీడా కార్యక్రమాలు, టాలెంట్ డెవలప్‌మెంట్ స్కీములు దివ్యాంగులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామన్నారు. దేశంలో ఎక్కడా కూడా పించన్లకు రూ.6 వేలు ఇచ్చే ప్రభుత్వం లేదని.. ఒక్క ఏపీలో మాత్రమే ఉందని చంద్రబాబు నాయుడు అన్నారు. రూ.3 వేల పింఛన్‌ను రూ.6వేలకు పెంచామని గుర్తుచేశారు. 63లక్షల 50వేల మందికి ప్రతి నెలా ఒకటో తేదీనే ఇళ్లకు వెళ్లి పెన్షన్ ఇస్తున్నామని వివరించారు. దివ్యాంగులపై తమ ప్రభుత్వానికి ఉన్న కమిట్‌మెంట్ ఇదని పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతులు కాబట్టే... అనేక రంగాల్లో రాణిస్తున్నారని చెప్పుకొచ్చారు. బహుళ అంతస్తులు కలిగిన ప్రభుత్వ హౌసింగ్ ప్రాజెక్టుల్లో దివ్యాంగులకు గ్రౌండ్ ఫ్లోర్ కేటాయిస్తామని వెల్లడించారు. బాపట్లలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కాలేజీతో పాటు వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలు, హాస్టల్స్‌లో చదివే దివ్యాంగ విద్యార్థులకు అదే చోట సామాజిక భద్రతా పెన్షన్ పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయిలో అమరావతిలో 'దివ్యాంగ్ భవన్' ఏర్పాటు చేస్తామన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు.

'ఏడాదికి రూ.6వేలకోట్లు పెన్షన్ రూపంలో అందిస్తున్నాం. బ్యాక్ లాగ్ పోస్టులకు స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ పొడిగిస్తున్నాం. ఎన్ని అడ్డంకులు ఉన్నా వైకల్యం అడ్డుకాదని ఇక్కడ ఉన్న కొంతమంది నిరూపించారు. అలాంటి ఆదర్శవంతులను అభినందించాలి. ఆశీర్వదించాలి. దృష్టి లోపం ఉన్నా కరుణా కుమారి పట్టుదలతో రాణించి అవార్డు సాధించారు. అంతర్జాతీయ ప్రపంచ కప్ క్రికెట్ 42 పరుగులు సాధించి భారత్‌కు కప్ అందించింది. ఆమె ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివి ఈ స్థాయికి చేరిందంటే నేను గర్విస్తున్నా. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని స్ఫూర్తి పొందాలి. అజయ్ కుమార్ రెడ్డి అర్జున అవార్డు సాధించడం గొప్ప విషయం. కర్ణాటక తరపున ఆడిన దీపిక మన రాష్ట్రంలో పుట్టారు. కంటి చూపు పోయినా అధైర్య పడకుండా క్రికెట్‌లో, వంద మీటర్ల పరుగులో రాణించారు. నేడు మెగాడీఎస్సీ ద్వారా 2వేలకు పైగా పోస్టులను భర్తీ చేస్తున్నాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా బస్సు ప్రయాణం సదుపాయం కల్పిస్తున్నాం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'విశాఖపట్నంలో నేషనల్ సెంటర్ పర్ డిజేబుల్ స్పోర్ట్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం. కరుణ కుమారికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ తరపున రూ. 5లక్షలు, మరో రూ. 5 లక్షలు, అంధుల క్రికెట్ అసియేషన్ ఒక లక్షతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.15లక్షలు, ఇళ్లు కట్టిస్తున్నాం. అజయ్ కుమార్ రెడ్డికి ప్రభుత్వం తరపున రూ.2 లక్షలు, ఎసీఏ తరపున లక్ష ఇస్తున్నాం. దీపికకు రూ.10 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. ఇంద్రధనస్సు రంగుల్లా మీ జీవితాలు బాగుండాలని, ఏడు వరాలు ఇస్తున్నాం. దివ్యాంగులు అందరికీ ఉచిత ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నాం. స్థానిక సంస్థల్లో గెలుస్తారు.. ఓటమి చెందితే.. ఎక్స్ అఫీషియో సభ్యులుగా ప్రాధాన్యత ఇస్తాం. ప్రజాసేవకు దివ్యాంగులు అన్ని విధాలా సమర్థులని చెప్పేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం. ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు ఇచ్చేలా దివ్యాంగులకు కూడా రూ.19 కోట్లు కేటాయించి రుణాలు ఇస్తాం. క్రీడల్లో రాణించేలా అన్ని విధాలా ప్రోత్సహిస్తాం. టిడ్కో ఇళ్లు ఎక్కడ ఇచ్చినా.. గ్రౌండ్ ఎ÷-లోర్‌లో ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. వినికిడి లోపం ఉన్న వారికి ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేస్తాం. రెసిడెన్షియల్ విద్యార్థులు ఎక్కడ ఉంటే అక్కడకు వచ్చి పెన్షన్ ఇచ్చే ఏర్పాటు చేస్తాం' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. అమరావతితో సహా అన్ని జిల్లాల్లో విభిన్న ప్రతిభావంతుల కోసం ఒక భవనం ఏర్పాటు చేస్తాం. విభిన్న ప్రతిభావంతుల భవన్‌లో మీరు కార్యక్రమాలు చేసుకోవచ్చు. ప్రజా రాజధాని అమరావతిలో స్వేచ్ఛగా తిరిగేలా ఏర్పాట్లు చేస్తాం. మీకు అండగా, తోడుగా నేను ఉంటా.. మిమ్మలను ముందుకు నడిపిస్తా. ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లండి.. మిమ్మలను ఆదుకునే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది.

ఎంత బిజీగా ఉన్నా మీతో మమేకం అయ్యి, మీకు ధైర్యం చెప్పాలనే ఉద్దేశంతోనే ఈకార్యక్రమానికి వచ్చాను. 2019 నుంచ 2024 మధ్య ఎప్పుడైనా ఇలాంటి కార్యక్రమాలు చూశారా.. దివ్యాంగులకు సభ పెట్టారా అని అడుగుతున్నా. ఒక్క రూపాయి అయినా మీకు సాయం చేశారా ఆలోచన చేయండి. దివ్యాంగులపై కక్ష కట్టి దాడులు చేశారు తప్ప.. మిమ్మలను ఆదుకోలేదు. నేను మీకు అండగా ఉంటాను.. తప్పకుండా మీకు ప్రభుత్వం అన్ని విధాలా చేయూతను ఇస్తుంది' అని సీఎం చంద్రబాబు వెల్లడించారు. కార్యక్రమంలో సీఎంతో పాటు మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, పెద్దఎత్తున విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

# అమరావతిలో పచ్చదానికి పెద్దపీట

## మీడియా సమావేశంలో మంత్రి నారాయణ

**అమరావతి :** రాజధాని అమరావతిలో 30 శాతం గ్రీనరీకి అధిక ప్రాధాన్యమిస్తున్నామని ఏపీ మంత్రి నారాయణ తెలిపారు. పచ్చదనంతో కూడిన రాజధాని నిర్మాణం మా లక్ష్యం అన్నారు. అందుకే గ్రీన్ బెల్ట్‌కు అధికంగా ప్రాధాన్యం కల్పిస్తున్నామిన చెప్పారు. 133.3 కి.మీ పరిధిలో ప్లాంటేషన్ ప్రణాళిక రూపొందించినట్లు ఆయన వివరించారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాజధాని పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నాం. శాఖమూరు, కృష్ణాయపాలెం, నీరుకొండలో గ్రీన్ అండ్ బ్లూ కాన్సెప్ట్‌కు ప్రణాళిక రూపొందించాం. జనవరి నెలాఖరు నాటికి టెండర్ల పక్రియ పూర్తిచేస్తాం. సీజన్‌లో వచ్చే ప్లవర్స్ ప్రకారం బ్యూటిఫికేషన్ ఉంటుంది. 22 రోడ్లలో రెండువైపులా బఫర్ జోన్‌లో గ్రీనరీ అభివృద్ధి జరుగుతుంది. రాజధాని రైతుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. 29 గ్రామాల పరిధిలో భూసమీకరణకు రైతులకు ఇవాల్టికీ విజ్ఞప్తి చేస్తున్నాం. రైతులు ముందుకు రాకుంటే భూసేకరణకు వెళ్తాం. సీఆర్డీఏ కార్యాలయంలోనే రైతుల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తాం అని నారాయణ తెలిపారు.

# అమరావతి పేరుతో రియల్ వ్యాపారం

## తొలివిడత భూములతో రాజధాని ఎక్కడ
## అప్పుడే రెండో విడతలో భూసేకరణ ఎవరి కోసం
## చంద్రబాబు తీరుపై మండిపడ్డ పిసిసి చీఫ్ షర్మిల




**విజయవాడ :** మింగ మెతుకు లేదు..మీసాలకు సంపెంగ నూనెలా ఉంది ముఖ్యమంత్రి చంద్రబాబు గారి తీరు అని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల విమర్శలు గుప్పించారు. తొలి విడత సేకరించిన 54 వేల ఎకరాల్లో వరల్డ్ క్లాస్ నగరం అమరావతి ఎక్కడ అన్నారు. ఐకానిక్ సముదాయాల నిర్మాణాలేవి? రైతుల నుంచి తీసుకున్న 34 వేల ఎకరాల్లో 29 వేల మంది రైతులకు ఇచ్చిన హామీల సంగతేంటని ప్రశ్నించారు. 217 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఒక్క కిలోమీటర్ అయినా నిర్మాణం జరిగిందా అన్నారు. కళ్ళముందు సింగపూర్, జపాన్, డిల్లీ నగరాలు కనిపిస్తున్నట్లు, అమరావతి విశ్వనగరంలో ఇక భూములు లేనట్లు అప్పుడే రెండో విడత 16 వేల ఎకరాల భూ సేకరణ మొదలు పెడతారా ? ఇది రియల్ ఎస్టేట్ మాఫియా కాకుంటే మరేంటని నిలదీసారు. అదానీ,అంబానీ కి బాకీ పడ్డారని భూములు సేకరిస్తున్నారా అని నిలదీసారు. ముంబాయి ఛత్రపతి విమానాశ్రయం 1850 ఎకరాలు.. భోగాపురం 2200 ఎకరాలు. మరి అమరావతికి 5 వేల ఎకరాలు ఎందుకని అన్నారు. బీజింగ్,లండన్ లలో ఒలంపిక్స్ నిర్వహించే స్పోర్ట్స్ సిటీలు 150 ఎకరాల విస్తీర్ణమే. మరి అమరావతి స్పోర్ట్స్ సిటీకి 2500 ఎకరాలు ఎందుకు ? గడిచిన 11 ఏళ్లలో ఒక్క పరిశ్రమ రాని అమరావతిలో స్మార్ట్ ఇండస్ట్రీల కోసం భూములు అంటే నమ్మశక్యమేనా ? రాజధాని భూములపై వెంటనే శ్వేతపత్రం ఇవ్వాలి. ఇది భూములు ఇచ్చిన 29 వేల మంది రైతులను మోసం చేయడమే. రెండో విడత భూ సేకరణను కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. రాజధానికి లక్ష కోట్ల అప్పులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. అమరావతి నిర్మాణం కేంద్రం భాధ్యత. రాజధాని విభజన హామీ. స్వయంగా కేంద్ర ఆర్థిక మంత్రి గారు రాష్ట్రానికి వస్తే, రాజధానికి సహాయం అడగాల్సిన పేరు శాలువాలు కప్పి, ఆహా ఓహో అని డప్పు కొడతారా ? అమరావతి పేరుతో చేసే అప్పులు జీవితాలలో తీరేవేనా అని సూటిగా ప్రశ్నించారు.

# ఏపీకి నక్షా కింద రూ.125 కోట్లు మంజూరు

## కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి



**అమరావతి :** కేంద్ర ప్రభుత్వం ఏపీకి నక్షా కింద రూ.125 కోట్లు మంజూరు చేసిందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. నక్షా కార్యక్రమం కింద పట్టణ భూసమీకరణ వ్యవస్థను ఆధునికీకరించడంలో చూపిన ప్రగతికి కేంద్రం ఈమేరకు నిధులు మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. 10 పట్టణ స్థానిక సంస్థల్లో చూపిన విశేష పురోగతికి గుర్తింపుగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ విషయాన్ని 'ఎక్స్' ద్వారా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. ప్రధాని మోదీ దూరదృష్టి, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో పాలనను మరింత బలపరిచే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పెమ్మసాని అన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులకు ప్రాపర్టీ కార్డులు జారీచేసే నక్ష ప్రాజెక్టుకు రాష్ట్రంలో పది పుర, నగరపాలక సంస్థలను కేంద్రం ప్రయోగాత్మకంగా ఎంపిక చేసింది. 2026 మార్చి నెలాఖరులోగా ప్రాజెక్టు పూర్తిచేసి ప్రజలకు కార్డులు ఇస్తారు. రెండోదశలో మరికొన్ని పట్టణాలు ఎంపికయ్యే అవకాశాలున్నాయి. నగరాలు, పట్టణాల్లో భూములు, స్థలాలపై కచ్చితమైన రికార్డుల తయారీ, ఉన్న రికార్డుల నవీకరణ ద్వారా వివాదాలకు పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో జాతీయ జియో స్పేషియల్ పరిజ్ఞానం ఆధారంగా పట్టణ ఆవాసాల్లో భూ సర్వే (నక్ష) పేరుతో కేంద్రం ప్రత్యేక కార్యక్రమాన్ని ఈ ఏడాది ప్రారంభించింది. పైలట్ ప్రాజెక్టు అమలు కోసం దేశవ్యాప్తంగా 152 పట్టణ స్థానిక సంస్థలను ఎంపికచేసి రూ.194 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలో ఒంగోలు, అనంతపురం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, కాకినాడ, ఏలూరు, తిరుపతి, మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థలతోపాటు కుప్పం పురపాలక సంఘాన్ని తొలి విడతలో కేంద్రం ఎంపిక చేసింది.

# అడ్డూ అదుపులేని వెండి ధరలు

- వేలల్లో పెరుగుతూ బంగారానికి సవాల్
- రూ.1,84,727 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరిక



**న్యూఢిల్లీ :** వెండిధరలు అదరగొడుతున్నాయి. బంగారంతో నాకేంటి పోటీ అన్నట్లుగా అమాంతంగా పెరుగుతున్నాయి. పెరగడమే తప్ప తగ్గడం లేదు. సరిగ్గా ఏడాది క్రితం వెండి ధర కిలో తొలిసారి లక్ష రూపాయలు దాటితే అంతా అబ్బో అనుకున్నారు. కానీ, ఇప్పుడు అదే వెండి పసిడికి ఏమాత్రం తక్కువ కానంటోంది. పట్టపగ్గాల్లేకుండా దూసుకెళుతోంది. దేశీయంగా కిలో వెండి రూ. 1.84 లక్షల వద్ద సరికొత్త రికార్డు గరిష్ఠాలను నమోదు చేసింది. అటు పసిడి సైతం రూ. 1.30 లక్షల పైనే పలుకుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధర పెరగడానికి తోడు, రూపాయి విలువ పతనం కావడమూ ఈ లోహాల ధరల పెరుగుదలకు కారణమని అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. వెండి అత్యధికంగా రూ. 3,126 పెరిగి రూ. 1,84,727 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరింది. బుధవారం డాలరుతో రూపాయి మారకం విలువ 90 మార్కు దాటింది. దీంతో దేశీయంగా వీటి ధరలు పెరిగాయి. దీనికితోడు యూఎస్ ఫెడ్ వడ్డీరేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో ఫ్యూచర్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు పెరుగుదలకు కారణమని అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు 4,204 వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 57.90 డాలర్ల వద్ద కొనసాగుతోంది. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి రూ. 1.32 లక్షలు పలుకుతుండగా.. కిలో వెండి రూ. 1.83 లక్షలుగా ఉంది. గతంలో దేవుళ్ల బొమ్మలు, పూజా సామగ్రి, సంపన్నుల ఇళ్లల్లో పళ్లాలు, గ్లాసులకు వెండిని దేశీయంగా వినియోగించేవారు. కొవిడ్ తర్వాత పరిస్థితులు మారాయి. పారిశ్రామికంగా వెండి వినియోగం పెరిగింది. సౌర విద్యుత్ రంగం, విద్యుత్ కార్లు, మొబైల్స్ తదితర రంగాల నుంచి దీనికి డిమాండ్ పెరిగింది. దీనికితోడు చిన్న మదుపరులు పెట్టుబడి కోసం వెండిని కొనడం ప్రారంభించారు. ద్రవ్యోల్బణాన్ని తట్టుకునే శక్తి బంగారంతో పాటు వెండికీ ఉందని చెబుతుండటంతో, మదుపరుల్లో ఆసక్తి పెరుగుతోంది. దీంతో ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెడుతున్నారు.

# లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఎంపీల ఆందోళన




**న్యూఢిల్లీ :** మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా బుధవారం ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంటు ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ నిరసనలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, ఇండియా బ్లాక్ ఎంపీలు పాల్గొన్నారు. 'కార్పొరేట్ జంగిల్ రాజ్‌కి నో? కార్మిక న్యాయానికి ఎస్' అని రాసిన బ్యానర్లు పట్టుకుని ప్రతిపక్ష ఎంపీలు నిరసన తెలిపారు. కాగా, పార్లమెంటు సమావేశాల రెండో రోజు కూడా ఎస్ఐఆర్‌పై చర్చించాలని ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో.. కేంద్ర ప్రభుత్వం దీనిపై డిసెంబర్ 9న చర్చించేందుకు ఆమోదించింది. డిసెంబర్ 1 నుంచి 19 వరకు పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరగనున్నాయి.

# డాలర్ దెబ్బకు విలవిల

**మరింత క్షీణించిన రూపాయి విలువ**

**చరిత్రలో తొలిసారి రూ.90 దాటిన డాలర్**



**ముంబై :** యుఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కనిష్ట స్థాయికి పడిపోయింది. ఉదయం ట్రేడింగ్‌లో 6 పైసలు తగ్గి చరిత్రలో తొలిసారిగా 90.02కి చేరుకుంది. గ్రీన్‌బ్యాక్‌తో పోలిస్తే 89.96 వద్ద ప్రారంభమైన రూపాయి, రికార్డు స్థాయిలో 90.15కి చేరుకుంది. తరువాత కొంత కోలుకుని 90.02 వద్ద ట్రేడవుతోంది. ఇది దాని మునుపటి ముగింపు కంటే 6 పైసలు తగ్గింది. బ్యాంకులు అధిక స్థాయిలో యుఎస్ డాలర్లను నిరంతరం కొనుగోలు చేయడం, ఎఫ్ఐఐ ఇన్‌ఫ్లోలు కొనసాగడం దీనికి కారణమని చెబుతున్నారు. దేశీయ స్టాక్ మార్కెట్లలో, సెన్సెక్స్ 165.35 పాయింట్లు తగ్గి 84,972.92కు, నిఫ్టీ 77.85 పాయింట్లు తగ్గి 25,954.35కు చేరుకుంది. రూపాయి క్షీణత అకస్మాత్తుగా సంభవించలేదు. ఇది 2025 అంతటా క్రమంగా తగ్గుతూ వచ్చింది. అప్పుడప్పుడు తిరిగి పుంజుకునే సంకేతాలు వచ్చినప్పటికీ కొనసాగలేకపోయింది. 2025 ప్రారంభంలో రూపాయి బలహీనపడటం ప్రారంభమైంది. 2025 జనవరి మధ్య నాటికి, రూ. 86.70కి పడిపోయింది. మార్చి 10న 30 పైసలు తగ్గి సుమారు రూ. 87.25కి చేరుకుంది. సెప్టెంబర్‌లో ఇది ఆల్‌టైమ్ కనిష్ట స్థాయికి చేరుకుంది. దాదాపు రూ. 88.79కి చేరుకుంది. నవంబర్ 21న రూ. 89.49కి పడిపోయింది. నవంబర్ చివరిలో ఇది కోలుకునే సంకేతాలను చూపించింది. కొన్ని రోజుల్లో రూపాయి రూ. 89.26- రూ. 89.28 మధ్య ట్రేడవుతూ నిలిచింది. కానీ దీనిని నిలబెట్టుకోలేకపోయింది. డిసెంబర్ నాటికి ఇది 90 దాటి దిగువకు పడిపోయింది.

# ఢిల్లీ మున్సిపల్ ఉప ఎన్నికల్లో బీజేపీ సత్తా

**12 స్థానాల్లో 7 గెలుపు.. ఆప్‌కు 3 సీట్లు ● కాంగ్రెస్, ఫార్వర్డ్ బ్లాక్‌కు చెరో సీటు**

**న్యూఢిల్లీ :** ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఉప ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ పైచేయి సాధించింది. 12 స్థానాల్లో 7 స్థానాలు గెలుచుకుంది. ఫిబ్రవరి అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన గెలుపును పదిలం చేసుకుంది. దశాబ్దానికి పైగా అధికారంలో కొనసాగి పది నెలల క్రితం అధికారాన్ని కోల్పోయిన ఆమ్ ఆద్మీ పార్టీ 3 సీట్లు గెలుచుకుని రెండో స్థానానికి పరిమితమైంది. కాంగ్రెస్ పార్టీ ఒక సీటును దక్కించుకోగా, మరో సీటును ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ గెలుచుకుంది. ఎంసీడీ ఉప ఎన్నికల్లో బీజేపీ ఏడు సీట్లు దక్కించుకున్నప్పటికీ మొత్తం 12 సీట్లలో ఇంతకుముందు 9 సీట్లు బీజేపీవే. ఇప్పుడు కోల్పోయిన రెండు సీట్లలో ఒక సీటు కాంగ్రెస్, మరొకటి ఏఐఎఫ్‌బీ చేజిక్కించుకున్నాయి. 2022లో జరిగిన పూర్తిస్థాయి ఎన్నికల్లో ఆప్ గెలుచుకున్న చాందినీచౌక్‌ను ఇప్పుడు బీజేపీకి చెందిన సుమన్ గుప్తా గెలుచుకోవడం ఆ పార్టీకి సానుకూల పరిణామం. 2022లో గెలుచుకున్న నరైన వార్డును తిరిగి ఆప్ నిలబెట్టుకుంది. బీజేపీ రెండు సీట్లు కోల్పోయినప్పటికీ ఎంసీడీలో ఆ పార్టీ ఆధిపత్యానికి ఢోకా లేదనే చెప్పాలి. మొత్తం 250 సీట్లలో బీజేపీకి ప్రస్తుతం 122 సీట్లు ఉండగా, ఆప్ 102 స్థానాలు కలిగి ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం తర్వాత ఎంసీడీ ఉప ఎన్నికలు రావడంతో ముఖ్యమంత్రి రేఖాగుప్తాకు ఇది పరీక్షగా అందరూ భావించారు. అయితే ఆమె సునాయాసంగా పరీక్షలో నెగ్గారు. ఆప్ ఢిల్లీ యూనిట్ బాధ్యతలు తీసుకున్న సౌరభ్ భరద్వాజ్‌కు కూడా ఇది తొలి ఎన్నికలే అయినప్పటికీ ఆయన కూడా ఎలాంటి సీటు కోల్పోకుండా ఎన్నికలను గట్టెక్కించారని చెప్పవచ్చు. గ్రేటర్ కైలాశ్, షాలిమార్ బాగ్ బి, అశోక్ విహార్, చాందినీ చౌక్, చాందినీ మహల్, డిచావున్ కలాన్, నరైన, సంగమ్ విహార్ ఏ, దక్షిణ్ పురి, ముండ్కా, వినోద్ నగర్, ద్వారకా బి వార్డుల్లో ఈ ఉప ఎన్నికలు జరిగాయి. వార్డు కౌన్సిలర్లు అసెంబ్లీకి ఎన్నిక కావడంతో 11 వార్డులకు ఖాళీలు ఏర్పడ్డాయి. కాంగ్రెస్ పార్టీ సంగమ్ విహార్-ఏలో మాత్రమే గెలిచింది. ఆ పార్టీ అభ్యర్థి సురేష్ చౌదరికి 12,766 ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థికి 3,628 ఓట్లు వచ్చాయి. చాందినీ మహల్ వార్డును ఏఐఎఫ్‌బీ అభ్యర్థి మహమ్మద్ ఇమ్రాన్ గెలుచుకున్నారు. దక్షిణపురి,ముండ్కా, నరైనా వార్డులను ఆప్ గెలుచుకుంది. తక్కిన ఏడు వార్డుల్లోనే బీజేపీ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు.







# 13 మంది కుటుంబ సభ్యులను కాల్చివేత

**హంతకుడికి బహిరంగ మరణం**

**బాలుడితో కాల్చి చంపించిన అఫ్ఘాన్ పోలీసులు**

**కాబూల్ :** తాలిబాన్ పాలిత అఫ్ఘానిస్తాన్‌లోని కోస్ట్ ప్రాంతంలో ఒక సంచలన ఘటన చోటుచేసుకుంది. ఒక హంతకుడికి బహిరంగ శిక్ష అమలు చేయడంలో షాకింగ్ పనిచేశారు ఆఫ్ఘాన్ పోలీసులు. ఒకే ఫ్యామిలీకి చెందిన 13 మందిని దారుణంగా హత్య చేసిన నిందితుడు మంగల్‌ను, 13 ఏళ్ల బాలుడు చేత కాల్చి చంపించారు. శిక్షను స్థానిక స్పోర్ట్స్ స్టేడియంలో 80 వేల మంది ప్రజల ముందు అమలు చేశారు. అఫ్ఘాన్ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ 'ఖిసాస్' అంటే ప్రతీకార శిక్ష జరిగింది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం, మంగల్ 10 నెలల క్రితం అలీ షిర్ టెరెజియో జిల్లాల్లో నివశించే అబ్దుల్ రహ్మాన్.. అతని కుటుంబంలోని 12 మందిని తుపాకీతో కాల్చి చంపాడు. ఈ హత్యలకు అతనికి జీవిత ఖైదు శిక్ష పడింది. శిక్ష అమలు సమయంలో తాలిబాన్ అధికారులు కుటుంబంలో బతికున్న బాలుడు అబ్దుల్ రహ్మాన్ మంగల్‌కు క్షమాభిక్ష పెడతావా అని అడిగారు.. కానీ బాలుడు నిరాకరించడంతో, అతనికి తుపాకీ ఇచ్చి మంగల్‌పై మూడు రౌండ్ల కాల్పులు జరిపించారు. ఈ సందర్భంగా స్టేడియం భిడ్డు 'అల్లాహు అక్బర్' నినాదాలతో దద్ధరిల్లింది. కోస్ట్ పోలీస్ ప్రతినిధి ఈ ఘటనను ధృవీకరించారు. తాలిబాన్ పాలితంలో షరియా చట్టం కింద ఇలాంటి బహిరంగ శిక్షలు పెరుగుతున్నాయి. అయితే, అంతర్జాతీయ సమాజం ఈ శిక్షను 'అమానవీయమైనది, అత్యంత క్రూరమైనది' అని ఖండిస్తోంది.


# ఛత్తీస్‌గడ్‌లో ఎన్‌కౌంటర్

**ఐదుగురు మావోలు..ఒక పోలీస్ మృతి**

**బీజాపూర్ :** అడవుల్లో రక్తపుటేరులు పారుతున్నాయి. కేంద్రహోంశాఖ విధించిన గడువు సమీపిస్తున్న కొద్దీ అరణ్యాలు కాల్పుల మోతతో దద్ధరిల్లుతున్నాయి. బుధవారం ఉదయం ఛత్తీసగఢ్‌లోని బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్ జరిగినట్లు పోలీసులు తెలిపారు. పశ్చిమ బస్తర్ డివిజన్‌లోని అడవిలో భద్రతా సిబ్బందికి, మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగాయని అన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు, పోలీసుల డిస్టిక్ట్ రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి) మరణించినట్లు తెలిపారు. మరో జవాన్‌కి గాయాలయ్యాయని అన్నారు. ఎన్‌కౌంటర్ ప్రాంతం నుండి మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. రాష్ట్రపోలీసుల్లోని రెండు విభాగాలైన డిస్టిక్ట్ రిజర్వ్‌గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ మరియు సిఆర్‌పిఎఫ్ ఎలైట్ గ్రూప్ కోబ్రా ( కమాండో బెటాలియన్ ఫర్ రిసోల్యూట్ యాక్షన్ ) ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారని ఆ అధికారి తెలిపారు. తాజా ఎన్‌కౌంటర్‌తో ఈ ఏడాది ఇప్పటివరకు 268మంది మావోయిసులు మరణించారు.

# బెంగాల్‌లో సర్ సక్రమంగా సాగేలా చూడండి

మొదటి పేజీ తరువాయి



ఉండేలా చూసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ఓటర్లను చేర్చడం, అర్హత లేని వారిని తొలగించడమే దాని ఉద్దేశమని, ఇదే సందేశం క్షేత్రస్థాయికి చేరేలా చూసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు ప్రధాని సన్నిహితవర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇదిలాఉంటే.. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆందోళన చేపడుతోన్న సంగతి తెలిసిందే. ఈసీ 'భాజపా కమిషన్'గా మారిందని, దిల్లీ నుంచి వచ్చిన సూచనల ప్రకారం నడుచుకుంటోందని ఆరోపణలు చేస్తున్నారు. ఎన్ని కేంద్ర సంస్థలను రాష్ట్రంలోకి తీసుకువచ్చినా.. ఎంత ఖర్చుపెట్టినా తనను రాజకీయపరంగా ఓడించలేరని గతంలో విరుచుకుపడ్డారు. అలాగే 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉండాలని ఎంపీలకు మోదీ సూచించారు. అలాగే తృణమూల్ కాంగ్రెస్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్లను ప్రస్తావించకుండా.. విపక్షాల ట్రాప్‌లో చిక్కవద్దని బెంగాల్ భాజపా ఎంపీలకు హితబోధ చేశారు. అంతేగాకుండా ఆ రాష్ట్రంలో భాజపా ఎదిగిన తీరును ప్రస్తావించారు. 2011లో అసెంబ్లీలో ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తుచేశారు. 2021లో ఆ సంఖ్య 65కు చేరింది. స్థానిక అంశాలపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని ఎంపీలతో పేర్కొన్నారు. కాగా.. కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తోన్న ఎస్ఐఆర్‌ను విపక్షాలు తొలి నుంచి వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మోదీ స్పందన వచ్చింది.

# సంచార్ సాథీ యాప్‌పై వెనక్కి తగ్గిన కేంద్రం


**న్యూఢిల్లీ :** మొబైల్ ఫోన్‌లలో సంచార్ సాథీ యాప్ ప్రీ-ఇన్‌స్టలేషన్‌పై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ప్రతిపక్షాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో, ఈ యాప్ ప్రీ-ఇన్‌స్టలేషన్ తప్పనిసరి కాదని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు ముందస్తు ఇన్‌స్టలేషన్ ఉత్తర్వును వెనక్కి తీసుకుంది. కొత్త స్మార్ట్‌ఫోన్‌లలో, అలాగే ఇప్పటికే ఉన్న పరికరాల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ద్వారా సంచార్ సాథీ యాప్‌ను ప్రీ-ఇన్‌స్టాల్ చేయాలని టెలికమ్యూనికేషన్స్ విభాగం (డీవోటీ) నవంబర్ 28న ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ నిర్ణయంపై ఇప్పుడు కేంద్రం వెనక్కి తగ్గింది. సైబర్ నేరాల నుంచి రక్షణ కోసం సంచార్ సాథీ యాప్‌ను ముందస్తుగానే ఇన్‌స్టాల్ చేసి ఇవ్వాలన్న కేంద్రం ఆదేశాలు దుమారం రేపాయి. ఇది ప్రజల వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడటమేనని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే, యాప్‌ను ఇన్‌స్టాల్ చేసినప్పటికీ, వినియోగదారులు తొలగించుకోవచ్చని, రిజిస్టర్ అయిన తర్వాతే అది పనిచేయడం ప్రారంభిస్తుందని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. అయినప్పటికీ, ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి. ఇదిలా ఉండగా, ఇప్పటికే 1.5 కోట్ల మందికి పైగా సంచార్ సాథీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు.

# ఇండిగో విమాన సేవల్లో అంతరాయం

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా తమ విమాన సేవల్లో అంతరాయం ఏర్పడటంపై 'ఇండిగో' సంస్థ స్పందించింది. ఈ వ్యవహారంపై ప్రయాణికులకు క్షమాపణలు చెప్పింది. కార్యకలాపాలను సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు రానున్న 48 గంటల పాటు తమ షెడ్యూల్‌లో సర్దుబాట్లు చేయడం ప్రారంభించి నట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇందులో భాగంగా కొన్ని విమానాల రద్దు, మరికొన్నింటిని రీషెడ్యూల్ చేయనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. బుధవారం దేశవ్యాప్తంగా 100కుపైగా 'ఇండిగో' విమానాలు రద్దయినట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. 'రెండు రోజులుగా మా విమాన కార్యకలాపాల్లో తీవ్ర అంతరాయం కలిగింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు. చిన్నపాటి సాంకేతిక లోపాలు, శీతాకాలానికి సంబంధించిన షెడ్యూల్ మార్పులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, పెరిగిన రద్దీ, అప్‌డేట్ చేసిన సిబ్బంది రోస్టరింగ్ నియమాల డ్యూటీ టైమ్ లిమిటేషన్స్) అమలు వంటి కారణాలు ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ప్రయాణికులకు అసౌకర్యాన్ని తగ్గించేందుకు, పరిస్థితిని వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు మా బృందాలు 24 గంటలూ పనిచేస్తున్నాయి. సేవల్లో అంతరాయంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు వారి గమ్యస్థానాలకు చేరుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం, రీఫండ్ అందించడం వంటివి చేస్తున్నాం' అని సంస్థ తెలిపింది. దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థగా గుర్తింపు పొందిన 'ఇండిగో'.. రోజుకు దాదాపు 2,300 విమాన సర్వీసులు నడుపుతుంది. రెండు రోజులుగా సేవల్లో తీవ్ర అంతరాయం ఏర్పడింది. మంగళవారం 1,400కు పైగా సర్వీసులు ఆలస్యమయ్యాయి. దిల్లీ, ముంబయి, హైదరాబాద్, బెంగళూరు వంటి విమానాశ్రయాల్లో బుధవారం 100కుపైగా సర్వీసులను రద్దు చేసినట్లు సమాచారం. అదేవిధంగా పదులకొద్దీ విమానాలు ఆలస్యంగా నడిచాయి.

# చెన్నైలో అఖండ-2 ప్రచారంలో బాలయ్య

**తమిళనాడు జన్మభూమి అంటూ వ్యాఖ్య**



**చెన్నై:** తన కొత్త సినిమా 'అఖండ 2' ప్రచారంలో భాగంగా ప్రముఖ నటుడు బాలకృష్ణ చెన్నై వెళ్లారు. అక్కడ నిర్వహించిన విలేకరులు సమావేశంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మద్రాస్ తన జన్మభూమి అని చెప్పిన ఆయన.. తెలంగాణను తన కర్మభూమిగా, ఆంధ్రప్రదేశ్ ఆత్మభూమిగా పేర్కొన్నారు. మద్రాస్‌లో తాను గడిపిన జీవితాన్ని, తమిళ దివంగత నటులను గుర్తుచేసుకున్నారు. చిత్రసీమకు వచ్చి 50 ఏళ్లు పూర్తవడం, ఇప్పటికీ హీరోగా కొనసాగుతుండటం గర్వంగా ఉందన్నారు. వరుసగా నాలుగు చిత్రాలు (అఖండ, వీర సింహారెడ్డి, భగవంత్ కేసరి, డాకు మహారాజ్ హిట్లు కొట్టానని, 'అఖండ 2' ఆ జాబితాలో చేరనుందని నమ్మకంగా చెప్పారు. రొటీన్ చిత్రాల్లో నటించడం ఇష్టం లేదన్నారు. 'అఖండ 2' పాన్ ఇండియా స్థాయిలో డిసెంబరు 5న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ముంబయి, చిక్కబళ్లాపుర (కర్ణాటక), హైదరాబాద్, విశాఖపట్నంలో వేడుకలు నిర్వహించిన చిత్ర బృందం.. తాజాగా చెన్నై వెళ్లింది. మరోవైపు, బాలీవుడ్ మీడియాకు ఇచ్చిన 'అఖండ 2' టీమ్ ఇంటర్వ్యూ విడుదలైంది. పలు వీడియోలు క్లిప్పింగ్స్ నెట్టింట వైరల్‌గా మారాయి. హిందీలోనూ బాలకృష్ణ అన్‌స్టాపబుల్ అంటూ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. మహా కుంభమేళాలో చేసిన షూటింగ్‌ను దర్శకుడు బోయపాటి శ్రీను గుర్తుచేసుకున్నారు. కొన్ని సన్నివేశాలు 2 కోట్ల భక్తుల మధ్య దాదాపు 10 గంటలపాటు నీటిలో షూట్ చేశామని తెలిపారు.



సంపాదకీయం

# ఎన్నికల సంస్కరణలపై చర్చించే దమ్ముందా?

పార్లమెంట్ బృహత్తర బాధ్యతను నిర్వహించాల్సిన సమయం వచ్చింది. సమగ్ర ఎన్నికల సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. దీనిపై పార్లమెంటులో విస్తృతంగా చర్చించాలి. అప్పుడే ఎన్నికల సంస్కరలప చర్చకు అర్థం ఉంటుంది. రాజ్యాంగం గురించి గొప్పగా మాట్లాడుతున్న వారు అప్పుడు రాజ్యాంగ వ్యవస్థ అయిన ఎన్నికల సంఘంపై విమర్శలు చేయకుండా చూడాలి. అలా చేస్తే శిక్షార్హులు అయ్యేలా చేయగలగాలి. సర్‌పై చర్చకు అనుమతించినందున పార్లమెంటులో ఈ అంశాలన్నీ చర్చించాలి. అనేకానేక అంశాలు చర్చ చేయాలి. దేశానికి గుదిబండగా మారిన గవర్నర్ వ్యవస్థ, మండలి వ్యవస్థ, ఒకే వ్యక్తి వరుసగా చట్టసభలకు ఎన్నికవ్వడం, డబుల్ పెన్షన్లు పొందడం వంటివన్నీ ఈ ఎన్నికల సంస్కరణలపై జరిగే చర్చలో భాగం కావాలి. అప్పుడే ప్రభుత్వ చిత్తశుద్ధి కూడా బయట పడుతుంది. అలాగే విపక్షాల నిజాయితీ కూడా ప్రజలకు తెలుస్తుంది. ఎన్నికల సంస్కరణలపై తూతూ మంత్రంగా చర్చించకుండా ఈ అంశాలను చర్చించాలి. విపక్షాల సూచనలనలు పరిగణించాలి. అంతా కలసి సమగ్ర ఎన్నికల విధానం రూపొందించాలి. అలాగే ఇటీవల పదవీ విరమణ చేస్తూ..సుప్రీం ప్రధాన న్యయామూర్తి బిఆర్ గవాయ్ చేసిన వ్యాఖ్యలను కూడా చర్చించాలి.ఎస్సీల్లో క్రిమీలేయర్ వర్తింప చేయాలన్న సూచనలు సభముందు చర్చించాలి. ఇకపోతే... ఇంతగా టెక్నాలజీ పెరిగినా..దానిని కేంద్ర ఎన్నికల సంఘం వినియోగించుకోవడం లేదేమో అని అనిపిస్తోంది. ఓటర్ల జాబితా మొదలు, ఓటరు నమోదు ప్రక్రియన సులువుగా చేయడం, లేని ఓట్లను తొలగించడం అన్నది సులువుగా జరగాలి. కానీ అలా జరగడం లేదనడానికి సర్ ప్రక్రియపై వస్తున్న ఆరోపణలు రుజువు చేస్తున్నాయి. ఇటీవల ఉడాయ్ 2కోట్ల ఆధార్ కార్డులన నంబర్లను తొలగించింది. ఎక్కడా గందరగోళ రాలేదు. కాన ఓటు వషయంలో మాత్రం గందరగోళం ఏర్పడుతోంది. పక్కాగా ఓటు నమోదు, జాబితా రూపకల్పన, ఓటు అడ్రస్ మార్చుకోవడం అన్నది కంప్యూటర్ ముందు కూర్చుంటే అయిపోవాలి. నకిలీ ఓటు నమోదయితే కఠిన శిక్షలు అమలు కావాలి. మనదేశంలో తప్పులకు కఠిన శిక్షలు లేకపోవడం వల్లనే నేరాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ఇప్పటికైనా కేంద్ర ఎన్నికల సంఘం ఈ తరహాలో ఆలోచన చేయాలి. ఓటును ఆధార్‌తో అనుసంధానం చేయడమే గాకుండా పక్కా ఓటరు కార్డు, జాబితాను రూపొందించాలి. సర్ లాంటి ప్రక్రియను ప్రతి ఎన్నికలకు ముందు జరపాలి. దొంగ ఓట్లను, చనిపోయిన వారి ఓట్లను నిరంతరం తొలగించేలా వ్యవస్థను రూపొందించాలి. ఇకపోతే భారత ఎన్నికల సంఘం 12 రాష్ట్రాలు , కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్, దాని అమలు విధానం సర్వత్రా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో భవిష్యత్‌లో ఇలాంటి వివాదాలు రాకుండా పక్కాగా లక్ష్యాలను నిర్దేశించేలా పార్లమెంట్ చట్టాలను ఆమోదించాలి. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌తోపాటు గుజరాత్‌లో సర్‌పై వివాదాలు రాకుండా చేయగలగాలి. ఇకపోతే బిఎల్‌ఓల మృతి వార్తలను దీనికి ఆపాదిస్తూ అసలు వ్యవస్థ పనిచేయకుండా చేయాలన్న మమతా బెనర్జీ లాంటి వారికి గట్టిగా సమాధానం చెప్పాలి. బీహార్‌లో ప్రారంభమైన ఎస్ఐఆర్ పక్రియ రాజ్యాంగబద్ధతపై సుప్రీంకోర్టు విచారించింది. ఇసి నుంచి వివరాలు తీసుకుంది. అయినా వివాదాలు సృష్టించేందకు విపక్షాలు చేస్తున్న ప్రయత్నాలు సరికాదు. ఇది రాజ్యాంగ విధులను అడ్డుకోవడం తప్ప మరోటి కాదు. ఓటర్లు బూత్ లెవల్ అధికారుల ద్వారా అందజేయ బడిన ఎన్యూమరేషన్ ఫారాలను నింపి, తమ వివరాలను 2002-2005 నాటి ఓటర్ల జాబితాలతో సరిపోల్చాలి. 12 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎక్కువ మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశామని ఇసిఐ చెబుతున్నది. నిజమైన ఓటర్లు నింపాదిగా ఉండవచ్చు. వచ్చే నెలలో విడుదల కాబోయే ముసాయిదా జాబితాల్లో నమోదుకి అవసరమైన పత్రాలపై కూడా గందరగోళం లేకుండా చూడాలి. ఇంటింటికీ వెళ్లాలని చెప్పిన మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్తాయిలో బిఎల్‌వోలు పనిచేయాలి. పక్కాగా సమాచారం సేకరించాలి. ప్రతి ఓటరూ పాత రికార్డులు లేదా ఇసిఐ పేర్కొన్న పత్రాల ఆధారంగా తన చెల్లుబాటు నిరూపించాలి. సవరించిన జాబితాల్లో తప్పుడు నమోదు సమస్యలను కూడా పరిశీలించడం ద్వారా ఎక్కడా ఎలాంటి అపోహలకు తావులేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే. సార్వత్రిక వయోజన ఓటుహక్కును పరిరక్షించేందుకు, సాంకేతిక ఆధారిత డీ డూప్లికేషన్ తోపాటు, మరింత ఓర్పుతో ఇంటింటికీ వెళ్లి ధృవీకరణ చేసే పద్ధతిని ఇసిఐ ఎంచుకోవాలి. ప్రధానంగా టెక్నాలిజితీ నకిలీ ఓట్లకు చెక్ పెట్టవచ్చు. ఎఐ వినియోగం పెంచుకోవాలి. వయోజనులందరికీ ఓటుహక్కు పరిరక్షణ కంటే మరో ధర్మం ఉండరాదు. ఎన్నో సంవత్సరాలుగా ఓటర్ల జాబితాల్లో ఉన్న పౌరులు తమ అర్హతను నిరూపించుకోవాల్సిన పరిస్థితి రాకుండా చూడాలి. ఖచ్చితమైన నమోదు బాధ్యతను కేంద్ర ఎన్నికల సంఘం పాటించాలి. అంతేగాక గందరగోళానికి దారితీసేలా చర్యలు ఉండరాదు. ఈ క్రమంలో కేంద్రం కూడా చిత్తశుద్ధితో వ్యవహరించాలి. ఓటరు నమోదు అన్నది వ్యవస్థీకృతం కావాలి. పక్కాగా ఓటు నమోదు సాగాలి. ఎన్నికల సంస్కరణలపై చర్చలో ఇలాంటి అంశాలను అన్నింటినీ చర్చించాలి. విపక్షాల సూచనలను కూడా పరిగణలోకి తీసుకోవాలి. దేశం అభివృద్ధి చెందాలంటే పక్కా ఓటు నమోదు వ్యవహారం ఉండాలి. లోటుపాట్లను చర్చించి సమగ్ర విధానంతో ముందుకు సాగేలా సవరణలకు వెనకాడరాదు.



కంచర్ల అచ్యుత్ రావు
ఎడిటర్

# సభా హక్కుల ఉల్లంఘన ఇస్తే గట్టిగా జవాబిస్తా

- కుక్క వ్యవహారంపై రేణుకా చౌదరి ఘాటు స్పందన

**న్యూఢిల్లీ,డిసెంబరు3 :**

కాంగ్రెస్ ఫైర్‌బ్రాండ్ ఎంపీ రేణుకా చౌదరి తన కారులో ఒక కుక్కను తీసుకుని పార్లమెంటు ఆవరణలోకి రావడం ఇటీవల సంచలనమైంది. ఎంపీలకు కల్పించిన హక్కులకు ఇది విరుద్ధమని బీజేపీ దీనిపై మండిపడగా, ఆమెపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం ప్రవేశపెట్టనున్నారనే ప్రచారం జరిగింది. దీనిపై పార్లమెంటు వెలుపల ఆమెను మీడియా బుధవారంనాడు ప్రశ్నించినప్పుడు ఆమె 'బౌ బౌ ' అంటూ రియాక్షన్ ఇచ్చారు. 'ఇంతకంటే ఏమి చెప్పాలి? తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు చూద్దాం. సమస్య ఏముంది? అది వచ్చినప్పుడు గట్టి సమాధానమిస్తాను' అని చెప్పారు. పార్లమెంటు సమావేశాల మధ్యలో కుక్కపిల్ల కనిపించిందని, అది గాయపడి ఉంటుందని భావించి కారులో తీసుకువచ్చానని, ఇక్కడకు వచ్చిన వెంటనే ఆ కుక్కను తన ఇంటికి పంపించేశానని చెప్పారు. ఇందులో సమస్య ఏముందని ప్రశ్నించారు. రేణుకా చౌదరి చర్యను బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ తప్పుపట్టడంతో ఆమె తిరిగి స్పందించారు. కాలుష్యంతో జనం చనిపోతున్నారు. దానిపై ఎవరికీ ఎలాంటి బాధ లేదు. బీఎల్‌ఓలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వాళ్ల కుటుంబాలు అతలాకుతలమవుతున్నాయి. అయినా వాళ్లకు ఎలాంటి పట్టింపూ లేదు. కార్మిక చట్టాలు రుద్దుతున్నారు. సంచార్ సాథీ యాప్ బలవంతంగా మనపై రుద్దుతున్నారు. కానీ రేణుకా చౌదరి కుక్క అందరికీ ఆందోళనకరమైన విషయంగా కనిపిస్తోంది. ఇంతకంటే ఏమి చెప్పాలి? మూగజీవాలను నేను ప్రేమిస్తూనే ఉంటాను' అని అన్నారు. పార్లమెంటు ఆవరణలోకి కుక్కలు రాకూడదనే నిషేధం ఏదీ లేదని, అటల్ బిహారీ వాజ్‌పేయి కూడా ఒకసారి ఎద్దులబండిపై వచ్చారని గుర్తుచేశారు.




రేణుకా చౌదరి కారులో ఒక శునకాన్ని తీసుకుని పార్లమెంటు ఆవరణలోకి వచ్చారు. వెంటనే భద్రతా సిబ్బంది ఆ కుక్కను వెనక్కి పంపేశారు. తాను రోడ్డుపై వస్తున్నప్పుడు రెండు వాహనాలు ఢీకొని

# ఢిల్లీ వెళ్లిన డిప్యూటి సిఎం డికె

- నాయకత్వ మార్పుపై మళ్లీ ఊహాగానాలు

**బెంగళూరు,డిసెంబరు3 :**

కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బుధవారంనాడు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పు వ్యవహారంపై ముందుగా కలిసి చర్చించుకోండంటూ కాంగ్రెస్ అధిష్ఠానం సూచించడంతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇటీవల పరస్పరం బ్రేక్‌ఫాస్ట్ ఆతిథ్యం ఇచ్చిపుచ్చుకోవడం జరిగాయి. ఇరువురు నేతలూ మీడియా ముందుకు వచ్చి తమ ఐక్యతను చాటుకున్నారు. ఈ నేపథ్యంలో డీకే శివకుమార్ ఢిల్లీ పర్యటనకు బయలుదేరడం ఆసక్తికరమైంది. అయితే ఇదెలాంటి రాజకీయ పర్యటన కాదని బెంగళూరులో మీడియాకు డీకే తెలిపారు. ఢిల్లీలో ఒక వివాహ కార్యక్రమానికి హాజరవుతున్నాననీ, రెండు మీటింగ్‌లు కూడా ఉంటాయని డిప్యూటీ సీఎం తెలిపారు. 'ఓట్ చోరీ'పై ఈనెల 14న ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న ర్యాలీ ఏర్పాట్లను కూడా తాను చూసుకోవాల్సి ఉందని చెప్పారు. కాగా సీఎం సిద్ధారామయ్యతో పాల్గొనాల్సిన ఒక కార్యక్రమం కోసం ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం ఉదయం మంగళూరు వచ్చారు. కేపీసీసీ అధ్యక్షుడు డీకే మద్దతుదారులు ఈ సందర్భంగా 'డీకే-డీకే' అంటూ నినాదాలు చేశారు. దీనిపై డీకేను మీడియా ప్రశ్నించినప్పుడు, కొందరు మోదీ-మోదీ అంటూ నినాదాలు చేస్తారని, మరికొందరు డీకే-డీకే అని, ఇంకొందరు రాహుల్-రాహుల్ అని, సిద్ధు-సిద్ధు అని నినాదాలు చేస్తుంటారని, అందులో తప్పేమీ లేదని అన్నారు. జనం తమ ప్రేమాభిమానాలను చాటుకోవడం సహజమేనని తెలిపారు. మంగళూరులో కేసీ వేణుగోపాల్‌తో కలిసి ఒక కార్యక్రమంలో పాల్గొన్న సిద్ధరామయ్య సైతం.. అధిష్ఠానం పిలిస్తే ఢిల్లీకి వెళ్తానని చెప్పారు.

# కోర్టు ఆదేశాలతో భవానీపురంలో కూల్చివేత

## రోడ్డున పడ్డ 42 ఇళ్లకు చెందిన బాధితులు

**విజయవాడ,డిసెంబరు3 :**

భవానీపురంలోని జోజిపేటలో కోర్టు ఆదేశాల మేరకు 42 ఇళ్లను కూల్చివేశారు. శ్రీలక్ష్మి రామ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి అనుకూలంగా కోర్టు తీర్పు రావటంతో భారీ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేత జరిగింది. కూల్చివేసిన ప్రాంతం చుట్టూ శ్రీలక్ష్మి రామ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ గోడ కడుతోంది. 42 ఇళ్ల కూల్చివేతతో బాధితులు రోడ్డున పడ్డారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. 25 ఏళ్లుగా నివాసముంటున్న తమను వెళ్లగొడుతున్నారని బాధితుల ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులతో వారంతా వాగ్వాదం చేశారు. సుప్రీంకోర్టు నుంచి స్టే ఆర్డర్ వచ్చినా పట్టించుకోకుండా కూల్చేశారని బాధితులు వాపోయారు. ఉదయం 10.45గంటలకు స్టే వచ్చిన విషయం పోలీసులు, న్యాయవాదుల దృష్టికి తీసుకెళ్లినా వినలేదని బాధితులు అంటున్నారు. సుప్రీంకోర్టు ఆర్డర్ వీడియో చూపించినా కూల్చివేతలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేసారు. డిసెంబర్ 31 వరకు ఎటువంటి కూల్చివేతలు చేపట్టకూడదని సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందన్నారు. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు ఉన్నా లెక్క చేయకుండా ప్లాట్స్ కూల్చడంపై న్యాయపోరాటం చేస్తామని బాధితులు తెలిపారు. తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు.

# అమెరికాలో తల్లీబిడ్డల హత్య కేసు

- హంతకుడు నజీర్ హమీద్‌పై రివార్డు ప్రకటన

**న్యూయార్క్, డిసెంబరు 3:**

అమెరికాలో ఎనిమిదేళ్ల క్రితం కుమారుడితో సహా దారుణ హత్యకు గురైన శశికళా నర్రా మర్డర్ కేసు నిందితుడిపై రివార్డ్ ప్రకటిస్తూ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసును ఛేదించే క్రమంలో గత నెలలో నజీర్ హమీద్‌ను నిందితునిగా తేల్చిన దర్యాప్తు బృందం.. ప్రస్తుతం అతను పరారీలో ఉండటంతో అతడి ఆచూకీ తెలిపిన వారికి యాభై వేల అమెరికన్ డాలర్ల ప్రోత్సాహకం ఇస్తామని పేర్కొంది. అమెరికా న్యూజెర్సీలోని మాపుల్‌షేడ్‌లో 2017 మార్చి 23న.. ఆంధ్రప్రదేశ్ కు చెందిన 40ఏళ్ల శశికళా నర్రా, ఆమె ఏడేళ్ల కుమారుడు అనీశ్ సాయిలు ఇంట్లో దారుణ హత్యకు గురయ్యారు. ఈ కేసులో తొలుత భర్త హనుమంత రావు నర్రాపై అనుమానం వ్యక్తం చేసిన అధికారులు.. ఆ తర్వాత గత నవంబర్‌లో ల్యాప్‌టాప్ ఆధారంగా అసలు నిందితుడిగా నజీర్ హమీద్‌ను తేల్చారు. అయితే.. అతను హత్య జరిగిన ఆరు నెలలకే భారత్‌కు తరలిపోయి.. ప్రస్తుతం అక్కడే తలదాచుకుంటున్నట్టు అమెరికా అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే హమీద్‌పై అరెస్ట్ వారెంట్ జారీచేసినట్టు ఎఫ్బీఐ తెలిపింది. దీంతో పాటు అతడిని మోస్ట్ వాంటెడ్ నిందితుల జాబితాలో చేర్చి, ఆచూకీ తెలిపిన వారికి 50వేల డాలర్లు ఇస్తామని వెల్లడించింది. అయితే.. ఈ హత్యకు సంబంధించి ఇప్పటివరకూ ఎలాంటి కచ్చితమైన కారణాలూ తెలియరాలేదని దర్యాప్తు బృందం తెలిపింది. ఇంకా దర్యాప్తు కొనసాగుతుండటంతో మృతురాలి భర్త హనుమంతరావు కార్యకలాపాలపై నిఘా ఉంచినట్లు బర్లింగ్టన్ కౌంటీ ప్రాసిక్యూటర్ కార్యాలయ(ఃబీసెతినిణబినీని అనీబీనిబా ఖసనీబ।ఇ-బీబినీస'బ క్షౌతిఇ।) అధికారులు స్పష్టం చేశారు. ఇండియాలో తలదాచుకుంటున్న హమీద్‌ను అమెరికాకు రప్పించేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. అందులో భాగంగా అమెరికాలోని భారత రాయబారి వినయ్ క్వాత్రాకు.. న్యూజెర్సీ గవర్నర్ ఫిల్ మర్ఫీ ఇటీవల ఓ లేఖ కూడా రాశారు. భారత్‌తో ద్వైపాక్షిక ఒప్పందాల్లో భాగంగా హమీద్ అప్పగింతకు సంబంధించి భారత విదేశాంగ శాఖ సాయం కావాలని అందులో కోరారు.

# రెండు వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం

- ఖమ్మంలో ముగ్గురు..మహబూబాబాద్‌లో ఒకరు మృతి

**ఖమ్మం, డిసెంబర్ 3:**

రెండు వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. ఖమ్మం ప్రమాదంలో ముగ్గురు, మహబూబాబాద్ జిల్లాలో ఒకరు మృతి చెందారు. ఖమ్మం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సత్తుపల్లి మండలం కిష్టాపురం వద్ద అదుపుతప్పిన కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.మృతులను సిద్దేశీజాయ్ (18), సాదిక్ (16), శశి (12)గా గుర్తించారు. చంద్రుగొండ నుంచి సత్తుపల్లికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇక మహబూబాబాద్ జిల్లాలో లారీని ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన మహబూబాబాద్ మండలం జమాండ్లపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రైల్వే డిపార్ట్‌మెంట్‌లో జేఈఈగా పనిచేస్తున్న భగవత్ అనే వ్యక్తి లారీని వెనుక నుంచి ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచార మిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేపట్టారు.

# హిందూదేవుళ్లపై రేవంత్ వ్యాఖ్యలు

● గాంధీభవన్ ముట్టడికి బీజేపీ యత్నం

● అడ్డుకున్న పోలీసులు..స్వల్ప ఉద్రిక్తత

**హైదరాబాద్, డిసెంబర్ 3:** నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. హిందూ దేవుళ్లపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు నిరసన చేపట్టాయి. నాంపల్లిలోని గాంధీభవన్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ర్యాలీగా బయలుదేరిన బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీజేపీ నేతలు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు గాంధీ భవన్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ కార్యవర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలు చేశారు. దీనిపై బీజేపీ నేతలు బుధవారం స్పందిస్తూ..నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పే వరకు తాము పోరాటం చేస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. గాంధీ భవన్‌ను ముట్టడించేందుకు వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ శ్రేణులు సైతం సమాయత్తమవుతున్నట్లు సమాచారం. గాంధీ భవన్ వద్ద పోలీసులను భారీగా మోహరించారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యల్లో ఎటువంటి తప్పు లేదని కాంగ్రెస్ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. నేతల మధ్య ఏమైనా మనస్పర్ధలు ఉంటే వాటిని అధిగమించి.. అందరిని కలుపుకుని పోవాలనే ఉద్దేశ్యంతో సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లను ఉదాహరించారని చెప్పారు. అంతేకాని హిందూ దేవుళ్లను కించపరిచే ఉద్దేశ్యం సీఎం రేవంత్ రెడ్డికి ఎట్టి పరిస్థితుల్లో లేదని పార్టీ సీనియర్ నేతలు స్పష్టం చేస్తున్నారు. అదీకాక రేవంత్ రెడ్డి పాలనపై విమర్శించేందుకు బీజేపీ నేతలకు ఏ అంశం దొరకలేదని చెప్పారు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వారు ఆక్షేపిస్తున్నారని చెప్పారు.

# పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు దురదృష్టకరం

- క్షమాపణలు చెప్పాలన్న మంత్రి అడ్లూరి
- కొండగట్టు ఆలయంలో ప్రత్యేక పూజలు

**జగిత్యాల, డిసెంబర్ 3:**

తెలంగాణ ప్రజలను కించపరుస్తూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు బాధాకరమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పవన్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో బుధవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అదేవిధంగా బేతాళస్వామిని కూడా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొండగట్టులో ఇటీవల జరిగిన ప్రమాదంలో నష్టపోయిన బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కొండగట్టు ఆలయ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. బడుగు బలహీన వర్గాలకు ఉన్నత విద్య ద్వారానే వారు ఉన్నత స్థానానికి చేరుతారన్నారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్ పార్టీ డ్వాక్రా మహిళలను మోసం చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలను ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో రూ. 590 కోట్లు వెచ్చించి నిరుపేదలకు రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యాన్ని అందించిన ఘనత తమ ప్రభుత్వానిదే అని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ఉన్న మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించింది తామే అన్నారు. ఈ ప్రభుత్వం రైతులకు అంకితమని.. దోపిడీదారులకు, దొంగలకు కాదన్నారు. ప్రపంచంతో పోటీపడే విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిచే విధంగా సిఎం రేవంత్ తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు.

# రబీ యూరియా కోసం రైతుల క్యూ

**వరంగల్, డిసెంబర్ 3:** మళ్లీ యూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. రబీకి ఎక్కడ దక్కదో అన్న ఆందోళనతో క్యూ కట్టారు. రబీ సీజన్లోనూ యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. నల్లబెల్లిలోని పీఎఫ్‌జీ సొసైటీ ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేస్తున్నారనే సమాచారంతో బుధవారం వేకువజామునే రైతులు బారులు తీరారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రైవేట్ ఎరువుల దుకాణాలతో కుమ్మక్కై ఎరువులు అమ్ముతున్నారని రైతులు ఆరోపించారు. కృత్రిమ ఎరువు కొరత సృష్టిస్తున్నారని వారు ఆక్షేపించారు. ఇలా అమ్ముతుండటంతో ప్రైవేట్ దుకాణాలలో కొనుగోలు చేయలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం





## రెవెన్యూ పరిపాలనలో పారదర్శకత సమయపాలనకే ప్రాధాన్యం

**- జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్**

**అనకాపల్లి, డిసెంబర్3 (మనసు లో మాట):** రెవెన్యూ సేవలలో సమయపాలన, పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలనను కట్టుదిట్టం చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం కలక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ ఎం . జాహ్నవి తో కలిసి జిల్లా రెవెన్యూ విభాగ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు ప్రతి రోజు ఫీల్డ్ లో మానిటరింగ్ చేసి, సేవలలో ఆలస్యం లేకుండా ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలన్నారు. జిల్లాలో వివాదరహిత భూ రికార్డులు, బాధ్యతాయుత రెవెన్యూ పరిపాలన కోసం అధికారులు మరింత చురుకుగా పనిచేయాలన్నారు. ఆన్లైన్ సేవలు, భూ మ్యాపింగ్, రికార్డులు అప్డేషన్, మ్యుటేషన్ దరఖాస్తులు వంటి అంశాల పై పురోగతిని అడిగి తెలుసుకున్నారు. లోపాలు ఉన్న చోట వెంటనే సరిదిద్దాలని, నిర్ణీత గడువులో రిపోర్టులు సమర్పించాలన్నారు. మండల స్థాయిలో తరుచూ ఫీల్డ్ ఇన్స్పెక్షన్లు చేయాలన్నారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులు, పిజిఆర్ఎస్ పిటిషన్లు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వెరిఫికేషన్ చేసి నివేదికలు సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓ లు షేక్ అయిషా, రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు, ఎడి సర్వే, సివిల్ సప్లై అధికారులు, జిల్లాలో గల తహసీల్దార్లు , కలక్టరేట్ సూపరింటెండెంట్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## పాయకరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన హోం మంత్రి అనిత



**పాయకరావుపేట డిసెంబర్ 3 మనసులో మాట..** పాయకరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలు నిర్వహించిన సమయంలో డాక్టర్ అందుబాటులో లేకపోవడం,డ్యూటీ కి వచ్చిన నర్స్ రిజిష్టర్ లో సంతకం పెట్టకపోవడం, యూనిఫాంలో లేకపోవడంతో వైద్యులు, సిబ్బంది పనితీరు పై మంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు.హాస్పటల్ లో వార్డులు,ల్యాబ్, మందులను పరిశీలించారు.ఓపి వివరాలను అడిగి తెలుసుకున్నారు.హాస్పటల్ పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో మరోసారి మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో ఫోన్లో మాట్లాడిన మంత్రి తక్షణమే హాస్పటల్ డాక్టర్,సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ కోరవలసిందిగా మంత్రి అనిత ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ కొప్పిశెట్టి వెంకటేష్,టిడిపి మండల అధ్యక్షుడు చింతలపు పద్దు,రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు,పట్టణ అధ్యక్షుడు యాళ్ళ వరహాలు బాబు,పల్లా విలియం కేరి,కంకిపాటి వెంకటేశ్వరరావు, ముంజులూరి దుర్గాప్రసాద్,ఆది రాజన్ తదితరులు పాల్గొన్నారు.

## మునగపాక గ్రామాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నం

**పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న గ్రామ సర్పంచి దిమ్మల అప్పారావు**



**మునగపాక, నవంబర్ 3, మనసులో మాట..** మండల కేంద్రం మునగపాక మేజర్ పంచాయతీని అన్ని రంగాల్లోనూ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు తెలిపారు. పారిశుధ్యం లోపించుకుంటా అనునిత్యం పరిశుద్ధ కార్మికులతో వారి చెంతనేఉంటూ పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్నారు. అలాగే గ్రామంలోని చీకటిని తరిమెందుకు ప్రతిచోట వీధిలైట్లు ఏర్పాటు చేసి విద్యుత్ వెలుగులు పంచుతున్నామని అన్నారు. మురుగనీరు ప్రవహించకుండా పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడే క్లీన్ చేయించడం జరుగుతుందని అన్నారు. గ్రామంలో పెరిగిపోయిన చెత్తను తరలించి తడి పొడి చెత్త కేంద్రానికి తరలించి వ్యవసాయానికి ఉపయోగపడే ఎరువులను తయారు చేయించడం జరుగుతుందని అన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా గ్రామం పై మమకారంతో ప్రత్యేక శ్రద్ధ కనబరిచి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంలోఎంతో సంతృప్తినిచ్చిందని తెలిపారు.

## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు తోనే రైతులకు మెరుగైన సేవలు

**- అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ**



**అనకాపల్లి, డిసెంబర్ 3 (మనసు లో మాట):** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పి.ఎ.సి.ఎస్) ల తోనే రైతులకు మేలైన సేవలు అందుతాయని మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. అనకాపల్లి రింగ్ రోడ్డు లోని పెంటకోట కన్వెన్షన్ ప్రాంగణంలో బుధవారం శ్రీ గౌరీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పి.ఎ.సి. ఎస్) నూతన పాలకవర్గ ప్రమాణస్వీకోరత్సం ఘనంగా జరిగింది. ముందుగా వి.విరమణ చిత్ర పటానికి ఎమ్మెల్యే రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్యఅతిథి మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ 1958 లో స్వర్గీయ వి.వి రమణ శ్రీ గౌరీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం స్థాపించారన్నారు. ఈ గౌరీ పిఎ.సి.ఎస్ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందివ్వలన్నా సంకల్పం తోనే అనాడు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇదిలావుంటే ప్రతి నిరుపేదకు ప్రభుత్వ పథకాలు వారింటికి చేరాలన్న వాగ్దానాలలో భాగంగానే సంక్షేమ కార్యక్రమాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సహకార బ్యాంకు కూడా సుమారు 20.17 కోట్లు టర్న్ అవర్, షేర్ హోల్డర్లు 6732 మంది , షేర్ ధనం 56.74 లక్షల, 2067 మంది రుణాలు గాను 27.89 కోట్లు, బంగారు రుణాలు 23 కోట్లు, వ్యవసాయ రుణాలు 5 కోట్లు రూపాయలు, పెట్టుబడులు 2 కోట్లు, ఎఫ్ డి, ఆర్ డి, సిటిడి ల రూపంలో 39.38 కోట్లు , నిధులు మంజూరు 27.89 లక్షలు, కాకుండా 2020 - 25 సంవత్సరం గాను 1.48 కోట్లు రూపాయలతో లాభం లో ఉన్నదన్నారు. ఇంతటి ఘనత కల్గిన సహకార బ్యాంకు లను కాపాడు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజల క్షేమం, మేలు జరగడం కోసం వ్యవసాయం చక్కగా చేసుకోవడానికి ఈ పిఏసి ఎస్ లు ఏర్పడ్డాయన్నారు. కాగా ఇప్పుడు ఈ నూతన పాలకవర్గ హయాంలో 75 కోట్లు టర్నోవర్ ఉన్నటువంటి బ్యాంకును సుమారు 120 కోట్ల టర్నోవర్ వరకు తీసుకువెళ్లాలని సూచించారు. అలాగే వ్యవసాయ రుణాలు కాకుండా వ్యవసాయానికి ఉపయోగపడే పని ముట్లపై, యంత్రాలపై రుణాలు ఇస్తే బాగుంటుందన్నారు. వ్యవసాయ యంత్రాల ద్వారా పెట్టుబడి తగ్గి రైతుకు ఆదాయం పెరిగితే సహకార బ్యాంకులు బలోపేతం అవుతాయన్నారు.

ఈ కార్యక్రమం లో నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యులు , ఏపీయుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ , డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర , డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ , మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బుద్ద నాగజగదీష్,అనకాపల్లి నూకాంబిక అమ్మవారి దేవస్థాన చైర్మెన్ పీలా నాగశ్రీను, భోగలింగేశ్వరస్వామి దేవస్థాన చైర్మెన్ కాండ్రేగుల సత్యనారాయణ, సుంకరమెట్ట శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థాన చైర్మెన్ బొడ్డేడ మురళీ, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కసింకోట మండల టిడిపి అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు, అనకాపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కర్రి సత్యనారాయణ, జనసేన నాయకులు తాడి రామకృష్ణ, దూలం గోపి, అధిక సంఖ్యలో జనసేన. బిజెపి. టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట

**- దివ్యాంగుల సమావేశంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు**



**నర్సీపట్నం, డిసెంబర్ 3 (మనసులో మాట)...** దివ్యాంగులు ఆత్మగౌరవంతో జీవించేలా, వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. బుధవారం నర్సీపట్నంలో దివ్యాంగులతో జరిగిన సమావేశంలో ఆయన వారి సమస్యలను సావధానంగా విని, పరిష్కారంపై భరోసా ఇచ్చారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఆయన అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులకు కేటాయించిన బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో చర్చిస్తానని స్పీకర్ గారు హామీ ఇచ్చారు. వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో ఉన్న రిజర్వేషన్ కోటాను మరో 1-2 శాతం పెంచేలా సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని తెలిపారు. అలాగే అర్హులైన దివ్యాంగులకు 35 కేజీల బియ్యం వచ్చేలా అంత్యోదయ రేషన్ కార్డుల మంజూరు అంశంపై సానుకూలంగా స్పందించారు. ఇది రాష్ట్ర స్థాయి అంశమని, త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. సుమారు రూ. 2 లక్షల విలువ చేసే ఆధునిక బ్యాటరీ (జాయ్ స్టిక్) వాహనాలను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల ద్వారా ఉ చితంగా అందించేందుకు కృషి చేస్తానన్నారు. విశాఖపట్నం లోని దాదాపు 30 పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడి, సుమారు 60 మందికి పైగా ఈ వాహనాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. అయితే, ఈ వాహనాలు నడిపేందుకు లబ్ధిదారులకు కనీస అవగాహన ఉండాలని, వారికి అవసరమైతే లైసెన్సులు కూడా ఇప్పిస్తామన్నారు. దివ్యాంగుల సంఘం భవన నిర్మాణం కొరకు స్థలం కేటాయించినట్లు తెలిపారు. అలాగే దివ్యాంగులు గ్రూపులుగా ఏర్పడితే బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు ఇప్పించే బాధ్యత తనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం దివ్యాంగులు సుమారు 100 మంది పాల్గొన్నారు.

## శత చండీ యాగానికి విచ్చేసిన ఎమ్మెల్యే కొణతాల

- విశ్వశాంతికై చేస్తున్న ఈ యాగం ప్రపంచానికి రాబోయే ఉపద్రవాలకు ఉపశాంతి కొణతాల...
- ఐదవ రోజు కార్యక్రమం సువాసిని పూజ.. - పాఠశాల విద్యార్థులచే వేద స్తోత్ర పారాయణం..
- భద్రాచల దేవస్థానం నుండి దేవస్థాన స్థానాచార్యులు - ఉభయ వేదాంత స్థలశాయి స్వామి...
- ఉప ప్రధానార్చకులు అమరవాది మురళీకృష్ణమాచార్యులు వారిచే ప్రవచన కార్యక్రమం - కుంకుమ పూజ



**అనకాపల్లి డిసెంబర్ 3 (మనసులో మాట)..** లోక కళ్యాణార్థమై నవాహ్నిక దీక్షతో శివ పంచాయతన పూర్వక శత చండీయాగ మహోత్సవం ఐదవ రోజు సుప్రభాత సేవతో ప్రారంభమైంది. యాగానికి బుధవారం మాజీ మంత్రి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ విచ్చేశారు. ఆయనకు మేళ తాళాలతో పూర్ణకుంభంతో వేద పండితుల మంత్రోచ్చాటన మధ్య రేజేటి రామాచార్యులు,వారి తనయులు కన్నబాబు, చక్రవర్తి మారుతీలు ఘన స్వాగతం పలికారు. రామకృష్ణ మాట్లాడుతూ విశ్వశాంతి కోసం ప్రపంచానికి రాబోయే ఉపద్రవాలకు ఉపశాంతిగా జరుగుతున్న ఈ యాగం మహా పవిత్రకార్యమన్నారు. యాగ ప్రారంభానికి ముందు రాష్ట్ర అర్చక ఎగ్జామినర్ రెజేటీ శ్రీ రామాచార్యుల వేదమంత్రాల మధ్య రుద్రాభిషేకాలు దంపతులు తో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో టిడిపి నాయకులు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి దాడి రత్నాకర్ అచ్యుత దంపతులు పాల్గొన్నారు. వారిని సోదర త్రయం ఘనంగా ఆహ్వానించి పూజాకార్యక్రమం అనంతరం శాలువాతో సత్కరించి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ ఈ పూజా కార్యక్రమం లో పాల్గొనడం సంతోషదాయకం అన్నారు. 11 గంటలకు సువాసినీ పూజా కార్యక్రమం జరిపారు. పాఠశాల విద్యార్థులచే వేద స్తోత్ర పారాయణం జరిగింది. అనంతరం భద్రాచలం దేవస్థానం స్థానాచార్యులు ఉభయ వేదాంత స్థలశాయి స్వామి, ఆలయ ఉప ప్రధానార్చకులు అమరవాది మురళీకృష్ణమాచార్యులు నిర్వాహకులు విజ్ఞప్తి మేరకు చండీయాగానికి విచ్చేశారు. వారిని సగౌరవం గా కమిటీ ఆహ్వానించారు. యాగశాల, యాగ నిర్వహణ అక్కడ జరిగిన కార్యక్రమాలు చూసి యాగ నిర్వాహకులను అభినందించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం వారు భక్తులతో ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం కుంకుమ పూజ జరిపారు. ఈ కార్యక్రమంలో చండి ఉపాసకులు, వేద పండితులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు .



## అన్నదాత కు అండగా కూటమి ప్రభుత్వం

**-హోం మంత్రి అనిత**

**ఎస్. రాయవరం, డిశంబర్ 3,(మనసులో మాట):** రైతులు సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, రైతులు సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలనే ఉద్దేశం తో వారంరోజులుపాటుమీకోసం రైతువారోత్సవాలు నిర్వహించామని రాష్ట్ర హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రైతువారోత్సవాలు ముగింపు సందర్భంగా ఎస్. రాయవరం మండలం గుడివాడ గ్రామంలో రైతులుతో ముఖా ముఖి కార్యక్రమం లో హోంమంత్రి పాల్గొన్నారు. రైతులు సమస్యలు ను ఈ సుదర్భంగా అడిగితెలుసుకున్నారు. రైతులుసేంద్రియ వ్యసాయం పై అవగాహన పెంచుకోవాలని, వచ్చే ఏడాది 50శాతం సేంద్రియ వ్యవసాయం చేసేలా కృషిచేయాలని కోరారు. రైతుల అభ్యున్నతికోసం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రానికి అన్నివిధలా సహకరిస్తుందని, రైతులు అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అన్నివిధలా కృషి చేస్తుందన్నారు.అంతకుముందు గుడివాడ గ్రామంలో సాగుచేస్తున్నడ్రాగన్ ఫ్రూట్స్ వ్యవసాయ క్షేత్రాన్ని మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమం లో కూటమి నేతలు అమలకంటి అబద్ధం, నల్లపురాజు వెంకట్రాజు, దూళిశ్రీను, గుర్రంరామకృష్ణ, వ్యవసాధికారి ఉమాప్రసాద్ పాల్గొన్నారు.

## పెన్షన్ సొమ్ముతో వెటర్నరీ అసిస్టెంట్ పరార్..

## బాధితులకు ఎంపీడీఓ భరోసా



**కొయ్యూరు డిసెంబర్ 3 (మనసులో మాట):** సామాజిక పింఛన్ల పంపిణీలో అపశృతి చోటుచేసుకుంది. పేదలకు అందాల్సిన రూ. 2.88లక్షల రూపాయలు పెన్షన్ డబ్బులతో ఓ వెటర్నరీ అసిస్టెంట్ పరారైన ఘటన అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం లోని ఎం.మాకవరం సచివాలయం పరిధిలోని చింతలపూడి పంచాయితీకి చెందిన లొద్దిపాకలు,లుబ్బుర్తి గ్రామాల్లో కలకలం రేపింది. ఈ విషయం తెలుసుకున్న వెంటనే ఎంపీడీఓ జిడివి ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు స్పందించి బాధితులకు అండగా నిలిచారు.లొద్దిపాకలు,లుబ్బుర్తి గ్రామాల పెన్షన్ల పంపిణీ బాధ్యతను స్థానిక వెటర్నరీ అసిస్టెంట్ చైతన్య కు అప్పగించారు. అయితే, లబ్ధిదారులకు నగదు పంపిణీ చేయకుండానే సదరు వెటర్నరీ అసిస్టెంట్ చేతిలో ఉన్న సొమ్ముతో సహా ఉడాయించాడు. పింఛను కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, వితంతువులు ఈ విషయం తెలిసి ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓ ఆ గ్రామాలకు చేరుకున్నారు. పింఛను రాని బాధితులను స్వయంగా కలిసి మాట్లాడారు. ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం తరపున అందాల్సిన ప్రతి రూపాయి లబ్ధిదారులకు అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు.

## ఎలమంచిలి భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం




**ఎలమంచిలి డిసెంబర్ 3 మనసులో మాట..** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఎలమంచిలి భవిత కేంద్రంలో విద్యార్థులు వారి తల్లిదండ్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అధిదిగా ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి అయినటువంటి జి స్పందన హాజరవడం జరిగింది. మిగతా అతిధులుగా డి వెంకట్రావు (ఎ జి పి), మండల విద్యాశాఖ అధికారులు సూర్య ప్రకాష్, అరుణ్ కుమార్, టి సత్యనారాయణ(బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్), హరి శంకరరావు (ప్యానల్ లాయర్), గవర్నమెంట్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం శ్రీనివాసరావు, జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎన్ ఎన్ ఎల్ డి భవాని పాల్గొన్నారు. ముఖ్య అతిథి సివిల్ జడ్జి స్పందన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేస్తుందని వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ వీరి పై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని వారి యొక్క హక్కులకు భంగం కలిగించకూడదని చెప్పారు. వీరికి ప్రోత్సాహం అందించినట్లయితే వీరు కూడా ఎన్నో విజయాలు అందుకుంటారని ఉదాహరణగా ప్రముఖుల పేర్లు ప్రస్తావిస్తూ వారి విజయ గాదలను వివరించడం జరిగింది. మిగతా అతిధులు మాట్లాడుతూ విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు చూపించే బాధ్యతలను ప్రశంసిస్తూ అందరికీ తగిన ప్రోత్సహిం ఇస్తే వీరు కూడా అన్ని రంగాల్లో ముందుకు వెళతారని ప్రోత్సహించారు. ఎంఈఓ సూర్య ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను బయటకు తీయుటకు భవిత కేంద్రం లు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, దీని సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే ప్రభుత్వం నుండి వచ్చే పథకాలును వివరించడం జరిగింది. తర్వాత విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపన్యాసాలు ఆటపాటలు తో ఆహ్లాదకరంగా సాగింది.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## 2వ రోజు ఏబిఎం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు

**నర్సీపట్నం ,డిసెంబర్ 3 (మనసులో మాట)..** నర్సీపట్నం ఏబిఎం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రత్యేక సేవా శిబిరం 2వ రోజు బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్-1 విద్యార్ధులు నీలంపేటలో, ఎన్ఎస్ఎస్ యూనిట్-2 విద్యార్ధులు అయ్యన్నకాలనీలో ఇంటింటికి వెళ్లి మెడికల్ అవేర్నెస్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు వివిధ వ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు, సూచనలు ఇచ్చి అవగాహన కల్పించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వివరించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పి.సత్యనారాయణ, ఎ.కుమార్, వాలంటీర్లు పాల్గొన్నారు.

## మండల యాదవ సంఘం అధ్యక్షునిగా చెల్లయ్య



**చీడికాడ, డిసెంబర్ 3, (మనసులో మాట)..** మండల యాదవ సంఘం అధ్యక్షునిగా అడవి అగ్రహారం గ్రామానికి చెందిన దాలిబోయిన ఎన్నికయ్యారు మండల యాదవ సంఘం ఎన్నికలు జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు బరిని కాన సాయినాథ్ బాబురావు ఆధ్వర్యంలో జరిగాయి మండల యాదవులు అందరూ దాలిబోయిన చెల్లయ్యను మండల అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ సందర్భంగా చెల్లె ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ మండలంలో యాదవుల సంక్షేమానికి సమస్యలు పరిష్కారాన్ని కృషి చేస్తానన్నారు తనకు ఈ పదవి ఇచ్చిన జిల్లా అధ్యక్షులు బరిణికాన సాయినాథ్ బాబురావుకు నియోజవర్గ అధ్యక్షులు మెల్లి సన్ని బాబుకు కృతజ్ఞతలు తెలిపారు

## రాజేంద్ర పాలెంలో పూర్తయిన నూతన సచివాలయం భవనం - ప్రారంభం ఎప్పుడో మరి?.



**కొయ్యూరు డిసెంబర్ 3 (మనసులో మాట):** అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం లోని రాజేంద్రపాలెం గ్రామంలో నిర్మించిన నూతన సచివాలయం భవనం ఇంకా అధికారికంగా ప్రారంభం కాలేదు. భవనం పూర్తిగా సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రారంభోత్సవ తేదీపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు. దీనివల్ల గ్రామ ప్రజలు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి రావడానికి ఇంకా ఎదురు చూడాల్సి వస్తోంది. స్థానికుల అభిప్రాయం ప్రకారం, భవనం త్వరగా ప్రారంభిస్తే గ్రామ ప్రజలకు అవసరమైన సేవలు సులభంగా చేరనున్నాయని చెబుతున్నారు. అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. భవనం నిర్మాణం పూర్తయి సుమారుగా రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇంకా ప్రారంభం ఆలస్యం కావడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. సచివాలయం పనిచేయడం ప్రారంభిస్తే ఆధార్ సేవలు, పింఛన్ దరఖాస్తులు, రేషన్ సంబంధిత సేవలు, రైతులకు సంబంధించిన పథకాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలన్నీ సచివాలయం లోనే సులభంగా అందుబాటులోకి రానున్నాయి.అధికారులు మాత్రం దీని ఊసే ఎత్తడం లేదు. ఈ భవనం ఎప్పుడు ప్రారంభిస్తారో మరి

## రాజేంద్రపాలెం సచివాలయాన్ని విజిట్ చేసిన డిప్యూటీ ఎంపీడీఓ



కొయ్యూరు డిసెంబర్ 3 (మనసులో మాట): మండల పరిధిలోని రాజేంద్రపాలెం గ్రామ సచివాలయాన్ని డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు ఈరోజు సందర్శించారు. సచివాలయంలో జరుగుతున్న వివిధ ప్రభుత్వ పథకాల అమలు, రికార్డుల నిర్వహణ, హాజరు రిజిస్టర్లు వంటి అంశాలను ఆయన పరిశీలించారు. ప్రజలకు అందించే సేవల నాణ్యతను మెరుగుపరచాలి అని సూచించారు

## పెద గంట్యాడ జీవీఎంసీ కళ్యాణ మండపానికి
# పులి భూలోక రెడ్డి పేరు

### - శిలా పలకాన్ని ఆవిష్కరించిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు



**గాజువాక (మనసులోమాట) డిసెంబర్ 3..** ఉక్కు నిర్వాసితుల సంక్షేమం కోసం తన చివరి శ్వాస వరకు పనిచేసిన అజాత శత్రువు కీర్తిశేషులు శ్రీ పులి భూలోక రెడ్డి గౌరవార్థం జీవీఎంసీ కౌన్సిల్ 2010 లోనే పెద గంట్యాడ మండలం నెల్లిముక్కు గ్రామములో నిర్మించిన జీవీఎంసీ కళ్యాణ మండపానికి ఆయన పేరును పెట్టింది అని దానిని అధికారికంగా శిలా పలకాన్ని ఆవిష్కరించడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను అని ఈ రోజు ఆయన 18 వ వర్ధంతి సందర్భములో నెల్లి ముక్కులో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గాజువాక నియోజక వర్గ శాసన సభ్యులు మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు శ్రీ పల్లా శ్రీనివాస రావు అన్నారు 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమములో కార్పొరేటర్ పల్లా శ్రీనివాస రావు,గాజువాక తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్,విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి రెడ్డి,కూటమి నాయకులు నమ్మి అప్పారావు,దొమ్మేటి పెరుమాళు ,శ్రీముసిరి శ్రీనివాస రావు, పులి సురేష్ రెడ్డి(బాబీ),బస అప్పల రెడ్డి,ములకలపల్లి ప్రకాష్,ములకలపల్లి వంశీ, నీలాపు అప్పల రెడ్డి, కండిపిల్లి రమణ ఇతర కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ప్రశాంతంగా జరపడానికి అందరూ సహకరించాలి

### సమావేశమైన గ్రామ పెద్దలు



**మునగపాక, నవంబర్ 3, మనసులో మాట..** మండలంలో గల గణపర్తి బుధవారం ఉదయం 11గం కు మీటింగ్ రామాలయం లో ఏర్పాటు చేయడమైనిది.గత నెల తే 15/11/25ది న రామాలయం లో సాయంత్రం 8గం కు గౌరీపరమేశ్వరల పండగనిమిత్తం సర్పంచ్ సిహెచ్. సూ ర్యాగణేశనాయుడుగ మీటింగ్ ఏర్పాటు చేశారు.చదరం అప్పలనాయుడు అనే వ్య క్తి గత మూడు సంవత్సరముల నుండి గౌరీ పరమేశ్వరుల మహోత్సవము జరుపుచున్నారు. కానీ గతంలో ఏ ప్రభుత్వము అధికారంలో ఉంటే వారే ఉత్సవమును నిర్వహిస్తూ వస్తున్నారు. కర్రి రామనాగేశ్వరావు అనే అనే వ్యక్తి వైసిపి గవర్నమెంట్ వచ్చిన వెంటనే ఉత్సవ కార్యక్రమం వారికి అప్పగించడం జరిగింది. రామాలయంలో గ్రామ పెద్దల సమక్షంలో సర్పంచ్ నాయుడు చదరం అప్పలనాయుడుకి కబురు పంపగ వారు సమావేశానికి రాలేదు., వారు పండగను అప్పగించుటకు కూడా నిరా కరించారు. గుడి వద్ద ఘర్షణవిషయం ను మునగ పాక ఎస్సై కి అదే సమయంలో తెలియపరచితిమి. ఎస్సై, తాసిల్దార్ ఆరు పర్యాయములు ఇరువర్గములను కూర్చోబెట్టి సమస్య పరిష్కారణకు నూతనముగా అన్ని వర్గము నుండి 24 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసి ఉన్నారు. మున గ పాక తాసిల్దార్ మరియు ఎస్సై గారు సలహా మేరకు గౌరీ పరమేశ్వర ఉత్సవం నిర్వహించుటకు అంగీకరించియున్నాము,.? కానీ చదరం అప్పలనాయుడు అనే వ్యక్తి తన వర్గీయులైన 14 మంది సభ్యులతో గౌరీ సంఘముగా రిజిస్ట్ చేయించుకొని తన సొంత దేవాలయం గా తన తన ఇష్టం వచ్చిన విధంగా ఏకపక్ష నిర్ణయాలతో నిర్ణయం చేయుట వలన గణపర్తి గ్రామప్రజలు మరియు బాలాజీ నగర వాసులు ఇబ్బంది పడుచున్నారు. ఈ యొక్క పండగను గ్రామ ప్రజలు యావన్మంది అనగా అన్ని వర్గాల వారు చందాలు వేసుకొని చుట్టాలను పిలుచుకొని చాలా వైభవంగా జరుపుకుంటారు. అప్పలనాయుడు అనే వ్యక్తి తాను కంప్లైంట్ ఇచ్చిన ఎస్సై, సిఐ పట్టించుకోవటం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నాడు. తాసిల్దారు గౌరీ పరమేశ్వరుల ఉత్సవములు లిఖితపూర్వకంగా ఆదేశాలు ఇచ్చి ఉన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నవారు. సర్పంచ్ చదరం నాయుడు,కర్రి రామనాగేశ్వరరావు, కాళ్ళ చంద్రమోహన్, ఆడారి గోపి, చదరం సత్తిబాబు, చదరము శంకర్, కర్రి వెంకునాయుడు, యెలాగ జగ్గారావు ,8.భీంపల్లి అశోక్, గొంది రాజు, నెలపాటి శంకర్, ఆడారి అప్పలరాజు, కాండ్రీగుల శంకర్, కర్రి వెంకటేష్, చదరం వెంకటప్పారావు, ఎల్లపు శంకర్, ఎల్లపు రమణ పాల్గొన్నారు.

## డిసెంబర్ 31 నుంచి విశాఖపట్నం లో జరుగు
# సిఐటియు మహాసభలు జయప్రదం చేయాలి

### - జనవరి 4 న లక్షలాది మంది తో కార్మిక ప్రదర్శన
### - సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.వి శ్రీనివాసరావు ప్రచార జాతర ప్రారంభం



**అనకాపల్లి, డిసెంబర్ 3 (మనసులో మాట):** సిఐటియు అఖిలభారత 18 వ మహాసభలు డిసెంబర్ 31 నుంచి విశాఖపట్నంలో జరుగుతున్న సందర్భంగా అనకాపల్లి గాంధీ కాయగూరల మార్కెట్ లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రచార జాత ను సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.వి శ్రీనివాసరావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సిఐటియు ఏర్పడిన తర్వాత విశాఖపట్నం లో జరుగుతున్న మొట్టమొదటి చారిత్రాత్మక అఖిలభారత మహాసభలకు కార్మికులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో కార్మికుల సమస్యలపై అకుంఠిత దీక్షతో పోరాడుతున్న సిఐటియు మహాసభలు ఈ ప్రాంతంలో జరగటం ఈ ప్రాంత పోరాటాలకే వెన్నుదన్నుగా నిలుస్తాయన్నారు. అనకాపల్లి జిల్లాలో పారిశ్రామిక వాడల్లో కార్మిక హక్కులకై , ఉద్యోగ భద్రతకై సిఐటియు పోరాడు తుందన్నారు. స్కీం వర్కర్ల సమస్యలపై కనీస వేతనాల అమలకై అసంఘటిత రంగ కార్మికులకు సిఐటియు ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. అలాగే 2026 జనవరి 4న విశాఖపట్నంలో లక్షలాది మందితో జరుగు కార్మిక ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభలో దేశంలోనే ఆదర్శంగా ఉన్న కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ తో పాటు అఖిలభారత నాయకత్వం పాల్గొంటున్నారన్నారు. ఈకార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్, మండల కన్వీనర్ కాళ్ల తాలయ్యబాబు, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు భీశెట్టి అప్పారావు, పి సురేష్, పప్పుశెట్టి అప్పారావు, వెంకటలక్ష్మి , నాయుడమ్మ పాల్గొన్నారు.

# అన్నదాతలు సాగు పద్ధతులు మార్చుకోవాలి

### - రైతన్న నీకోసం లో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు సుధాకర్



**హుకుంపేట నవంబర్ 03 (మనుసు లో మాట)** మండల కేంద్రం లోని రైతున్న మీకోసం కార్యక్రమం హుకుంపేట పంచాయతీ కార్యాలయం లో బుధవారం నిర్వహించారు. సభ అధ్యక్షులు వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందు గా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ మాట్లాడుతూ సమాజంలో నేడు మారుతున్న ఆహారాలు అలవాట్లకు అనుకూలంగా అన్నదాతలు సాగు పద్ధతులు మార్చుకోవాలని అన్నారు. చిరుధాన్యాలు మరింత పెంచాలని ప్రకృతి వచ్చే వ్యాసరను మార్పులను తట్టుకొని పరిష్కార మార్గంలో ప్రకృతి వ్యవసాయం అవలంబించాలని ఆయన సూచించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమవేశంలో టీడీపీ మండల అధ్యక్షులు శతక బోంజు బాబు మాట్లాడుతు రానున్న ఐదు సంవత్సరాలో రైతులకు రాష్ట్రంలో వ్యవసాయం అనుబంధ రంగాల్లో సగటు సంవత్సరానికి 15% వృద్ధిరేటు సాధించాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని. రైతులకు టెక్నాలజీ తోడైతే ఇక మన రైతులకు తిరిగి ఉండదు అందుకే అగ్రిటెక్ని ప్రోత్సహిస్తున్నామని ఆయన అన్నారు. నీటి వినియోగ సామ్రాజ్యాన్ని 50% వరకు పెంచి రైతు ఉత్పత్తి కథలు పెంచటానికి ప్రభుత్వం కట్టుబడింది అన్నారు ఎస్సీ ఎస్టీ రైతులకు బిందు సేద్యంపై గత ప్రభుత్వం రద్దు చేసిన 100% సబ్సిడీని ఈ ప్రభుత్వం పునరుద్ధించిందని ఆయన అన్నారు. గత ప్రభుత్వం 10 ఎకరాలకు లోపు రైతులకు సబ్సిడీని తగ్గించగా దానిని ఈ ప్రభుత్వ 90 శాతానికి పెంచి యంత్రాలు టెక్నాలజీ వాడుకతో వ్యవసాయంలో పెట్టుబడి తగ్గుతుందని అందుకు వ్యక్తిగతంగా రైతులకు యంత్రాలు సరఫరా చేస్తుందని కిసాన్ డ్రోన్ సేవలు అందిస్తుందని పంట విస్తీర్ణం తెలుసుకోవడానికి పంట ఆరోగ్య స్థితి కాంచన వెయ్యటానికి సానిలైట్ టెక్నాలజీ వాడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కొమ్మరమ్మ,మండల ఉపాధ్యక్షులు ఎల్ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి శ్యామ్, సర్పంచులు బాకురు వెంకటరమణ, సత్యనారాయణ, అరకు నియోజవర్గం మహిళ వైస్ ప్రెసిడెంట్ సాగర సత్యవతి. అరకు నియోజవర్గం మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి నాయకురాలు సూర్యకాంతం. పేసా కార్యదర్శ జె వెంకట్ కోశాధికారి భరత్, రైతు పంట అధ్యక్షులు అప్పలకొండ, నాయకులు బెసు, నర్సింగ్ రావు,



## రోగులపేట గ్రామంలో ఎన్ఎస్ఎస్ ద్వారా
# వైద్య శిబిరం..

**పెదబయలు డిసెంబర్ మనసులో మాట :** పెదబయలు గురుకుల కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో సీతగుంట పంచాయతీ రోగుల గ్రామం లో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ లో భాగంగా రోగుల గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు మాట్లాడుతూ గ్రామంలో మురుగు కాలువలు పరిశుభ్రత పాటించాలని అలాగే మన చుట్టూ పరిసర ప్రాంతాల్లో పొడిగా ఉంచుకోవడం ద్వారా దోమలు నివారించుకోవచ్చు తద్వారా పరిశుభ్రత తో పాటు ఆరోగ్యానికి వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యవంతంగా ఉండటానికి అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది మరియు ఎన్ఎస్ఎస్, పి ఓ, 50 మంది వాలంటీర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పులి భూలోక రెడ్డి వర్ధంతి



**గాజువాక (మనసులోమాట) డిసెంబర్ 3..** ఉక్కు ఫ్యాక్టరీ నిర్వాసుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పులి భూలోక రెడ్డి 18 వ వర్ధంతి కార్యక్రమం పెద గంట్యాడ సెంటర్లో పులి భూలోక రెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనముగా నిర్వహించారు. పి బి ఆర్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు పులి శ్రీరామ రెడ్డి నేతృత్వంలో,విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశిష్ట అతిధులుగా పాల్గొన్న గాజువాక నియోజక వర్గ శాసన సభ్యులు మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు శ్రీ పల్లా శ్రీనివాస రావు , మాజీ శాసన సభ్యులు తిప్పల నాగిరెడ్డి ,తిప్పల గురుమూర్తి రెడ్డి ,చింతలపూడి వెంకట రామయ్య , జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవింద రెడ్డి ముందుగా పెద గంట్యాడ సెంటర్లో పులి భూలోక రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన ఉక్కు నిర్వాసితులకు, ఈ ప్రాంత అభివృద్ధికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు

పి బి ఆర్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి,తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పులి సురేష్ రెడ్డి (బాబీ) వందన సమర్పణతో ముగిసిన ఈ కార్యక్రమములో

గాజువాక వై యస్ ఆర్ సి పి సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి,గాజువాక తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, జీవీఎంసీ కార్పొరేటర్లు గంధం శ్రీనివాస రావు, కాకి గోవింద రెడ్డి,ఊరుకుటి రామచంద్ర రావు (చందు), తిప్పల వంశీ రెడ్డి,మొహమ్మద్ ఇమ్రాన్, పల్లా శ్రీనివాస రావు, పులి లక్ష్మిబాయి,వివిధ పార్టీల నాయకులు నమ్మి అప్పారావు,గొందేసి మహేశ్వర రెడ్డి,శ్రీముసిరి శ్రీనివాస రావు,గొందేసి సత్యారావు, మార్దుపూడి పరదేశి, గొందేసి శ్రీనివాస రెడ్డి,గంట్యాడ గురుమూర్తి,కిలానా ముసలయ్య,జ్యోతి రెడ్డి, ప్రకాష్,వంశీ,దొమ్మేటి పెరుమాళ్,మంత్రి శంకర్ నారాయణ వివిధ కార్మిక సంఘాల నాయకులు సీఐటి యురామారావు,దొమ్మేటి అప్పారావు,స్తానిక గ్రామాల పెద్దలు పిట్ట కుంచారావు,ధర్మాల ఎల్లయ్య రెడ్డి,గొందేసి భూషణం రెడ్డి, దొమ్మేటి రాము నాయుడు,ధర్మాల ఎల్లయ్య రెడ్డి,గొందేసి అమ్మాలు, గొందేసి నాగిరెడ్డి,శ్రీనివాస రెడ్డి,ఎంపాడ ఆనంద రెడ్డి,పిట్ట అప్పన్న రెడ్డి,దూడ సోమనాథ్ రెడ్డి,నీలాపు అప్పల రెడ్డి,ముద్దుర్తి శ్రీరామ మూర్తి, ప్రజలు,మహిళలు,పులి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని ఆయన సేవలను కొనియాడారు.

## గొర్రెల రాజుబాబు కుటుంబాన్ని పరామర్శించిన హోంమంత్రి అనిత



**పాయకరావుపేట డిసెంబర్ 3 మనసులో మాట..** పాయకరావుపేట పట్టణానికి చెందిన టిడిపి సీనియర్ సీనియర్ నాయకుడు గొర్రెల రాజుబాబు తల్లి గొర్రెల వెంకటలక్ష్మి ఇటీవలే స్వర్గస్తులయ్యారు.ఈ నేపథ్యంలో హోం మంత్రి వంగలపూడి అనిత బుధవారం గొర్రెల రాజబాబు కుటుంబాన్ని పరామర్శించి గొర్రెల వెంకటలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు,టిడిపి పట్టణ అధ్యక్షుడు యాళ్ళ వరహాల బాబు,జనసేన పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర,తలారి రాజా తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గం మాడుగులకు బస్సులు కొరత

### - బస్సులపై ఎమ్మార్వో కి వినతి పత్రం



**వి మాడుగుల డిసెంబర్ 3 (మనసులో మాట)..** మాడుగుల ఆర్టీసీ బస్సులు సమస్య పరిష్కారం చేయాలని ఎంతోకాలంగా ఈ సమస్యపై పోరాటం జరుగుతున్న ప్రజలు పూర్తి సహకారం అందించి సమస్యను నివారించవలసిందిగా రాను రాను మాడుగుల పరిస్థితి కుంటుపడుతున్న కారణంగా మండల సతీష్ ఈ సమస్యపై పోరాటం కొనసాగిస్తూనే ఉన్నారు, స్థానిక ఎంఆర్ఓ గారికి వినతి పత్రం సమర్పించడం జరిగింది.ప్రతిబస్సు మాడుగుల మీదుగా వెళ్ళాలి,ఎస్.ఆర్.మాడుగుల స్టేజ్ రాయాలి.విజయనగరం,తురువోలు బస్సులు వేయాలి.గతంలో మాదిరిగా పల్లే వెలుగు బస్సులు వేయాలి.స్థానిక బస్టాండ్ లో బస్ టైం టేబుల్ అమర్చాలి ల అని వినయ పూర్వకంగా కోరుచున్నారు,



## అభాగ్యులు, అనాధలకు అండగా రాజాన వీర సూర్యచంద్ర

**నర్సీపట్నం, నవంబర్ 3 (మనసులో మాట)..** జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర మరొకసారి తన మానవతా గుణాన్ని ప్రతిఫలింపజేశారు. రాజకీయ విభాగంలో చురుకైన నాయకుడిగా మాత్రమే కాకుండా, అవసరంలో ఉన్న వారికి అండగా నిలిచే సేవాభావం కలిగిన వ్యక్తిగా ఆయన మరోసారి నిలిచారు. బుధవారం నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలోని అనాధలు, ఆర్థికంగా వెనుకబడిన వారు, సహాయం కోసం ఎదురుచూస్తున్న అభాగ్యులకు దుస్తులను పంపిణీ చేశారు. తీవ్రమైన శీతాకాలం సమీపిస్తున్న తరుణంలో వారికి అవసరమైన బట్టలు అందించడం ద్వారా ఆయన మానవతకు నిలువుదొక్కినట్టు స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా రాజాన వీర సూర్యచంద్ర మాట్లాడుతూ, సమాజంలో ఉన్న ప్రతి మనిషికి కనీస జీవన హక్కులు, గౌరవం, రక్షణ కల్పించడం ప్రతి బాధ్యత గల పౌరుడి కర్తవ్యమని అన్నారు. రాజకీయాలు ప్రజలకు సేవ చేయడానికి ఉన్న వేదిక మాత్రమేనని, అందుకు మించినది మానవత్వం అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వెంకటరమణతో పాటు పలువురు స్థానిక సభ్యులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ఇటువంటి మానవతా కార్యక్రమాలు మరింత మందికి ఆదర్శంగా నిలవాలని అభిలషించారు.

## డిప్యూటీ ఎంపీడీవో గా గౌరీ శంకర్



**వి మాడుగుల డిసెంబర్ 3 (మనసులో మాట)..** నూతనంగా మాడుగుల డిప్యూటీ ఎంపీడీవో గా (జి. ఎస్ డబ్ల్యు ఎస్) గా గౌరీ శంకరు మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్గా పని చేస్తూ పదోన్నతుపై డిప్యూటీ ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎంపీడీవో కొంకి అప్పారావు మర్యాదపూర్వకంగా కలిసి మండలంలో సచివాలయం వ్యవస్థ ఏర్పడిన తర్వాత సిబ్బంది విధులపై పరివేక్షణ లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఈ ఉద్యోగాన్ని కేటాయించింది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ ఎంపీడీవో గా సచివాలయాలపై పూర్తి పర్యవేక్షణచేస్తూ మెరుగని సేవలు అందిస్తారు.



### అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మునగపాక మండలాన్ని

## అనకాపల్లి రెవిన్యూ డివిజన్ లో కొనసాగించాలి

### మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్




**మునగపాక, డిసెంబర్ 3, మనసులో మాట..** మునగపాక మండల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్ లోనే కొనసాగించాలని మాజీ ఎమ్మెల్యే, ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో విడుదల చేసిన జీవో నెంబర్ 1491 రద్దు చేసి ఎలమంచిలి నియోజకవర్గాన్ని యధాతధంగా అనకాపల్లి రెవిన్యూ డివిజన్ లోనే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. మునగపాక మండలం అనకాపల్లి మండలానికి కేవలం రెండు నుండి పది కిలోమీటర్ల లోపు ఉన్న గ్రామాలు, 29 రెవిన్యూ గ్రామాలు ప్రజలు అనకాపల్లికి వెళ్లి నిత్యం తమ పనులు చేయించుకుంటున్నారని, సుమారు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న నక్కపల్లి మండలం రెవిన్యూ డివిజన్లో మునగపాక మండలాన్ని కలపడం ఎంతవరకు సబబు అని వారు ప్రశ్నించారు. ఒకప్పుడు మునగపాక, ఎలమంచిలి నియోజవర్గంలో ఉన్న మండలాలు విశాఖ రెవిన్యూ డివిజన్ కేంద్రంగా ఉండేవని, విశాఖపట్నం వెళ్లి పనులు చేయించుకోవడానికి ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడే వారిని, అయితే 2013లో అప్పట్లో ఉన్న నాయకులు అనకాపల్లి రెవిన్యూ కేంద్రంగా ఏర్పాటు చేసి ప్రజలకు ఎంతో అందుబాటులో తీసుకువచ్చారని వారు గుర్తు చేశారు. ఎలమంచిలి నియోజకవర్గాన్ని నక్కపల్లి రెవిన్యూ డివిజన్లో విలీనం చేయడంలో స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ అభిప్రాయాలు ఏమిటో ప్రజలకు తేట తెల్లం చేయాలని వారు డిమాండ్ చేశారు. నక్కపల్లి వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లడానికి నిత్యం హైవేలో ప్రయాణం చేయవలసి వస్తుందని, అధికారులకు కూడా అంత దూరం వెళ్ళలేని పరిస్థితి ఉంటుందని, మరి సామాన్య ప్రజల సంగతేమిటని వారి ప్రశ్నించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వింత పత్రాన్ని స్థానిక తహసీల్దార్ సత్యనారాయణ కు అందజేసి వారి నిరసనను వ్యక్తం చేశారు. మునగపాక మండలాన్ని నక్కపల్లి రెవిన్యూ డివిజన్లో కలపవద్దని ప్లే కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చయ్య నాయుడు, స్థానిక జడ్పిటిసి సభ్యులు పెంటకోట స్వామి సత్యనారాయణ, మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, అరభుపాలు సర్పంచ్ బొడ్డేడశ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు అద్దాల వీరు నాయుడు, వెంకటాపురం సర్పంచ్ సుందరపు తాతాజీ, నాగులపల్లి పాల సంఘం అధ్యక్షులు దొడ్డి బుజ్జి, మాజీ సర్పంచ్ బోద్దపు శ్రీరామ్మూర్తి, పెంటకోట హరే రామ, పెంటకోట అప్పలనాయుడు, షేక్ ఇస్మాయిల్, ద్వారం జానకిరామ్, బొడ్డేడ బుజ్జి, పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## గోమంగిలో 'రైతన్నా మీకోసం' లో వెచ్చంగి కొండయ్య





**పెదబయలు డిసెంబర్4 మనసులో మాట:** అల్లూరి సీతారామరాజు జిల్లా: పెదబయలు మండలం గోమంగి పంచాయతీలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రైతన్నా! మీకోసం కార్యక్రమంలో పెదబయలు మండల అధ్యక్షులు : వెచ్చింగి కొండయ్య ప్రధాన కార్యదర్శి కొర్రా రాజారావు అరకు తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బొండా వినోద్ ముఖ్య అతిధులు గాపాల్గొన్నారు. గోమంగి పంచాయతీ అధ్యక్షులు : గంపరాయి ధనుంజయ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పురుషకరి భాస్కరరావు,అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. మండల కార్యనిర్వహణ కార్యదర్శి జంపరంగి తిరుపతిరావు సభాధ్యక్షులుగా సమావేశం నడిపించారు. వెచ్చింగి కొండయ్య మాట్లాడుతూ. రైతులందరూ అందరూ రాగులు, సామలు, కొర్రలు, మినుములు పండించడం వలన మంచి లాభం సాధించవచ్చని తెలియజేశారు. వరి తో పాటు చిరుధాన్యాలు తినడం వలన పూర్వం మన పెద్దలు ఆరోగ్యంగా ఉండేవారని తెలియజేశారు. రసాయానిక ఎరువులతో పండించిన పంటలు తినటం వలన తొందరగా బిపి, షుగర్, వ్యాధుల బారిన పడుతున్నామని తెలియజేశారు. ప్రతి ఏటా కూటమి ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా సంవత్సరానికి 20000 వేలు రైతు ఖాతాలో జమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శికొర్రా రాజారావు, అరకు తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బొండా వినోద్, మార్కెటింగ్ డైరెక్టర్ పురుషకరి భాస్కరరావు, మండల కార్యనిర్వహణ కార్యదర్శి జంపరంగి తిరుపతిరావు, క్లస్టర్ ఇంచార్జ్ కరుగొండ మన్మధరావు,లింగేటి అధ్యక్షులు కొర్రా శేషగిరి, రైతు సంఘం అధ్యక్షులు బొండా గణపతి,ప్రధాన కార్యదర్శి సత్తిబాబు, గుల్లేలు అధ్యక్షులు గంగన్న, టిడిపి సీనియర్ నాయకులు కొండలరావు, జోగన్న, హార్టికల్చర్అసిస్టెంట్, శివలింగం, సచివాలయం సిబ్బంది,వెటర్నరీ అస.

## యు. బొడ్డపుట్టు గ్రామంలో ఇంటింటికి తాగునీరు సరఫరా పనులకు శ్రీకారం



**హుకుంపేట నవంబర్ 3 (మనసులో మాట)..** మండలంలోని జీ. తాడేపుట్టు పంచాయతీ పరిధిలోని యు. బొడ్డపుట్టు గ్రామంలో జల్ జీవన్ మిషన్ నిధులతో మంజూరైన ఇంటింటికి మంచినీటి సరఫరా పథకాన్ని బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. 535 మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో ప్రతి ఇంటికి కొళాయి ద్వారా తాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన బోరు పనులను స్థానిక సర్పంచ్ సోమేలి సత్యవతి, ఎంపీటీసీ కిలగడ సింహాచలం చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ ద్వారా రూ. 5.50 లక్షల వ్యయంతో గ్రామానికి శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించేందుకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. గతంలో తాగునీటి వసతులు లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రజల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ప్రస్తుతం బోరు పనులు ప్రారంభించగలిగామని పేర్కొన్నారు. ఈ పథకంతో గ్రామంలో తాగునీటి సమస్య పూర్తిగా తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

గ్రామానికి శాశ్వత పరిష్కారం లభించడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బద్నాయిని బొంజు బాబు, వార్డు సభ్యులు కితలంగి కేశమ్మ, టీడీపీ నాయకులు సోమేలి లక్ష్మయ్య, పీసా సెక్రెటరీ సోమేలి వెంకన్న, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మీరు కోరితే దీనిని మరింత చిన్న వార్తగా, లేదా శీర్షికలతో ప్రత్యేక రూపంలో కూడా రూపొందించి ఇవ్వగలను.

## గోకులపాడు పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం




రాష్ట్ర సమగ్ర శిక్ష, ఎస్. రాయవరం మండల, విద్యాశాఖ వారి ఆదేశాలమేరకు గోకులపాడు హైస్కూల్ లోని భవిత కేంద్రం లో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు సహిత ఉపాధ్యాయుడు రజనీకాంత్ పట్నాయక్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యంగుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇన్చార్జ్ హెచ్ ఎం గొండి రాజు మాట్లాడుతూ దివ్యాంగులు కూడా సమాజంలో ఒక భాగమేనని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో మంచి కార్యక్రమాలు దివ్యాంగులు కోసం నిర్వహిస్తున్నాయి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో నాలుగు శాతరిజర్వేషన్, 10 వ తరగతి దివ్యాంగుల పిల్లలకు 5 సబ్జెక్ట్ మాత్రమే నని, 10 మార్కులకే పాస్ అన్నారు.స్కూల్ లో చదివే దివ్యాంగ పిల్లలకి ప్రతి సంవత్సరానికి 6 వేలు నగదుతోపాటు ఉపకారణాలు ఉచితంగా అందించటమే కాకుండా భవిత కేంద్రంలో ఉచిత విద్యాని ప్రత్యేక ఉపాధ్యాయలు ఫిజియోతెరపిస్ట్ లను నియమించి భోదన చేస్తాన్నారన్నారు. వారి భవిష్యత్ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ను వివరించారు. అలాగే దివ్యంగ పిల్లలకి ఆట, పాటలపోటీలను నిర్వహించి విజేతలకి బహుమతులు అందజేసారు. ప్రాధమిక పాఠశాల హెచ్ ఎం సుబ్బారావు , సహ ఉపాధ్యాయలు చింతలపూడి త్రినాధ రావు,అప్పారావు, మోహన రావు,లక్ష్మి, స్వర్ణ, కళా, అరుణ , స్కూల్ కమిటీ సభ్యులు, దివ్యంగ పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మునగపాక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

### - విద్యార్థులకు వస్తువులు అందజేస్తున్న మండల విద్యాశాఖ అధికారి



**మునగపాక, డిసెంబర్ 3, మనసులో మాట..** మునగపాక మండలం భవిత కేంద్రం నందు నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి- 1 శ్రీ వేణుగోపాలరావు మండల విద్యాశాఖ అధికారి -2 శివ నాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మట్ట శ్రీనివాస్ రావు, మరియు స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్ , ఇతర ఉపాధ్యాయ బృందం గ్రామ పెద్దలు సహిత విద్యా ఉపాధ్యాయులు సుమతి శ్రీ విజయేశ్వర్ మరియు దేముడు బాబు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో దివ్యాంగు పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ రకాల వయసులో సౌకర్యాలు మరియు అలవెన్స్ సంబంధించి మరియు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న ఉద్యోగాలలో మూడు నుంచి నాలుగు శాతం రిజర్వేషన్ పెంచి వాళ్ళని ఉన్నత ఉద్యోగాలు కూడా చేర్పించే ఏర్పాటు సదుపాయాలు ఉన్నాయని తెలియపరచడం జరిగింది.



## పొంగలపాక లోపంచ సూత్రాలు వివరణ

### - రైతు సేవా కేంద్రం దగ్గర 104 సేవలు

వి మాడుగుల డిసెంబర్ 3 (మనసులో మాట) మాడుగుల మండలంపొంగలిపాక గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. బుధవారం కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పంచసూత్రాలు వివరించడం జరిగింది నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్ ద్వారా అభివృద్ధి, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, ప్రభుత్వాల ద్వారా మద్దతు పొందటం తదితర విషయాలన్నింటినీ ఆన్లైన్లో రైతులందరికీ చంద్రబాబు నాయుడు గారి సందేశాన్ని చూపిస్తూ వ్యవసాయ రంగంలో ఉన్న సదుపాయాలన్నీ అందరూ పొందాలని తెలియజేయడం జరిగింది.... మరియు... పొంగలిపాక రైతు సేవా కేంద్రం వద్ద 104 వాహనం ద్వారా గ్రామంలో ఉన్న ప్రజలకి వైద్య సదుపాయం కల్పించడం జరిగింది, బిపి, షుగర్, అంటూ వ్యాధులు, జ్వరాలు, తదితర వ్యాధులన్నిటికీ 104 సిబ్బంది మందులు పంపిణీ చేయడం జరిగింది ... ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మై చర్ల సన్యాసిరావు, కింతలి కోఆపరేటివ్ సొసైటీ చైర్ పర్సన్ ఉండూరు దేముడు, కింతలి పిహెచ్సి వైద్యులు శ్రీను గారు, 104 సిబ్బంది గంగాధరు, మ్ ఎల్ %ష్ర% పి లోవతల్లి, ఏఎన్ఎం మంగతల్లి, ఆశ తులసి, అగ్రికల్చర్ అసిస్టెంట్ గణేష్, పంచాయతీ సెక్రటరీ ప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అబ్దుల్లా, వెటర్నరీ అసిస్టెంట్ శ్రీను, అంగన్వాడి టీచర్ వరలక్ష్మి, ఎన్పీయం ప్రసాదు పాల్గొన్నారు.

## రైతే రాజు అని నిరూపించిన ఘనుడు బాబే..

### - మండల అధ్యక్షులు ఆనంద్..




**దుంబ్రిగుడ, డిసెంబర్ 03, (మనసులో మాట):** రైతే రాజని నిరూపించిన ఘనుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఆనంద్ అన్నారు. మండలంలోని అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ ద్వారా నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ కార్యక్రమానికి బుధవారం ఉదయం 11:30 నిమిషాల నుండి ప్రారంభమైన కార్యక్రమానికి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబు నిర్వహించిన రైతన్న నీకోసం కార్యక్రమాన్ని శ్రద్ధగా విన్నారు. అనంతరం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్ మాట్లాడుతూ కని విని ఎరగని రీతిలో ఎన్నడూ లేని విధంగా ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా కూటమి ప్రభుత్వం ఇటువంటి గొప్ప కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చిన్న గెన్ను, మాజీ ఎంపీపీ ధన్నే, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, మాజీ పీఎస్ఎస్ చైర్మన్ భాస్కరరావు, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సౌర్యా దినోత్సవ వేడుకలు



గాజువాక (మనసులోమాట ) డిసెంబర్ 3 విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శౌర్య దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. గాజువాక పట్టణంలోని వీధుల్లో జై శ్రీరాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి నర్సింగరావు,కేఎన్ఆర్,గూటూరు శంకరరావు, కృష్ణారెడ్డి,నాగబాబు తదితరులు పాల్గొన్నారు. విహెచ్ పి నాయకులు వీర్రాజు శ్రీనివాస్, దుర్గాప్రసాద్, రామారావు,నాయుడు, జిలకర్ర భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీలకు రేవుపోలవరం విద్యార్థులు ఎంపిక



**ఎస్. రాయవరం, డిశంబర్ 3,(మనసులో మాట):** ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి కౌశల్ పోటీలో ప్రతిభ కనబర్చిన రేవుపోలవరం జిల్లాపరిషత్ హైస్కూల్ లోచదువుతున్న ముగ్గురు విద్యార్థిని, విద్యార్థులు రాష్ట్ర స్థాయిపోటీలకు అర్హత సాధించారని ఆపాఠశాల హెచ్ ఎం అరుణ తెలిపారు. హైస్కూల్ విద్యార్థులు ఐశ్వర్య, భారతి, దుర్గాప్రసాద్ లు ఈ పోటీలకు ఎంపిక అయ్యేందుకు గాను పాఠశాల గణిత ఉపాధ్యాయిని స్వర్ణగౌరి వారికి శిక్షణను ఇచ్చినట్లు హెచ్ ఎం తెలిపారు. రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలవాలంటూ ఉపాధ్యాయ బృందం అభినందించారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
కోస్తాంధ్ర
తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా
గుంటూరు | ప్రకాశం | నెల్లూరు
గురువారం 4 డిసెంబర్ 2025 

## కొవ్వూరుకి తిరిగి
## వాహన ఫిట్‌నెస్ కేంద్రం
# కేటాయించండి



- ▶▶ సీఎం చంద్రబాబు నాయుడును కోరిన మంత్రి కందుల దుర్గేష్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్
- ▶▶ తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల ఆటో కార్మికుల సమస్యపై ముఖ్యమంత్రికి వినతి
- ▶▶ హర్షం వ్యక్తం చేసిన ఆటో కార్మికులు

**తూర్పు గోదావరి (మనసులో మాట), డిసెంబరు 3:** వాహన ఫిట్‌నెస్ కేంద్రాన్ని మళ్లీ కొవ్వూరుకే తరలించాలని నిడదవోలు నియోజకవర్గం ఆటో కార్మికులు చేసిన అభ్యర్థనను మంత్రి కందుల దుర్గేష్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. బుధవారం తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి మంత్రి దుర్గేష్ ఈ విషయంపై వినతి పత్రాన్ని సమర్పించారు. నిడదవోలు నియోజకవర్గంలో సుమారు 1700 ఆటోలు నడుస్తున్నాయి. గతంలో ఈ ఫిట్‌నెస్ కేంద్రం కొవ్వూరులో ఉండటం వలన కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల ఆటో డ్రైవర్లకు చాలా సౌకర్యంగా ఉండేది. సంబంధిత కేంద్రాన్ని ఇటీవల రాజానగరం మండలం పరిధిలోని కావలచెర్ల గ్రామానికి మార్చారు. ఇది ఆటో కార్మికులకు చాలా దూరం అవుతోంది. దూరం పెరగడం వల్ల పాత ఆటోలకు వార్షిక ఫిట్‌నెస్ మరియు కొత్త ఆటోలకు రెండేళ్ల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోవడానికి ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, వారి సౌలభ్యం కోసం ఫిట్‌నెస్ కేంద్రాన్ని కావలచెర్ల గ్రామం నుండి తిరిగి కొవ్వూరుకు మార్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని మంత్రి కందుల దుర్గేష్ వినయ పూర్వకంగా కోరారు. మంత్రి దుర్గేష్ స్పందన పట్ల ఆటో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.



## కాకినాడ లో ఘనంగా
# సాయుధ దళాల పతాక దినోత్సవం
### - ఇంచార్జి కలెక్టర్ మనీషా

**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 3..** సాయుధ దళాల పతాక దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబర్ 7 వ తేదీన జరుపుకుంటాము కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ ఆదేశాల ననుసరించి 1949 వ సమత్సరము నుండి పతాక దినోత్సవం జరుగుతుంది. ఈ సంవత్సరము డిసెంబర్ 7 వ తేదీ ఆదివారం అయిన కారణంగా కాకినాడ జిల్లాలో కలెక్టర్ జిల్లా సైనిక బోర్డు చైర్మన్ వారి అధ్యక్షతన పతాక దినోత్సవం జరుపుకుంటున్నాము. దేశ రక్షణ కోసం సాయుధ దళాలు అహర్నిశలు చేస్తున్న కృషి, శత్రువుల నుంచి దేశాన్ని రక్షిస్తూ వారు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ వారి కుటుంబాలకు అండగా ఉన్నామని తెలియ జేయడమే దీని ఉద్దేశం. మనీషా, ఇంచార్జ్ కలక్టర్, కాకినాడ జిల్లా వారు తమ మొదటి విరాళాన్ని అందచేయుచూ ఈ కార్య క్రమాన్ని ప్రారంభించారు. సాయుధ దళాల పతాక నిధికి ఉద్యో గులు, వివిధ సంస్థలు మరియు ప్రజలు విరివిగా విరాళాలు ఇవ్వవలసినదిగా విజ్ఞప్తి చేశారు. ఈ పతాక నిధిని యుద్ధంలో గాయపడినవారికి పునరావాసం కల్పించటం, సర్వీసులోవున్న సిబ్బంది యొక్క కుటుంబీకుల సంక్షేమం, మాజీ సైనికోద్యోగులు, వారి కుటుంబాల సంక్షేమం, పునరావసం కల్పించడం, అమరవీరుల కుటుంబాలు, మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం ఉపయోగించడం జరుగుతుంది.

ఈ కార్యక్రమములో జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎస్.కె. నవాబ్ జాన్, వారి కార్యాలయ సిబ్బంది మరియు కాకినాడ జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘ అధ్యక్ష కార్య దర్శు లు పలువురు మాజీ సైనికులు, ఎస్ కె నవాబ్ జాన్ జిల్లా సైనిక సంక్షేమాధికారి కాకినాడ జిల్లా, తూర్పు గోదావరి జిల్లా మరియు డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్ కోనసీమ అసోసియేషన్, అడపా శంకర్, కెనడీ, విక్టర్, త్రినాధ్, ఈశ్వరుడు, జి.వి.ఎస్.ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే వాసు, కమిషనర్ రాహుల్ మీనాకు
# సీఎం అభినందనలు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 3:** రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు), నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మకమైన 'జల్ జల్ సంచయ్ జన్ భాగీదారీ 1.0' జాతీయ స్థాయి అవార్డును రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ దక్కించుకుని, రూ. 2 కోట్ల ప్రైజ్ మనీని గెలుచుకున్న సంగతి తెలిసిందే. అయితే రైతన్నల సంక్షేమమే లక్ష్యంగా చేపట్టిన 'రైతన్న మీ కోసం' కార్యక్రమానికి హాజరయ్యేందుకు తూర్పు గోదావరి జిల్లా విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కమిషనర్ రాహుల్ మీనా మర్యాదపూర్వకంగా కలుసుకుని స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఎమ్మెల్యే వాసును, కమిషనర్ రాహుల్ మీనాను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి దార్శనికత, తన పర్యవేక్షణ, అధికారుల నిబద్ధత ఫలితమే ఈ అద్భుత విజయమని గర్వంగా చెప్పారు. గత పాలనలో మందగించిన కార్పొరేషన్ పనులు, ఇప్పుడు ఎంత వేగంగా దూసుకుపోతున్నాయో చెప్పడానికి ఈ అవార్డే నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, జల్ శక్తి మంత్రిత్వ శాఖకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.



# రైతన్న మీకోసం లో సీఎం ప్రసంగాన్ని తిలకించిన కలెక్టర్



**ఏలూరు, డిసెంబర్, 3 (మనసులో మాట)..** పెదపాడు మండలం అప్పనవీడు గ్రామంలో 'రైతన్న మీకోసం.' వర్క్ షాప్ లో బుధవారం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అప్పనవీడు రైతు సేవ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంద రంగాల శాఖల సిబ్బంది రైతుల ఇళ్లకు వెళ్లి ఆధునిక వ్యవసాయ పద్ధతులతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధనతో రైతులకు అవగాహన కలిగించడం రైతన్న మీకోసం కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమ న్నారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. మరింత విస్తీర్ణంలో ప్రకృతి సాగుచేసేలా రైతులలో అవగాహన పెంచాలని వ్యవసాయాధికారులు కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో పొలంపిలుస్తోంది, పొలంబడి కార్యక్రమాలు నిర్వహించి సాగులో ఉత్తమ యాజమాన్య పద్దతులపై రైతులకు అవగాహన కలిగిస్తున్నామన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై అందించడమే కాక 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రెండు విడతలలో లక్షా 60 వేల 968 మంది రైతులకు 213. 31 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించిందన్నారు. సాగులో యాంత్రీకరణను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని, జిల్లాలో 60 డ్రోన్లను రైతులకు అందించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, వ్యవసాయంలో సాంకేతికత, ఆహార శుద్ధి, ప్రభుత్వ మద్దతు. పాడి రైతులకు అండ వంటి పంచ సూత్రాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలు, వాటిని ప్రతీ రైతు వినియోగించుకునే విధానాలపై రైతుల ఇంటివద్దకు వెళ్లి ప్రతీ రైతుకు వ్యవసాయ, అనుబంధాల రంగాల సిబ్బంది 15 రోజులపాటు తెలియజేశారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రైతులను ఉద్దేశించి ప్రసంగించిన కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులతో పాటు అధికారులు తిలగించారు.

## అన్నదాత మోములో చిరునవ్వే కూటమి ప్రభుత్వ లక్ష్యం
# కూటమి ప్రభుత్వంలో రైతే - రాజు

- రూ. 31.85 కోట్ల పంట నష్ట పరిహారానికి నివేదిక
- కందుల పాలెంలో రైతన్నా మీకోసం
- పంచ సూత్రాలతో రైతులకు ఆర్థిక ప్రగతి
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం(మనసులో మాట) డిసెంబర్ 3..** అన్నదాతల మోముల్లో చిరునవ్వులే ఈ దేశానికి నిజమైన సిరి సంపద అని, వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడమే ప్రభుత్వ ధ్యేయమని వ్యవసాయాన్ని లాభదాయక రంగంగా మార్చడానికి ఆధునిక పద్ధతుల ద్వారా ప్రకృతి సేద్యాన్ని తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురం మండలం కందులపాలెం లో బుధవారం జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో మంత్రి సుభాష్ పాల్గొని అన్నదాతలతో మాట్లాడారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు అనే అంశాలతో పంచ సూత్రాలతో అన్నదాతలకు అండగా నిలవడానికి రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల సంభవించిన ముంథా తుఫాన్ వల్ల రామచంద్రపురం నియోజవర్గంలో 31,500 రైతులకు గాను రూ. 31.85 కోట్ల మేర నష్టం వాటిలినట్లు ప్రభుత్వానికి నివేదిక పంపమన్నారు. అలాగే ధాన్యం కొనుగోలుకు రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి 4 నుంచి 24 గంటలలోపు రైతుల అకౌంట్లో సొమ్ము చెల్లిస్తున్నామన్నారు. సేంద్రీయ వ్యవసాయంతో భూసార పరిరక్షణతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం కూడా లభిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతే రాజని, వారి సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామన్నారు. రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని, వ్యవసాయాధికారులు సూచించిన విషయాలను జాగ్రత్తగా పాటించి వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలన్నారు. ఎ ఏం సి చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్ మాట్లాడుతూ పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం కింద రెండు విడతల్లో పీఎం కిసాన్ పథకంతో ఇప్పటికే రూ.14వేలు అందించడం జరిగిందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించడంలో కూటమి ప్రభుత్వం ముందుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వైట్ల శ్రీనివాసరావు(రాజబాబు) పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, సర్పంచ్ పెంకె కృష్ణవేణి, ద్రాక్షారామం సర్పంచ్ కొత్తపల్లి అరుణ, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు బలుసు శివప్రసాద్, బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు పెంకే సాంబశివరావు, ఏఎంసీ డైరెక్టర్లు రాఘవేంద్ర, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ గుత్తుల అచ్యుత వేణి,వయిట్ల గజలక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

#### కోనసీమ జిల్లాలో నాబార్డు నిధులతో నిర్మిస్తున్న ఆర్అండ్ బి
# రహదారులు త్వరితగతిని పూర్తి చేయాలి
### - జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్



**అమలాపురం (మనసులోమాట) డిసెంబరు 3:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా రహదారులు భవనాల శాఖ ఆధ్వర్యంలో నాబార్డు, ప్రణాళిక నిధులతో చేపట్టిన రహదారుల అభివృద్ధి పనులను త్వరితగ తిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆర్ అండ్ బి ఇంజనీర్లను ఆదేశిం చారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రహ దారులు భవనాల శాఖ పరిధిలో వివిధ రహదారుల మరమ్మత్తు పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రహదారులు భవనాల శాఖ సుమారు 23 రహదారి అభివృద్ధి పనులను చేపట్టిందని ఈ పనులు పూర్తి చేసేందుకు గడువులు విధించడం జరిగిం దన్నారు. టెండర్ దశలో ఉన్న పనులు, నిధులు మంజూరు అంశాలపై కూడా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రహదారి నిర్మాణాలు చేపట్టిన ప్రాంతాలను పరిశీలించారు.రోడ్డు అభివృద్ధి పనుల్లో నాణ్య త ప్రమాణాల పాటింపు అత్యంత ముఖ్యమని తెలిపారు. రోడ్డు నిర్మాణంలో నిర్దేశిత ప్రమాణం లో నాణ్యమైన మెటీరియల్ తప్పనిసరిగా వాడాలని సూచించారు. టెండరు లో నిర్దేశించిన ప్రకారం డిజైన్, థర్డ్ పార్టీ ఆడిట్‌ల ద్వారా నాణ్యతా పరీక్షలు నిర్వ హించాలన్నారు. కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు పూర్తి పారదర్శకత,జవాబుదారీతనంతో పనిచేయాలని, నాణ్య తలో లోపాలు గమనిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్ల నిర్మాణాలలో నాణ్యతకు పెద్దపీట వేయాలని ఆయన సూచించారు. ఈ కార్య క్రమం లో ఆర్ అండ్ బి ఎస్ ఈ బి రాము. డివిజనల్ ఇంజనీర్లు అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# కాకినాడలో ఫ్లాగ్ డే సెలబ్రేషన్

- అమర జవానుల స్థూపం వద్ద మాజీ సైనికుల నివాళులు
- కలెక్టరేట్ లో సైనిక సమావేశంలో ఉత్సాహంగా పాల్గొన్న ఉద్యోగులు







**కాకినాడ (మనసులో మాట), డిసెంబరు 3:** జిల్లా ప్రధాన కేంద్రం కాకినాడలో బుధవారం ఫ్లాగ్ డే సెలబ్రేషన్స్ అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించారు. వాస్తవానికి 'ఆర్మర్డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే' డిసెంబరు 7న. అయినప్పటికీ బుధవారం ఫ్లాగ్ డే సెలబ్రేషన్స్ ను నిర్వహిం చారు. స్థానిక జిల్లా కలెక్టరేట్ సమీపంలో ఉన్న అమర జవానుల స్థూపం వద్ద మాజీ సైనికులు దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికులకు నివాళులర్పించారు. జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన సైనిక సమావేశంలో కలెక్టరేట్ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 1949 నుండి, దేశ గౌరవాన్ని కాపాడటానికి మన సరిహద్దులలో వీరోచితంగా పోరాడి పోరాడుతున్న అమరవీరులను, యూనిఫాం ధరించిన పురుషులను గౌరవించడానికి దేశ వ్యాప్తంగా డిసెంబరు 7 ను సాయుధ దళాల పతాక దినోత్సవంగా జరుపుకుంటారు. సైనికులు ఏ దేశానికైనా గొప్ప ఆస్తుల్లో ఒకటి. వారు దేశానికి సంరక్షకులు, దాని పౌరులను అన్ని విధాలా రక్షిస్తారు. తమ విధులు నిర్వర్తించడానికి సైనికులు తమ జీవితంలో ఎన్నో పనులు చేశారు. మాతృ భూమి కోసం తమ ప్రాణాలను అర్పించిన ఈ వీర వీరులకు దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుంది. విధి నిర్వహణలో గాయపడిన అమరవీరులకు, అమర వీరులకు మాత్రమే కాకుండా, ఈ త్యాగంలో కీలక పాత్ర పోషించిన వారి కుటుంబాలకు కూడా మన గౌరవాన్ని చూపించడం మన కర్తవ్యం. కేంద్ర, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ చర్యలతో పాటు, సంరక్షణ, మద్దతు, పునరావాసం, ఆర్థిక సహాయాన్ని అందించడానికి తన నిరాటంకంగా, స్వచ్ఛందంగా సహకారం అందించడం మన దేశంలోని ప్రతి పౌరుడి సమిష్టి కర్తవ్యం. మన యుద్ధ వికలాంగులైన సైనికులు, వీర నారీలు, దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలనే నిబద్ధతను ఫ్లాగ్ డే తెరపైకి తెస్తుంది. రేపటి భావి భారత పౌరులకు ఒక స్ఫూర్తిని, దేశం పట్ల ప్రేమానురాగాలను అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తి వంతంగా ఉంటాయని పలువురు ఈ సందర్భంగా తెలిపారు.



## ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన
## ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి
## యువ నాయకులు మనోజ్ రెడ్డి

**అనపర్తి ( మనసులో మాట) డిసెంబర్ 3:** గోపాలపురం నియోజకవర్గం పర్యటనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం విచ్చేశారు. ఈ సందర్భంగా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, యువ నాయకులు నల్లమిల్లి మనోజ్ రెడ్డి లు ముఖ్యమంత్రి కి ఘన స్వాగతం పలికారు.

# నేచురల్ స్టార్ నాని గృహంలో దత్త హెూమం



**పిఠాపురం,(మనసులో మాట) డిసెంబరు 3:** ప్రముఖ సినీ హీరో, 'నేచురల్ స్టార్' నాని ఆధ్యాత్మిక చింతనలో మునిగిపోయారు. హైదరాబాద్‌లోని ఫిలింనగర్‌లో గల ఆయన నివాసంలో బుధవారం దత్త హెూమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాకినాడ జిల్లాలోని పిఠాపురం నుంచి విచ్చేసిన దత్త ఉపాసకులు, లక్ష్మీనారాయణ దత్త స్వామి ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా, లక్ష్మీనారాయణ దత్త స్వామి పిఠాపురం పుణ్యక్షేత్రం యొక్క అపారమైన మహిమను, దత్తాత్రేయ మహత్యాన్ని హీరో నానికి సవివరంగా వివరించారు. దత్త పీఠం, పాదగయ క్షేత్రం యొక్క ప్రాశస్త్యాన్ని తెలుసుకున్న నాని, ఆధ్యాత్మికంగా ఎంతో సంతృప్తి చెందారు. హెూమం అనంతరం హీరో నాని మాట్లాడుతూ, తనకు పిఠాపురం అంటే వ్యక్తిగతంగా ఎంతో ఇష్టమని తెలిపారు. "పిఠాపురం పుణ్యక్షేత్రం గురించి చాలా విన్నాను. అక్కడి దత్త మహత్యం అద్భుతమైనది. త్వరలోనే నేను స్వయంగా పిఠాపురం వచ్చి దత్తాత్రేయ స్వామిని దర్శించుకుంటాను," అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాని కుటుంబ సభ్యులతో పాటు కొద్దిమంది సన్నిహితులు, ఉపాసకులు పాల్గొన్నారు.

# వ్యవసాయం లాభసాటికి పంచ సూత్రాలు

- ఆహార అలవాట్లకు అనుగుణంగా సాగు పద్ధతులు ఉండాలి
- వ్యవసాయ అనుబంధ రంగాలపైనా రైతన్నలు దృష్టి పెట్టాలి
- అంతర పంటలతో అధిక ఆదాయం
- విద్యుత్తు ఛార్జీలు పెంచబోం
- గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు...ఖజానా ఖాళీ చేశారు
- రైతన్నా..మీకోసం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- అంతరపంటల పరిశీలన, మేలు సాగు విధానాలు పాటిస్తున్న రైతులకు సీఎం సన్మానం


























**నల్లజర్ల/రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 3:** వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి, అన్నదాతకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం పంచసూత్ర ప్రణాళికతో ముందుకెళుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పంచ సూత్రాలపై అవగాహన కల్పించేందుకే 'రైతన్నా...మీ కోసం' కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి రైతు కుటుంబం అభివృద్ధి చెందడమే లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో 'రైతన్నా...మీ కోసం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి నిర్వహించారు. వ్యవసాయ యాక్షన్ ప్లాన్ పై చర్చించారు. అంతకుముందు అక్కడి రైతులు సాగు చేస్తున్న అంతర్ పంటలను పరిశీలించారు. అనంతరం రైతులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 'వ్యవసాయమే మన బలం. రాష్ట్రంలో 62 శాతం మంది వ్యవసాయ, అనుబంధ రంగాలపైన ఆధారపడి జీవిస్తున్నారు. అందుకే సాగును లాభసాటి చేసేందుకు మొదటి రోజు నుంచి ప్రయత్నిస్తున్నామని" ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి పెట్టాలి..**

"మనది వ్యవసాయ ఆధారిత రాష్ట్రం. వ్యవసాయం లాభసాటిగా మారాలి. రైతుకు గిట్టుబాటు ధర రావాలి. తెలంగాణలో 60 శాతం సర్వీస్ సెక్టార్ ఉంది. అక్కడ వ్యవసాయంలో వచ్చే ఆదాయం 14 శాతంగా ఉంది. వ్యవసాయం, అనుబంధ రంగాలు మన రాష్ట్ర జీఎస్డీపీ లో 34 శాతం వాటా కలిగి ఉన్నాయి. రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపైనా దృష్టి పెట్టాలి. అలాగే భూగర్భ జలాలు పెంచుకోగలిగితే కరువు ఉండదు. రాబోయే రోజుల్లో గోదావరిని వంశధారలో కలుపుతాం. పెన్నాకూ తీసుకెళతాం. ఈ ఏడాది 7 వేల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలోకి పోయింది. కృష్ణా నుంచి 1500 టీఎంసీల నీరు సముద్రంలోకి పోయింది. ఇందులో 200 టీఎంసీల నీరు మనం వాడుకోగలిగితే కరువు అన్నమాటే వినపడదని" సీఎం అన్నారు.


**కృష్ణా-గోదావరి అనుసంధానంతో ప్రతి ఎకరాకు నీళ్లు..**

భూమినే జలాశయంగా చేసి భూగర్భ జలాలు పెంచుకోగలిగితే కరువు ఉండదు. పోలవరం రైట్ కెనాల్ నుంచి నీరు ఇస్తే ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరుగుతాయి. రాష్ట్రమంతటా డిసెంబరు 1 నాటికి 6.8 మీటర్ల భూగర్భ జలాలు రాగా తూర్పు గోదావరి జిల్లాలో 18 మీటర్లు ఉన్నాయి. అందుకు ఇక్కడున్న భూమే కారణం. కరువు ఎక్కువగా ఉండే సీమలోని నంద్యాల జిల్లాలో 4 మీటర్లకు భూగర్భ జలాలు పెరిగాయి. రాష్ట్రం మొత్తం మీద తూర్పు గోదావరి, ఏలూరు, ప్రకాశం జిల్లాలో భూగర్భ జలాలు తగ్గాయి. రాష్ట్రంలో కృష్ణా, గోదావరి నుంచి నీరు వృథాగా సముద్రంలోకి పోతోంది. ఈ రెంటిని అనుసంధానం చేసి ప్రతి ఎకరాకు సాగు నీరు అందిస్తాం. ఈ ఏడాది రిజర్వాయర్లలో 900 టీఎంసీల నీరు ఉంది. 700 టీఎంసీల వరకూ భూగర్భ జలాలు ఉన్నాయి. 20 లక్షల పంపు సెట్లు ఉన్నాయి. సాగు, తాగుతో పాటు పరిశ్రమలకు నీటి ఎద్దడి లేకుండా చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**డిమాండు ఉన్న పంటల సాగుతో ఆదాయం..**

"రైతులు డిమాండు ఉన్న పంటలను సాగు చేయాలి. వినూత్న పద్ధతుల్లో విభిన్న పంటలు పండించాలి. ఏ పంటలకు డిమాండు ఉంది, ఎక్కడ మార్కెట్ ఉంది, సాగులో కొత్త పద్దతులు ఏంటి అనే వాటిపై రైతులకు అవగాహన రావాలి. వ్యవసాయ రంగాన్ని రీ-ఓరియేంటేషన్ చేస్తాం. యూనివర్సిటీల్లో చేస్తున్న పరిశోధనలు రైతులకు ఉపయోగకరంగా ఉండాలి. పామాయిల్ సాగులో టెక్నాలజీ ఉపయోగించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చు. ఆనాడు పామాయిల్ సాగును ఎన్టీఆర్ ప్రోత్సహించారు. సాగు కోసం మొదటిసారిగా మలేషియా నుంచి మొక్కలు తెప్పించారు. నేడు ప్రపంచీకరణతో మొత్తం మారింది. ఎక్కడో ఉక్రెయిన్ లో జరిగిన యుద్ధం మన పంటలపై ప్రభావం చూపుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు కోపం వస్తే మన రొయ్యి ఎగిరిపోయే పరిస్థితి వచ్చింది. ఇథనాల్ తయారీ కోసం కేంద్ర ప్రభుత్వాలు మొదట మొక్కజొన్న సాగును ప్రోత్సహించాయి. తర్వాత పాలసీ మారడంతో ఇథనాల్ తయారీకి 40 శాతం వరి నూకలు, 60 శాతం జొన్నలు వాడుతున్నారు. దీంతో మొక్కజొన్నకు డిమాండు తగ్గి రైతులు నష్టపోయారు. అలాగే డిమాండు ఉందని హెచ్డీ బర్లీ పొగాకు భారీగా సాగు చేశారు. తర్వాత మార్కెట్ పడిపోయింది. అంతర్ పంటలు వేసిన రైతులకు లాభాలు వస్తున్నాయి. ఎరువుల వాడకం ఎక్కువగా ఉంటే ఖర్చు పెరిగిపోతుంది. చిత్తూరు జిల్లాలో కొందరు రైతులు మామిడి పండ్లకు పురుగు పట్టకుండా కవర్ పెట్టి జాగ్రత్తలు తీసుకోవడంతో మంచి లాభాలు పొందారని సీఎం తెలిపారు.





**ప్రకృతి సేద్యంతో ఆరోగ్యం పదిలం..**

టెక్నాలజీ వినియోగంతో వ్యవసాయం లాభసాటిగా మారుతుంది. ఒక పంట వరి వేసినప్పటికీ మరో పంటగా హార్టికల్చర్ కు వెళితే ఆదాయం పెరుగుతుంది. నియోజకవర్గానికి ఒక ఎంఎస్ ఎంఈ పార్కు పెడుతున్నాం. రైతులు పండించిన పంటను నేరుగా వినియోగదారునికి విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నాం. నేడు రైస్ తినడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. కాబట్టి వరితో పాటు ఇతర పంటలపై రైతులు దృష్టి పెట్టాలి. ప్రకృతి సేద్యంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. రాయల సీమను హార్టికల్చర్ హబ్ గా తయారు చేస్తున్నాం. సీమలో 18 రకాల పంటలు, పండ్లు పండుతున్నాయి. ఎడారిలో పండే ఖర్జూరాలనూ వాళ్లు పండిస్తున్నారు. కాఫీ నుంచి కోకో వరకు, బత్తాయి నుంచి బొప్పాయి వరకు, పట్టు నుంచి పసుపు వరకు...పామాయిల్ నుంచి శనగ వరకు, అగ్రికల్చర్ నుంచి ఆక్వా కల్చర్, హార్టికల్చర్ వరకు....మన దగ్గర పండని పంటలేదు, మన దగ్గర దొరకని ఫలం లేదు. మారిన పరిస్థితులకు అనుగుణంగా ముందుకెళ్లాలి. డైరీ, పౌల్ట్రీ...మీట్ లో రూ.2 లక్షల కోట్ల జీఎస్డీపీ వస్తుంది. హార్టికల్చర్ లో రూ.లక్షా 85 వేల కోట్ల జీఎస్డీపీ వస్తుంది. చేపలు, రొయ్యల సాగుతో రూ.లక్షా 45 వేల ఆదాయం వస్తుంది. వ్యవసాయంలో కేవలం రూ.50 వేల ఆదాయమే వస్తుంది. ఒకప్పుడు అరకు కాఫీ ఎవరికీ పెద్దగా తెలీదు. మనం ఇచ్చిన ప్రోత్సాహంతో నేడు అరకు కాఫీ గ్లోబల్ బ్రాండ్ గా మారింది. ఏపీ రైతు తెలివైనవాడు. నీళ్లు ఎక్కడుంటే అక్కడ మన రైతు ఉంటారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణతో పాటు ఆఫ్రికా వంటి దేశాల్లోనూ వ్యవసాయం చేస్తున్నారని" సీఎం అన్నారు.

**గత పాలకులు ఖజానా ఖాళీ చేశారు..**

"గడిచిన ఐదేళ్లలో పాలన ఎలా ఉందో మనం చూశాం. జగన్మోహన్ రెడ్డి వ్యవస్థలను సర్వనాశనం చేశాడు. ఖజానా ఖాళీ చేశాడు. కనీసం అప్పు దొరకని పరిస్థితి. తాము దక్కించుకోవాల్సిన భూమిని దక్కించుకోలేకపోతే... ఆ భూములను లిటిగేషన్లో పెట్టేవారు. అలాంటి భూములను 22-ఎ జాబితాలో చేర్చే వారు. అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పలికారు. కూటమిపై నమ్మకంతో ప్రజలు అద్భుత విజయం అందించారు. అన్నింటినీ సరిచేసుకుంటూ వస్తున్నాం. సూపర్ సిక్స్ తో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. తల్లికి వందనం కింద రూ.15 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నాం. దీపం-2 కింద ఏటా 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. మెగా డీఎస్సీతో 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేశాం. అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ. 20 వేలు అందిస్తున్నాం. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు ఇంటి వద్దకే పౌర సేవలు అందిస్తున్నాం. కరెంటు చార్జీలు పెంచబోమనే మాటకు కట్టుబడి ఉన్నాం. వచ్చే సంక్రాంతి నాటికి గుంతలు పడ్డ రోడ్లన్నీ మరమ్మతులు చేస్తాం. ఇప్పటికే టాటా సంస్థ సహకారంతో డిజిటల్ నెర్వ్ సెంటర్ సంజీవని కేంద్రాలనే ప్రాజెక్టును తీసుకొచ్చామని" సీఎం తెలిపారు.

**విమర్శలు సహజమే..**

"పాలనలో సంస్కరణలు తీసుకొస్తున్న క్రమంలో అడ్డంకులు సహజం. నాడు నేను ఐటీని ప్రోత్సహించినప్పుడు విమర్శలు చేశారు. డ్వాక్రా సంఘాలు పెట్టినప్పుడు హేళన చేశారు. కానీ నేడు వాటి ఫలితాలు ఎలా ఉన్నాయో చూస్తున్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తున్నాం. విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సులో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇప్పటికే విశాఖ నగరానికి గూగుల్ డేటా సెంటర్ వచ్చింది. 20 లక్షల ఉద్యోగాలు కల్పనకు కట్టుబడి ఉన్నాం. కేంద్ర సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని, 2047 నాటికి స్వర్ణాంధ్ర కల సాకారమవుతుందని" సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఆదర్శ రైతులకు సీఎం చంద్రబాబు సత్కారం



**నల్లజర్ల / రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 3:** నల్లజర్లలో బుధవారం నిర్వహించిన "రైతన్నా - మీ కోసం" కార్యక్రమంలో సహజ వ్యవసాయంలో విశిష్ట ఫలితాలు సాధించిన ఆదర్శ రైతులను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సన్మానించారు. వదాలగుంట గ్రామానికి చెందిన గేద జోగేంద్ర ప్రసాద్ సహజ పద్ధతుల్లో చెరుకు నుంచి బెల్లం సాగు చేసి పరిశుభ్ర ఆహారాన్ని వినియోగదారులకు అందిస్తున్నందుకు అభినందనలు అందుకున్నారు. అలాగే యర్నగూడెం రైతు గద్దె మునేశ్వరరావు సహజ పద్ధతుల్లో వరి సాగుతో పాటు జాగరీ, కారం పొడి వంటి ఉత్పత్తులను సొంతంగానే ప్రాసెస్ చేసి ఆదాయం పెంచుతూ గ్రామానికి ఆదర్శం అవుతున్నారు. చిట్యాల గ్రామానికి చెందిన గద్దె హరిశ్చంద్ర ప్రసాద్ వరిని ప్రత్యక్షంగా ప్రాసెస్ చేస్తూ రైతు ఉత్పత్తికి విలువ వృద్ధి కల్పించారు. దుద్దుకూరు రైతు కాకర్ల హరినాథ్ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వరి సాగుతో డ్రైయింగ్, రైస్ ప్రాసెసింగ్ సదుపాయాలతో మార్కెట్లో మంచి ధరలు పొందే విధంగా కృషి చేస్తున్నారు. సింగరాజుపాలెం రైతు దొండపాటి లక్ష్మీ నారాయణ సహజ పద్ధతుల్లో పశుసంరక్షణ, నాటు కోళ్లు పెంపకంలో సమీకృత విధానం లో ఆయిల్ పామ్ సాగు చేపట్టి ఆదర్శ రైతు గా ముందంజలో ఉన్నారన్నారు. గుండుగొలనుగుంటకు చెందిన ఒబెలిశెట్టి గోపాలకృష్ణ రాష్ట్ర వ్యాప్తంగా బయో ఇన్పుట్ల సరఫరా నేపథ్యంలో వనరుల కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, ఆయిల్ పామ్ విస్తరణలో క్షేత్ర స్థాయిలో మంచి పని తనం చూపడం జరిగిందన్నారు. కురుకూరు గ్రామానికి చెందిన యెలమతి భాస్కరరావు 10 ఎకరాల వరి సాగు నుంచి ఆయిల్ పామ్ రంగానికి మారడం, ఉత్పత్తి నుండి మార్కెటింగ్ వరకు స్వంతంగా నిర్వహిస్తూ ఆదర్శ రైతుగా గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా రైతులను అభినందించిన ముఖ్యమంత్రి "సహజ వ్యవసాయ పంథాకు మారితే రైతు లాభాలు పెరుగుతాయి. ఈ ఆదర్శ రైతుల మోడల్ను అందరూ అనుసరించాలని కోరుతున్నాను. రైతు బలపడాలంటే గ్రామం బలపడాలి, గ్రామం బలపడాలంటే వ్యవసాయం బలోపేతం కావాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



## గొల్లప్రోలు భవిత కేంద్రంలో ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

### చేయూత సంస్థ నుండి రూ.50 వేల విలువైన థెరపీ పరికరాల విరాళం

**గొల్లప్రోలు (మనసులో మాట) డిసెంబరు 3:** గొల్లప్రోలు పట్టణంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా భవిత కేంద్రంలో బుధవారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కేంద్రంలో 22 మంది దివ్యాంగ చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీసీసీబీ చైర్మన్ మరియు జిల్లా జనసేన అధ్యక్షుడు మరియు పిఠాపురం ఫైర్ మాన్ కమిటీ సభ్యులు తుమ్మల రామస్వామి (బాబు), ఓదూరి కిషోర్ హాజరయ్యారు.
ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి మాట్లాడుతూ...దివ్యాంగ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్య పర్యవేక్షణ తప్పనిసరి అని పేర్కొన్నారు. సాధారణ విద్యార్థులతో కలిసేలా ప్రత్యేక శిక్షణ, బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.
ఫైవ్ మాన్ కమిటీ సభ్యుడు ఓదూరి కిషోర్ మాట్లాడుతూ... విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందేలా బోధన, శిక్షణను అందించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.50,000 విలువైన స్పీచ్ థెరపీ, మస్క్యులార్ ఫిజియోథెరపీ యూనిట్లు భవిత కేంద్రానికి అందజేశారు. చేయూత సంస్థ అధ్యక్షుడు మొండి రవికుమార్ మాట్లాడుతూ....ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సేవా తత్త్వం స్ఫూర్తిగా ఇలాంటి సామాజిక సేవలు చేస్తున్నామని తెలిపారు. ఈ పరికరాలను ఉపయోగించి రెగ్యులర్ థెరపీ ద్వారా దివ్యాంగ చిన్నారులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.
అలాగే బాలికల పాఠశాలకు చెందిన కొత్త వెంకటేశ్వరరావు దంపతులు రెండు సీలింగ్ ఫ్యాన్లను విరాళంగా అందజేశారు. అనంతరం అతిథులతో కలిసి కేక్ కట్ చేసి చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆటపాటల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.
ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వెన్నా శ్రీనివాస్‌రావు, శివప్రసాద్, స్థానిక జనసేన నాయకులు, పాఠశాల చైర్మన్ కృష్ణవేణి, ఫిజియోథెరపీ నిపుణులు, చేయూత సంస్థ సభ్యులు, రహీమాన్ బీ,స్వామి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమత్వ్రత మహోత్సవాలు ప్రారంభం



**తాళ్లరేవు (మనసులో మాట), డిసెంబరు 3:** పవిత్ర హనుమద్వ్రత మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రమైన తాళ్లరేవులో వేంచేసియున్న శ్రీ సువర్చల సమేత దాసాంజనేయస్వామి వారి ఆలయంలో అర్చకులు కొండవీటి శ్రీరామశర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా పిల్లంక గ్రామంలో వేంచేసియున్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారి ఆలయంలో 33వ హనుమద్వ్రత వార్షికోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. అవధూత యోగీ శ్రీ సీతారామబాబా ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 8.18 నిమిషాలకు కలశస్థాపన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. తొలిరోజు స్వామివారికి సహస్రనామ తమలపత్రాల పూజ చేసారు. ఆయా కార్యక్రమాలలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఓపెన్ పదో తరగతి, ఇంటర్ అడ్మిషన్లు

**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 3..** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్ ) ద్వారా 2025-26 విద్యా సంవత్సరం లో పదో తరగతి మరియు ఇంటర్ తత్కాల్ ప్రవేశాలు కొరకు రూ. 600 అపరాద రుసుమం తో అడ్మిషన్స్ అవకాశం కల్పిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాదికారి షేక్ సలీం భాషా తెలిపారు. ఈ తత్కాల్ అడ్మిషన్ చేసుకోవడానికి ఈ నెల 2 వ తేది నుండి 6 వ తేది వరకూ అవకాశం ఉందన్నారు. కాబట్టి జిల్లా లో ఉన్న ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, కో - ఆర్డినేటర్ లను సంప్రదించలన్నారు

## 22న ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ పై నేషనల్ సెమినార్

### - బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ ప్రసన్నశ్రీ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 3:** ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈ నెల 22న "భారతీయ జ్ఞాన వ్యవస్థలను తిరిగి పొందడం : ముందుకు సాగే మార్గం" అనే అంశంపై నేషనల్ సెమినార్ ను నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ తెలిపారు. బుధవారం దీనికి సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించి వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిపార్ట్మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ ఆధ్వర్యంలో విద్యా భారతి ఉచ్చా శిక్షా సంస్థాన్ నోయిడా సహకారంతో "రిక్లైమింగ్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ : ది వే ఫార్వర్డ్" అనే అంశంపై జాతీయ సెమినార్ ను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం, అనుబంధ కళాశాలలలో యూజీ పీజీ స్థాయిలలో పాఠ్యాంశాలను సవరించడం ద్వారా భారతీయ జ్ఞాన వ్యవస్థల గురించి ప్రాథమిక జ్ఞానాన్ని వ్యాప్తి చేయడం, తదనుగుణంగా కోర్సులను ప్రవేశపెట్టడం ఈ నేషనల్ సెమినార్ లక్ష్యం అన్నారు. నన్నయ విశ్వ విద్యాలయంతో పాటు ఇతర విశ్వవిద్యాలయాల బీఓఎస్ చైర్‌పర్సన్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు అందరూ ఈ నేషనల్ సెమినార్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ పరిచయం, ప్రపంచానికి దాని సహకారం, భారతదేశ కళలు, సంప్రదాయాలు, భారతీయ వాస్తుశిల్పం, పట్టణ ప్రణాళిక, ఆరోగ్యం మరియు శ్రేయస్సు, భారతీయ గణితం, భారతీయ సైన్స్- టెక్నాలజీ, కార్యాచరణ ప్రణాళిక : 2026-2027 విద్యా సంవత్సరానికి యూజీ, పీజీ కోర్సులకు పునర్నిర్మించిన సిలబస్ తయారీ వంటి అంశాలపై చర్చిస్తారని చెప్పారు. నేషనల్ సెమినార్ కన్వీనర్లుగా ప్రొఫెసర్ కేఎస్ రమేష్, ప్రొఫెసర్ డీ జ్యోతిర్మయి, డాక్టర్ ఎన్ సజ్నా రాజ్ వ్యవహరిస్తారని తెలిపారు. కీలక ఉపన్యాసకులుగా భారత ప్రభుత్వం విద్యా మంత్రిత్వ శాఖ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ విభాగం జాతీయ సమన్వయకర్త గంటి ఎస్ మూర్తి, విద్యాభారతి ఉచ్చా శిక్షా సంస్థాన్ వైస్ ప్రెసిడెంట్ పీ మురళీమోహన్ ఉపన్యసిస్తారని అన్నారు. విద్యావేత్తలంతా హాజరై ఈ నేషనల్ సెమినార్ ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, సెమినార్ కన్వీనర్లు ప్రొఫెసర్ కేఎస్ రమేష్, ప్రొఫెసర్ డీ జ్యోతిర్మయి, డాక్టర్ ఎన్ సజ్నా రాజ్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ప్రతిభావంతులకు భరోసా!

### భవిత కేంద్రాలతో మానసిక స్థైర్యం - తాడితోట భవిత కేంద్రంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 3:** ప్రత్యేక అవసరాల పిల్లల్లో మానసిక స్థైర్యాన్ని నింపి.. వారి శారీరక అవసరాల ఆధారంగా సహాయం చేసే పాఠశాలలు భవిత కేంద్రాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బీ దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక తాడితోట భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దివ్యాంగులచే కేక్ కట్ చేయించారు. సహిత విద్యా విభాగం, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ప్రత్యేకావసరాలు గల (18 ఏళ్ల లోపు) వారికి భవిత కేంద్రాలు విద్యను అందిస్తున్నాయన్నారు. ఇక్కడ 72 మంది విద్యార్థులున్నారన్నారు.
కూటమి ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబరు నెలలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ వైకల్యాన్ని నిర్ధారించి ఉపకరణాలను ఇచ్చేందుకు శిబిరాలను నిర్వహించి, 750 మందికి ఉపకరణాలు అందించిందన్నారు. డిజిటల్ బోధనకు ట్యాబ్ లు కూడా ఇచ్చిందన్నారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల్లో మానసిక వికాసాన్ని పెంచేందుకు మండలం, జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారని డీఐ తెలిపారు. నైపుణ్యం ఉన్న వారి నమోదుకు ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్వైజర్లకు శిక్షణ ఇచ్చారన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకావసరాలు గల విద్యార్థులు 146 మంది పదవ తరగతి పరీక్షలు రాశారు. వారిలో 126 మంది ఉత్తీర్ణులయ్యారు. చున్నీలాల్ జాజూ లో పదవ తరగతి చదివిన విద్యార్థిని నవ్యశ్రీ జిల్లాలో ప్రథమ స్థానం పొంది కలెక్టర్ మన్ననలు పొందిందన్నారు. ఇక్కడ భవిత కేంద్రంలో చదువుకుని గత సంవత్సరం పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఎన్వీఆర్ పాఠశాలలో గల భవిత కేంద్రం లో నలుగురు ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పెర్సన్ లు చిట్టి, మేరీ రాణి, యామినీ మహాలక్ష్మి, ఎం లోవకుమారి, కేర్ గివింగ్ వాలంటీర్ లీలా భవానీలను, వారి అంకితభావ సేవలను కొనియాడుతూ ఘనంగా సత్కరించారు. బృందావన కాలనీ సభ్యులు, తాడితోట బట్టల షాపు, తల్లిదండ్రులు విద్యార్థులకు బహుమతులు స్పాన్సర్ చేశారు. తన ప్రత్యేక ప్రతిభతో ఆచార్య దేవా అంటూ.. చక్కని డైలాగ్ చెప్పి అందరినీ అలరించిన మోక్షజ్ఞ కు ఉపాధ్యాయులు ఎల్ ప్రభాకర రావు ఐదువందల రూపాయల నగదు బహుమతి అందజేశారు.
ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు."ఏక్ కదమ్ ఔర్ "స్వచ్ఛంద సంస్థ దివ్యాంగుల కొరకు ప్రత్యేకంగా తయారు చేసిన మొబైల్ ఫోన్ లను అందజేశారు. ఆ సంస్థ ప్రతినిధులు శ్రీను, సాయిరామ్, చంద్రకిరణ్ లను డీఐ దిలీప్ కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎంఈఓ-2 రమా రజని, ఎన్ ఎస్ బీ హై స్కూల్ హెచ్ఎం సింహాద్రి, ప్రసాద్, ఎన్వీఆర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నాగవల్లి, డీఎమ్హెచ్ క్లస్టర్ కాంప్లెక్స్ కార్యదర్శి పరస జగన్నాధరావు, ప్రభుత్వ బాలుర పాఠశాల హెచ్ఎం సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం - సామాజిక సమానత్వానికి ప్రతిబింబం



**కాజులూరు (మనసులో మాట) డిసెంబరు 3..** దివ్యాంగులలో ఎందరో మహానుభావులు ఉన్నారని దివ్యంగులను కూడా అందరితో సమానంగా చూడాలని ఎంపీడీవో జె .రాంబాబు అన్నారు బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ను పురస్కరించుకుని దివ్యాంగులుచే కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాంబాబు మాట్లాడుతూ ఈ రోజు దివ్యాంగుల హక్కులు, వారి సామర్థ్యాలు, సమాజంలో వారికి అందాల్సిన సమాన అవకాశాలపై చైతన్యం పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని దివ్యాంగులంటే దౌర్భల్యం కాదు, ధైర్యం, పట్టుదల, ప్రతిభలకు ప్రతీకలని అనేక మంది దివ్యాంగులు తమ జీవితాలలో అసాధారణ విజయాలు సాధించి సామాన్యులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారనీ తెలిపారు.దివ్యాంగులలో ఎందరో అపారమైన ప్రతిభావంతులు ఉన్నారని వారిని దురదృష్టవశాత్తు ప్రజలు తరచుగా తక్కువ గా అంచనా వేస్తారనీ దివ్యాంగులు ఇతరుల్లాగే సమాన అవకాశాలు, సమాన గౌరవం పొందాలని వారిని సమాన భావంతో చూడటం ప్రతి పౌరుని బాధ్యత" అని అన్నారు. దివ్యాంగులు కేవలం సానుభూతికే కాకుండా అవకాశాలు, ప్రోత్సాహం, ప్రాప్యత అనే మౌలిక హక్కులకు అర్హులు. సమాజంలో వారు తలదించుకునే పరిస్థితులు కాదు, గౌరవంతో ఎదగడానికి సరైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న దివ్యాంగుల ఆనందం, వారి కళ్లల్లో కనిపించిన ఆశ, వారి మనోధైర్యంఈ ప్రత్యేక రోజుకు నిజమైన అర్థాన్ని చాటాయి. ప్రభుత్వాలు, సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులుఅందరూ కలిసి పని చేసినప్పుడే దివ్యాంగుల అభివృద్ధి సాధ్యమవుతుందనీ తెలిపారు.

**సమానత్వం - ఒక నినాదం కాక, ఆచరణ**

దివ్యాంగులకు అందుబాటు వాతావరణం విద్యలో సౌకర్యాలు, ఉపాధి అవకాశాలు, ఆరోగ్య సేవలు ఇవి పూర్తిగా అమల్లో ఉన్నప్పుడే నిజమైన సమానత్వం సాధ్యం అన్నారు. వారి ప్రతిభను వెలికితీసి, సమాజంలో వారు గౌరవప్రదమైన స్థానాన్ని పొందేందుకు ప్రతి ఒక్కరి సహకారం అత్యవసరం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ముద్రగడ సత్యనారాయణమూర్తి, సర్వ శిక్ష అభియాన్ ఐఆర్పీలు జయప్రకాశ్ రెడ్డి సేవ మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పద్మ ,మైథిలి ,నాగరాజు, సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ లో డాక్టర్ రావు సేవలు దిక్సూచి గా ఉంటుంది

### - డాక్టర్ గోపీనాథ్



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 3..** రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఫౌండర్ సభ్యునిగా, రోటరీ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్గా సుధా యూరాలజీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ ఎస్ వి ఎస్ రావు సేవలు దిక్సూచిగా ఉంటాయని రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ అన్నారు. డాక్టర్ రావు బుధవారం జన్మదిన వేడుకలు సుధా యూరాలజీ ఛాంబర్ లో డాక్టర్ గోపీనాథ్ ఆధ్వర్యంలో సభ్యుల బృందం డాక్టర్ రావు ను ఘనంగా సన్మానించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఫౌండర్ సభ్యునిగా డాక్టర్ రావు ఆనాడు చేసిన ఆలోచనల ఫలితంగా నేడు అద్భుతమైన రోటరీ బ్లడ్ బ్యాంకు నిరంతరం సేవలందిస్తోందని కొనియాడారు. క్లబ్ అధ్యక్షులుగా డాక్టర్ రావు బాధ్యత నిర్వహించడమే కాక సామాజిక సేవా కార్యక్రమాలలో వినూత్న రీతిలో అనేక కార్యక్రమాలను చేపట్టి క్లబ్ యొక్క ఇమేజ్ ని పెంచారని ప్రశంసించారు. వైద్య వృత్తిలో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహణకు ప్లానింగ్ చేయడంలో డాక్టర్ రావు ఆలోచన విధానం సమయపాలన వైద్యులకు మార్గదర్శకంగా ఉంటుందనడంలో అతిశయోక్తి లేదన్నారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్గా బాధ్యతలు చేపట్టి రోటరీ ఫౌండేషన్కు విరాళాలను సమకూర్చడంతో పాటు నిర్వహించిన సేవా కార్యక్రమాలు అంతర్జాతీయ స్థాయిలో రోటరీ డిస్ట్రిక్ట్ 3020 కి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని డాక్టర్ గోపీనాథ్ అన్నారు. వైద్య సేవలకు వెనుకబడి ఉన్న నైజీరియా వంటి దేశంలో ఆరోగ్య సేవా కార్యక్రమాలు నిర్వహణ నిష్ణాతులైన వైద్యుల బృందాన్ని పంపిన ఘనత డాక్టర్ రావు కే దక్కుతుందన్నారు. నేడు నైజీరియాలో శాశ్వత వైద్య సేవలు అందించడానికి అంతర్జాతీయ రోటరీ ప్రత్యేక దృష్టి పెట్టిందని ఫలితంగా ఆ ప్రాంత ప్రజలు కు నిరంతరం వైద్య సేవలు అందుబాటు లోకి వచ్చిందని డాక్టర్ గోపీనాథ్ గుర్తు చేశారు .డాక్టర్ రావు చేపట్టిన బాధ్యతలకు పూర్తిగా న్యాయం చేయడమే కాక రానున్న వారికి సర్వీస్ గైడ్ గా ఉన్నారని ఆయన వివరించారు. వైద్య వృత్తి నిర్వహిస్తున్న తమ వంటి వారికి డాక్టర్ రావు ఒక ఐకానిక్ పర్సన్ గా ఎల్లప్పుడూ ఉంటారని ఆ స్ఫూర్తితో సమాజానికి ఆయన చేసిన కార్యక్రమాలను తాము కూడా చేపడుతున్నామని డాక్టర్ గోపీనాథ్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ రామకృష్ణ, క్లబ్ కార్యదర్శి డాక్టర్ సానా ప్రవీణ్, కోశాధికారి ఉదయ చక్రవర్తి, సత్తి రవి రెడ్డి, జి కే శ్రీనివాస్, కోటగిరి నాని, మాజేటి పవన్, టేకుమూడి సూర్యనారాయణ తో పాటు వివిధ రోటరీ క్లబ్ సభ్యులు పలువురు వైద్యులు, నగర ప్రముఖులు, ప్రజాప్రతి నిధులు అధిక సంఖ్యలో డాక్టర్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.



## అలయన్స్ శరవణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం

**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 3..** కాకినాడ రూరల్ ప్రాంతమైన తిమ్మాపురం లోని గ్రీన్ ఫీల్డ్ రెసిడెన్షియల్ స్కూల్ ఫర్ బ్లైండ్లో కార్యక్రమం బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా రెండు బియ్యం సంచులను వార్డెన్ ప్రసాద్, కేర్ టేకర్ ఏ లక్ష్మిలకు అందజేశారు. క్లబ్ అధ్యక్షులు యాళ్ళ రత్నారావు మాట్లాడుతూ వికలాంగుల పిల్లలను ప్రోత్సహించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, క్లబ్ తరపున ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు.పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొవ్వూరి మునిరెడ్డి మాట్లాడుతూ వికలాంగులకు సౌకర్యాలు, అవకాశాలు కల్పించడం సమాన హక్కులున్న సమాజ నిర్మాణానికి చాలా అవసరమని తెలిపారు. క్లబ్ ఎక్స్‌టెన్షన్ చైర్మన్ దిలీప్ కుమార్ సధ్నాని మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు అలయన్స్ సంస్థ యొక్క నిజమైన సేవా భావాన్ని ప్రతిబింబిస్తాయని అన్నారు. ప్రోగ్రామ్ చైర్మన్ యదవిల్లి మురళీధర్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు వికలాంగుల కోసం చేపడతామని తెలిపారు. క్లబ్ ట్రెజరర్ దామిశెట్టి శ్రీనివాస రావు, సింగబాబు కార్యక్రమంలో పాల్గొని బియ్యం సంచులను పాఠశాల వారికి అందజేశారు.

## వీరేశ్వర స్వామి ఆలయంలో హుండీ ఆదాయం తొమ్మిది లక్షలు



**ఐ .పోలవరం,( మనసులో మాట) డిసెంబర్ 3..** నిత్యకల్యాణం పచ్చతోరణం విరాజిల్లుతున్న మహిమాన్యుడైన మురమళ్ల శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి దేవస్థానంలో హుండీల ద్వారా రు 09 లక్షలు పైన ఆదాయం సమకురినట్లు ఆలయ చైర్మన్ దాట్ల రామకృష్ణం రాజు, సహాయ కమీషనర్ కార్యానిర్వాహణాధికారి వి. సత్యనారాయణ వెల్లడించారు. బుధవారం అంతర్వేది అసిస్టెంట్ కమీషనర్ శ్రీ యం.కే.టి.యన్.వి. ప్రసాద్, తనిఖీ అధికారి రామలింగేశ్వర రావు సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 45 రోజులకు గాను ప్రధాన ఆలయ హుండీ ద్వారా రు 09 లక్షల 87 వేల 354 అలాగే అన్నదాన హుండీ ద్వారా రు 08 వేల 849 వెరసి మొత్తం రు 09 లక్షల 96 వేల 203 ఆదాయం సమకురినట్లు తెలిపారు. 5 విదేశీ రియాన్స్ వచ్చినట్లు తెలిపారు. హుండీ ఆదాయం సొమ్మును దేవస్థానం ఖాతా కు జమచేస్తున్నట్లు తెలిపారు. తొలుత ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు, బ్రహ్మశ్రీ యనమండ్ర సత్య సీతారామ శర్మ, బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్ హుండీలకు హారతి కూడా ఆ 5ఇచ్చి ప్రారంభించారు. కార్యక్రమంలో ధర్మకర్తమండలి సభ్యులు, ఆలయ సూపర్డెంట్ కటారి శ్రీనివాసరాజు, ఆలయ మాజీ చైర్మన్ కటారి నాని, సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది, రెవెన్యూ, పోలీస్, సత్య సాయి సేవ కార్యకర్తలు, భక్తులు హుండీ లెక్కింపు సేవలో పాల్గొన్నారు.

## ఫజుల్లాబాద్ కబడ్డీ పోటీ విజేతలకు కంబాల బహుమతులు ప్రదానం

### రూ 50 వేలు నగదు, ట్రోఫీలు మెడల్స్ అందజేత



**గోకవరం (మనసులో మాట), డిసెంబర్ 3:** శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవాలు సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం ఫజుల్లాబాద్ గ్రామంలో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గత నెల 26వ తేదీన ప్రారంభమైన కబడ్డీ టోర్నమెంట్ పోటీలు మంగళవారం రాత్రి ముగిసాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కంబాల శ్రీనివాసరావు హాజరయ్యారు. హోరా హోరీగా జరిగిన ఫైనల్ పోటీలను తిలకించారు. ఫైనల్లో తాళరేవు మండలం రామన్నపాలెం టీం మొదట స్థానంలో నిలవగా, ఠాగూర్ పాలెం టీం రెండోవ స్థానం, గాదరాడ టీం మూడోవ స్థానం, పెంటపల్లి టీం నాలుగోవ స్థానంలో విజేతలుగా గెలుపొందాయి. ఫైనల్లో గెలుపొందిన విజేతలకు కంబాల శ్రీనివాసరావు బహుమతులు ప్రధానం చేశారు. మొదటి విజేతకు 20 వేలు, రెండవ బహుమతి 15 వేలు, మూడోవ విజేతకు 10, వేలు, నాలుగో విజేతకు 5, వేలు రూపాయలు చొప్పున 50,000 రూపాయలు నగదు పంపిణీ చేసి, టోపీలు, మెడల్స్ అందజేశారు. అలాగే నలుగురు క్రికెట్ అంపైర్లు ఒకొక్కరికి 2,500 చొప్పున పది వేలు రూపాయలు అందజేశారు. బెస్ట్ రైడర్ కు మూడు వేలు, బెస్ట్ డిపెండర్ కు రెండు వేలు రూపాయలు నగదు అందజేశారు. బెస్ట్ ఆల్ రౌండర్, బెస్ట్ పెర్ఫార్మెన్స్ కు ట్రోపీలు అందజేశారు. అలాగే కబడ్డీ కోర్టులో ముగ్గులు వేసిన ఇద్దరి యువతకు ఒక్కొక్కరికి 1,000 చొప్పున రెండు వేలు రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడాకారులకు యువతకు, తాను ఏప్పుడు అండదండగా ఉంటానని అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన యువతకు ప్రోత్సాహం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు వరసాల ప్రసాద్, దాసరి ధర్మ రాజు, బత్తుల నానాజీ, పెద్దాడ వెంకన్న దొర, కంబాల యువసేన అధ్యక్షులు ఉంగరాల మణికంఠ, కర్రి మణికంఠ, దోసపాటి సుబ్బారావు, మందపాటి సతీష్, కమిటీ సభ్యులు ఈత శివాజీ, ప్రగాఢ వీరబాబు, ఉల్లింగాల వీరబాబు, గుర్రం శివ, తాకారపు దివ్యశ్వర్ రావు, బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## కోనసీమ యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలు పెంచేలా

# చర్యలు తీసుకోండి

### - లోకసభలో ఎంపీ హరీష్ బాలయోగి

**అమలాపురం (మనసులోమాట) డిశంబరు3:** డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి 377 ద్వారా లోకసభలో కోరారు. జిల్లా యువత ఆకాంక్షలకు మద్దతుగా, నైపుణ్యాభివృద్ధి సౌకర్యాలను విస్తరించాల్సిన అవసరం ఉందని ప్రస్తావించారు.డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా యువత డిజిటల్ సేవలు, అధునాతన తయారీ, హాస్పిటాలిటీ మరియు కొత్త సాంకేతికతలు వంటి రంగాలలో, ప్రస్తుత పరిశ్రమలకు అవసరమైన కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారన్నారు. అయితే జిల్లా స్థాయిలో అందుకు తగిన శిక్షణా కేంద్రాలు లేకపోవడంతో, చాలా మంది విద్యార్థులు సుదూర ప్రాంతాలకు తరలివెళ్లాల్సి వస్తుందన్నారు. సుదూర ప్రాంతాలు వెళ్లలేని యువత నైపుణ్యాభివృద్ధి అవకాశాలను పూర్తిగా వదులుకోవలసి వస్తోందని ఆయన సమావేశంలో స్పీకర్ కు వివరించారు. ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, జిల్లాలో నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా యువతకు ఉద్యోగ, జీవనోపాధి అవకాశాలు పెరుగుతాయని ఎంపీ విశ్వాసం వ్యక్తం చేశారు. డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమలో ప్రతి యువకుడికి నైపుణ్యాభివృద్ధి అందుబాటులో ఉండేలా చూడాలని, అటువంటి సంస్థలకు ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ హరీష్ బాలయోగి కోరారు.

## హనుమాన్ ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు



**పిఠాపురం, ( మనసులో డిసెంబరు) 3 :** పిఠాపురం మండలం రాపర్తి గ్రామంలో గల ప్రసిద్ధ అనుమానాలయం 11వ వార్షికోత్సవ వేడుకలు గ్రామస్తులు భక్తులు సమక్షంలో వైభవంగా జరిగాయి. బుధవారం ఈ ఉత్సవాలలో పిఠాపురం మాజీ శాసనసభ్యులు పెండం దొరబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పెండం దొరబాబు మాట్లాడుతూ ఆలయ 11వ వార్షికోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందని స్వామివారి కృపతో పిఠాపురం నియోజకవర్గ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ హడావి కూడా వార్షికోత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించామన్నారు.కార్యక్రమంలో జనసేన నాయకులు సాయి ప్రియ సేవాసమితి అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాసరావు, పాదగయ్య మాజీ చైర్మన్ ఆగంటి ప్రభాకర రావు , శ్రీపాద శ్రీ వల్లభ మహాసంస్థానం మాజీ చైర్మన్ రెడ్డం జనార్ధన రావు , కో-ఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ బాలిపల్లి రాంబాబు , పల్లా శీను , తదితరులు పాల్గున్నారు.

## మెప్మా ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభా వంతుల దినోత్సవం

### ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

### పట్టణ వివిధ ప్రతిభావంతుల సంఘం అధ్యక్షుడు కర్రోతు రమేష్ కి సత్కారం



**ఏలేశ్వరం (మనసులో మాట) డిసెంబర్ 3..** అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఏలేశ్వరం నగర పంచాయతీ కార్యాలయం లో మెప్మా ఆధ్వర్యంలో అభినందన సభ ని ఏర్పాటు చేసారు. సభ అనంతరం వారి కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిభిరం లో వైద్యులు వికలాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. ఈ కార్యక్రమానికి 14 వ వార్డు కౌన్సెలర్, ఏలేశ్వరం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మూది నారాయణ స్వామి ముఖ్య అతిధి గావిచ్చేసి వికలాంగుల సంక్షేమాన్ని ఉద్దేశించి పలు విషయాలు వెల్లడించారు .ఏలేశ్వరం పట్టణానికి చెందిన విభిన్న ప్రతిభ వంతుల సంఘం అధ్యక్షుడు కర్రోతు రమేష్ ని మూది నారాయణ స్వామి దుశాలువాతో సత్కరించారు . ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం పట్టణానికి చెందిన పలు వార్డుల కౌన్సెలర్లు,నగర పంచాయతీ ఇంచార్జి కమిషనర్ సూర్య ప్రకాష్ మెప్మా టీ.ఎం.సీ ప్రసాద్, సి. ఓ నాయుడు డి. ఈ. ఓ.రమేష్, పట్టణ ఆర్ పి లు లు పాల్గొన్నారు.

## రైతే దేశానికి వెన్నుము, రైతులకు మేమున్నా మనే అనే

# భరోసా అధికారులు కల్పించాలి

### - కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్



**అయినవిల్లి( మనసులోమాట ) డిశంబరు 3:** రైతులు దేశానికి వెన్నెముక లాంటి వారిని అధికారులు ఉండాలని డాక్టర్ బి అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం అయినవిల్లి మండలం పోతుకుర్రు గ్రామ రైతు సేవ కేంద్రం నందు ఏర్పాటుచేసిన రైతన్న మీకోసం గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షే మమే ధ్యేయంగా పలు కార్యక్రమాలను అమలు చేస్తూ రైతాంగానికి అన్ని విధాల అండగా ఉంటుందని ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని లాభసాటి గా మార్చుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్నా మీ కోసం కార్యక్ర మాన్ని రాష్ట్ర వ్యా ప్తంగా ఏకకాలంలో నిర్వ హించి ఈ గ్రామసభలో 2025-26 రబీ,2026 ఖరీఫ్, 2026 -27 రబీ పంటల ప్రణాళికలపై చర్చించడంతో పాటు నీటి నిర్వహణ, పంట బీమా, రుణాలు, మార్కెట్ సదుపాయాలు, సహాయ పథకాలపై రైతు అభి ప్రాయాలు సూచనలు సేకరించి కార్యా చరణ ప్రణాళికలను రచించనున్నట్లు ఆయన తెలిపారు. దేశానికి రైతులే వెన్ను ముకని ఆ దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో సేంద్రీయ వ్యవసాయం ఎక్కువ విస్తీర్ణంలో అమలు చేయాలని జిల్లాలో లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు. రెగ్యులర్ గా ఒకే వంగడాలను విని యోగించకుండా పంటలు మార్పిడి విధానాలను మార్కెట్లో డిమాండ్ ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాల యాలు సూచించిన హైబ్రిడ్ వరి వంగడాలను సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం రైతుల సంక్షే మానికి అన్నదాత సుఖీభవ పథకం రైతులకు సంవత్స రానికి రూ.20,000 ఆర్థిక సహాయం అందిస్తోందని డ్రోన్ టెక్నాలజీ నానో యూరియా వాడకాన్ని పెంచుకొని పెట్టుబడి ఖర్చులను తగ్గించుకుంటూ అధిక దిగుబడులు పొందాలన్నారు. రైతులే దేశానికి వెన్నుముకగా పరిగణిస్తూ ప్రభుత్వాలు వ్యవసాయ ఇన్‌పుట్ ఖర్చులు, పంటల బీమా, ఎరువులు-విత్తనాల సబ్సిడీలను అందిస్తున్నాయన్నారు. కొబ్బరిలో అంతర పంటగా భూసారాన్ని బట్టి కోకో వంటి సాగును చేపడుతూ అదనపు ఆదాయాన్ని ఆర్జించాలన్నారు. యూరియా సరఫరా నత్రజని వాడకం ఎరువుల స్టాకు వంటి అంశాలపై సచివాలయ సహాయకుల ద్వారా ఆరా తీశారు. కోనసీమ పశువుల దాన సరఫరా పశుగ్రాసం సమృద్ధిగా ఉన్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. నరేగా అనుసంధానంతో అంతర పంటల సాగుకు అవకాశాలు ఉన్నాయని ఆ దిశగా రైతాంగం ముందుకు సాగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం సెగ్మా సి ఫుడ్స్ ఆక్వా రొయ్యల కోల్డ్ స్టోరేజ్ ను సందర్శించి ప్యాకింగ్ మేకింగ్ వంటి అంశాల నిర్వహణ తీరును ఆయన స్వయంగా పరిశీ లించి ఎగుమతులు దిగుమ తులు పై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పం చ్ ఎస్ సుబ్బలక్ష్మి వ్యవసా యాధికారి బోసు బాబు మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు తహశీల్దార్ విద్యాపతి ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

# తెలుగు యూనివర్సిటీకి అందిన అపూర్వ నిధి

### శీలా వీర్రాజు పుస్తకాలు - పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అభివర్ణన




**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 3 :** శీలా వీర్రాజు సేకరించిన పుస్తకాల ద్వారా తెలుగు విశ్వ విద్యాలయానికి ఒక అపూర్వ నిధి అందిందని పద్మశ్రీ, పద్మ భూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అభివర్ణించారు. చిత్రకళా పుస్తకాలతో తెలుగు విశ్వ విద్యాలయం చిత్ర కళా విభాగం కళకళ లాడాలని ఆయన ఆకాంక్షించారు. సీపీ బ్రౌన్ మందిరం, మాదేటి రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం శీలా వీర్రాజు సేకరించిన జాతీయ, అంతర్జాతీయ చిత్ర కళా పుస్తకాలను ఆచార్య యార్లగడ్డ విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య డీ మునిరత్నం నాయుడుకి దామెర్ల ఆర్ట్ గ్యాలరీలో అందజేశారు. ప్రాణహిత కవి సన్నిధానం నరసింహ శర్మ అధ్యక్షతన జరిగిన సభలో యార్లగడ్డ మాట్లాడుతూ ఎన్టీఆర్ మానసిక పుత్రిక అయిన తెలుగు విశ్వ విద్యాలయం అభివృద్ధికి, ఎన్టీఆర్ పుత్రిక అయిన రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి, ఎన్టీఆర్ మనుమడు విద్యా శాఖ మంత్రి లోకేష్ లు సహకరిస్తారనే విశ్వాసం తనకు ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో తెలుగు విశ్వ విద్యాలయం మనుగడకు పన్నెండు సంవత్సరాల కాలం పడుతోందని చెప్పారు. తెలుగు విశ్వ విద్యాలయం అభివృద్ధి రాజమండ్రి ప్రజల బాధ్యత అని, గతంలో చంద్రబాబు నాయుడు రెండు హామీలు ఇచ్చారన్నారు. రాజమండ్రి పేరు మార్పు ఒకటయితే, రాజమండ్రి కేంద్రంగా తెలుగు విశ్వ విద్యాలయం ఏర్పాటుకు హామీ ఇచ్చి అమలు చేశారని చెప్పారు. తెలంగాణ నుంచి చేరాల్సిన చర స్థిరాస్తుల విషయంలో రెండు వర్సిటీల ఉప కులపతులు ఓ నిర్ణయానికి రావాలని యార్లగడ్డ కోరారు. తెలుగు విశ్వ విద్యాలయం పటిష్ఠతకు ప్రత్యక్ష పరోక్ష భాగస్వామి అయిన తాను, ఆంధ్ర తెలుగు యూనివర్సిటీ తొలి సభలో భాగస్వామ్యం కావడం ఆనందం కలిగిస్తోందని అన్నారు. పుస్తకాల బహుకరణకు కీలక పాత్ర వహించిన మాదేటి రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమి వ్యవస్థాపక కార్యదర్శి మాదేటి రవి ప్రకాష్ మాట్లాడుతూ తెలంగాణ తెలుగు యూనివర్సిటీ లో ఉన్న ఆంధ్రాకు చెందిన చిత్రకారుల అపురూప చిత్రాలను స్థానిక తెలుగు విశ్వ విద్యాలయానికి తీసుకు వచ్చే ప్రయత్నం చేయాలని కోరారు. తెలుగు యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య డీ మునిరత్నం నాయుడు మాట్లాడుతూ శిలా వీర్రాజును తాను గతంలో కలిశానని, ఆయన సేకరించిన పుస్తకాలు తమకు బహుకరించడం ఎంతో ఆనందం కలిగిస్తోందని చెప్పారు. కోహినూర్ వజ్రం కూరల దుకాణంలో ఉంటే విలువలేనిది అవుతుందని, అదే అత్యుత్తమ అగ్ర స్థానంలో ఉంటేనే విలువని, అదే విధంగా శీలా వీర్రాజు పుస్తకాలు తెలుగు విశ్వ విద్యాలయంలో ఉంటేనే సార్థకత అని అమ్మ భగవాన్ శిష్యురాలు, ధర్మ బోధ మార్గదర్శకురాలు సౌజన్య దాసాజి నిర్వచించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ పర్వతనేని సుబ్బారావు మాట్లాడుతూ పుస్తకాలకు విలువ తగ్గుతున్న ఈ కాలంలో శీలా పుస్తకాలు బహుకరణతో పూర్వ వైభవం కలగాలని ఆకాంక్షించారు. భగీరథి ఆర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి ఎన్ పీఎస్ఎస్ లక్ష్మి, సన్నిధానం శాస్త్రి, మల్లాది శ్రీరామ్ ప్రసంగించారు. ఇన్ కంటాక్స్ విశ్రాంత చీఫ్ కమిషనర్ మేడిశెట్టి తిరుమల కుమార్, విశ్రాంత మేజిస్ట్రేట్ ఎస్ఆర్ పృథ్వి, సామాజిక వేత్త కే సుర్యకుమారి, అమ్మ భగవాన్ సేవకులు మంతెన రాధిక, దొంతంశెట్టి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ రెడ్డి పార్వతి, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ తణుకు గోపాలకృష్ణ, పోలిశెట్టి ఈశ్వర రావు పాల్గొన్నారు.

## రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనేదే

# కూటమి ప్రభుత్వ ఉద్దేశ్యం

### రైతుల అవగాహన కోసమే వర్క్ షాపులు - దేవరపల్లి వర్క్ షాప్ లో యువనేత బండారు సంజీవ్



**కొత్తపేట( మనసులో మాట )నవంబర్ 3..** రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని తద్వారా దేశం బాగుపడుతుందనేది కూటమి ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమని యువనాయకులు బండారు సంజీవ్ అన్నారు. బుధవారం దేవరపల్లి రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్ షాప్ లో ఆయన పాల్గొని ప్రసంగించారు. రబీ, ఖరీఫ్, రబీ వరుసగా మూడు పంట కాలాలను పరిగణనలోకి తీసుకుని పెట్టుబడి, దిగుబడులు, లాభనష్టాల అంచనాకు వ్యవసాయ అధికారులు రానున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అన్నదాతల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ పథకం, పీఎం కిసాన్ పథకం కలిపి రెండు విడతల్లో రైతులు ఖాతాల్లో రూ.14వేలను జమ చేయడం జరిగిందన్నారు. త్వరలో మూడో విడతలో మిగిలిన రూ.6వేలను జమ చేయడం జరుగుతుందన్నారు. కోనసీమలో వరి, అరటి కొబ్బరి ప్రధాన పంటలుగా ఉన్నాయని, వాటికి అనుబంధంగా స్మాల్ స్కేల్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం రాయతీలు ఇస్తుందని, సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు, యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. రైతులు ప్రధానంగా సేంద్రియ,ప్రకృతి వ్యవసాయం పట్ల ఆసక్తి పెంచుకొని ఆ దిశగా కృషి చేయాలన్నారు. స్థానిక నాయకులు రహదారుల అభివృద్ధి కోసం అడిగారని ఈ అంశాన్ని ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు దృష్టికి తీసుకుని వెళ్లి తప్పకుండా రహదారుల అభివృద్ధి సైతం కృషి చేస్తానన్నారు.

# రైతులు కోసం "రైతన్న మీకోసం కార్యక్రమం



**ముమ్మిడివరం)మనసులో మాట) డిసెంబరు 3:** ముమ్మిడివరం మండలం సిహెచ్ గున్నేపల్లి పంచాయతీ పరిధిలో రైతన్న నీకోసం రైతులు కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమం లో సర్పంచ్ గొలకోటి దొరబాబు పాల్గొని మాట్లాడేరు. ఈ కార్యక్రమం ముఖ్య ఉదేశ్యం "ప్రకృతి వ్యవసాయం " చాలా అవసరం అని ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని అలాగే పంట మార్పిడి జరగాలని ఎప్పుడు వరి కాకుండా ఇతర పంటలు వేయాలని కొబ్బరి తోటల్లో అంతర పంటల కింద పోక, అరటి, కోకో పంటలు వేసి అధిక లాభం పొందాలన్నారు అలాగే గతంలో మెట్ట భూములు చాలా తక్కువ రేటు ఉండేవాని కోనసీమ వ్యవసాయ భూములు అధిక రేట్లు ఉండేవని ఈరోజు మేట్ట భూములు అన్ని పంటలు సాగు చేయడం వల్ల ఆ భూములు అధిక రేట్లు పలుకుతున్నాయని రైతులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమం లో యాళ్ల ఉదయ్, పాము హేమ కుమారి, గోలకోటి భాస్కర్, గోలకోటి తాతాజీ,గోలకోటి కాశీ, సఖిలే వెంకటేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ ఇందు మతి కృష్ణ వేణి మరియు వ్యవసాయం శాఖ నుండి గౌతమ్, అలాగే రైతులు పాల్గొన్నారు



## భారతదేశ మొదటి రాష్ట్రపతి

# డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ జయంతి

**గోకవరం (మనసులో మాట), డిసెంబర్ 3:** భారతదేశ మొదటి రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ జయంతి వేడుకలు గోకవరం తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. బాబు రాజేంద్ర ప్రసాద్ చిత్రపటానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ భారత దేశానికీ మొదటి రాష్ట్రపతి , స్వాతంత్ర్య సమరయోధుడు, న్యాయవాది, పాత్రికేయుడు, పండితుడు అన్నారు. ఆయన దేశానికీ చేసిన సేవలను కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఆశయ సాధనలకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు దాసరి ధర్మరాజు, బత్తుల నానాజీ, పెద్దాడ వెంకన్న దొర, నాగ రమేష్, దోసపాటి సుబ్బారావు, తాడికొండ సురేష్, మంగరౌత్ పద్దరాజు, నందూరి దుర్గా రావు, సిబ్బంది పాల్గొన్నారు.

# హ్యాండ్ బాల్ జిల్లా పురుషుల జట్టు ఎంపిక



**కాకినాడ (మనసులో మాట), డిసెంబరు 3:** కాకినాడ ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పనసపాడు నందు జరిగిన హ్యాండ్ బాల్ పురుషుల జిల్లా జట్టు ఎంపిక బుధవారం జరిగినది. ఈ పోటీలలో 40 మంది క్రీడాకారులు హాజరైయ్యారు. పోటీలను పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రియాంక శర్మ ప్రారంభించగా, పోటీలకు అవసరమయ్యే అన్ని ఏర్పాట్లను ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మేనేజ్మెంట్ సమకూర్చింది. మొత్తం గా 16 మంది సభ్యులతో ఎంపికైన జట్టు రెండు రోజుల్లో కర్నూలులో జరగనున్న అంతర్ జిల్లాల హ్యాండ్ బాల్ పురుషుల పోటీలలో పాల్గొంటుందని తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు ఎం వి వి దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ పోటీలను హ్యాండ్ బాల్ అసోసియేషన్ సభ్యులు, శ్రీ ప్రభాకర్ శ్రీ రవికుమార్ శ్రీ సాగర్ శ్రీ చంద్రశేఖర్ శివ ,వెంకట్ ,ఏసు పర్యవేక్షించారు.

# పాఠశాలకు కంప్యూటర్ అందజేత



**కాకినాడ(మనసులో మాట), డిసెంబరు 3:** కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కంప్యూటర్ విద్యాభ్యాసాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలకు కంప్యూటర్‌ను బహూకరించారు. బుధవారం సాయంత్రం పాఠశాల ప్రాంగణంలో హెచ్ఎం పి.ఆర్.పి. కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధానం గా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయం ఇంచార్జ్ మేకా లక్ష్మణమూర్తి పాల్గొనగా, ప్రత్యేక అతిధిగా ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ , ఫౌండేషన్ సభ్యులు ముమ్మిడి వెంకటేశ్వరరావు విచ్చేశారు. ముఖ్య అతిథులు మేకా లక్ష్మణమూర్తి కంప్యూటర్‌ను హెచ్ఎంకు అందజేశారు. అలాగే విద్యార్థులకు నోటు పుస్తకాలను అతిథులు అందజేశారు. ఈ సందర్భంగా మేకా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు నిబద్ధతతో చదువుకొని తమ భవిష్యత్తును మెరుగుపరుచుకుని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. సానా సతీష్ బాబు ఫౌండేషన్ విద్య, ఆరోగ్యం, సామాజిక సేవా రంగాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతోందని గుర్తుచేశారు. ఈ విధమైన సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు. ఫౌండేషన్‌చైర్మన్ తలాటం హరీష్ మాట్లాడుతూ విద్యార్ధులకు క్రీడా పరంగా ఏ సహాయ సహకారాలు కావాలన్నా సహకరిస్తామన్నారు. పాఠశాల విద్యార్థులు ఆర్ఎంసి గ్రౌండ్‌లో హాకీ నేర్చుకోవాలని సూచించారు. క్రీడాకారుల అభ్యున్నతి కోసం తనప్రోత్సాహం ఉంటుందన్నారు. పాఠశాల ప్రాంగణంలో క్రీడా వస్తువులు భద్రపరచుకునేందుకు ఓ గదిని ఫౌండేషన్ తరపున నిర్మిస్తామన్నారు. అనంతరం ఉపాధ్యాయులు మేకా లక్ష్మణమూర్తికి, తలాటం హరీషలను సత్కంరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.ఆర్.పి. కుమార్, మాజీ విద్యాకమిటీ కోఆప్టెడ్ సభ్యులు ఎల్.ఎస్.వీరభద్రరాజు, ఉపాధ్యాయులు ఎం.ఎన్. వీరభద్రరావు, డి. సత్యానందం, జి. సూర్యరావు తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ ఎంపీడీఓ విజెవి రమణకు ఘన సత్కారం



**తాళ్లరేవు (మనసులో మాట), డిసెంబరు 3:** కోరంగి పంచాయతీ కార్యదర్శిగా సేవలందిస్తూ డిప్యూటీ ఎంపీడీఓగా పదోన్నతి పొందిన విజెవి రమణను బుధవారం ఘనంగా సత్కరించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ పెయ్యల మంగేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రమణను నాయకులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సిబ్బంది దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మండలంలో పలు పంచాయతీలలో కార్యదర్శిగా ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. క్రమశిక్షణ నిజాయితీగా సేవలందిస్తూ ఉన్నత స్థానాన్ని పొందారని అభినందించారు. ఆయన మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సీహెచ్ ప్రకాష్, ఎంపీటీసీ సభ్యురాలు పోతుల రత్నకుమారి, గ్రామ ఉపసర్పంచ్ కామాడి భైరవమూర్తి, కోరంగి సొసైటీ అధ్యక్షుడు కొప్పిశెట్టి బాబి, నాయకులు కోడూరి ఆదినారాయణ చౌదరి, నడింపల్లి వినోద్, కొండిశెట్టి ఈశ్వరరావు, సతీష్ రాజు, వళ్ళు రాజబాబు, ఈశ్వరరావు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## ధీరుభాయ్ అంబానీక్విజ్ పోటీలో సీఎంహెచ్ స్కూల్ విద్యార్థులకు తృతీయ స్థానం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 3:** స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన రిలయన్స్ ధీరుబాయ్ అంబానీ క్విజ్ పోటీల్లో సిటీ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ఎనిమిదవ తరగతి విద్యార్థులు శామ్యూల్ ప్రవీణ్, రష్మిక జిల్లాలో తృతీయ స్థానాన్ని పొందారని ఇన్చార్జి హెచ్ఎం ఎన్ గౌరీ శంకర్ తెలిపారు. నిర్వాహకులు జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు చేతుల మీదుగా విద్యార్థులకు సైకిళ్ళు బహుమతిగా అందజేశారు.

ధీరుభాయ్ అంబానీక్విజ్ పోటీలో సీఎంహెచ్ స్కూల్ విద్యార్థులకు తృతీయ స్థానం



రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 3: స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన రిలయన్స్ ధీరుబాయ్ అంబానీ క్విజ్ పోటీల్లో సిటీ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ఎనిమిదవ తరగతి విద్యార్థులు శామ్యూల్ ప్రవీణ్, రష్మిక జిల్లాలో తృతీయ స్థానాన్ని పొందారని ఇన్చార్జి హెచ్ఎం ఎన్ గౌరీ శంకర్ తెలిపారు. నిర్వాహకులు జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు చేతుల మీదుగా విద్యార్థులకు సైకిళ్ళు బహుమతిగా అందజేశారు.

### డ్రయిన్లను ఆధునీకరించి
## రైతులను ఆదుకోవాలి
**- వైసిపి రైతు విభాగం**



**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 3:** ముమ్మిడివరం నియోజకవర్గం లో ఉన్న డ్రయిన్లను ఆధునీకరణ చేసి రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని వైసిపి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోరుకొండ సత్యనారాయణ(ఢిల్లీ నారాయణ) బుధవారం ముమ్మిడివరం వైసీపీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడారు.

ఈ సందర్భంగా ఢిల్లీ నారాయణ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమైన మురుగు కాలువలు 16 ఉన్నాయి, మద్యతరగతి మురుగుకాలువలు 37 ఉన్నాయి, చిన్న కాలువలు 238 ఉండగా, ఇవి చాలావరకు ఆక్రమణలకు గురి అయ్యాయని అన్నారు. ముఖ్యంగా మురుగు కాలువలను ఆధునీకరించక పోవడం వల్ల వర్షాలు, వరదల సమయంలో మురుగు నీరు దిగే అవకాశం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాను మూడు భాగాలుగా విభజించి మురుగు కాలువలను ఆధునీకరించామని, ప్రస్తుతం జిల్లా మొత్తం మురుగుకాలువల ఆధునీకరణ ఒక వ్యక్తికే అప్పగించి, మూడు కోట్ల రూపాయలను గంపగుత్తగా అప్పగించారని విమర్శలు చేశారు. మురుగు కాలువలలో ఏవిధమైన పనులు చేయకుండా సదరు వ్యక్తి నిధులను స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. పార్టీలకు అతీతంగా రైతుల సంక్షేమం కొరకు అందరూ కలిసిరావాలని, రైతుల సంక్షేమమే రాష్ట్రానికి ప్రగతి అని నారాయణ అన్నారు.. ఈ కార్యక్రమం లో ముమ్మిడివరం నియోజకవర్గ వైసిపి రైతు విభాగం కన్వీనర్ పళ్ళ వీరబాబు, వైసిపి రైతు విభాగం మండల కన్వీనర్ జగతా బాబ్జీ, వైసిపి రాష్ట్ర లీగల్ సెల్ సెక్రటరీ కోనా శ్రీనివాస్ లతో పాటు పలువురు పాల్గొన్నారు...

# సీతానగరంలో రైతన్నా మీ కోసం





**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబర్ 3..** రైతులు బాగుకోరే ప్రభుత్వం తమదని,లాభసాటి వ్యవసాయం కోసం నిర్వహించిన రైతన్నా మీకోసం వారోత్సవాల కార్యక్రమం విజయవంతమైందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. అన్నదాత మేలు కోరే వ్యక్తి సీఎం చంద్రబాబు అని, రైతుల పేరుతో పార్టీ పెట్టుకుని వారిని అన్నివిధాలా వేధించిన ఘనుడు జగన్ అని జ్యోతుల నెహ్రూ మండిపడ్డారు. మండలంలోని సీతానగరం గ్రామంలో రైతన్నా మీకోసం ముగింపు కార్యక్రమం జగ్గంపేట వ్యవసాయ శాఖ ఏడి జి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వర్క్ షాపులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ముందుగా హనుమాన్ వ్రతం సందర్భంగా హనుమంతుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసే నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు ఎల్లప్పుడూ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.వారి బాగుకోరుకునే ప్రభుత్వం తమదన్నారు. వ్యవసాయాన్ని లాభసాటి మార్చలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, వ్యవసాయాధికారులు రైతుల ఇళ్లకు వెళ్లి ఏయే పంటలు వేయాలి ఏ పంట వేస్తే అధిక దిగుబడులతో పాటు ధరలు లభిస్తాయి ఏ ఎరువులు వాడాలి అనే అంశాలపై వివరించారన్నారు. రైతన్నా మీకోసం కార్యక్రమ నిర్వహణపై అన్నదాతల్లోనూ సంతృప్తి వ్యక్తమవుతోందన్నారు. అధికారులు సూచనల మేరకు పంట మార్పిడి చేస్తామని రైతులు చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు, పారిశ్రామికాభివృద్ధితో పాటు వ్యవసాయానికి సీఎం చంద్రబాబు పెద్దపీట వేస్తున్నామన్నారు. వ్యవసాయంలో సాంకేతికతకు పెద్దపీట వేస్తూ పెట్టుబడులు తగ్గేలా చర్యలుతీసుకుంటు న్నారన్నారు.

**ప్రకృతి సేద్యంతో ఆరోగ్యం, రాబడి**

అధికారులు సూచించిన పంటలు వేయడం ద్వారా లాభాలు ఆర్జించొచ్చునని ఎమ్మెల్యే నెహ్రూ సూచించారు. ప్రస్తుతం చిరు ధాన్యల ఆహారాన్ని ప్రజలు ఎక్కువగా తీసుకుంటున్నారని, రైతులు ఆ పంటలు సాగు చేయాలని సూచించారు. బోరు సదుపాయం ఉన్న రైతులందరూ ఆయిల్ ఫామ్ సాగు చేయాలని ఎమ్మెల్యే నెహ్రూ సూచించారు. అధికారుల సూచనల మేరకు ఎరువుల వినియోగించాలని రైతులకు సూచించారు. సేంద్రీయ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో రాబడి రావడంతో పాటు ఆరోగ్యం కూడా కలుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, ఆత్మ కమిటీ చైర్మన్ పైడిపాల సూరిబాబు, కొత్త కొండబాబు, సర్వసిద్ధి లక్ష్మణరావు, వైభోగల కొండబాబు యాదవ్, ముత్యాల సత్యనారాయణ, తాతిన నాగేశ్వరరావు, ఈర్పిన శ్రీను, నిమ్మగడ్డ సత్యనారాయణ, పిండి రెడ్డమ్మ, వ్యవసాయ శాఖ అధికారులు ఎస్ నరసింహ, శ్రీవల్లి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చిరు ఉద్యోగి పద్మావతి పై జాలి చూపండి...

- **షాప్ నర్స్ గా 13 సంవత్సరాల సర్వీస్ ఉంది....**
- **గత నెల తుని ఏరియా హాస్పిటల్ లో జరిగిన సంఘన లో పద్మావతి ఏ తప్పు చేయలేదు...**
- **తుని ఏరియా హాస్పిటల్ సర్జరీ కేసులో డాక్టర్ దే పూర్తి బాధ్యత....**
- **ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి. స్వామి బాబు విజ్ఞప్తి**



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 3..** కాకినాడ జిల్లా ఆసుపత్రులు, సమన్వయ అధికారి డాక్టర్. కె. మహేశ్వరరావు (డిసిహెచ్ఎస్) ని, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకట్రావు ని కలిసి వినతి పత్రం ఇచ్చిన ఏ. పి మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి. స్వామి బాబు, జిల్లా అధ్యక్ష,కార్యదర్శి ఏ.పద్మావతి, కార్యదర్శి ఎస్ ఎం వల్లి, ట్రెజరర్ టీ రాణి .ఈ సందర్బంగా ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బి.స్వామి బాబు మాట్లాడుతూ గత నవంబర్ 27 వ తేదిన ఏరియా హాస్పిటల్ తుని పట్టణం లో సర్జరీ కేసు లో జరిగిన ఘటనపై పి. పద్మావతి, స్టాఫ్ నర్స్ విధులలో నిర్లక్ష్యం వహించిందని సర్వీసు నుంచి తొలగించి యున్నారు. ఆపరేషన్ థియేటర్ యందు స్టాఫ్ నర్స్ సహాయకురాలిగా మాత్రమే ఉంటుంది, డాక్టర్ ఇచ్చిన ఆదేశాలను పాటిస్తుంది. స్టాఫ్ నర్స్ సొంత నిర్ణయం ఏమి ఉండదు. ఆమె 13 సం ల సర్వీస్ లో ఎటువంటి రిమార్క్ లేదు. కనుక స్టాఫ్ నర్స్ అభ్యర్థన మన్నించి సమగ్ర విచారణ జరిపి వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను, మానసిక వేదనను పరిగణలో తీసుకొని, చిరు ఉద్యోగి అయిన పి. పద్మావతి స్టాఫ్ నర్స్ ఏరియా హాస్పిటల్ తుని వారిని తిరిగి సర్వీస్ లోకి తీసుకొని పునర్ నియామక ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అందులకు సానుకూలంగా స్పందించిన జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ కే మహేశ్వర రావు ( డి సి హెచ్ ఎస్ )జిల్లా రెవెన్యూ అధికారి జే. వెంకట్రావు లకు పై అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కరిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఏలేశ్వరం జగ్గంపేట తుని పెద్దాపురం సామర్లకోట పిఠాపురం పెదపూడి ప్రత్తిపాడు రౌతులపూడి తాళ్లరేవు ఆసుపత్రుల అధ్యక్షులు ఉపాధ్యక్షులు కార్యదర్శులు, ఈసీ నంబర్లు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సానా సతీష్ బాబు ఫౌండేషన్ చే
# సర్పవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ అందజేత



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 3..** కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కంప్యూటర్ విద్యాభ్యాసాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలకు కంప్యూటర్ను బహూకరించారు. బుధవారం సాయంత్రం పాఠశాల ప్రాంగణంలో హెచ్ఎం పి.ఆర్.పి. కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధానం గా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయం ఇంచార్జ్ మేకా లక్ష్మణమూర్తి పాల్గొనగా, ప్రత్యేక అతిధిగా ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ , ఫౌండేషన్ సభ్యులు ముమ్మిడి వెంకటేశ్వరరావు విచ్చేశారు. ముఖ్య అతిధులు మేకా లక్ష్మణమూర్తి కంప్యూటర్ను హెచ్ఎంకు అందజేశారు. అలాగే విద్యార్థులకు నోటు పుస్తకాలను అతిథులు అందజేశారు. ఈ సందర్భంగా మేకా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు నిబద్ధతతో చదువుకొని తమ భవిష్యత్తును మెరుగుపరుచుకుని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. సానా సతీష్ బాబు ఫౌండేషన్ విద్య, ఆరోగ్యం, సామాజిక సేవా రంగాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతోందని గుర్తుచేశారు. ఈ విధమైన సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు. ఫౌండేషన్చైర్మన్ తలాటం హరీష్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడా పరంగా ఏ సహాయ సహకారాలు కావాలన్నా సహకరిస్తామన్నారు. పాఠశాల విద్యార్థులు ఆర్ఎంసి గ్రౌండ్లో క్రికెట్ నేర్చుకోవాలని సూచించారు. క్రీడాకారుల అభ్యున్నతి కోసం తనప్రోత్సాహం ఉంటుందన్నారు. పాఠశాల ప్రాంగణంలో క్రీడా వస్తువులు భద్రపరచుకునేందుకు ఓ గదిని ఫౌండేషన్ తరపున నిర్మిస్తామన్నారు. అనంతరం ఉపాధ్యాయులు మేకా లక్ష్మణమూర్తికి, తలాటం హరీషలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.ఆర్.పి. కుమార్, మాజీ విద్యాకమిటీ కోఆప్టెడ్ సభ్యులు ఎల్.ఎస్.వీరభద్రరాజు, ఉపాధ్యాయులు ఎం.ఎన్. వీరభద్రరావు, డి. సత్యానందం, జి. సూర్యరావు పాల్గొన్నారు.

# ప్రజలు నివసించే ప్రాంతాల్లో అభివృద్ధి చేయడమే అసలైన అభివృద్ధి

**-40వ డివిజన్ లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 3:** ప్రజలు నివసించే ప్రాంతాల్లో అభివృద్ధి చేయడమే అసలైన అభివృద్ధి అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్థానిక 40వ డివిజన్లో రూ. 10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయినేజి నిర్మాణం పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40వ డివిజన్లో సుమారు 15 ఏళ్లుగా ఉన్న సమస్యకు పరిష్కారం చూపించామన్నారు. రామయ్య దిబ్బ ప్రాంతంలో రోడ్డు... డ్రెయినేజి లేక స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఆ సమస్యకు పరిష్కారం చూపించడం జరిగిందన్నారు. అలాగే ఈ ప్రాంతంలో అనేక సమస్యలు ఉన్నాయని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్నారు. ఈ ప్రాంతం అంతా చిన్న చిన్న రోడ్లు కలిగి ఉంటుందని, అయినా కానీ ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు అవసరమైన మేరకు సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించడం జరిగిందన్నారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీ నేతలు కేవలం జేఎన్ రోడ్డు, ఏవీ అప్పారావు రోడ్డు ఇలా ప్రధాన రోడ్లను మాత్రమే చూసుకుని పనులు చేశారని, కానీ చిన్న చిన్న రోడ్లు పట్టించుకోకపోవడం వల్ల ప్రజలు ప్రస్తుతం ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు నివసించే ప్రాంతాల్లో అభివృద్ధి చేయడమే అసలైన అభివృద్ధి అన్నారు. గత పాలకులు ప్రచారం కోసం పనులు చేస్తే తాము ప్రజా అవసరాలు గుర్తించి ఆ మేరకు అభివృద్ధి పనులు చేయడం జరుగుతోందన్నారు. అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా తమ కూటమి పాలన సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా విభిన్న ప్రతిభావంతల దినోత్సవం

**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 3:** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ముమ్మిడివరం నగర పంచాయతీ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా విభాగం నందు బుధవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభా వంతుల దినోత్సవం లో పాల్గొన్న నగర పంచాయతీ కమిషనర్ పి. రవి వర్మ మాట్లాడుతూ దివ్యాంగులు అనేక రంగాల్లో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆత్మవిశ్వాసంతో వారు ఇలాగే ముందుకు సాగాలని ఆకాంక్షించారు. శారీరక వైరుధ్యాలు కలిగినప్పటికీ.. దివ్యాంగులు విభిన్న ప్రతిభావంతులుగా నెగ్గుతున్నారని పేర్కొన్నారు.మరో ముఖ్య అతిధి జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు మాట్లాడుతూ టీడీపీ మొదటి నుంచి బాసటగా నిలుస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలనలో దివ్యాంగులకు మంచి రోజులు వచ్చాయన్నారు. మంచి ప్రభుత్వంలో దేశంలోనే ఎక్కడా లేని విధంగా దివ్యాంగులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వారికి రూ.6వేల పింఛన్ అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. అంతేకాకుండా దివ్యాంగులకు అన్ని విధాల చేయూతను అందిస్తామని నరసింహారావు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. దివ్యాంగులు సవాళ్లను అధిగమించి జీవితంలో మరెన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో మెప్మా అధికారి ఎం. సోమాని భాస్కర్, మెప్మా సిబ్బంది, పంచాయతీ సిబ్బంది లతో పాటు కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు

## బాధిత కుటుంబాలకు జడ్పీటీసీ సామ్యూల్ సాగర్ ఆర్థిక సహాయం



**తాళ్లరేవు (మనసులో మాట), డిసెంబరు 3:** జార్జీపేట పంచాయతీలోని పలు బాధిత కుటుంబాలను జడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్ బుధవారం పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసారు. ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న వాసంశెట్టి అర్జునరావు, క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ శస్త్ర చికిత్స చేయించుకున్న వట్టూరి ఈశ్వరరావు, కాలేయ వ్యాధితో బాధపడుతూ శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కుడుపూడి రాము లను పరామర్శించి బస్తా బియ్యంతోపాటు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆయన వెంట వైఎస్సార్సీపీ నాయకులు రెడ్డి నాగేశ్వరరావు, దడాల జగదీశ్వరరావు, పెట్ల సూర్యనారాయణరాజు, పేర్ని ఆదినారాయణ మూర్తి, శీలి రాజు, పువ్వల డేవిడ్, చిట్టూరి చలపతి, పిల్లి మణికంఠ తదితరులు ఉన్నారు.

## న్యాయ విజ్ఞాన సదస్సు



**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 3:** ముమ్మిడివరం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మరియు జూనియర్ సివిల్ జడ్జ్ మహమ్మద్ రహంతుల్లా ఆధ్వర్యంలో నగర పంచాయతీ పరిధిలో ఉన్న భవిత మానసిక వికలాంగుల స్కూల్ నందు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది.ఈ సదస్సులో జడ్జి పాల్గొని మాట్లాడారు. శరీరంలో లోపాన్ని చూసి జాలి పడటం కాదు వారిలో ఆత్మవిశ్వాసం స్ఫూర్తి నింపాలి. వైకల్యం ఒక స్థితి మాత్రమే అడ్డంకి కాదు అని తెలియజేయాలని, వైకల్యాలు ఉన్న వ్యక్తులను గౌరవించడం, వారికి సహాయం చేయటం సమాజంలో ప్రతి ఒక్కరు బాధ్యత అని తెలియజేశారు. ప్రత్యేక అవసరాల గల పిల్లలు చదువుకునే చోట మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఇందులో ఏదైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని జడ్జి తెలిపారు. పిల్లలకు ఎలాంటి విద్య అందిస్తున్నారు నైపుణ్యాలు ఎలా పెంపొందిస్తున్నారనే అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం బారు అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డీ నాగేశ్వరరావు, ఏ జి పి కాశి సిద్ధార్థ కుమార్, ముమ్మిడివరం ఎస్సై జ్వాలా సాగర్, భవిత స్కూల్ టీచర్ ఆర్ రమాదేవి లతో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష తమలపాకుల పూజ





**కొత్తపేట (మనసులో మాట) డిసెంబర్ 3..** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో వెంచేసి ఉన్న ఆంజనేయస్వామికి ప్రధానార్చకుడు రఘు ఆధ్వర్యంలో దాతల సహకారంతో లక్ష తులసి పూజ ఘనంగా నిర్వహించారు. ముందుగా పంచామృతాలతో హనుమంతునికి అభిషేకం నిర్వహించి అనంతరం శ్రీరామ నామంతో మహిళలు తమలపాకుపై శ్రీరామ అని రాసిన తమల పాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సహస్ర జ్యోతులతో పెట్టిన హనుమంతుని ఆకారం ఆకట్టుకుంది. కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



## విభిన్న ప్రతిభావంతులకు పండ్ల పంపిణీ

**పిఠాపురం, (మనసులో మాట) డిసెంబరు 3:** పిఠాపురం భవిత కేంద్రం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా పండ్లు పంపిణీ జరిగింది. అడిషనల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి వెంకట అపర్ణ ఆధ్వర్యంలో న్యాయ వాదులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి అపర్ణ మాట్లాడుతూ నల్సా రూపొందించిన చట్టాలను పథకాలను మానసిక వికలాంగులకు వివరించారు.బాల్య విద్య సంబంధించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన చట్టాల పై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు మేరుగ రాజారావు, సీనియర్ న్యాయవాది ఎస్ఎం అలీ, న్యాయవాదులు సత్యవాణి, బి.ఈశ్వర్ బాబు, భవిత కేంద్రం అధ్యాపకులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా హనుమత్ వ్రతం



**పల్నాడు,డిసెంబర్ 3, (మనసులో మాట):** కోళ్ళూరు ఆంజనేయ స్వామి దేవస్థానంలో అత్యంత వైభవంగా హనుమత్ వ్రత కార్యక్రమం నిర్వహించినట్లు బెల్లంకొండ గ్రూపు దేవస్థానాల కార్య నిర్వహణ అధికారి కోటిరెడ్డి తెలిపారు. బెల్లంకొండ మండలంలోని అడ్డ రోడ్డు సమీపంలో ఉన్న కోళ్లూరు ఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు బొర్రా అనంతచార్యులు సారథ్యంలో వేద పండితుల మంత్రోచ్చారణతో హనుమత్ వ్రత విశిష్టతను తెలియజేస్తూ కార్యక్రమం అత్యంత వైభవంగా తేజోభ్యమానంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొర్రా అనంత చార్యులు మాట్లాడుతూ సుమారు 15 సంవత్సరాల నుండి కోళ్ళూరు ఆంజనేయ స్వామి దేవస్థానంలో మార్గశిర శుద్ధ త్రయోదశినాడు హనుమత్ వ్రత కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. 100 మంది మాల ధరించిన స్వాములు, వందలాది మంది భక్తులు ఈ వ్రత కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు, వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థాన చైర్మన్ ఆసుల జగన్ కమిటీ వారు తగిన ఏర్పాట్లు చేసి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ జాలయ్య,వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

## బెల్లంకొండ లో రైతన్నా..మీకోసం



**పల్నాడు, డిసెంబర్ 3,(మనసులో మాట):** రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం రూపొందించిన పంచ సూత్రాలు ప్రతి రైతు వరకు చేరాలనే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమమే రైతన్నా.. మీకోసమని బెల్లంకొండ ఎంపీడీవో సునీత అన్నారు. బెల్లంకొండ మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో రైతన్నా.. మీకోసం కార్యక్రమం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో సునీత మాట్లాడుతూ ప్రభుత్వం దీర్ఘకాలిక దూర దృష్టితో రూపొందించిన పంచ సూత్రాలు రైతులు ఆదాయాన్ని రేట్టింపు చేయడమే లక్ష్యమని తెలిపారు. నూతన విధానాలు ఆధునిక సాంకేతికత తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు పంట బీమా నీటి వినియోగ సమర్థత వంటి అంశాలను రైతులు అవలంబిస్తే వ్యవసాయం మళ్లీ లాభదాయక రంగమవుతుందని పేర్కొన్నారు. రైతు సేవ కేంద్రాలు రైతుల సమస్యలకు పరిష్కార వేదికగా మారాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు. మండలంలో రైతులు ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందాలని ఆశిస్తున్నామన్నారు. ఇన్చార్జి ఈవోపీఆర్డి, రైతు సేవ కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## కాకినాడలో ఘనంగా అంతర్జాతీయ

# విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు

**- వివిధ ప్రతిభావంతులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఉపకరణాలను అందజేస్తుంది....**

**- శారీరక వైకల్యం వినికిడి లోపం ఉన్నవారు లాప్టాప్ల కోసం దరఖాస్తు చేసుకోండి...**

**- ట్రైని కలెక్టర్ మానీషా**





**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 3..** విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయోవృద్ధులు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కాకినాడ జేఎన్టీయూ అల్లూమ్ని ఆల్టోరియంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యురాలు కర్రి పద్మశ్రీ, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, ఏఎస్పీ మనీష్ పాటిల్ దేవరాజ్, ఐసీడీఎస్ పీడీ శ్రీ లక్ష్మీ, రాష్ట్ర రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ వైడీ రామారావు, విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ సంఘాల నాయకులు ముఖ్య అతిథులుగా హాజరై అంతర్జాతీయ విన్న ప్రతిభావంతులు దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవం చేశారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంత విద్యార్థిని, విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విభిన్న ప్రతిభావంతులకు ఉత్తమ సేవలు అందిస్తున్న 26 మంది ప్రత్యేక పాఠశాల ఉపాధ్యాయులకు, 15 మంది వివిధ సంఘాల ప్రతినిధులకు, స్వచందసేవ సంస్థల ద్వారా నిర్వహిస్తున్న ప్రత్యేక పాఠశాలల ప్రతినిధులు అతిథుల చేతులు మీదుగా ప్రశంస పత్రాలు అందజేసి సత్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ.. విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో సాధారణ మనుషుల్లా అన్ని రంగాల్లోనూ రాణించేందుకు పుట్టుదలతో కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల వారికి సమ ప్రాధాన్యతను ఇస్తూ ముందుకు వెళు తుందన్నారు. ముఖ్యంగా విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన పరికరాలు, ఇతర సదుపాయాలు కల్పిస్తుందని ఆమె తెలిపారు. 2028లో జరిగే పారా ఒలింపిక్స్ పోటీలకు కాకినాడ జిల్లా నుంచి విభిన్న ప్రతిభావంతులు ప్రాతినిధ్యం వహించేలా పెద్ద ఎత్తున ప్రోత్సహించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

ట్రైనీ కలెక్టర్ మానీషా మాట్లాడుతూ విభిన్న ప్రతిభ వంతులందరికీ అంతర్జాతీయ విభిన్న ప్రతిభవంతుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ 2025 అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని సామాజిక పురోగతిని పెంపొందించడం కోసం అంగవైకల్యంతో కూడిన సమాజాలను ప్రోత్సహించడం అనే ఇతివృత్తంతో జరుపుకుంటున్నామన్నారు. ఈ దినోత్సవం పురస్కరించుకుని వివిధ స్థాయిల్లో విభిన్న ప్రతిభావంతులకు ఆయా క్రీడా పోటీలు నిర్వహించి జిల్లాస్థాయి విజేతలను రాష్ట్ర స్థాయికి పంపించడం జరుగుతుందని ఆమె తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి వివిధ సంక్షేమ పథకాలు ఇతర సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం రెండు వసతి గృహాల నిర్వహించ బడుతున్నాయని, ఇందులో 50 మంది బాలికలు మరియు 150 మంది బాలురు వసతి పొందుతున్నారని ఆమె తెలిపారు.ఈ వసతి గృహాల ద్వారా విద్యార్థులకు ఉచిత బోర్డింగ్, బస, యూనిఫారాలు, నోట్‌బుక్‌లు మరియు ఇతర సౌకర్యాలు లభిస్తున్నాయన్నారు. దృష్టి లోపం ఉన్న 50 మంది పురుషులు మరియు 50 మంది మహిళల కోసం జిల్లాలో ఒక ఆశ్రమం నిర్వహించబడుతుందన్నారం అదే విధంగా విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన ఉపకరణాలు మూడు చక్రాల సైకిళ్లు, వీల్‌చైర్లు, ఊతకర్రలు, కృత్రిమ అవయవాలు, కాలిపర్‌లు, వాకింగ్ స్టిక్‌లు, వినికిడి పరికరాలు మరియు టచ్ ఫోన్లు, డిగ్రీ లేదా ఉన్నత చదువులు చదివే వారికి (శారీరక వైకల్యం ఉన్నవారికి, వినికిడి లోపం ఉన్నవారికి మరియు దృష్టి లోపం ఉన్నవారికి) ల్యాప్‌టాప్‌లు దరఖాస్తు చేసుకున్న అతి తక్కువ సమయంలోనే మంజూరు చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. కాకినాడ జిల్లాలో ఇది వరకే హలెన్కో ( ఏఎల్ఐఎంసిఒ) ప్రత్యేక శిబిరాలు నిర్వహించి పరికరాలు అందించేందుకు 1891 మందిని గుర్తించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు అందిస్తున్న ప్రతి సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

కార్యక్రమంలో జేఎన్టీయూ రెక్టార్ పి.సుబ్బారావుజిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఏవై. శ్రీనివాసు, మహర్షి సాంబమూర్తి స్పెషల్ స్కూల్, ఉమా మనోవికాస కేంద్రం, సామర్లకోట సిరి స్పెషల్ స్కూల్, పులిమేరు శాంతి వర్ధన స్పెషల్ పాఠశాల ప్రతినిధులు ప్రభుత్వ బధిర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విభిన్న ప్రతిభావంతులు సేవా సంఘం ప్రతినిధులు ఎం.పాపిరెడ్డి, బి. కిరణ్, జి కొండలరావు, నిమ్మకాయల సురేష్, కే సత్య సుబ్రహ్మణ్యం, అంధ ఉద్యోగుల జిల్లా ప్రెసిడెంట్ పి. సురేష్ కుమార్ పాల్గొన్నారు.

# నాన్యమైన వంగడాలను అందించాలి

**- జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్**



**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 3:** వ్యవసాయ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ల ద్వారా నాణ్యత పరీక్షలు భూసార పరీక్షలు నిర్వహిస్తూ అనువైన వంగ డాలను సాగు చేసే దిశగా అన్ని విధాల తగిన ప్రోత్సా హాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ టెస్ట్ ల్యాబ్ సాంకేతిక నిపు ణులకు సూచించారు. బుధవారం ముమ్మిడివరం గ్రామంలోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ను భూసార పరీక్ష కేంద్రాన్ని సందర్శించి నిర్వహణ తీరు పట్ల ఆరా తీసి ఏ మేరకు రైతులు ఈ యొక్క అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారో రికార్డుల ఆధారంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగానికి ఈ పరీక్షా కేంద్రాల ద్వారా నాణ్యత ప్రమాణాలతో కూడిన విత్తనాలు ఎరువులు నాణ్యత పరీక్షలు నిర్వహిస్తూ నకిలీలను అరికట్టాలని సూచించారు. భూసార పరీక్షలు నిర్వ హించి అనువైన రకాలు సాగు చేసేటట్లు అన్ని విధాలుగా రైతు సంక్షేమా నికి అండగా నిలవాలని సూచించారు. నానో యూరియా వాడకాన్ని పెంచుతూ వరి సాగులో రెండో దఫా సాధారణ యూరియా రకం వాడకం బదులుగా నానో యూరియాను వినియోగించా లన్నారు. డ్రోన్ టెక్నాలజీ తో సాగు ఖర్చులను తగ్గించు కోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో అగ్రిటెస్టింగ్ ల్యాబ్ శాస్త్రవేత్తలు ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు

# పిఠాపురంలో క్షీణించిన శాంతి భద్రతలు

**- మాజీ ఎంపీ వంగా గీత తీవ్ర ఆరోపణలు**

**- పలుమార్లు కుల వివక్షత జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదంటూ వ్యాఖ్యలు.**

**- లా అండ్ ఆర్డర్ సక్రమంగా లేదంటూ ఆరోపణలు.**

**- ఆసుపత్రులకు తాళాలు వేసి ప్రాణాలు తీస్తున్నారంటు తీవ్ర మండిపాటు.**

**- శాంతిభద్రతలపై ప్రతిపక్షం లేవనెత్తిన ఈ అంశాలు అధికార పక్షానికి సవాలుగా నిలిచాయి.**

**- గంటలు తరబడి అంబులెన్స్ రావట్లేదని ప్రజలు మొరపెట్టుకుంటున్న ప్రభుత్వం పట్టించుకోవట్లేదు అంటూ ధ్వజమెత్తిన వైనం.**



**పిఠాపురం మనసులో మాట డిసెంబరు 3:** పిఠాపురంలో శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా దిగజారిపోయిందని నేరాలు అన్యాయాలు పెరిగిపోయాయని మాజీ ఎంపీ వైఎస్ఆర్సిపి పిఠాపురం ఇన్చార్జ్ వంగా గీతా విశ్వనాధ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన పత్రిక సమావేశంలో స్థానిక లా అండ్ ఆర్డర్ వ్యవస్థ సక్రమంగా పనిచేయట్లేదని అధికారులు విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆమె విమర్శించారు. వంగా గీత ఆరోపణలలో ముఖ్య అంశాలు..

శాంతి భద్రతల వైఫల్యం

పిఠాపురంలో నేరాలకు అదుపు లేకుండా పోయిందని స్థానిక పోలీసులు యంత్రాంగం విఫలమయ్యారని ఆమె ధ్వజమెత్తారు.

మైనర్లపై అత్యాచారాలు

పిఠాపురం పట్టణంలో మైనర్ బాలికపై గతంలో ఆటో డ్రైవర్ అత్యాయత్నం చేసిన ఉదాంతాన్ని ప్రస్తావించారు. యు కొత్తపల్లి మండలం పిఠాపురం మండలాలలో ఫోక్సో కేసులు నమోదయినట్లు మరోసారి గుర్తు చేశారు. పోక్సో కేసులు నమోదు సమాజానికి పెను ప్రమాదమని పేర్కొన్నారు.

కుల వివక్ష నియోజకవర్గంలో పలుమార్లు కుల వివక్షత దళితులపై జరుగుతుందన్నారు. మల్లం గ్రామంలో దళితుల పట్ల కుల వివక్షత జరిగిందన్న విషయాన్ని ప్రస్తావించారు. బి కొత్తూరు గ్రామంలోనూ దళితులపై దాడి జరిగిందన్నారు. నేడు ఆ కుల వివక్ష విద్యాలయాల దాకా పాకిందని యండపల్లి గ్రామంలో దళిత విద్యార్థులు వివక్షకు గురి కావడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయంపై ప్రభుత్వం అధికారులు తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

తక్షణ చర్యల ఆవశ్యకత

పెరుగుతున్న నేరాలను అరికట్టడానికి బాధితులు న్యాయం చేయడానికి తక్షణమే స్పందించాలని ఆమె కోరారు. వంగా గీత చేసిన ఈ వ్యాఖ్యలు స్థానిక రాజకీయాల్లో ప్రజల్లో తీవ్ర చర్చనీయంగా మారాయి. పిఠాపురం నియోజకవర్గం లో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో ఈ ఆరోపణలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు రావుల మాధవరావు,రాష్ట్ర యువత సహాయ కార్యదర్శి ఉలవలభూషణం, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి ముమ్మిడి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కొతెం దత్తుడు తదితరులు పాల్గొన్నారు.



## క్షేత్రస్థాయి ప్రణాళిక రూపకల్పన చేయండి

**- వ్యవసాయ శాఖ జెడి**

**పెదపూడి (మనసులో మాట) డిసెంబర్ 4..** వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమానికి క్షేత్రస్థాయి ప్రణాళికల రూపకల్పన చేపట్టాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ విజయకుమార్ కోరారు. పెదపూడి మండల పరిషత్తులో బుధవారం మండల వ్యవసాయ అధికారి సత్యప్రసాద్ అధ్యక్షతన ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుత రబీ సీజన్, 2026...27లో వ్యవసాయ ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. యూరియా ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ స్వాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని విజయ్ కుమార్ కోరారు. పెదపూడి సొసైటీ చైర్మన్ పుట్ట గంగాధర్ చౌదరి, అనపర్తి ఏఎంసీ చైర్పర్సన్ జుత్తుక సూర్యకుమారి, ఎంపీడీవో నరేంద్రరెడ్డి, ఏడీఏ దుర్గాలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, సహకార సొసైటీల కార్యదర్శులు పాల్గొన్నారు.

## మా గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించండి




**ఎటపాక (మనసులో మాట), డిసెంబరు 1 :** మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని వాగు వడ్డు గుంపు గిరిజన ప్రజలకు నడవడానికి రోడ్డు లేక అనేక సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యుడు సవలం రాము పూనం.వెంకట్రావు స్థానికులు కలిసి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఇదే విషయాన్ని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కరించలేదు. అనేకసార్లు రెవెన్యూ అధికారులు రోడ్డు కోసం పరిశీలన చేసినప్పటికీ సమస్యను పరిష్కారం దిశగా తీసుకెళ్లలేదు. ఎన్నో ఏళ్లగా రోడ్డు లేక చీకటిలో కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నదాని తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులు ముందుకు రావాలని గ్రామస్తులు కోరుతున్నారు. కార్యక్రమంలో మడక ముత్తయ్య, సవరం రామయ్య, సోడి రామయ్య, సోడి కృష్ణమూర్తి. తదితరులు పాల్గొన్నారు

## దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

**దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేసిన కూటమి పార్టీ సీనియర్ నేత సత్యం, ఎంపీపీ భవాని**



**రామచంద్రపురం(మనసులో మాట) డిసెంబర్ 3..** సమాజంలోని దివ్యాంగుల్లో స్వావలంబన, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కూటమి పార్టీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అలింకో సంస్థ సమకూర్చిన నాలుగు ట్రై సైకిళ్లను ( మూడు బ్యాటరీ, ఒక ట్రై సైకిల్ ) లబ్ధిదారులకు సత్యం, ఎంపీపీ అంబటి భవాని చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ప్రపంచ దివ్యంగుల దినోత్సవం సందర్భంగా మూడు చక్రాల సైకిళ్లు పంపిణీ చేయడం ఆనందకరమన్నారు. అర్హులైన దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం పింఛన్లు అందజేస్తుందన్నారు. దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యంగా అలీంకో సంస్థ ద్వారా ఇటీవల పెద్ద ఎత్తున ఉపకరణాలు, వినికిడి యంత్రాలు, ట్రై సైకిల్లు పంపిణీ చేశారన్నారు. ఎంపీపీ అంబటి భవాని మాట్లాడుతూ ప్రయాణానికి ఇబ్బంది పడుతున్న దివ్యాంగులకు ఉపయుక్తమైన ట్రైసైకిళ్లు అందించడం ద్వారా వారి రోజువారీ జీవితం మరింత సులభంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీవో ఎం శివప్రసాద్, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఉండవల్లి శివ, మాజీ మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, కంచుమర్తి బాబురావు, విత్తనాల వెంకటరమణ, చిల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఏలేశ్వరం లో విభిన్న ప్రతిభావంతులకి దేశం లో ఉన్నా చట్టాల పై అవగాహన సదస్సు

**ప్యానెల్ అడ్వకేట్స్ బుగత శివ అవసరాల దేవి, శ్రీలక్ష్మి, దేవి**



**ఏలేశ్వరం ( మనసులో మాట) డిసెంబర్ 3..** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని ఏలేశ్వరం లోని భవితా కేంద్రంలో మండల న్యాయ సేవాధికార సంస్థ నేతృత్వంలో బుధవారం విద్యార్థులకు బిస్కెట్లు, పండ్లు అందజేశారు. అనంతరం పిల్లల తయారు చేసిన బొమ్మలు, ఆట వస్తువులను వారు పరిశీలించి వారిని అభినందించారు.ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులకు దేశం లో ఉన్న చట్టాల పై వారికీ అవగాహన సదస్సు కల్పించారు . ఈ కార్యక్రమంలో ఎం.ఈ.ఓ 2 వరలక్ష్మి, ప్యానల్ అడ్వకేట్స్ బుగత శివ, అవసరాల దేవి, శ్రీలక్ష్మి, దేవి, భవిత కేంద్ర ఉపాధ్యాయురాలు వాణి పద్మ, బుజ్జి,పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## స్క్రబ్ టైఫస్ వ్యాధి పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

**-డీఎంహెచ్ఓ డాక్టర్ కే వెంకటేశ్వరరావు**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 3:** తగిన చికిత్స అందుబాటులో ఉండటంతో పాటు ప్రజలు నిర్భయంగా ఉండవలసిందిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని కొద్ది జిల్లాల్లో "స్క్రబ్ టైఫస్" కేసులు నమోదవుతున్నప్పటికీ ఈ వ్యాధి సుత్సుగాముషి అనే కీటకం కుడితేనే సోకుతుందని తెలిపారు. ఈ కీటకం కుట్టిన ప్రదేశంలో ఎర్రటి మచ్చ కనిపించడం, ముఖ్యంగా పొలాలు, తోటలు, గుబురు చెట్లు ఉన్న ప్రదేశాల వద్దకు వెళ్లే వారికి ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని అన్నారు. పొడవైన చేతులు గల షర్టులు, ప్యాంట్లు వేసుకోవడం, శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు ధరించడం ద్వారా కీటకం కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చని సూచించారు. జ్వరం లేదా అనుమానాస్పద లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం లేదా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని ప్రజలకు డీఎంహెచ్ఓ విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా హనుమద్వ్రతం



**అనపర్తి ( మనసులో మాట) డిసెంబర్ 3:** స్థానిక బ్రాహ్మణ రేవులో కొలువుతీరిన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారికి బుధవారం హనుమద్వ్రతం పురస్కరించుకుని, పురోహితులు నాగదేవర వెంకటేశ్వర్లు వాసు శర్మ ఆధ్వర్యంలో పండితులచే, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం 32 రకాల ద్రవ్యాలతో భక్తులచే వారి స్వహస్తాలతో ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహానికి వేదమంత్రాలు నడుమ అభిషేకం నిర్వహించుకున్నారు. తొలుత సామూహిక పూజా కార్యక్రమం నిర్వహించి అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి దర్శనం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

## నేడు దత్త జయంతి ఘనంగా ఏర్పాట్లు పూర్తి

- శ్రీపాద శ్రీ వల్లభ మహా సంస్థానంలో ప్రత్యేక పూజలు
- పాదగయ క్షేత్రంలో స్వయంభు దత్తాత్రేయుడికి ప్రత్యేక అభిషేకాలు
- ఘనంగా ఇరుముడి ధారణ దత్తస్వాముల దత్త స్వాముల నగరోత్సవం



**పిఠాపురం, ( మనసులో మాట) డిసెంబరు 3:** శ్రీపాద శ్రీ వల్లభుల జన్మస్థానంగా పేరుగాంచిన పిఠాపురం మహా సంస్థానంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతిరోజు దత్త పాదుకులకు అభిషేకాలను ఆలయ పండితులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. అనంతరం శ్రీపాద శ్రీ వల్లభుడు దత్తాత్రేయ స్వామి వారికి ప్రత్యేక పుష్పాలతో అలంకరణ జరుగుతుంది. దత్త జయంతిని నేడు పెద్ద ఎత్తున ఆలయానికి భక్తులు విచ్చేస్తారు.తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర భక్తులు కూడా దత్త జయంతికి అధికంగా ఈ క్షేత్రానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మహాగణపతి పూజ, రుద్రాభిషేకాలు, మంగళహారతి, మంత్రపుష్పం వేద పారాయణం, మూల మంత్ర అనుష్టానం, గురు చరిత్ర, శ్రీపాద వల్లభ చరిత్ర పారాయణం. లక్ష బిల్వార్చనలతో శ్రీపాద శ్రీ వల్లభుల దత్తాత్రేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

**పాదగయాక్షేత్రంలో నిర్వహించే పూజా కార్యక్రమాలు**

ప్రముఖ పుణ్యక్షేత్రం పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఉప ఆలయంగా కొలువైయున్న స్వయంభు దత్తాత్రేయ స్వామి ఆలయంలో దత్త జయంతి వేడుకలు ఘనంగా జరుగుతాయి. దత్త జయంతిని పురస్కరించుకుని తెల్లవారి జాము నుండే అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి విచ్చేస్తారు. దత్త జయంతి రోజు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలు దత్త జయంతి పురస్కరించుకుని మహా గణపతి పూజ, ఏకాదశి రుద్రాభిషేకం, సహస్రనామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, శీర్ష ఉపనిషత్తు , వేద సూక్తులు, సామూహిక దత్త పారాయణం, సాయంత్రం విశేష పుష్పార్చనలు నిర్వహిస్తారు. దత్త జయంతి సందర్భంగా విచ్చేసే భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా విస్తృత ఏర్పాటు చేసినట్లు పాదగయ కార్య నిర్వహణ అధికారి అసిస్టెంట్ కమిషనర్ కారణం జగన్మోహన్ శ్రీనివాస్ తెలిపారు. అలాగే శ్రీపాద శ్రీ వల్లభ స్వామి దర్శనానికి విచ్చేసే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు కార్య నిర్వహణ అధికారి ఆర్ సౌజన్య ప్రభాకర్ తెలిపారు.

# ఉచిత బస్సు తో ఇక్కట్లు

- కిక్కిరిసిపోయి ఓవర్‌లోడుతో నడుస్తున్న వైనం
- పురుషులు, వయో వృద్ధులకి దొరకని సీట్లు
- పలుస్టేజీల్లో బస్సులు ఆపడంలేదని ప్రయాణికుల ఆరోపణ
- సాయంత్రం అయితే జాతరను తలపిస్తున్న ముమ్మిడివరం విష్ణాలయం సెంటర్
- బస్సెక్కాలంటే సాహసం చేయాల్సిన పరిస్థితి








**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 3:** అమలాపురం నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికుల అవసరాకు సరిపడ ఆర్టీసీ బస్సులు నడపకపోవడంతో నిత్యం వేలాది మంది ఇబ్బంది పడుతున్నారు. 'స్త్రీ శక్తి' పథకం అమలుకాకముందు నుంచే ఈ సమస్య వుండగా.. మహిళలకు ఉచిత ప్రయాణం అమల్లోకి వచ్చిన తరువాత మరింత పెరిగింది. ఆక్యుపెన్సీ రేషియాకు అనుగుణంగా అధికారులు అదనంగా బస్సు సర్వీసులను ప్రవేశపెట్టకపోవడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లే దినసరి కూలీలు, చిరుద్యోగులు చాలా ఇబ్బంది పడుతున్నారు.

అమలాపురం, కాకినాడ లో ఉన్న కళాశాలలు, పాఠశాలల్లో ముమ్మిడివరం, ఐ. పోలవరం, కాట్రేనికోన మండలాలకి కు చెందిన సుమారు రెండు వేల మంది విద్యను అభ్యసిస్తున్నారు. వీరు రోజూ ఆయా గ్రామాల నుంచి అమలాపురం కి రాకపోకలు సాగిస్తుంటారు. కొంతమంది ఆటోలను ఆశ్రయిస్తుండగా ఎక్కువ మంది ఆర్టీసీ బస్సులపైన.. అది కూడా పల్లెవెలుగు బస్సులపై ఆధారపడుతున్నారు. కాకినాడ నుంచి యానాం, అమలాపురం వెళ్లే పల్లె వెలుగు బస్సులు మురముళ్ల లోనే నిండిపోయి, చాలా మంది నిల్చుని వుంటున్నారు. దీంతో ముమ్మిడివరం మండలానికి చెందిన ప్రయాణికులు బస్సు ఎక్కడానికి, కనీసం నిల్చుని ప్రయాణించడానికి కూడా చోటు వుండడంలేదు. ఈ కారణంగా ఆయా గ్రామాల స్టాప్‌ల వద్ద డ్రైవర్లు బస్సులను ఆపడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో విద్యార్థులు సకాలంలో తరగతులకు హాజరుకాలేకపోతున్నారు. ప్రధానంగా అమలాపురం చెంతనే ఉన్న అనాతవరం, భట్నవిల్లి గ్రామాల విద్యార్థులకు ఈ సమస్య అధికంగా వుంది. అష్టకష్టాలు పడి పాఠశాల లేదా కళాశాలకు వెళితే.. మళ్లీ సాయంత్రం ఇంటికి రావడానికి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కడానికి యుద్ధమే చేయాల్సి వస్తున్నదని వాపోతున్నారు. కాకినాడ వైపు నుంచి మురముళ్ళ, ముమ్మిడివరం వైపు వెళ్లే పల్లెవెలుగు బస్సులు ముమ్మిడివరం వచ్చేసరికి సీట్లన్నీ నిండిపోవడమే కాకుండా చాలా మంది నిల్చుని వుంటున్నారు. ఎక్కడ ఐదారుగురు బస్సు దిగితే.. 20 మందికి పైగా బస్సు ఎక్కేవారు వుంటున్నారు. బస్సు రావడమే తరువాయి.. ఒక్కసారిగా తోసుకుంటూ గేటు వద్దకు వెళుతున్నారు. బస్సులో నిల్చుని వెళదామన్నా ఖాళీ లేని పరిస్థితి నెలకొంటున్నది. అబ్బాయిలు, యువకులు ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. అమ్మాయిలు, మహిళలు అంత సాహసం చేయలేక.. మరో బస్సు కోసం వేచి వుంటున్నారు. దీంతో ఇంటికి చేరేసరికి రాతి ఏడేనిమిది గంటల అవుతున్నదని విద్యార్థినులు వాపోతున్నారు. ఇక చిన్నపిల్లలు, లగేజీతో ప్రయాణించే మహిళల ఇక్కట్లు వర్ణనాతీతం. దీంతో పలువురు మహిళలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు అమలాపురం -కాకినాడ మీదుగా మరిన్ని పల్లె వెలుగు బస్సులు నడిచేలాచర్యలు చేపట్టాలని ప్రయాణికులు, విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**పురుషులు కి అసలు సీట్లే ఉండడం లేదు :**

సీటు కోసం మొన్నటి వరకూ ఆడవాళ్లు ఆడవాళ్లు కొట్టుకునే వీడియో లే వైరల్ అవ్వడం చూసాం ఇప్పటి వరకూ కానీ సీటు కోసం మహిళలు పురుషుల మధ్య కూడా గొడవలు జరుతున్నాయి. ఆ గొడవలు కేవలం తిట్లకే పరిమితం కాకుండా కొట్టుకునే వరకు వెళుతున్నాయి. తాజాగా తుని నుండి నర్సీపట్నం వెళుతున్న ఆర్టీసీ బస్సులో అలాంటి ఘటనే చోటు చేసుకుంది. సీటు కోసం ఓ మహిళ పురుషుడి మధ్య గొడవ జరిగింది.

ఈ క్రమంలో మాటామాట పెరిగి మహిళ ప్రయాణికుడి జుట్టు పట్టుకుని కొట్టింది. దీంతో ప్రయాణికులు అంతా నివ్వెరపోయారు. ఆ ప్రయాణికుడు సైతం ప్రతిఘటించడంతో రచ్చరచ్చగా మారింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. అయితే సీటు కోసం గొడవలకు ఉచిత బస్ పథకమే కారణం అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పురుషులు టికెట్ తీసుకుని నిలబడి ప్రయాణిస్తే మహిళలు ఉచితంగా ఎక్కుతూ సీట్లలో కూర్చుకుంటున్నారని, దానివల్లనే గొడవలు జరుగుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

## నాటుసారా రహిత జిల్లాగా ఏలూరు జిల్లాను రూపొందించాలి



**ఏలూరు, డిసెంబర్, 3(మనసులో మాట)** నాటుసారా రహిత జిల్లాగా ఏలూరు జిల్లాను రూపొందించేందుకు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారం నాటుసారా తయారీని విడిచిపెట్టిన కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి (మార్పు) కార్యక్రమాల పై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాను నాటుసారాను పూర్తిగా నిర్మూలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాటుసారా తయారీదారులు నాటుసారా జోలికి వెళ్లకుండా గౌరప్రదమైన మార్గాన్ని ఎంపికచేసుకునేలా వారిలో మార్పు తీసుకురావాలన్నారు. నాటుసారా విడిచిన కుటుంబాలను ఆదుకునేందుకు వివిధ సంక్షేమ శాఖల ద్వారా సర్వే నిర్వహించి వారికి పెన్షన్లు, గృహాలు మంజూరు, స్వయం ఉపాధి రుణాలు మంజూరు వంటి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు మంజూరు చేసేందుకు నాటుసారా ప్రభావిత ప్రాంతాలలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటుచేసి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. అవసరమైన అనువైన ఉపాధికార్యక్రమాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుకోవాలన్నారు. నాటుసారా తయారీ ని వదిలిని కుటుంబాలకు గతంలో నవోదయం ద్వారా చాలా కుటుంబాలకు ఉపాధికి వివిధ శాఖల ద్వారా రుణాలు అందించడం జరిగిందన్నారు. వారు తిరిగి నాటుసారా తయారీ జోలికి వెళితే కఠిన చర్యలు ఉంటాయని తెలియజేయాలన్నారు.


## ఏలూరులో ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు



**ఏలూరు, డిసెంబర్, 3(మనసులో మాట)..** విభిన్న ప్రతిభావంతులలో ఆత్మస్థైర్యాన్ని నింపి వారి అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ చేయూత నివ్వాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ఎం. జె. అభిషేక్ గౌడ పిలుపులినిచ్చారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు కలక్టరేట్ లోని సమావేశపు హాలులో ఘనంగా నిర్వహించారు. వేడుకలను జిల్లా జాయింట్ కలక్టర్ అభిషేక్ గౌడ ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ గౌడ మాట్లాడుతూ అవకాశం ఇస్తే విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాలలోను తమ ప్రతిభను నిరూపించుకోగాలన్నారు. వారిని అన్ని రంగాలలో ప్రోత్సాహం అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. విభిన్న ప్రతిభావంతులు సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని,వాటిని అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వారి సమస్యలపై అందిన ఫిర్యాదులను కూడా ప్రాధాన్యతతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భముగా నవంబరు 25వ తేదీన నిర్వహించబడిన విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలలో పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులను జేసీ అందించారు. విభిన్న ప్రతిభావంతుల సాధికారతకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులను ఈ సందర్భంగా సత్కరించారు.

## విభిన్న ప్రతిభావంతులకు రుణాలు మంజూరు

**- మెప్మా పీడీ కనక రాజు**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 3:** పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో రెండు పురపాలక సంఘాలు, ఒక నగర పాలక సంస్థలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతుల స్వయం సహాయ సంఘాలు, టౌన్ వికలాంగుల సమాఖ్యల అర్హత కలిగిన సభ్యులకు విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ, మెప్మా నందు సమావేశాన్ని ఏర్పాటు చేసి సీనియర్ సంఘానికి ఇండియన్ బ్యాంకు ద్వారా రూ. 20 లక్షల బ్యాంకు రుణాన్ని, ఇద్దరు లబ్ధిదారులకు యూనియన్ బ్యాంకు రూ. 65 వేలు పీఎం స్వానిధి పథకము ద్వారా అందజేశారు. నిడదవోలు పురపాలక సంఘం పరిధిలో రెండు సంఘాలకు రూ. 6.5 లక్షలు రుణాలు యూనియన్ బ్యాంకు, స్టేట్ బ్యాంక్ ద్వారా అందజేశారు. మెప్మా పీడీ టీ కనకరాజు మాట్లాడుతూ జిల్లాలో ప్రతి పట్టణంలో వికలాంగులు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పాటయ్యి ఆర్థికముగా నిలదొక్కుకోవాలని కోరారు. వారికి ప్రభుత్వం ద్వారా వచ్చే అన్ని ప్రయోజనాలు అందజేస్తామని తెలిపారు. సీనియర్ సంఘంలోని ఐదుగురు విభిన్న ప్రతిభావంతులను శాలువాతో సత్కరించారు.



### పిఠాపురం పట్టణంలో ట్రాఫిక్, రోడ్డు ఆక్రమణలపై

## పోలీసులు ఉక్కు పాదం

- విజిబుల్ పోలీసింగ్ నిర్వహణ
- రోడ్డును ఆక్రమించి వ్యాపారం చేస్తున్న పలువురిపై కేసులు నమోదు
- ట్రాఫిక్ కి అంతరాయం కలిగిస్తే ఉపేక్షించేది లేదంటూ కఠిన ఆంక్షలు జారీ

**పిఠాపురం, ( మనసులో మాట) డిసెంబరు 3:** పిఠాపురం లో ట్రాఫిక్ ఆక్రమణలపై పోలీసులు ఉక్కు పాదం మోపారు. పట్టణంలో 'విజిబుల్ పోలీసింగ్' లో భాగంగా ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఈ డ్రైవ్ జరిగింది. పోలీస్ సిబ్బంది బుధవారం పట్టణంలోని ప్రధాన కూడలి ల లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. చర్చి సెంటర్ నుండి కోటగుమ్మం మీదగా ఉప్పాడ బస్టాండ్ వరకు రోడ్డుపై నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇటువంటి ఆక్రమణలు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ జి శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ ఆకస్మిక తనిఖీలతో స్థానిక వ్యాపారుల్లో వాహనదారుల్లో క్రమశిక్షణ నెలకొంటుందని పోలీసులు భావిస్తున్నారు. పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ మణికుమార్ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగులపై స్నేహపూర్వకంగా మెలగాలి- ఎంఈఓ





**పల్నాడు, డిసెంబర్ 3, (మనసులో మాట):** ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా పెదకూరపాడు భవిత కేంద్రము నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి .టీ. సత్యనారాయణ పాల్గొని ఐ ఆర్ పి టీచర్స్ ద్వారా కార్యక్రమానికి ఘనంగా నిర్వహించారు.. మానసిక శారీరిక బలహీనతల వలన వికలాంగులు అయినవారికి మానవతా దృక్పథంతో వారి పట్ల స్నేహపూర్వకంగా మెలగాలని కోరారు .నిజమైన వికలాంగులు అవయవాలు అన్నీ ఉండి ఎవరికి ఉపయోగం లేని వారు అని అన్నారు. ఈ విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు స్నేహపూర్వక వాతావరణం లో బోధించడం, ఫిజియోథెరపీ, హెూం బేసిక్ ఎడ్యుకేషన్, ప్రభుత్వ నుండి వచ్చే వివిధ రకాల అలవెన్సెస్, వినికిడి, కళ్ళద్దాలు వీల్ చైర్స్ మొదలగునవి ప్రభుత్వం ద్వారా అందించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెదకూరపాడు ప్రధానోపాధ్యాయులు కె.వి.రమణ , స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు చిలకా సుబ్బారావు,సుశిత ప్రియ, ఉపాధ్యాయులు లక్ష్మిప్రసన్న, ఏ. లక్ష్మి త్రివేణి, షేక్ రహీం పాల్గొన్నారు.

### ఈ నెల 12 వ తేదిన భవన నిర్మాణ కార్మికులకు పథకాల అమలు ప్రమాదాలపై

## అవగాహన సదస్సు ను జయప్రదం చేయండి

- భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా.. ప్రభుత్వం పథకాలను తక్షణమే అమలు చేయాలి....
- కాకినాడ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తాటిపాక మధు..



**కాకినాడ (మనసులో మాట ) డిసెంబర్ 3..** భవన నిర్మాణ కార్మికులకు పథకాల అమలు ప్రమాదాలపై డిసెంబర్ 12వ తేదీన కాకినాడలో స్థానిక సాంబమూర్తి నగర్ రెవెన్యూ కాలనీ రోడ్ దుర్గమ్మ గుడి పక్కన పి. ఆర్ భవన్ లో ది కాకినాడ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో పి.ఆర్ భవన్లో భవన నిర్మాణ కార్మికులకు పథకాల అమలు, ప్రమాదాలపై అవగాహన సదస్సు జరుగును. బుధవారం పిఆర్ భవన్ లో ఈ సదస్సు కరపత్రం ఆవిష్కరణ ది కాకినాడ జిల్లా బిల్లింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు తాటిపాక మధు, ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ ఆవిష్కరణ చేశారు. తాటిపాక మధు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ఈ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా సంక్షేమ బోర్డును పున ప్రారంభించి సంక్షేమ బోర్డు ద్వారా పథకాలను తక్షణమే అమలు చేసి భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన అన్నారు. పని ప్రదేశాల్లో ప్రమాదాల జరుగుతుంటే కార్మిక సంఘాల్లో తరుపున ఆందోళన చేస్తేనే తప్ప బాధిత కుటుంబానికి నష్టపరహారం చెల్లించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు నిరాశ మిగిల్చిందని, కార్మికుల ఉసురు తగిలిందని, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 మాసాలు గడుస్తున్న నేటికీ సంక్షేమ బోర్డు అమలు చేయకపోవడం సిగ్గుచేటని ఆయన అన్నారు. తోకల ప్రసాద్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు పథకాలు అమలు ప్రమాదాలపై డిసెంబర్ 12 వతేదీన తేదీన అవగాహన సదస్సు జరగనున్నదని, ఈ సదస్సుకు ముఖ్య అతిధులుగా ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ %ఁ%కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ పడాల రమణ హాజరవుతారని, కాకినాడలో జరిగే ఈ సదస్సుకు తాపీ మేస్త్రీలు, ఎలక్ట్రిషన్లు, కార్పెంటర్లో, టైల్స్ ,మార్బుల్, పెయింటర్లు, వెల్డర్స్, పిఓపి సీలింగ్ వర్కర్స్ తదితర రంగాల కార్మికులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. పని ప్రదేశాల్లో ప్రమాదాలు జరుగుతున్న సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు వచ్చే ఆర్థిక సహాయం కరువైందని, కోట్లాది రూపాయల సెస్ నిధులు ఉన్న కార్మికులకు ఖర్చు చేయడంలో పాలకుల విఫలం చెందితున్నారని ఆయన అన్నారు. ఇంజనీర్స్, బిల్డర్స్, ప్రముఖ వ్యాపారవేత్తలు కన్స్ట్రక్షన్ రంగంలో భవన నిర్మాణ కార్మికులకు టాటా ఏఐజి గ్రూప్ ఆఫ్ ఇన్సూరెన్స్ చేస్తే భవన నిర్మాణ కార్మికులకు భరోసా కల్పించేందుకు అందరూ ఇన్సూరెన్స్ చేయించాలని, తెలంగాణ రాష్ట్రం వల్లే ఆంధ్ర రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల ప్రమాదాలకు పది లక్షల రూపాయలు ఎక్స్గ్రేసే చెల్లించాలని, పథకాల అమలకే ఐక్యంగా పోరాడదాం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కామిరెడ్డి బోడకొండ, టి. అన్నవరం, రామకృష్ణ, నక్క శ్రీనివాస్,అర్జున్ రావు, భాను, శాఖ రామకృష్ణ, శ్రీనివాస్, రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రపంచ దివ్యాంగులదినోత్సవ సందర్భంగా

# ఆటల పోటీలు

**రౌతులపూడి, (మనసులో మాట )డిసెంబర్ 03 :** ప్రపంచ దివ్యంగుల దినోత్సవ సందర్భంగా రౌతులపూడి భవిత సెంటర్లో విద్యార్థులకు ఆటల పోటీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రౌతులపూడి మండల అధ్యక్షురాలు గంటిమండ్ల రాజలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం భవిత సెంటర్లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంపీపీ గంటి మల్ల రాజలక్ష్మి చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఇట్టంశెట్టి సూర్య భాస్కర బాబు, వాసిరెడ్డి భాస్కర బాబు, మండల విద్యాశాఖ అధికారి 2 గాడి కొండబాబు, ఉపాధ్యాయులు శ్రీనివాస్ మరియు భవిత సెంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

# సెల్ ఫోన్లను పరిమితంగా వినియోగించాలి




**కాకినాడ ( మనసులో మాట )డిసెంబర్ 3..** సెల్ ఫోన్లకు సంబంధించిన తరంగాలు మన మెదడుపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున వాటిని పరిమితంగా వినియోగించాలని విశ్రాంతి ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు .రమణయ్యపేట లో వి ఎస్ ఎల్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ఉద్దేశించి బుధవారం ఆయన మాట్లాడారు. సెల్ ఫోన్లలో సమస్త సమాచారం నిక్షిప్తమై ఉందన్నారు. అయితే విద్యార్థులు వాటి ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించు కోవాలని అన్నారు. సెల్ఫోన్లకు బానిస కాకుండా చదువుపై మనసును నిమగ్నం చేయాలని వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్, ప్రిన్సిపాల్ కెవి రాఘవరావు, ఎన్ఎస్ఎస్ అధికారిని కె. సుకన్య స్థానిక పెద్దలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

# సంపరలో వైభవంగా హనుమత్ వ్రత మహోత్సవాలు



**పెదపూడి (మనసులో మాట) డిసెంబర్ 4..** పెదపూడి మండలం సంప్ర గ్రామంలో కోదండ రామాలయం వద్ద బుధవారం హనుమత్ వ్రత మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు కండపల్లి శ్రీనివాస్ ఆచార్యులు, ఖండవిల్లి హనుమంత ఆచార్యులు ఆధ్వర్యంలో హనుమాన్ విగ్రహానికి పంచామృత అభిషేకాలు, నాగవల్లి దళ సహిత సింధూర అర్చన, అభిషేకాలు నిర్వహించారు. ప్రాచీన కాలంలో రావణాసురుడి లంకలో హనుమంతుడు సీతాదేవిని గుర్తించిన విశేషమైన రోజునే హనుమత్వ్రత మహోత్సవంగా ప్రాచీన కాలం నుండి నిర్వహిస్తున్నట్లు కండవల్లి రామకృష్ణాచార్యులు వివరించారు. పరిసర గ్రామాల నుండి హనుమత్ వ్రత పూజలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. పూజల అనంతరం భక్తులకు, ప్రజలకు స్వామి ప్రసాదం, గంగ సింధూరాన్ని అందించారు. హనుమత్ వ్రత మహోత్సవ సందర్భంగా స్వామిని దర్శిస్తే శుభ ఫలితాలు లభిస్తాయని హనుమంత ఆచార్యులు తెలిపారు.



# ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి మట్టి పాత్రలను వినియోగిద్దాం

**- జెసి టి నిశాంతి**




**అమలాపురం డిసెంబరు 3 :** ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయంగా మట్టి పాత్రల తయారీని ప్రోత్స హించేందుకు జిల్లాయం త్రాంగం చర్యలు తీసుకుం టుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిశాంతి తెలిపారు . బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా వ్యాప్తంగా ఉన్న కుమ్మరి కులస్తులతో సమావేశం నిర్వహించి పర్యావరణ హితమైనమట్టి పాత్రలు తయారీ కై చేపట్టాల్సిన చర్యలు గూర్చి సమీక్షిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ మట్టి లభించే లంక ప్రాంతాలను గుర్తించి నివేదిక జిల్లా పౌరసరఫరాల అధికారికి అందించాలని సభ్యులకు సూచించారు. ఎస్సీ బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం క్రింద సబ్సిడీతో కూడిన ఈ రుణాలు మంజూరుకు ఎల్డిఎం కృషి చేయాలని ఆదేశించారు. గ్రామాలలో ఖాళీ స్థలాలను గుర్తించి కుమ్మరి పరిశ్రమకు కేటాయించడం జరుగుతుం దన్నారు. విద్యుత్ సబ్సిడీ కొరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని ఉద్యాన నర్సరీలలో కుండీలు మట్టి పాత్రతో ప్రోత్సహించేందుకు చర్యలు చేపడతామన్నారు. రైతు బజార్లలో ఒక షాపును మట్టి పాత్రలు అమ్మేందుకు కేటాయిస్తామన్నారు. సంక్రాంతికి మట్టి పాత్రలు ప్రోత్స హించే దిశగా కలెక్టరేట్ నందు ప్రతి ఉద్యోగికి మట్టి పాత్రలు సరఫరా చేస్తామని తెలిపారు.. కుమ్మరి పరిశ్రమ కు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని జెసి తెలిపారు. జిల్లా పౌర సరఫరాల అధికారి ఏ ఉదయ భాస్కర్ మాట్లాడుతూ మట్టి పాత్రలు పర్యావరణానికి అను కూలమైనవని, ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు, ప్లాస్టిక్ వల్ల వచ్చే కాలుష్యాన్ని మట్టి పాత్ర నివారిస్తాయని రానున్న జూన్ నాటికి సింగిల్-యూజ్ ప్లాస్టిక్ ఫ్రీ జిల్లాగా మారాలనే ప్రధాన లక్ష్యంతో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్ర మాలు సాగుతున్నాయ న్నారు .ప్లాస్టిక్ వ్యర్థాలు మట్టిలో వందల సంవ త్సరాలు భూమిలో కలవని జలచరాలు, భూమి సారాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు. మట్టి పాత్రలు పండిన ఆహారం పోషకా లను అందిస్తుందన్నారు, నూనె వాడకం తగ్గి, జీర్ణక్రియ మెరు గుపడి గ్రామాల్లో కుమ్మరి కులస్తులకు శిక్షణ, ఆర్థిక సహాయం అందించి తయారీని పెంచడానికి చర్యలు గైకొం టున్నట్లు తెలిపారు. గ్రామ సభలు, పబ్లిక్ మీటింగుల ద్వారా ప్రజలకు మట్టి పాత్రల ప్రయోజనాలు తెలియ జేస్తూ, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్లు, ఆసుపత్రుల్లో మట్టి పాత్రలు తప్పనిసరి చేస్తూ, సబ్సి డీలు, డిస్కౌంట్లు అందిస్తామన్నారు. ఈ చర్యలతో సమాజంలో పర్యావరణ ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొంటుం దన్నారు, ప్లాస్టిక్ వినియోగం పెరిగి పోవడంతో పర్యావరణం తీవ్రమైన నష్టాన్ని ఎదుర్కొం టుందని శాలివాహన కుమ్మరి ప్రతినిధి విజయకుమారి అన్నారు. సముద్రాలు, నదులు, నేల, వాతావరణంఏదీ ప్లాస్టిక్ ప్రభావం నుండి తప్పించుకోలేక పోతున్నా యన్నారు. ఇలాంటి పరిస్థితిలో మన సంప్రదాయ కళను, పర్యావరణాన్ని రక్షించే దిశగా మట్టి పాత్రల వినియోగం ఎంతో అవసరమని. ముఖ్యంగా కుమ్మరి కుటుంబాలు ఈ కళకు ప్రోత్సాహం ఇచ్చే బాధ్యత సమాజంపై ఉందన్నారు. మట్టిపాత్రలు ఆరోగ్యపరంగా సురక్షితమైనవని వేడి, చల్లదనం సహజంగా నియంత్రించే లక్షణం మట్టిలో ఉందన్నారు.కుమ్మరి కళ జీవించే కుటుంబాల జీవనాధారమే మట్టని,కానీ మార్కెట్లో ప్లాస్టిక్ ఉత్పత్తులు చౌకగా రావడంతో కుమ్మరి వృత్తి కళ క్రమంగా నశిస్తోందన్నారు

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని కుమ్మరి కళాకారులను ప్రోత్సహించడం ద్వారా సహజమైన ఆరోగ్యకర జీవనశైలినిపర్యావరణ హితమైన భవిష్యత్తును పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో కాశీ విశ్వేశ్వరరావు డిసి హెచ్ఎస్ కార్తీక్, సాంఘిక సంక్షేమ శాఖ సాధికారత అధికారిని జ్యోతిలక్ష్మి దేవి అదనపు డిఎంహెచ్వో భరత లక్ష్మి కుమ్మరి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

**- కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ**




**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 3..** విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ పలు పథకాలను కూటమి ప్రభుత్వం రూపొందించ నుందని కాకినాడ గ్రామీణ శాసనసభ్యుడు పంతం నానాజీ అన్నారు . స్థానిక వలసపాకల భవిత పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని జరిగిన కార్యక్రమాని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టిన వెంటనే విభిన్న ప్రతిభావంతులకు నెలనెలా చెల్లించే పింఛనును 4 వేల రూపాయలు నుండి 6 వేల రూపాయలకు పెంచడం జరిగిందన్నారు. భవిత పాఠశాల విద్యార్థుల సౌలభ్యం కోసం తమ పంతం ఫౌండేషన్, తదేకం ఫౌండేషన్ ద్వారా సహకారం అందిస్తామన్నారు. సహృదయం తో స్వచ్ఛంద సంస్థలు కూడా విభిన్న ప్రతిభవంతులను ఆదుకోవడానికి ముందుకు రావాలని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యం లోని కూటమి ప్రభుత్వం విభిన్న ప్రతి భావంతులకు త్వరలోనే మరిన్ని కొత్త పింఛన్లు మంజూరు చేయనుందని నానాజీ తెలిపారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులకు నిర్వహించిన పోటీలలో విజేతలకు ఎమ్మెల్యే నానాజీ మెడల్స్ అందజేశారు. లయన్స్ క్లబ్ కాకినాడ జెమ్స్ బాల బాలికలకు లంచ్ బాక్సులను ఎమ్మెల్యే నానాజీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డి ఎల్ డి ఓ వాసుదేవరావు, ఎండిఓ పసుపులేటి సతీష్, ఎంఈఓలు శ్రీనివాస్ కుమార్, తుమ్మల రంగారావు, లయన్స్ క్లబ్ జెమ్స్ వ్యవస్థాపకులు లింగమల్లు కృష్ణమూర్తి, పాఠశాల ఫిజియోథెరపీ వైద్యురాలు మారుతి, ఉపాధ్యాయులు వై.వి లక్ష్మి, వీర గణేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనాలు




**కాకినాడ(మనసులో మాట) డిసెంబర్ 3:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) వందేళ్ళ వార్షిక వేడుకల పురస్కరించుకొని కాకినాడ నగరంలో ఉన్న 50 డివిజన్లతో పాటు రూరల్లో ఉన్న ఆరు డివిజన్లతో మొత్తం 56 హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కాకినాడ హిందు సమ్మేళన నిర్వహణ సమితి ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. దీనికి సంబంధించిన వివరాలను కాకినాడ నగర హిందూ సమ్మేళనం నిర్వహణ సమితి అధ్యక్షులు నారాయణ మురళి కాకినాడ నరసన్ననగర్లో ఉన్న వ్యాస భవనంలో బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు

ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ హిందూ ఆచారాలు పండగలు నిర్వహించి హిందూ మత విశిష్టతను పెంపొందిస్తామన్నారు. హిందువుల ఐక్యతను ఈ సమ్మేళనం ద్వారా తీసుకొస్తామని చెప్పారు. దేశ శ్రేయస్సు కోసం ఆర్ఎస్ఎస్ పనిచేస్తుందని పంచ పరివర్తన పేరుతో ఈ కార్యక్రమాలను ఈ నెల ఆఖరి వరకు నిర్వహిస్తామని మురళి చెప్పారు. నగర అధ్యక్షుడు టిఎస్వి ఆదిత్య శర్మ మాట్లాడుతూ హిందూ మతాన్ని కాపాడుకోవాలని ముఖ్య ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శర్మ చెప్పారు. ఈ సమావేశంలో ఆర్ఎస్ జిల్లా సంఘ్ చాలక్ సిహెచ్ విజయ ప్రకాష్, నగర కార్యవాహ వి బాలాజీ, ఆర్ఎస్ గోదావరి విభాగం సహ సంపర్క్ కే అప్పాజీ, రాష్ట్ర సంఘ చాలక్ వివి సుబ్బారావులతోపాటు సమితి అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజల పార్కులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించకండి

**కనీసం పార్కుల్నైనా మిగల్చండి**



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 3..** కాకినాడ జిల్లా కలెక్టర్ పార్కులను, ఉద్యానవనాలను కార్పొరేషన్ కు ఆదాయం పేరుతో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనే నిర్ణయానికి వ్యతిరేకంగా బుధవారం ఉదయం కాకినాడలో స్థానిక గాంధీనగర్ పార్కు వద్ద గాంధీ నగర్ పార్క్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పరస సురేష్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన ఆందోళనలు జరిగాయి. ప్రజల పార్కులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించోద్దని, పార్కు అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, నినాదాలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజల పార్కులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించకండి అని, ప్రజలకు ఆహ్లాదం కల్పించేందుకు పార్కుల అభివృద్ధి కొరకు ప్రభుత్వమే ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆయన అన్నారు. టెండర్లు పిలిచే విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని, ప్రజల పార్కులను ప్రభుత్వంలోనే కొనసాగించాలని, ఆనంద్ భారతి గ్రౌండ్, మెక్లోరిన్ గ్రౌండ్ తదితర ప్రాంతాల గ్రౌండ్ లను ప్రైవేట్ వ్యక్తులకు లీజుకి ఇచ్చి కార్పొరేషన్ కి ఆదాయం సమకూర్చు కోవాలని, ప్రభుత్వం పార్కులు ప్రైవేట్ వ్యక్తులుగా అప్పగించాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టామని ఆయన అన్నారు. అసోసియేషన్ సెక్రెటరీ ఆంజనేయులు మాట్లాడుతూ లక్షల కోట్ల రూపాయలతో టెండర్ పాడుకునే వ్యక్తి పార్కును తాను ఇష్టా సారాంశంగా మలుచుకుంటాడని, టెండర్ ఖర్చు చేసిన సొమ్మును తిరిగి ప్రజల వద్ద ముక్కు పిండి మరి వసూలు చేస్తారని, మొత్తం వచ్చేవరకు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తారని, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తున్న నిర్ణయాన్ని జిల్లా కలెక్టర్ వెనక్కి తీసుకోవాలని ఆయన అన్నారు. వైస్ ప్రెసిడెంట్ తోకల ప్రసాద్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ కోట్ల రూపాయల నిధులతో పబ్లిక్ పార్క్ అయినటువంటి లలిత కళా ప్రాంగణం కులాయి చేరు పార్కులో ఫ్యాబ్రిన్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపట్టడం జరిగిందని, నిర్మాణానికి అయిన ఖర్చు ప్రభుత్వ నిధులు, స్థలం పార్కు స్థలం, ప్రస్తుతం దానిని ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తున్నారని,కోట్లల్లో ప్రైవేటు వ్యక్తులు ఆదాయం పొందుతున్నారని, కార్పొరేషన్ ఆదాయం ఎంత వస్తుందో తెలియజేయాలని, పక్కనే స్కేటింగ్ ప్రభుత్వ నిధులతో ప్రభుత్వ స్థలం నిర్మించడం జరిగిందని,కార్పొరేషన్ కు ఎంత వస్తుందో తెలియజేయాలని, బాల భవన్ వద్దనున్న పార్కు స్థలంలో టెన్నిస్ కోర్ట్ పెట్టడం జరిగిందినీ కార్పొరేషన్ లో వస్తున్న ఆదాయంతో తెలియజేయాలని, పి.ఆర్ కాలేజీ రోడ్ ఇట్ ట్రీట్ ఫుడ్ గతంలో స్వప్నల్ దినకర్ పుండకర్ కమిషనర్ గారు కార్పొరేషన్ నిధులతో ఆర్భాటాలు, సదుపాయాలు ఏర్పాటు చేశారని, ఎవరు లబ్ధి పొందుతున్నారు, కార్పొరేషన్ కి ఆదాయం ఎంత వస్తుందో తెలియజేయాలని,కాకినాడలో ఉన్న కార్పొరేషన్ స్థలాల్లో కార్పొరేషన్ కి సంవత్సరం వచ్చే ఆదాయం పై జిల్లా కలెక్టర్ గారు శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన అన్నారు. పబ్లిక్ స్థలాల్లో , ప్రభుత్వ నిధులతో నిర్మాణాలు చేపడుతుంటే ఆదాయాలు మాత్రం ప్రైవేటు లబ్ధి లబ్ధిపొందిస్తున్నారన్న విషయాన్ని గుర్తించండి అని,కార్పొరేషన్ కి వచ్చే ఆదాయం కన్నా ప్రైవేటు వ్యక్తులకు వచ్చే ఆదాయం ఎక్కువగా ఉందని, అందుకే ప్రజల పార్కులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించొద్దు ప్రభుత్వంలోనే కొనసాగించాలి, లేదంటే ప్రజల ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు చేపడతామని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 మాసాలు గడుస్తున్న ఏ విధమైన అభివృద్ధి చెయ్యకపోగా ఉన్న పార్కులను ప్రైవేట్ వ్యక్తులుగా అప్పగించడం దుర్మార్గ చర్య అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ, శాస్త్రి, కృష్ణ, నాయుడు, ప్రసన్న, సత్యనారాయణ, శర్మ, ప్రసన్న కుమార్, రాంబాబు, అప్పారావు, తదితర వాకర్స్, సెటిల్ టీం, యోగా టీం, ఎక్సర్సైజ్ పాల్గొన్నారు.



## వెంకటనగరంలో వైసీపీ నాయకుడి

# కారు దగ్ధం చేసిన దుండగులు

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన చెల్లుబోయిన తనయుడు నరేన్
- బాధితుడు రమేష్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పిన చెల్లుబోయిన నరేన్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 3:** రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం వెంకటనగరం గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మోత రమేష్ కు సంబంధించిన 'ఐ20' కారును మంగళవారం అర్ధరాత్రి కొంత మంది దుండగులు పెట్రోల్ పోసి నిప్పు అంటించారు. ఈ ఘటనలో కారు పూర్తిగా ధ్వంసం అయింది. విషయం తెలుసుకున్న జిల్లా పార్టీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తూర్పు గోదావరి జిల్లా సూపరెంటెండెంట్ ఆఫ్ పోలీస్ డీ నరసింహ కిషోర్ కి పూర్తి సమాచారాన్ని ఫోన్ ద్వారా తెలియజేశారు. ఇప్పటి వరకు ఏ రోజూ కూడా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పరిధిలో ఇలాంటి ఘటనలు జరగలేదని, కొంతమంది ఆకతాయిలు కావాలనే చేస్తున్నారని దీని వల్ల ప్రశాంతంగా ఉండే పల్లెలు ఆగ్రహ జ్వాలలకు బలవుతున్నాయన్నారు. త్వరతగతిన విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని కోరారు. అనంతరం చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తనయుడు చెల్లుబోయిన నరేన్, పార్టీ నాయకులు కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రమేష్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ పార్టీ అన్ని విధాలుగా మీకు అండగా ఉంటుందని, ఆ ధైర్య పడవద్దని ఏ పరిస్థితుల్లోనైనా మేము మీ వెన్నంటే ఉంటామన్నారు. అవసరమైతే తాను, తన తండ్రి కూడా న్యాయం జరిగే వరకూ మీ వెంట ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆచంట కళ్యాణ్, సుందరపల్లి అనిల్, చాప రాజా, అప్పా పరిమళ కుమార్, ఓడూరి రాంకీ, కోల్లి వెంకటరత్నం, కల్లూరి చైతన్య, ఉండ్రాజవరపు సూర్య, నక్కా ధనరాజ్, అల్లంపల్లి శ్రీను, పంతం ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## నగరం స్వచ్ఛంగా ఉండేందుకు

# ప్రజలు భాగస్వాములు కావాలి

**- ఇన్‌చార్జ్ కమిషనర్ ఎస్వీవీ సత్యనారాయణ**



**కాకినాడ(మనసులో మాట), డిసెంబరు 3:** కాకినాడ నగరాన్ని సంపూర్ణ పారిశుధ్య నగరంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో ప్రజలు కూడా భాగస్వాములుగా మారాలని కాకినాడ నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎస్.వి.వి. సత్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని 12వ సర్కిల్ పరిధిలోని 43వ డివిజన్‌లో కమిషనర్ పర్యటించి పారిశుధ్య పనులను సమీక్షించారు. చెత్త సేకరణ, వీధుల పరిశుభ్రత, మురుగు నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. రోడ్డుపై చెత్త పారేయకుండా ప్రతి ఇంటి నుంచి తడి చెత్త %-% పొడి చెత్త వేర్వేరుగా అందించాలని ప్రజలకు సూచించి, పారిశుధ్య కార్మికులకు ఈ విషయంలో అవగాహన కల్పించారు. త్రాగునీటి సరఫరా సాంద్రతను పరిశీలించిన కమిషనర్, 43వ డివిజన్‌లో నివాసి రిటైర్డ్ ఉద్యోగి శర్మ ఇంటికి వెళ్లి కులాయి ద్వారా వస్తున్న నీటి నమూనాను తనిఖీ చేశారు. నీరు పూర్తిగా శుభ్రంగా అందడం లేదన్న స్థానికుల అభిప్రాయాలను స్వీకరించిన కమిషనర్ వెంటనే సంబంధిత అధికారులను చర్యలు తీసుకోమని ఆదేశించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కమిషనర్ ఎస్ వి వి సత్యనారాయణ మాట్లాడుతూ,కాకినాడ నగర ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించడమే మా ప్రధాన లక్ష్యం. త్రాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు కొనసాగుతున్నాయి. పరిశుభ్రమైన నగర నిర్మాణంలో ఉద్యోగులు, సిబ్బందితో పాటు ప్రజలు కూడా బాధ్యత వహించాలని తెలిపారు.ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ కే.టి. సుధాకర్, ప్రజా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. పృద్వి చరణ్, శానిటరీ ఇన్స్పెక్టర్ సత్తిబాబు, ఏఈ సుజయ్, 43వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ సన్నీకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాకు గురైన ప్రభుత్వ గ్రీన్ బెల్ట్ స్థలాన్ని

# స్వాధీనం చేసుకున్న కాకినాడ నగరపాలక సంస్థ

**- వేయ్యా గజాలు 4 కోట్ల రూపాయలు విలువ చేస్తుంది -**

**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 3..** కాకినాడ మున్సిపల్ కమిషనర్ ఎస్ వి వి సత్యనారాయణ ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ డి సి పి కృష్ణారావు ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది రామ్మో మోహన్ రావు తో పాటు ఇతర సిబ్బందితో కలిసి కాకినాడ తొమ్మిదోవార్డులో ఉన్నా పల్లంరాజు నగర్లో ఎల్ పి నెంబర్ 134/90, టీ ఎస్ నెంబర్ 130/2 cp కబ్జాకి గురైన1000 గజాల ప్రభుత్వ గ్రీన్ బెల్ట్ స్థలంలో ఉన్న అక్రమ కట్టడాలని టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించి బుధవారం స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు 4 కోట్లు ఉంటుంది అని అంచనా. టౌన్ ప్లానింగ్ సిబ్బంది పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

రాయలసీమ

కర్నూలు | అనంతపురం | చిత్తూరు | కడప

గురువారం 4 డిసెంబర్ 2025




# మదనపల్లి ది కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ శత జయంతి




పలమనేరు డిసెంబర్ 3 ( మనసులో మాట) :మదనపల్లి ది కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ శతజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బ్యాంకు ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అతిరథ మహారథులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ముఖ్యంగా పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పీలేరు శాసనసభ్యులు కిషోర్ కుమార్ రెడ్డి,పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్, మదనపల్లె శాసనసభ్యులు షాజహాన్ భాష, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పి కే ఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు సురేంద్ర యాదవ్ లతో పాటు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ళ విద్యాసాగర్ అతిథులను ఘనంగా ఆహ్వానించారు. అనంతరం మదనపల్లెలోని ఎన్వీఆర్ కన్వెన్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో మదనపల్లె టౌన్ బ్యాంక్ సేవలను వారు వివరించారు.



## దివ్యాంగులకు మెటీరియల్స్ పంపిణీ చేసిన డాక్టర్ నరసింహులు

**ధర్మవరం డిసెంబర్ 3 (మనసులో మాట)..** పట్టణంలోని సాయి భారతి సేవా సమితి మానసిక వికలాంగుల పాఠశాలలో"ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం" సందర్భంగా రిటైర్డ్ కంటి వైద్యాధికారి సంకారపు నర్సింలు దివ్యాంగ విద్యార్థులకు మెటీరియల్స్ ను పంపిణీ చేయడం జరిగిందని నిర్వాహకులు డాక్టర్ సత్య నిర్ధారణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ధర్మవరం స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించామని తెలిపారు. దివ్యాంగులకు క్లోజ్ చేయించడానికి మెటీరియల్స్ తో పాటు డ్రై ఫ్రూట్స్ ఇవ్వడం పట్ల డాక్టర్ నరసింహులు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ ఎదగలేని పిల్లల కోసం ఎదిగిన మనసత్వంతో వీరిని అక్కున చేర్చుకున్న ఉపాధ్యాయులకు నా తరఫున ధన్యవాదాలు తెలిపారు. స్వచ్ఛంద సేవా సంస్థలతో చర్చించి వీరికి అవసరమైన సహాయ సహకారాలను ప్రణాళికాబద్ధంగా అందజేస్తామని తెలిపారు. తదుపరి డాక్టర్ సత్య నిర్ధారణ దివ్యాంగుల కోసం ప్రత్యేకమైన గానం"ఎగిరిపోదామా.. పిప్పి అనే గేయాలను ఆలపించిన వైనం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం డాక్టర్ నరసింహులు పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ స్వాతి పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ కి అండగా ఉందాం దేశాన్ని కాపాడుకుందాం..

### కాంగ్రెస్ నాయకుడు తుంపర్తి పరమేష్



**ధర్మవరం డిసెంబర్ 3 (మనసులో మాట)..** రాహుల్ గాంధీకి అండగా ఉందాం దేశాన్ని కాపాడుకుందాం అని కాంగ్రెస్ నాయకుడు తుంపర్తి పరమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిపాలన చేతగాని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ డైవర్షన్ పాలిటిక్స్ కు తెరతీస్తున్నాడు అని, అందులో భాగమే హెరాల్డ్ విషయంలో సోనియా గాంధీ , రాహుల్ గాంధీ లకు ఈడీ నోటీసులు పంపడం,వ్యవస్థలను వాడడంలోను నాశనం చేయడంలోనూ బీజేపీ దిట్ట తెలిపారు. ఎందుకంటే గెలిచి దాదాపు 12సంవత్సరాలు అయినా చెప్పుకోవడానికి అభివృద్ధి లేక కేవలం ప్రజల పన్నులతో మితిమిరిన అప్పులతో దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేసి, ఆవిషయాలు ప్రజలకుతెలియకూడదని మతాల పేరిట, కులాల పేరిట, యుద్దాల పేరిట విష సంస్కృతిని రుద్దుతూన్నాడు అని వారు మండిపడ్డారు. విటన్నిటిని రాహుల్ గాంధీ నిలదీస్తున్నాడు అనే కారణంతోనే కొత్తగా అపద్దం చెప్పడానికి ఏమిలేక ఈడీ నోటీసుల డ్రామా మొదలు పెట్టడం జరిగిందన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో ఎదురు దాడిని తట్టుకోలేక సమాధానం చెప్పలేకపోయారన్నారు. బీజేపీ ప్రజలకు చేస్తున్న మోసం చేస్తున్న వైనంలో 2019-2024వరకు అంతర్జాతీయ మార్కెట్ లో ముడిచమురు ధరలు తగ్గినా మనకు పెట్రోల్, డిసల్ ఎందుకు రేటు పెరుగుతుంది అని, అధికంగా సెస్సు మరియు జీఎస్టీ పెరగడం వలన.వాటి ఆదాయం ఎక్కడ పోతోంది, చూద్దాం పెట్రోల్ పై ఆదాయపన్ను వలన ప్రభుత్వానికి 26.74లక్షలకోట్ల ఆదాయం వస్తోంది అని తెలిపారు. డిసల్ పై జీఎస్టీ ద్వార 31.25లక్షలకోట్ల ఆదాయం సమకూరింది అని తెలిపారు. మొత్తం 58లక్షలకోట్ల అదనపు ఆదాయం వచ్చింది అని, ఇందులో వారు ఖర్చులు చేసింది మాత్రం గత ప్రభుత్వంలో చేసిన పెట్రోల్ బాండ్లకు-1.03లక్షల కోట్లు, ఉచిత వ్యాక్సిన్ 36500కోట్లు, గరీబ్ అహర్ యోజన్ 4.6లక్షల కోట్లు మొత్తం 6లక్షల కోట్లు మరి మిగిలిన 52లక్షల కోట్లు ఏమైనాయి అని వారు ప్రశ్నించారు. ఇది బీజేపీ అసలు రంగు అని వారు స్పష్టం చేశారు.


## నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడుగా నాగరాజు



పలమనేరు డిసెంబర్ 4 ( మనసులో మాట): నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ (ఎన్ టి ఎఫ్) జాతీయ అధ్యక్షులు డాక్టర్ కుంభ రవి బాబు సహకారంతో రాష్ట్ర అధ్యక్షులు మానుపాటి నవీన్ ఆదేశాల మేరకు ఏపీ రాష్ట్రం చిత్తూరు జిల్లా పలమనేరు మున్సిపాలిటీ పాత పేటకు చెందిన వైసిపి కౌన్సిలర్ కావడి నాగరాజును చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా నియమించడం జరిగిందని ఎన్ టి ఎఫ్ కుటుంబ సభ్యులు అందరికీ తెలియజేస్తున్నట్లు కుంభ ఉదయ్ కుమార్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలియజేశారు. ఈ పదవి రావడానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

### ఆర్థికంగా అందరూ ఎదగాలి - ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి



**పలమనేరు డిసెంబర్ 3 ( మనసులో మాట):** పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయమని పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన స్వానిధి సంకల్ప అభియాన్ పథకము ద్వారా 966 మంది వీధి విక్రయ దారులకు రూ. 2.28 కోట్ల చెక్కును మరియు 9 మంది విభిన్న ప్రతిభ వంతులకు రూ. 66 వేల చెక్కును ఆయన పంపిణి చేశారు. ఈ సందర్భంగా వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులను సైతం ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... పేదలను ఆర్థికంగా అన్ని విధాలా ముందుకు తీసుకెళ్లాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను చేపడుతున్నదన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు ప్రభుత్వం కల్పిస్తోన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముందుకు రావాలని ఆయన కోరారు. ఇలా ఉండగా పేదలకు రుణాలను అందించి సహకరించిన పలువురు బ్యాంకర్లను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ రవిచంద్ర బాబు, మున్సిపల్ కమిషనర్ రమణా రెడ్డి,లీడ్ బ్యాంక్ మేనేజర్ హరీష్, పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, బాలాజీ కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ, మెప్మా సీఎంఎం బాబాలతో పాటు నాయకులు కుట్టీ, గిరి, నాగరాజు, ఖాజా, మదన్, బిఆర్సీ కుమార్, చాంద్ బాషా, నదీం, శ్రీనివాసులు, చిన్నీ, భాస్కర్ యాదవ్, సుధాకర్, లోకేష్, వెంకటరమణ,తదితరులు పాల్గొన్నారు.

## కోల్ జెట్ వాలీబాల్ టోర్నమెంటుకు విద్యార్థి సమీర్ భాష ఎంపిక



**పలమనేరు డిసెంబర్ 3( మనసులో మాట)..** ఎస్ వి యూనివర్సిటీ ఇంటర్ కోల్ జెట్ వాలీబాల్ టోర్నమెంట్ కు ఎస్ వి సి ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి సమీర్ భాష ఎన్నికయ్యారు. ఇతను నాలుగవ తారీకు నుండి ఎస్ వి యూనివర్సిటీ లో జరిగే క్యాంపుకు వెళుతున్నారు. క్యాంప్ అనంతరం జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ కాకినాడలో పదవ తారీఖు నుండి జరగబోయే స్టేట్ మీట్ లో ఎస్ వి యూనివర్సిటీ టీం తరపున పాస్టిపేట్ చేస్తున్నందుకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం వెంకటేశులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నందీశ్వరయ్య, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సుబ్బయ్య నాయుడు, ఫిజికల్ డైరెక్టర్ విక్రమ్ రాజ్, అధ్యాపకులు అభినందించారు.

## నేలకోట గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం



**ధర్మవరం డిసెంబర్ 3 (మనసులో మాట)..** మండల పరిధిలోని నేలకోట గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆశీస్సులతో, సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో బెంగళూరు వైట్‌ఫీల్డ్ వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించడం జరిగిందని మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు తెలిపారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరంలో మొత్తం 225 మందిమహిళలు 110 మంది, పురుషులు 115 మందిఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు అని తెలిపారు. ప్రముఖ నిపుణ వైద్యుల ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్, గుండె వ్యాధులు, రక్తపోటు, మధుమేహం, కీళ్ళు-ఎముకలు, కిడ్నీ, గ్యాస్ట్రో, న్యూరో సర్జరీ, ఇ.ఎన్.టి. తదితర విభాగాలకు చెందిన వైద్య సేవలు అందించడమే కాకుండా ఈసీజీ, ఎకో, బిపి, ఆర్ బి ఎస్ వంటి అనేక పరీక్షలు కూడా పూర్తిగా ఉచితంగా నిర్వహించబడ్డాయి అని తెలిపారు. ఆరోగ్యం ప్రతి కుటుంబానికి మౌలిక హక్కు. వైద్య సేవలు ఖరీదవుతున్న ఈ కాలంలో పేదవారు చికిత్స భారాన్ని తెగనే భరించలేక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని మార్చాలన్న సంకల్పంతో మంత్రి కృషి చేస్తున్నారన్నారు. కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను గ్రామాల్లోనే ఉచితంగా అందించడం, ఈ సంస్కృతి సేవా సమితి యొక్క ప్రత్యేకత అని అన్నారు. సంస్కృతి సేవా సమితి , వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎంతో సంయుక్తతతో పనిచేసి ప్రజలకు గొప్ప సేవ అందించారని వారు అభినందించారు. అలాగే, ఈ శిబిరంలో చికిత్స అవసరమయ్యే రోగులకు డా.ఎన్.టి.ఆర్. ఆరోగ్యసేవ , ఆయుష్మాన్ భారత్ పిఎన్జేవై పథకాల ద్వారా పూర్తిగా ఉచిత శస్త్రచికిత్సలు, వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ సాంబశివమ్మ, ఎం.ఎల్.హెచ్ పి పుష్పలత, ఏఎన్ఎం హేమలత, ఆశా వర్కర్లు, వైదేహి హాస్పిటల్ లోకేష్ భరణి బృందం, సచివాలయ సిబ్బంది, బీజేపీ మండల అధ్యక్షులు చంద్ర, నేలకోట రాము, ఏలుకుంట్ల లక్ష్మీనారాయణ, పోతుకుంట రాజు, దర్శనముల ధనుంజయ, అదెప్ప, భక్తవత్సలా నాయుడు, నడిమిగడపల్లి నరేష్, నాగరాజు పాల్గొన్నారు.

# పట్టణంలో పైప్‌లైన్ లీకేజీ

### - మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి రాగానే వెంటనే స్పందన



**ధర్మవరం డిసెంబర్ 3 (మనసులో మాట).** పట్టణంలో తుంపర్తి కాలనీ నీట్ పాయింట్ (పీటి-1615) వద్ద ఏర్పడిన తీవ్ర గుంట, పైప్ లీకేజీ సమస్యపై ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి వచ్చిన వెంటనే, మంత్రి అత్యంత ప్రాధాన్యతతో స్పందించారు. మంత్రి సంబంధిత మున్సిపల్, పంచాయతీ ఇంజనీరింగ్ అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ, ప్రజల ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం కలగకుండా వెంటనే సమస్యను పరిష్కరించాలని సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు, ఆయన నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు తక్షణమే సంఘటన స్థలానికి వెళ్లి పర్యవేక్షణ చేపట్టారు. అక్కడే మున్సిపల్ అధికారులు, టెక్నికల్ సిబ్బందితో కలిసి పైప్ లీకేజీని సరి చేయించి, గుంతను పూడ్చేందుకు తక్షణ చర్యలు చేపట్టడం జరిగింది. రహదారి పక్కన నివసిస్తున్న కుటుంబాలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా భద్రతా చర్యలు చేపట్టడం వంటి పనులను వెంటనే ప్రారంభించారు. ప్రజలకు ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన పర్యవేక్షణ ఉండాలని తెలిపారు.

## ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాలను ఉపముఖ్యమంత్రి పవన్ సమానంగా చూస్తారు

### - జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి



**ధర్మవరం డిసెంబర్ 3 మనసులో మాట..** ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను సమానంగా చూస్తారని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది తెలంగాణ నాయకులు కోనసీమ గూర్చి అసభ్యంగా మాట్లాడడం అనేది అవాస్తవమని, పూర్తిగా తెలుసుకొని మాట్లాడాలని తెలిపారు. ఓనసీమ పచ్చదనం గూర్చి వారు వివరించారే తప్ప తెలంగాణ ప్రజలను కించపరిచే విధంగా మాట్లాడలేదని వారు స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాలు అభివృద్ధి చెందాల అన్నదే పవన్ లక్ష్యం అని తెలిపారు.. అంతేగాకుండా పనిగట్టుకొని బురద జల్లడం ఇకనైనా రాజకీయ నాయకులు మానుకోవాలని వారితో పలికారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్లో పేర్ని నాని లాంటివారు పవన్ కళ్యాణ్ పై అనవసరమైన విమర్శలు చేయడం మానుకోవాలని, ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రజలు 11 సీట్లకే పరిమితం చేయడం మరిచిపోయారా, వచ్చే ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి పార్టీ దాఖలాలు ఉండవని వారు తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చి ఏపీలో ఎన్నో అభివృద్ధి పనులను నిర్వహించడం జరిగిందని, ప్రతిపక్షాలు అభివృద్ధిని ఓర్వలేకనే విమర్శలు చేయడం, బురద జల్లడం ఇకనైనా మానుకోవాలని తెలిపారు.



## ఎమ్మెల్యే చేతుల మీదుగా ఘనంగా జల హారతి

- దశాబ్దాల తర్వాత నిండిన హంద్రీనీవా జలాలతో బైరెడ్డిపల్లి చెరువు
- పండుగ వాతావరణంలో సంభరాలు చేసుకున్న గ్రామస్థులు
- నియోజకవర్గంలోని అన్ని చెరువులను నీటితో నింపుతామన్న ఎమ్మెల్యే

**పలమనేరు డిసెంబర్ 3( మనసులో మాట)..** పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి చేతుల మీదుగా బైరెడ్డిపల్లి చెరువుకు ఘనంగా జలహారతి కార్యక్రమం బుధవారం సాయంత్రం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం హంద్రీ నీవా జలాలను మళ్లించి చెరువు నిండి రెండ్రోజులుగా మొరవ పారుతోంది. దీంతో దశాబ్దాల అనంతరం బైరెడ్డిపల్లి పెద్ద చెరువు జలకళను సంతరించుకోవడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జల హారతి మరియు తెప్పోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. అనంతరం తెప్పోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంగించారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను హంద్రీనీవా జలాలతో నింపడం జరుగుతుందన్నారు. జనవరిలో నూతన కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టబోతున్నారని ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీటిని అందించడం జరుగుతుందని వివరించారు. గత ప్రభుత్వం గేట్లు పెట్టి స్టంట్ లు చూపించి ప్రజలను మభ్యపెట్టిందని అయితే ఇచ్చిన మాటకు కట్టుబడి నేడు కృష్ణా జలాలను కుప్పం దాక తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో పలమనేరు ఏఎంసి చైర్మన్ రాజన్న, మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి, యువత అధ్యక్షులు భువనచంద్ర గౌడ్ లతో పాటు ప్రజా ప్రతినిధులు పిఎసిఎస్ చైర్మన్లు పలువురు నాయకులు , కార్యకర్తలతో పాటు హంద్రీనీవా ప్రాజెక్టు మరియు ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పట్టణ వాలంటీర్లకు శిక్షణ

### - మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణ




**ధర్మవరం డిసెంబర్ 3 (మనసులో మాట)..** పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో పట్టణ వాలంటీర్ల టీచర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.. ఈ సందర్భంగా వారు పలు విషయాలను తెలియజేశారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓ గోపాల్ నాయక్, టిపిఆర్ఓ విజయభాస్కర్, వయోజన విద్య పర్యవేక్షికులు సి ఓ లు పాల్గొన్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ మెప్మా వారు నిర్వహించే ప్రతి సమావేశంలో "ఉల్లాస్ అక్షర ఆంధ్ర"అంశాన్ని అజెండాలో మొదటి పాయింట్ గా ఉంచాలని సి ఓ లకు ఆర్పీలకు సూచించారు. నోడల్ ఆఫీసర్ జనార్ధన్ గౌడ్ మాట్లాడుతూ పట్టణములో ఈ సంవత్సరంలో 7860 మంది నిరక్షరాశులను గుర్తించడం జరిగిందని, మెప్మా వారి సహకారంతో ఫిబ్రవరి 2026 వరకు తరగతులు నిర్వహించి అనంతరం మార్చి 2026లో పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారిని అక్షర రాశులుగా గుర్తించి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. పర్యవేక్షకులు ఉషారాణి మాట్లాడుతూ కేంద్రాల నిర్వహణ విధానం వయోజనులకు బోధించే పద్ధతుల వంటి అంశాలపై వారి శిక్షణ ఇచ్చారు. జీవోలు అందరూ మాట్లాడుతూ వాలంటీర్ల సహకారంతో నిరక్షరాస్యులు అయిన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చి దిద్దుతూ అక్షరాస్యతలో అగ్రస్థానంలో ధర్మారం ఉండాలని వారు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఓలు, ఆర్పీలు, అకౌంటెంట్లు ,అక్షర ఆంధ్ర వాలంటీర్లు పాల్గొన్నారు.

## వైకల్యం ఒక స్థితి మాత్రమే అడ్డంకి కాదు అని తెలిపిన అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎల్. భాస్కర్



పలమనేరు డిసెంబర్3 (మనసులో మాట) :గంగవరం మండలం జడ్పీ హైస్కూల్ నందుగల భవిత భవనం నందు ప్రతిభావంతులకు పలమనేరు మండల న్యాయ సేవా అధికార సేవా సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ న్యాయమూర్తి వావిలి ఆదినారాయణఆదేశాలు మేరకు న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సమావేశంలో పలమనేరు అడ్వకేట్స్ బార్ సోసియేషన్ ప్రెసిడెంట్ ఎల్. భాస్కర్ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ.... వైకల్యం అనేది శరీరానికి మాత్రమే మనసుకు కాదు అని తెలిపారు. అలాగే వారిపై జాలిచూపడం,లోపా న్ని ఎత్తి చూపడం, హేళన చేయడం మానవత్వం కాదని తెలిపారు. మనకు వీలైతే వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి అందరిలో ఒకరిగా బ్రతకనిద్దామని తెలిపారు. వైకల్యం అనేది ఒక స్థితి మాత్రమే అడ్డంకి కాదు అని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ షేక్ షరీఫ్, గంగవరం మండల విద్యాశాఖ అధికారి వేణుగోపాల్ రెడ్డి, హై స్కూల్ హెచ్.ఎం. చెంగల్ రెడ్డి, ఇంచార్జ్ ఎంపీడీవో ప్రసాద్, రిటైర్డ్ ఆర్మీ వెంకటస్వామి, ఐఆర్టీలు సురేఖ,త్రిలోక్, కోర్టు సిబ్బంది. ఉపాధ్యాయులు, తదితరులుపాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

తెలంగాణ

| హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ |
|---|---|---|---|---|
| నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం |

గురువారం 4 డిసెంబర్ 2025



# కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో బాంబు కలకలం

- బాంబు సంచిని నోట కరిచిన కుక్క మృతి



**భద్రాద్రికొత్తగూడెం, డిసెంబర్ 3 (మనసులో మాట):**

కొత్తగూడెం రైల్వేస్టేషన్‌లో బాంబు పేలుడు కలకలం సృష్టించింది. గురువారం ఉదయం ఆగంతకుడు స్థానిక రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్ ఫారంపై నల్ల సంచి ఉంచి వెళ్లిపోయాడు. అందులో ఏముందో ఎవరు పట్టించుకోలేదు. ఆ సంచిని వీధి కుక్క రైల్వే ట్రాక్‌పైకి నోటితో లాక్కెళ్లింది. ఆ సంచిలో ఉల్లిగడ్డ ఆకారంలో ఉన్న బాం బును కుక్క కొరికింది. దీంతో భారీ శబ్దంతో బాంబు పేలుడు సంభవించింది. కుక్క అక్కడికక్కడే మృతి చెందింది. ఈ బాంబు పేలుడుతో రైల్వే స్టేషన్‌లోని ప్రయాణికులు పరుగులు తీశారు. స్థానికుల సమాచారంతో కొత్తగూడెం 3వ పట్టణ పోలీసులు రంగంలోకి దిగారు. కేసు దర్యాప్తు చేపట్టారు. ఇంకా ఏమైనా బాంబులు ఉన్నాయా అంటూ పోలీస్ జాగిలాలతో రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు. రైల్వే స్టేషన్‌లో ఆగంతకుడు ఎటువైపు నుంచి వచ్చాడు. ఎటువెళ్లాడనే కోణంలో పోలీసులు పరిశీలిస్తున్నారు.



# తెలంగాణ రైజింగ్‌కు మోడీకి ఆహ్వానం

- రాజ్‌నాథ్ సహా పలువురు కేంద్రమంత్రులకు ఇన్విటేషన్
- భట్టితో కలసి ఆహ్వానించిన రేవంత్
- దేవుళ్లపై వ్యాఖ్యలను వక్రీకరించారని ఆగ్రహం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 3 (మనసులో మాట):**

దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలసి ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'కు ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రధాని మోదీకి సీఎం విజ్ఞప్తి చేశారు. తులంగాణ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్–బెంగళూరు–చెన్నై బుల్లెట్ రైలు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ విస్తరణకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ ప్రాజెక్టుకు అనుమతులు, నిధులు ఇవ్వాలని అభ్యర్థించారు. పలువురు కేంద్ర మంత్రులతో పాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలను కలిసిన సీఎం సమ్మిట్‌కు ఆహ్వానించారు. కాగా, మంగళవారం రాత్రి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను సీఎం రేవంత్‌రెడ్డి కలిసి గ్లోబల్ సమిట్‌కు రావాలని కోరారు. తరవాత సిఎం రేవంత్ మీడియాతో చిట్‌చాట్‌లో ..తెలంగాణలో పదేళ్లు తన నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హిందూ సమాజంలాంటిదే కాంగ్రెస్ అని డీసీసీ అధ్యక్షులకు చెప్పానని సిఎం వివరించారు. పార్టీ నేతగా ఎలా పనిచేయాలనేది వివరించే క్రమంలో చెప్పానన్నారు. జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోవడంతో భాజపా దీన్ని వివాదం చేస్తోందని మండిపడ్డారు. పార్టీలో అంతర్గతంగా మాట్లాడిన వ్యాఖ్యలను ఎడిట్ చేసి ప్రచారం చేస్తున్నారని విపక్షాలపై మండిపడ్డారు. ఉత్తర భారతంలోనూ తనను పాపులర్ చేస్తున్నందుకు సంతోషమని వ్యాఖ్యానించారు. తాను కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా మాట్లాడిన విషయాల్లో ముందు వెనక కట్ చేసి కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లు తెలంగాణలో తన నేతృత్వంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని స్పష్టం చేశారు. హిందూ దేవుళు,, హిందూ సమాజం లాంటిదే కాంగ్రెస్ అని కొత్తగా ఎన్నికైన తమ పార్టీ జిల్లా అధ్యక్షులకు చెప్పినట్లు వివరించారు. సమావేశంలో పార్టీ నాయకుడిగా ఎలా పనిచేయాలో తాను చెప్పినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ డిపాజిట్ కోల్పోవడంతో ఈ విషయాన్ని పెద్దదిగా చేసి వివాదాస్పదం చేస్తోందని ధ్వజమెత్తారు. హిందూ దేవుళ్లు మూడు కోట్ల మంది ఉన్నారని? పలు సారూప్యతలు కలిగిన దేవుళ్లు ఉన్నారని తాను చెప్పానని అన్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ కూడా హిందూ సమాజం లాంటిదేనని అని పోలుస్తూ తాను వ్యాఖ్యానించానని స్పష్టత ఇచ్చారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులకు పలు కీలక అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారంపిసిసి సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో సీఎం మాట్లాడిన మాటలను కొంతమంది సోషల్ మీడియాలో వక్రీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి క్లారిటీ ఇచ్చారు. తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని ప్రధాని మోడీని కోరాను.. మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్ రాష్ట్ర అభివృద్ధికి నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ సహకరించారని తెలిపాం.. అలాగే, రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై ప్రధాని మోడీకి పలు వినతులు చేశాం.. ఆర్ఆర్ఆర్ సౌత్ ప్రాజెక్టుకు అనుమతులు, నిధులు ఇవ్వాలని ప్రధాన మంత్రిని కోరామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇక, డిసెంబర్ 8, 9న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అశ్విని వైష్ణవ్, మనోహర్ లాల్ ఖట్టర్, సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆహ్వానించారు. అలాగే, భవిష్యత్తులో తెలంగాణ అభివృద్ధి, ఆదాయ వృద్ధి లక్ష్యంగా రూపొందించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ గురించి వివరించిన ఆహ్వాన పత్రికను వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందజేశారు.

# ఇప్పటికే 60వేల ఉద్యోగాలు..
# త్వరలో మరో 40 వేలు

> పనిచేసే వాడిని, మంచోడిని గ్రామ సర్పంచ్ గా ఎన్నుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. వీలైనంత వరకు సర్పంచ్ లను ఏకగ్రీవం చేసుకోవాలని సూచించారు. పొంకనాలు కొట్టే వాడిని సర్పంచ్ గా ఎన్నుకోవద్దని చెప్పారు.

### ఉద్యమ జ్వాలలకు కరీంనగర్ కేంద్రం

- ఎట్టి పరిస్థితుల్లోనూ గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- బిఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం ఏమయ్యిందో చూశాం
- రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం
- సమర్థులనే సర్పంచ్‌లుగా ఎన్నుకోండి
- హుస్నాబాద్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి



**సిద్దిపేట, డిసెంబర్ 3 (మనసులో మాట):**

రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. తమ ప్రభుత్వంలో ఇప్పటికే 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని.. త్వరలో మరో 40 వేల ఉద్యోగాలు ఇస్తా మని స్పష్టం చేశారు. రెండున్నరేళ్ల పాలన పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. బుధవారం హుస్నా బాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.262.68 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించా రు. ఇచ్చిన హామీ మేరకు త్వరలో మరో 40వేల ఉద్యోగాల భర్తీ చేస్తామని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. శ్రీకాంతా చారి స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 60వేల ఉద్యోగాలు ఇచ్చాం. ప్రజాపాలన రెండున్నరేళ్లు పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తాం అన్నారు. పనిచేసే వాడిని, మంచోడిని గ్రామ సర్పంచ్ గా ఎన్నుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. వీలైనంత వరకు సర్పంచ్‌లను ఏకగ్రీవం చేసుకోవాలని సూచించారు. పొంకనాలు కొట్టే వాడిని సర్పంచ్ గా ఎన్నుకోవద్దని చెప్పారు. ఎడ్యుకేషన్,ఇరిగేషన్ పై మా ప్రభుత్వం దృష్టి పెట్టింది. నెహ్రూ స్ఫూర్తితోనే మేం ముందుకెళ్తున్నాం. లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయ్యింది. ఆనాడు ఎస్ఆర్ఎస్పీని నెహ్రూ కడితే ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ఆనాడు కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులే దేశానికి సేవలు అందిస్తున్నాయి. రూ.2 లక్షల రుణామాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం మాదే. వ్యవసాయం దండగ కాదు..పండగ చేసి నిరూపించాం. లక్షా4 వేల కోట్లు రైతుల కోసం మా ప్రభుత్వం ఖర్చు చేసింది. మహిళలకు ఫ్రీ బస్సులే కాదు..బస్సు ఓనర్లను చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లను ఆడబిడ్డలకు అప్పగించాం. అడిగిన ప్రతీ పేద ఇంటికి రేషన్ కార్డు ఇచ్చాం. ఆనాడు దొడ్డు బియ్యం ఇస్తే పశువులకు దాణ పెట్టేవాళ్లు. మా ప్రభుత్వం వచ్చాక సన్నబియ్యం ఇస్తున్నాం. ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లునిర్మిస్తున్నాం. హుస్నాబాద్ లో దేవుళ్లేమైనా పాలించారా?. హుస్నాబాద్లో గౌరెల్లి రిజర్వాయర్ ఎందుకు పూర్తి కాలేదు. పదేండ్లు హుస్నాబాద్ నిర్లక్ష్యానికి గురైంది. గౌరెల్లి రిజర్వాయర్లు పూర్తి చేసే భాద్యత నాది. ఆనాడు సిద్దిపేట,సిరిసిల్ల ,గజ్వేల్ నియోజకవర్గాలే అభివృద్ధి అయ్యాయి. ఐటీఐ కాలేజీలన్నింటిని ఏటీసీలుగా మార్చాం. ఏటీసీలో చేరే ప్రతి విద్యార్థికి నెలనెలా రూ.2వేలు ఇస్తున్నాం. అని రేవంత్ అన్నారు.సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ హుస్నాబాద్ నుంచే.. బహుజనులు దండు కట్టి ఉద్యమించారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం ఇక్కడి నుంచే ఉవ్వెత్తున ఎగసిపడిందని గుర్తుచేశారు. 2004లో కరీంనగర్ గడ్డ నుంచే తెలంగాణ ఇస్తానని ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ మాట ఇచ్చి నిలబెట్టుకున్నారని చెప్పుకొచ్చారు. 2014లో స్వరాష్ట్ర ఆకాంక్షను సోనియాగాంధీ నెరవేర్చారని వ్యాఖ్యానించారు. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తున్నామని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో నిధులు ఎక్కువగా ఇచ్చారని.. మిగిలిన ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. హుస్నాబాద్‌కు పదేళ్లు నిధులెందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు ఎన్ని నిధులైనా ఇచ్చి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో లాగా హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చేయబోనని చెప్పుకొచ్చారు. గత పదేళ్లలో ఎవ్వరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా అలసత్వం ప్రదర్శించారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఎస్ఆర్ఎస్పీ ఎలా ఉందో?.. బిఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం ఎలా ఉందో ప్రజలు ఆలోచించాలి. దేశంలో అత్యధికంగా వరిని పండించేది మన రాష్ట్రంలోనే. వ్యవసాయం అంటే దండగ కాదు.. పండగ అని చేసి చూపించింది మన ప్రభుత్వమే. రాష్ట్రంలో రైతుల కోసం రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు పెట్టాం. రాష్ట్రంలో వందలాది బస్సులకు ఆడబిడ్డలు యజమానులు అయ్యారు. 3.10 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. రూ.22,500 కోట్లు పేదల ఇళ్ల కోసం ఖర్చు చేస్తున్నాం. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో మొదలు పెట్టిన ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యాయి. కానీ, హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరెల్లి ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదు. గత పాలకుల మాదిరిగా హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చెయ్యం. త్వరలో గౌరెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తాం అని సీఎం ప్రకటించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో రూ. 262.78 కోట్లతో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ. 44.12 కోట్లతో హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 45.15 కోట్లతో హుస్నాబాద్‌లో ం÷అ ఏర్పాటుతో పాటు రూ. 20 కోట్లతో హుస్నాబాద్ మునిసిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే, రూ. 8.60 కోట్లతో ఖిం యూనిట్ ఆఫీస్ కు శంకుస్థాపన చేశారు. ఇక, రూ. 86 కోట్లతో హుస్నాబాద్ అర్బన్– కొత్తపల్లి ప్యాకేజీ–1లో భాగంగా 4 లైన్ల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేయగా.. రూ. 58.91 కోట్లతో హుస్నాబాద్– అక్కన్నపేట నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, శ్రీధర్‌బాబు తదితరులు సభలో పాల్గొన్నారు..



# భూదార్ కార్డులపై ప్రభుత్వం కీలక నిర్ణయం

- భూ భారతిని సమగ్రంగా తయారు చేశాం
- ప్రజలు మెచ్చే విధంగా భూభారతి చట్టం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి వెల్లడి

**హైదరాబాద్,డిసెంబర్ 3 (మనసులో మాట):**

భూదార్ కార్డులపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసు కుంది. భూ భారతిలో నియమ నిబంధనలు కఠినతరం చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి చిన్న విషయానికి కోర్టుకు వెళ్లకుండా భూ భారతిని సమగ్రంగా తయారు చేశామన్నారు. 9 లక్షల ఫిర్యాదుల్లో న్యాయపర మైనవి పరిష్కరించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధరణిలోని ఉన్న అనేక సీక్రెట్ లాకర్లు ఓపెన్ చేశామని తెలిపారు. భూభారతిలో చెప్పిన విధంగా భూధార్ కార్డులు సిద్ధం చేశామని, స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత వాటి ని పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియా తో మాట్లాడి ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. భూదార్ కార్డులు సిద్ధం చేశామని.. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత అందజేస్తామని చెప్పుకొచ్చారు. రెండో విడతలో 373 నక్షలేని గ్రామాల్లో సర్వే చేస్తామని..ఎన్నికల తర్వాత భూదార్ కార్డులు అందజేస్తామని తెలిపారు. రెండేళ్ల ప్రజా పాలనలో కేసీఆర్ హయాంలో తీసుకువచ్చిన ధరణిని బంగాళాఖాతంలో వేశామని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధరణిలో ఉన్న అనేక సీక్రెట్ లాకర్లు ఓపెన్ చేశామన్నారు. భూభారతిలో చెప్పిన విధంగా భూధార్ కార్డులు సిద్ధంగా ఉన్నాయన్నారు. భూభారతి చట్టంతో రైతులందరికీ మేలు జరుగుతుందన్నారు. ధరణిని బీఆర్ఎస్ సర్కార్ విదేశీ సంస్థకు అప్పగించిందని చెప్పారు. కాంగ్రెస్ పవర్లోకి వచ్చాక భూ భారతిని కేంద్ర సంస్థకు అప్పగించామన్నారు. భయంకరమైన ధరణి వెబ్ సైట్ ను బంగాళాఖాతంలో పడేశామన్నారు. స్థానిక ఎన్నికల తర్వాత నక్షలేని గ్రామాల్లో సర్వేలు చేసి భూధార్ కార్డులిస్తామని తెలిపారు. ధరణి వెబ్ సైట్ తో బీఆర్ఎస్ రెవెన్యూ వ్యవస్థను కుప్పకూల్చిందన్నారు.ప్రజలు మెచ్చే భూ భారతి చట్టాన్నితమ ప్రభుత్వంలో తీసుకువచ్చామని పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద నక్షలేని 5గ్రామాల్లో భూ సర్వే పూర్తి చేశామని వివరించారు. ఇవాళ(బుధవారం) తెలంగాణ సచివాలయంలో మీడియాతో మంత్రి పొంగులేటి మాట్లాడారు. 6వేల మంది వీఆర్ఏలను నియమించామని తెలిపారు. 490మంది సర్వేయర్లకు లైసెన్సులు ఇచ్చామని చెప్పుకొచ్చారు. ఒక్కో రెవెన్యూ గ్రామానికి సర్వేయర్లను అలాట్ చేశామని తెలిపారు. రోవర్స్ కొనుగోలు చేసి సర్వేయర్లకు అప్పగిస్తున్నామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా కుప్ప కూల్చారని..తమ ప్రభుత్వం సరిచేస్తున్నామని వివరించారు. 59 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులను అధునాతనంగా నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

# ఆటోలో ఇద్దరి మృతదేహాలు




**హైదరాబాద్, డిసెంబర్ 3 (మనసులో మాట):**

నగరంలోని చాంద్రాయణగుట్టలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మృతిచెందడం కలకలం రేపింది. రోమన్ హోటల్ ఎదురుగా ఉన్న ఓ ఆటోలో ఇద్దరి మృతదేహాలను స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతులను జహంగీర్ (24), ఇర్ఫాన్ (25)గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అధిక మోతాదులో డ్రగ్స్ తీసుకోవడంతోనే వారు మృతిచెందినట్లు భావిస్తున్నారు. ఘటనాస్థలంలో క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించింది. అక్కడ మూడు సిరంజీలు లభ్యమయ్యాయి. మరో వ్యక్తి పరారైనట్లు సమాచారం. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. ఘటనా స్థలంలో క్లూస్ టీమ్ సాయం తో ఆధారాలు సేకరించారు. అక్కడ మూడు సిరంజీలు లభించాయి. దీంతో అధిక మోతాదులోడ్రగ్స్ తీసుకోవడంతోనే వారు చనిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

# పవన్ వ్యాఖ్యలు తెలంగాణకు వ్యతిరేకం

- తెలంగాణకు ఏనాడూ మద్దతు ఇవ్వని పవన్
- మండిపడ్డ జాగృతి అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్, డిసెంబర్ 3:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్రంగా స్పందించారు. ఎల్బీనగర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ఆమె, పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు తెలంగాణకు వ్యతిరేకంగా ఉన్నాయని విమర్శించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తమ బిడ్డలు ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేసిన కవిత, పవన్ కళ్యాణ్ మాత్రం ఆనాటి నుంచి ఇనాటి వరకు తెలంగాణకు వ్యతిరేకంగానే ఉన్నారని మండిపడ్డారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ నాయకుల దిష్టి కళ్లతో కోనసీమ పాడైందని అనడంపై కవిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు ఏనాడూ దిష్టి పెట్టలేదు. కోనసీమ మాదిరిగా తెలంగాణ కావాలనుకున్నాం. తెలంగాణ బిడ్డల మనసు చాలా గొప్పది, మేము పెద్దగా ఆలోచిస్తాం అని ఆమె అన్నారు. తమ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు అవుతున్నా, ఎప్పుడు కూడా జై తెలంగాణ, జై ఆంధ్రా అనే తాము కోరుకున్నామని, తెలంగాణ ఎంత బాగుందో ఆంధ్రా కూడా అంతే బాగుండాలని ఆకాంక్షించామని ఆమె స్పష్టం చేశారు. ఆంధ్రకు ప్రత్యేక హోదా ఇవ్వాలని నేను పార్లమెంట్‌లో కూడా మాట్లాడాను. పక్కోడు బాగుంటే మా కళ్లు మండవు. పక్కోనిది గుంజుకోవాలనుకునే వాళ్లం కాదు. మేము బాగుండాలని కోరుకుంటాం కానీ, పక్కోడు చెడిపోవాలని అనుకోం. అలా అనుకొని ఉంటే తెలంగాణ ఉద్యమ స్వరూపం వేరేలా ఉండేది. మా బిడ్డలు ప్రాణాలు త్యాగం చేశారే తప్ప, ఒక్క పరాయి రాష్ట్రం వారి మీద కూడా చేయి ఎత్తలేదని కవిత వివరించారు. ఆనాడు సినిమా నటుడిగా మాట్లాడారు కానీ, ఇప్పుడు పవన్ కళ్యాణ్ ఏపీ డిప్యూటీ సీఎం అని, ఆయన మాటలు ఆంధ్రా ప్రజలకు ఆపాదిస్తారని కవిత హెచ్చరించారు. కనుక పవన్ కళ్యాణ్ జాగ్రత్తగా ఆలోచన చేసి మాట్లాడాలని ఆమె సూచించారు.



## రాహుల్‌ను విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు

**మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి**

**హైదరాబాద్, డిసెంబర్ 3:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి బిఆర్ఎస్ నేత కేటీఆర్‌కు లేదని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీది త్యాగాల కుటుంబమన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ కుటుంబం రాజకీయం చేసిందని విమర్శించారు. రాహుల్ గాంధీని ప్రశ్నించే హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. విలువలు లేని రాజకీయాలు మంచిది కాదు. కేటీఆర్‌కు నైతిక విలువలు ఉంటే రాహుల్ గాంధీ గురించి ఇంకోసారి మాట్లాడొద్దు. కాంగ్రెస్ జాతీయ పార్టీ.. భారత రాష్ట్ర సమితి ప్రాంతీయ పార్టీ. కేటీఆర్.. ఇక్కడ రాజకీయం చేయి.. సీఎం, పీసీసీ చీఫ్, మేమంతా సిద్ధం. రాహుల్ గాంధీని విమర్శిస్తే విడిచిపెట్టనని జగ్గారెడ్డి అన్నారు.

## రియల్ వ్యాపారులకు అనుకూలంగా హిల్ట్ పాలసీ

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు**



**న్యూఢిల్లీ,డిసెంబర్3 :** క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండానే తెలంగాణ ప్రభుత్వం 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్' హిల్ట్ పాలసీని తీసుకొచ్చిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలంగా హిల్ట్ పాలసీ ఉందని ఆరోపించారు. దిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. పారిశ్రామికవాడలో పనిచేస్తున్న వారితో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు సహకారం అందించకుండా పారిశ్రామిక వేత్తలకు లబ్ధి చేకూరుస్తోందని విమర్శించారు. పారిశ్రామికవేత్తలకు ఒక విధానం.. రైతులకు ఒక విధానమా? అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. పారిశ్రామిక వేత్తలకు లబ్ధి చేకూర్చేలా అవినీతి జీవోను తెచ్చారన్నారు. హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని వేల ఎకరాల్లో కమర్షియల్ కాంప్లెక్స్‌లకు అనుమతిస్తే ట్రాఫిక్ పరిస్థితి ఏంటని నిలదీశారు.

## ఓయూలో పాడైన అన్నం

**విద్యార్థుల ఆందోళన కనువిప్పు కావాలి**

**సిఎం రేవంత్‌పై హరీష్ రావు విమర్శలు**



**హైదరాబాద్, డిసెంబర్ 3:** మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపంగి నూనె అన్నట్లుగా రేవంత్ పాలన తీరు ఉందని సిద్దిపేట ఎమ్మెల్యే,బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఓయూ లా కాలేజీ మెస్‌లో పాడైపోయిన అన్నం పెడుతున్నారని విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేయడం కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ దుస్థితికి అద్దం పడుతోందని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి వేయి కోట్లు ఇస్తానని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి గారు.. కనీసం విద్యార్థులకు ఒక పూట మంచి భోజనం పెట్టలేక పోవడం సిగ్గుచేటు అని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనంలో గొడ్డుకారం, గురుకులాల్లో పురుగుల అన్నం, ఇప్పుడు యూనివర్సిటీల్లో పాడైపోయిన భోజనం.. ఇదేనా కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో సాధించిన ఘనత అని నిలదీశారు. అడుగడుగునా యూనివర్సిటీ పర్యవేక్షణలో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. రేవంత్ రెడ్డి గారూ.. మీ చేతగానితనంతో విద్యార్థుల భవిష్యత్తును, ఆరోగ్యాన్ని ఆగం చేయకండి అని హరీశ్‌రావు హితవుపలికారు. ఇప్పటికైనా ప్రగల్భాలు మాని.. విద్యార్థులకు కడుపునిండా మంచి భోజనం పెట్టండని సూచించారు.

## మెడికల్ కాలేజీలో ర్యాగింగ్

**విద్యార్థుల మధ్య పరస్పరం గొడవ**

**సంగారెడ్డి,డిసెంబరు 3:** సంగారెడ్డి గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం రేపింది. ఫస్ట్ ఇయర్ స్టూడెంట్ ని సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేశారు. ఎందుకు ర్యాగింగ్ చేస్తున్నారంటూ సీనియర్స్ పై విద్యార్థి సోదరుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆగ్రహంతో శాంతినగర్ లోని విద్యార్థి ఇంటికి వెళ్లి మరి సీనియర్స్ దాడి చేశారు. దీంతో సీనియర్లు, జూనియర్ల మధ్య గొడవ జరిగింది. ఒకరినొకరు కొట్టుకున్నారు. ఈ గ్యాంగ్ వార్ లో ఓ విద్యార్థికి చేయి విరిగగా, మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. అయితే, ఈ గొడవపై పోలీసులకు కాలనీ వాసులు సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన సంఘటన ప్రదేశానికి చేరుకున్న పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఈ ఘర్షణకు కారణమైన వారిని పట్టుకుని సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్లారు. ఇక, సంగారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్‌ను నిరోధించడానికి కాలేజీ యాజమాన్యం యాంటీ-ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీతో పాటు పోలీసులు కూడా ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించాలని తెలిపారు.

## కోతులను పారదోలే వారే ఓట్లకోసం రండి

**రేగొండ గ్రామంలో పోస్టర్ వేసిన యువత**

**కోతుల బెడద తప్పించే వారికే ఓటేస్తామని హెచ్చరిక**



**జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 3:** సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు నానా పాట్లు పడుతున్నారు. మరోవైపు ప్రజలు కూడా ప్రధాన సమస్యలపై నిలదీస్తున్నారు. సాధారణంగా సర్పంచ్ అభ్యర్థులు ఓట్లు అడగడానికి వస్తే.. ఎవరైనా తమ ఊరిని అభివృద్ధి చేయాలని అడుగుతారు. విద్యుత్, నీటి కొరత వంటి సమస్యలను పరిష్కారం చేయాలని కోరతారు. అయితే.. రేగొండ మండల ప్రజలు మాత్రం ఓ విచిత్ర కోరిక కోరారు. ఆ ఊర్లో వానరాల బెడద అధికమవడంతో.. ముందుగా వాటిని తరిమేయాలని సర్పంచ్ అభ్యర్థులను వేడుకుంటున్నారు. కోతులను ఊరి నుంచి దాటించాకే ఓట్ల ప్రచారం కోసం రండి.. లేదంటే ఓట్లు అడగవద్దని బహిరంగంగా పోస్టర్ కూడా వేశారు. ఆ పోస్టర్లో ఇంకా ఏముందంటే...'మా ఓటును అమ్మేది లేదు.. కోతులను తరిమి ఓట్లు అడిగేందుకు రండి. ప్రలోభాలకు లొంగి ప్రజాస్వామ్యాన్ని కూనీ చేయొద్దు. వజ్రాయుధం లాంటి ఓటుతో గ్రామీణాభివృద్ధికి బాటలు వేద్దాం. ఊరంతా వానరాల దాడుల్లో గాయాలైన బాధితులే. పత్తి, వరి, మిరప పంటలు.. కోతుల చేష్టలతో ఇంటికి చేరడం లేదు. రేగొండ మండల కేంద్రమైన మా గ్రామంలో పెద్ద సార్లు, పెద్ద పెద్ద లీడర్లు తిరుగుతున్నా.. మా గోడును పట్టించుకునే నాథుడే లేకుండాపోయారు. ఎన్నికల వేళ మా ఇల్లు తొక్కే నాయకుల్లారా.. కోతులను తరిమి ఎన్నికకు ముందే అభివృద్ధికి శ్రీకారం చుట్టి.. మీ చిత్తశుద్ధిని చాటుకోండి.' అని స్థానిక ఇన్‌స్పైర్ యూత్ అసోసియేషన్ తరఫున ఓ పోస్టర్‌లో రాసిపెట్టి అందరికీ కనిపించేలా వీధిలో గోడకు అతికించారు. రేగొండలో గోడకు అతికించిన పోస్టర్ ప్రస్తుతం.. ఈ ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీన్ని బట్టి ఆ ఊరి ప్రజలు కోతుల ద్వారా ఎంతగా ఇబ్బందులకు గురవుతున్నారో అర్థమవుతోందని నెట్టింట చర్చించుకుంటున్నారు. వారి న్యాయబద్ధమైన కోరికను నెరవేర్చి సర్పంచ్ అభ్యర్థులు చిత్తశుద్ధి చాటుకోవాలని పలువురు కోరుతున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడతకు నామినేషన్ల గడువు మంగళవారంతో ముగిసింది. 193 మండలాల్లోని 4,332 గ్రామ పంచాయతీలు; 38,342 వార్డులకు సంబంధించిన నామినేషన్లను స్వీకరించారు. రెండో విడత నామినేషన్లను బుధవారం పరిశీలిస్తారు. డిసెంబర్ 6న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. అదే రోజు పోటీకి అర్హులైన అభ్యర్థుల జాబితాను వెల్లడిస్తారు. రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ఈనెల 14న జరగనున్నాయి. ఆరోజు మధ్యాహ్నం తర్వాత కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను ప్రకటించనున్నారు.



## హిందూదేవుళ్లపై రేవంత్ వ్యాఖ్యలు

**గాంధీభవన్ ముట్టడికి బీజేపీ యత్నం ● అడ్డుకున్న పోలీసులు..స్వల్ప ఉద్రిక్తత**


**హైదరాబాద్, డిసెంబర్ 3:** నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. హిందూ దేవుళ్లపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు నిరసన చేపట్టాయి. నాంపల్లిలోని గాంధీభవన్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ర్యాలీగా బయలుదేరిన బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీజేపీ నేతలు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు గాంధీ భవన్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ కార్యవర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలు చేశారు. దీనిపై బీజేపీ నేతలు బుధవారం స్పందిస్తూ..నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పే వరకు తాము పోరాటం చేస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. గాంధీ భవన్‌ను ముట్టడించేందుకు వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ శ్రేణులు సైతం సమాయత్తమవుతున్నట్లు సమాచారం. గాంధీ భవన్ వద్ద పోలీసులను భారీగా మోహరించారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యల్లో ఎటువంటి తప్పు లేదని కాంగ్రెస్ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. నేతల మధ్య ఏమైనా మనస్పర్థలు ఉంటే వాటిని అధిగమించి.. అందరిని కలుపుకుని పోవాలనే ఉద్దేశ్యంతో సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లను ఉదాహరించారని చెప్పారు. అంతేకాని హిందూ దేవుళ్లను కించపరిచే ఉద్దేశ్యం సీఎం రేవంత్ రెడ్డికి ఎట్టి పరిస్థితుల్లో లేదని పార్టీ సీనియర్ నేతలు స్పష్టం చేస్తున్నారు. అదీకాక రేవంత్ రెడ్డి పాలనపై విమర్శించేందుకు బీజేపీ నేతలకు ఏ అంశం దొరకలేదని చెప్పారు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వారు ఆక్షేపిస్తున్నారని చెప్పారు.

## రబీ యూరియా కోసం రైతుల క్యూ

**వరంగల్, డిసెంబర్ 3:** మళ్లీ యూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. రబీకి ఎక్కడ దక్కదో అన్న ఆందోళనతో క్యూ కట్టారు. రబీ సీజన్లోనూ యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. నల్లబెల్లిలోని వీఎఫ్‌జీ సొసైటీ ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేస్తున్నారనే సమాచారంతో బుధవారం వేకువజామునే రైతులు బారులు తీరారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రైవేట్ ఎరువుల దుకాణాలతో కుమ్మక్కై ఎరువులు అమ్ముతున్నారని రైతులు ఆరోపించారు. కృత్రిమ ఎరువు కొరత సృష్టిస్తున్నారని వారు ఆక్షేపించారు. ఇలా అమ్ముతుండటంతో ప్రైవేట్ దుకాణాలలో కొనుగోలు చేయలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# మహానగరంగా ఇక హైదరాబాద్

- 27 మున్సిపాటలిటీల విలీనం
- మున్సిపల్ రికార్డులను స్వాధీనం
- సిబ్బంది వివరాలు తెలియచేయాలని సూచనలు
- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ప్రత్యేక ఆదేశాలు జారీ



**హైదరాబాద్, డిసెంబరు3:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో 27 మున్సిపాలిటీల విలీనం ప్రక్రియ వేగవంతం అయింది. ఇప్పటికే ప్రభుత్వం పంపిన ఆర్డినెన్సుకు గవర్నర్ ఆమోదం తెలిపారు. ప్రత్యేక ఆదేశాలను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ జారీ చేశారు. 27 మున్సిపాలిటీల్లో రికార్డులను స్వాధీనం చేసుకోవాలని డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు ఇచ్చారు. జోనల్ కమిషనర్ పర్యవేక్షణలో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లు రికార్డ్స్ స్వాధీనం చేసుకోవడంతో పాటు ప్రత్యేకంగా రికార్డ్స్ ప్రొఫార్మ రూపొందించాలని తెలిపారు. ఇక, 27 మున్సిపాలిటీల్లో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్ల బాధ్యతల జాబితాను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేటర్ లో విలీనం అయ్యే 27 మున్సిపాలిటీలలో ఉన్న సిబ్బంది వివరాలను తక్షణమే అందించాలని పేర్కొన్నారు. రెగ్యులర్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పూర్తి వివరాలు సమర్పించాల్సిందిగా లేఖ రాశారు. జీహెచ్‌ఎంసీలో మున్సిపాలిటీల ప్రక్రియ వేగవంతం చేసేందుకు అత్యవసరంగా ఈ డేటాను కోరినట్లు కమిషనర్ లేఖలో స్పష్టం చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్-1955లో వచ్చిన తాజా ఆర్డినెన్స్‌ల ఆధారంగా విస్తరణకు అనుమతి ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి నుంచి మొత్తం తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ జీహెచ్‌ఎంసీ పరిధిలో భాగం కానుంది. ఈ మేరకు కోర్ అర్బన్ రీజియన్ విస్తరణపై సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. జీహెచ్‌ఎంసీని ఇప్పుడు రాష్ట్రంలోనే అతిపెద్ద అర్బన్ అడ్మినిస్ట్రేటివ్ యూనిట్‌గా మారుస్తూ తెలంగాణ ప్రభుత్వ సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. 27 మున్సిపాలిటీల్లో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్ల బాధ్యతల జాబితా విడుదల చేస్తూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు.

# జీహెచ్ఎంసీ నిధులతో తార్నాకలో అభివృద్ధి

- బస్తీ బాట కార్యక్రమంలో ప్రజలకు డిప్యూటీ మేయర్ హామీ



**హైదరాబాద్, డిసెంబర్ 3 (మనసులో మాట):**

గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మోతే శోభన్ రెడ్డితో కలిసి తార్నాక డివిజన్‌లోని మాణికేశ్వరి నగర్, రవీంద్ర నగర్, పార్థివాడ ప్రాంతాలలో బస్తీ బాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి, జలమండలి, విద్యుత్, రెవెన్యూ, ఆరోగ్య శాఖలతో పాటు నగర పల్లె అభివృద్ధి, పర్యావరణ శాఖల అధికారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అధికారులు ప్రతి బస్తీలో ప్రజలతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను సమగ్రంగా నమోదు చేశారు. బస్తీ బాట సందర్శనలో ప్రధానంగా రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణం, చెత్త సేకరణ లోపాలు, వీధిదీపాల నిర్వహణ, డ్రైనేజీ బ్లాకేజీలు, నాళాల డీసిల్టింగ్, మంచినీటి సరఫరా అంతరాయాలు, కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణ, పాఠశాలల చుట్టూ పరిశుభ్రత, శ్మశాన వాటిక అభివృద్ధి, బస్తీ దవాఖాన సేవలు బలోపేతం వంటి అత్యవసర సమస్యలు ప్రజల ద్వారా డిప్యూటీ మేయర్ దృష్టికి వచ్చాయి. ప్రతి సమస్యపై అక్కడికక్కడే స్పందించిన డిప్యూటీ మేయర్, సంబంధిత అధికారులను ఆదేశించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**ప్రజల వద్దకే పాలన - కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం**

ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీమతి శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను నేరుగా విని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం తమ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. బస్తీ బాట కార్యక్రమం కేవలం సమస్యలను వినడానికి మాత్రమే కాకుండా, బస్తీ అభివృద్ధిని సమగ్రంగా పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన ఒక ప్రజామిత్ర కార్యక్రమమని వివరించారు. ప్రజల నుండి వస్తున్న సానుకూల స్పందనను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు.

**రెండు కోట్ల నిధులతో అభివృద్ధి వేగవంతం**

బస్తీ అభివృద్ధి కోసం జిహెచ్ఎంసి కౌన్సిల్ సాంక్షన్ చేసిన రెండు కోట్ల నిధుల వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టామని డిప్యూటీ మేయర్ తెలిపారు. ఈ నిధులను పారదర్శకతతో అత్యవసర అవసరాలను బట్టి ఖర్చు చేయాలని సంబంధిత శాఖలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. ముఖ్యంగా ఇంటీరియర్ రోడ్లు, కాలువలు, వీధిదీపాలు, వర్షాకాల డ్రైనేజీ సమస్యలు, పార్కుల అభివృద్ధి, చిన్నారుల ఆట స్థలాలు, మహిళల కోసం సురక్షిత ప్రదేశాల ఏర్పాటు వంటి అంశాలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

**ముఖ్యమంత్రి, మంత్రి కృషితో నగర అభివృద్ధి**

ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి గారు జిహెచ్ఎంసి వ్యవస్థపై చూపుతున్న నిబద్ధతను, ఆయన సూచనల మేరకు బస్తీ స్థాయి నుండి నగర స్థాయి వరకు అభివృద్ధి పనులు వేగవంతం చేయడాన్ని డిప్యూటీ మేయర్ ప్రశంసించారు. అలాగే, నగర ఇన్‌చార్జ్ మంత్రివర్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ గారు కూడా హైదరాబాద్ అభివృద్ధిలో ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రతి విభాగంతో సమన్వయం చేసి పనులు నిర్వహిస్తున్నారని అభినందించారు.

స్థానిక ప్రజలు తమ సమస్యలను నేరుగా డిప్యూటీ మేయర్‌తో పంచుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ఇంతకాలం పెండింగ్‌లో ఉన్న పనులు ఈ కార్యక్రమం ద్వారా వేగంగా పరిష్కారమవుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యలు, చెత్త సేకరణ, డ్రైనేజీ క్లీరెన్స్, నాళాల శుభ్రత, రోడ్ల మరమ్మతులపై తక్షణ స్పందన వస్తుందన్న నమ్మకాన్ని వారు వ్యక్తం చేశారు. బస్తీ బాట కార్యక్రమం ద్వారా తార్నాక డివిజన్‌లోని మాణికేశ్వరి నగర్, రవీంద్ర నగర్, పార్థివాడ ప్రాంతాలు త్వరలోనే అభివృద్ధి దిశగా ముందుకు సాగుతాయని అధికారులు తెలిపారు. ప్రజలతో మమేకమై సమస్యలను ప్రత్యేకంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ మేయర్ శ్రీమతి శ్రీలత శోభన్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# భవిత కేంద్రాలతో దివ్యాంగుల మానసిక అభివృద్ధి



- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**తిమ్మాపూర్, డిసెంబర్ 3 (మనసులో మాట):**

భవిత కేంద్రాల్లో ప్రత్యేక విద్యా విధానం ద్వారా దివ్యాంగ పిల్లలు మానసికంగా అభివృద్ధి చెందుతారని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన భవిత కేంద్రాన్ని (ప్రత్యేక అవసరాలు గల పిల్లల పాఠశాల) జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో ప్రత్యేక పద్ధతిలో విద్యా బోధన ద్వారా దివ్యాంగ విద్యార్థుల్లో ఎంతో మార్పు కనిపిస్తోందని తెలిపారు. చిన్న వయసులోనే భవిత కేంద్రంలో చేర్పిస్తే ప్రత్యేక అవసరాలు గల పిల్లలు తల్లిదండ్రుల అవసరం లేకుండానే సొంతంగా వారి పనులు చేసుకునే స్థాయికి చేరుకోగలరని అన్నారు. జిల్లాలో "దివ్య దృష్టి" కార్యక్రమం ద్వారా ప్రభుత్వ అంధుల, బధిరుల పాఠశాల, భవిత కేంద్రాలను ఎంతగానో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అక్కడ చదివే పిల్లల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. అధికారులకు, పాఠశాలలు, ఆసుపత్రుల సిబ్బందికి సైగల భాష నేర్పడం ద్వారా బధిరుల భావాలను వారు అర్థం చేసుకుంటున్నారని అన్నారు. భవిత కేంద్రాల్లో పని చేస్తున్న ప్రత్యేక విద్య బోధించే ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని అన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ దివ్యాంగుల కోసం జిల్లాలో అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. దివ్యాంగుల పాఠశాలలు, భవిత కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలను కల్పించామని తెలిపారు. భవిష్యత్తులో దివ్యాంగ విద్యార్థుల చదువుకు, వారి అభివృద్ధికి మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో మల్హోత్ర, విద్యా శాఖ కో ఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్ ఎంఈఓ శ్రీనివాస్, డిఈ కృష్ణ కుమార్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

**బుధవారం బోధనలో ప్రతి విద్యార్థి పాల్గొనాలి**

మహాత్మా నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బోధన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. విద్యార్థులతో పాఠాలు చదివించారు. కొందరు విద్యార్థులు పాఠాలు సరిగ్గా చదవకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. 10వ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రతి రోజు పాఠాలు బిగ్గరగా చదివించాలని అన్నారు. బుధవారం భోదనలో ప్రతి విద్యార్థిని భాగస్వామ్యం చేయాలని, ప్రతి ఒక్కరితో పాఠాలు చదివించాలని ఆదేశించారు. విద్యార్థులు పట్టుదలతో నేర్చుకోవాలని, అర్థం కానీ సబ్జెక్ట్ ను ఉపాధ్యాయుల ద్వారా మరోసారి అడిగి తెలుసుకోవాలని తెలిపారు.



# సికింద్రాబాద్ ఏఓసీ సెంటర్‌లో అగ్నివీర్ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్

**478 మంది అగ్నివీరుల విజయవంతమైన సైనిక శిక్షణ పూర్తి**

**సికింద్రాబాద్, డిసెంబర్ 3 (మనసులో మాట):**

సికింద్రాబాద్‌లోని ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్ (ఏఓసీ) సెంటర్‌లో అగ్నివీర్ బ్యాచ్ 06/25 యొక్క ప్రతిష్టాత్మక పాసింగ్ అవుట్ పరేడ్ బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. రక్షణ మంత్రిత్వ శాఖ 2022 జూన్‌లో ప్రవేశపెట్టిన అగ్నిపథ్ స్కీమ్ కింద శిక్షణ పొందిన మొత్తం 478 మంది అగ్నివీర్లు, మే 1 నుంచి ప్రారంభమైన 31 వారాల ప్రాథమిక మరియు పురోగతి సైనిక శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు.

**పరేడ్ హైలైట్స్**

ఈ కార్యక్రమాన్ని ఆర్.యు. పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించారు. అగ్నివీర్లు తమ అద్భుతమైన మార్చ్ పాస్ నైపుణ్యాలను ప్రదర్శించి, ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఈ ప్రదర్శన అనంతరం, వారు సైన్యంలో ఏఓసీ విభాగంలో అధికారికంగా చేరేందుకు ప్రమాణ స్వీకారం చేశారు. తీవ్రమైన శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, సహనం వంటి అంశాలపై రూపొందించిన కఠినమైన శిక్షణను వారు సమర్థవంతంగా పూర్తిచేసినట్లు ఈ పరేడ్ స్పష్టం చేసింది.

**ఉన్నతాధికారి సందేశం**

పరేడ్‌ను ఏఓసీ సెంటర్ ఆఫిషియేటింగ్ కమాండెంట్ కల్నల్ కె. శాజీ సమీక్షించారు. శిక్షణను విజయవంతంగా పూర్తిచేసిన అగ్నివీర్లను ఆయన అభినందించారు. కొత్తగా ప్రారంభమవుతున్న వారి సైనిక జీవితంలో ధైర్యం, సేవా భావం, క్రమశిక్షణ వంటి అత్యున్నత విలువలను నిలబెట్టుకోవాలని వారికి పిలుపునిచ్చారు. అగ్నివీర్లను శిక్షణ ఇచ్చిన ఇన్‌స్ట్రక్టర్ల కృషిని కల్నల్ కె. శాజీ ప్రత్యేకంగా ప్రశంసించారు. తమ కుమారులను జాతీయ సేవ మార్గంలో నడిపించినందుకు అగ్నివీర్ల తల్లిదండ్రులకు కూడా ఆయన ధన్యవాదాలు తెలిపారు. క్రమశిక్షణ, సేవాస్ఫూర్తి, నిబద్ధత కలిగిన సైనికులుగా తయారైన అగ్నివీర్లు ఇకపై దేశ సేవలో తమ ప్రయాణాన్ని ప్రారంభించనున్నారు.

# తత్కాల్ కౌంటర్ టికెట్లకు ఓటీపీ వ్యవస్థ అమలు

- రైల్వేల నిర్ణయం
- పారదర్శకత, ప్రయాణికుల సౌలభ్యం పెంపునకు కీలక ముందడుగు

**సికింద్రాబాద్, డిసెంబర్ 3 (మనసులో మాట):**



సాధారణ ప్రయాణికులకు తాత్కాల్ రిజర్వేషన్‌ను మరింత సులభతరం చేయడానికి, రైల్వేలు త్వరలో ఓటీపీ (ఒకసారి వాడే సంఖ్య) ఆధారిత తాత్కాల్ రిజర్వేషన్ విధానాన్ని కౌంటర్లలో కూడా ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ చర్య తాత్కాల్ టికెట్ల దుర్వినియోగాన్ని అరికట్టి, నిజమైన ప్రయాణికులకు అధిక డిమాండ్ ఉన్న టికెట్లు పొందడానికి మెరుగైన అవకాశం కల్పిస్తుంది. ముందుగా, 2025 జులైలో రైల్వేలు ఆన్‌లైన్ తాత్కాల్ టికెటింగ్‌లో ఆధార్ ఆధారిత ధృవీకరణను ప్రారంభించాయి. ఆ తరువాత, 2025 అక్టోబర్‌లో మొదటి రోజు బుకింగ్‌లకు సంబంధించి అన్ని సాధారణ రిజర్వేషన్‌ల కోసం ఓటీపీ ఆధారిత ఆన్‌లైన్ రిజర్వేషన్ వ్యవస్థను విజయవంతంగా అమలు చేశాయి. ఈ రెండు చర్యలు ప్రయాణికులచే విస్తృతంగా వినియోగించబడుతూ, రిజర్వేషన్ వ్యవస్థలో పారదర్శకత, సౌలభ్యాన్ని పెంచాయి. ఈ నేపథ్యంలో, 2025 నవంబర్ 17న రైల్వేలు రిజర్వేషన్ కౌంటర్ల వద్ద టికెట్లు బుక్ చేసుకునే ప్రయాణికుల కోసం ఓటీపీ ఆధారిత తాత్కాల్ రిజర్వేషన్ వ్యవస్థను పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించాయి. ప్రస్తుతం ఈ వ్యవస్థను 52 రైళ్లకు విస్తరించారు. ఈ విధానంలో, తాత్కాల్ టికెట్‌ను రిజర్వేషన్ కౌంటర్‌లో బుక్ చేసినప్పుడు, ప్రయాణికుడు రిజర్వేషన్ దరఖాస్తు పత్రంలో ఇచ్చిన మొబైల్ నంబర్‌కు ఒక ఓటీపీని అందుకుంటారు. ఈ ఓటీపీ ధృవీకరణ పూర్తయిన తర్వాత మాత్రమే టికెట్ ధృవీకరించబడుతుంది (కన్ఫర్మ్ అవుతుంది). మరికొన్ని రోజుల్లోనే ఈ ఓటీపీ ఆధారిత తాత్కాల్ రిజర్వేషన్ వ్యవస్థను మిగతా అన్ని రైళ్లకు కూడా రైల్వేలు అమలు చేయనున్నాయి. రైల్వే టికెటింగ్‌లో పారదర్శకత, ప్రయాణికుల సౌలభ్యం, భద్రత పెంపు దిశగా ఇది ఒక కీలక ముందడుగు అని రైల్వే అధికారులు తెలిపారు.

# నాటు బాంబు కొరికి కుక్క మృతి

**తప్పుడు ప్రచారాలు చేయొద్దు: ఎస్పీ రోహిత్ రాజు**

**కొత్తగూడెం, డిసెంబర్ 3 (మనసులో మాట):**

కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే ట్రాక్ వద్ద ఒక దురదృష్టకర సంఘటన చోటు చేసుకుంది. రైల్వే ట్రాక్ పై ఉల్లిగడ్డ ఆకారంలో ఉన్న నాటు బాంబును కొరికి ఒక కుక్క మృతి చెందిందని జిల్లా ఎస్పీ శ్రీ రోహిత్ రాజు తెలిపారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లోని చెత్త పడేసే ప్రదేశం నుండి ఒక కుక్క ఏదో తినే పదార్థంలా భావించి, అడవి జంతువులను వేటాడటానికి తయారుచేసిన ఆ నాటు బాంబును రైల్వే ట్రాక్ మీదకు తీసుకువచ్చి కొరికింది. దాంతో ఆ బాంబు ప్రేలి, కుక్క అక్కడికక్కడే మృతి చెందిందని ఎస్పీ వివరించారు. నాటు బాంబులను చెత్తలో పడేసిన వ్యక్తుల గురించి పోలీసులు విచారణ చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ ఘటనలో మరేవిధమైన ఇతర కోణం లేదని ఎస్పీ శ్రీ రోహిత్ రాజు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలని, కావున ఎవరూ కూడా సామాజిక మాధ్యమాలలో (సోషల్ మీడియాలో) ఈ సంఘటనపై తప్పుడు ప్రచారం చేయవద్దని ఆయన ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.

# వరి కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



**కామారెడ్డి, డిసెంబర్ 3 (మనసులో మాట):**

జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం నాడు తాడ్వాయి మండలంలోని కరడ్‌పల్లి వరి కొనుగోలు కేంద్రాన్ని (పిపిసి) సందర్శించారు. పిఏసిఎస్ (ప్యాక్స్) ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న వరి కొనుగోలు ప్రక్రియను, రైతుల రాకపోకలను, గన్నీస్ (గోనె సంచుల) అందుబాటును, రవాణా సదుపాయాలు వంటి అంశాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. రవాణా కాంట్రాక్టర్ ద్వారా లోడింగ్ ప్రక్రియ సక్రమంగా జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కొనుగోలు కేంద్రంలో నిర్వహణ పద్ధతులను పరిశీలించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, వరి కొనుగోళ్లు తక్షణం మరియు పారదర్శకంగా జరగాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. తూకం, గన్నీస్ సరఫరా, ట్రక్కుల రాకపోకలు, మిల్లులకు రవాణా వంటి అంశాల్లో పూర్తి సమన్వయం ఉండాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. వరి కొనుగోలు కేంద్రం సందర్శన అనంతరం, ప్రజలు గ్రామంలో ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు: డంపింగ్ యార్డ్: జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్ ద్వారా ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రజలు తెలిపారు. పాఠశాల సమస్యలు: పాఠశాలలో త్రాగునీరు మరియు టాయిలెట్స్ (మరుగుదొడ్ల) సమస్యలు ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలపై కలెక్టర్ వెంటనే స్పందించి, తహసిల్దార్ మరియు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అక్కడే ఉండి సమస్యను పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట సివిల్ సప్లై వెంకటేశ్వర్లు, డి.ఎం. శ్రీకాంత్, సి.పి.ఓ., తహసిల్దార్, రైతులు, తదితరులు ఉన్నారు.

# రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటాలి

**మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి**



**నారాయణ పేట, డిసెంబర్ 3 (మనసులో మాట):**

రాష్ట్రస్థాయి ఎస్.జీ.ఎఫ్ క్రికెట్ పోటీలలో ప్రతిభ చాటి నారాయణపేట జిల్లా కు మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ డెవలప్మెంట్, మత్స్య, క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సూచించారు. బుధవారం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన అండర్ 14 బాలుర క్రికెట్ జట్టు భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో జరిగే ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడలకు తరలి వెళ్ళారు. అంతకు ముందు అండర్ - 14 క్రికెటర్లు మక్తల్ లోని మంత్రి నివాసంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ... మీకు అవసరమైన సదుపాయాలు అన్ని నేను కల్పిస్తానని రాష్ట్రస్థాయిలో మంచి ప్రదర్శన కనబరచాలని తెలిపారు. క్రికెటర్లకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డి వై ఎస్ ఓ వెంకటేష్ శెట్టి, క్రీడా దుస్తువుల దాత లక్ష్మీనారాయణ, టీం మేనేజర్ విష్ణువర్ధన్, కోచ్ వలియోద్దీన్ పాల్గొన్నారు.

# నగరం శుభ్రత కోసం తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వండి

**"చేయి చేయి కలుపుదాం - తడి పొడి చెత్తను వేరు చేద్దాం - స్వచ్ఛ వరంగల్‌ను నిర్మిద్దాం" లక్ష్యం: వరంగల్ మేయర్**




**వరంగల్, డిసెంబర్ 3 (మనసులో మాట):**

"చేయి చేయి కలుపుదాం - తడి పొడి చెత్తను వేరు చేద్దాం - స్వచ్ఛ వరంగల్‌ను నిర్మిద్దాం" అనే లక్ష్యంతో వరంగల్ నగరపాలక సంస్థ బుధవారం విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా వరంగల్ పరిధిలోని 42వ డివిజన్ రంగశాయి పేట, 38వ డివిజన్ ఖిలా వరంగల్ ప్రాంతాల్లో స్థానికులకు అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేసిన ర్యాలీలో నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి మరియు కమిషనర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్ పాల్గొన్నారు. వారు స్థానికులను ఉద్దేశించి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం మరియు స్వచ్ఛ వరంగల్ నిర్మాణంలో భాగస్వాములై, తడి చెత్త మరియు పొడి చెత్తను వేర్వేరుగా చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండు చందన పూర్ణ చందర్, బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్, సి.ఎం.హెచ్.ఓ. డాక్టర్ రాజారెడ్డి, ఎం.హెచ్.ఓ. డాక్టర్ రాజేష్, హెచ్.ఓ. లక్ష్మారెడ్డి, టి.ఎం.సి. రమేష్, సానిటరీ సూపర్ వైజర్ గోల్కొండ శ్రీను, ఆస్కి ప్రతినిధులు డాక్టర్ రాజ్ మోహన్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# అభ్యంతరాల పరిష్కారం తర్వాతే బైపాస్ రోడ్డు భూసేకరణ

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి బైపాస్ రోడ్డు 'ఎన్జాయ్‌మెంట్ సర్వే'ను పరిశీలించిన కలెక్టర్**



**పెద్దపల్లి, డిసెంబర్ 3 (మనసులో మాట):**

పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ విషయంలో రైతుల అభ్యంతరాలను పూర్తిగా పరిష్కరించిన తర్వాతే భూసేకరణ ప్రక్రియ జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్పష్టం చేశారు. బుధవారం పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట గ్రామంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ నిమిత్తం చేపట్టిన ఎన్జాయ్‌మెంట్ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెద్దపల్లి పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం బైపాస్ రోడ్డును మంజూరు చేసిందని, దాని నిర్మాణానికి అవసరమైన భూసేకరణ నిమిత్తం ప్రస్తుతం ఎన్జాయ్‌మెంట్ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుల అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన తర్వాతే భూసేకరణ జరుగుతుందని, కాబట్టి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ భరోసా ఇచ్చారు. మెరుగైన పరిహారంతో రైతులను ఒప్పించిన తర్వాతే భూసేకరణ ప్రక్రియ ముందుకు సాగుతుందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి. గంగయ్య, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భావ్ సింగ్, ఇన్చార్జి తహసిల్దార్ విజేందర్, సర్వేయర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అంగడిరైచుర్ పీహెచ్‌సీలో అన్ని సౌకర్యాలు కల్పించాలి

**జిల్లా డి.ఎం.హెచ్.ఓ. డాక్టర్ స్వర్ణ కుమారి**

**ఆసుపత్రిలో రికార్డులు, కార్యక్రమాల అమలుపై పరిశీలన**



**కొడంగల్ మండలం, డిసెంబర్ 3 (మనసులో మాట):**

వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ మండలం, అంగడిరైచుర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పి.హెచ్.సి.) వికారాబాద్ జిల్లా డి.ఎం.హెచ్.ఓ. (జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి) డాక్టర్ స్వర్ణ కుమారి బుధవారం సందర్శించారు. ఆసుపత్రిలో అందుతున్న అన్ని సౌకర్యాలను, రికార్డులను ఆమె స్వయంగా పరిశీలించారు. ఆరోగ్య కార్యక్రమాలను నూటికి నూరు శాతం అమలు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ల్యాబ్ (ప్రయోగశాల), ఫార్మసీ (మందుల పంపిణీ) సేవలతో సహా అన్ని వైద్య సేవలను ప్రజలకు సమర్థవంతంగా అందించాలని ఆమె తెలిపారు. ఈ సందర్శన కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ. డాక్టర్ రవీంద్రా యాదవ్, అంగడిరైచుర్ డాక్టర్ భూషరా ఫాతిమా, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నవోదయ ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష తేదీ, హాల్ టికెట్లు విడుదల

**డిసెంబర్ 13న ఉమ్మడి వరంగల్ జిల్లాలో పరీక్ష**

**మహబూబాబాద్, డిసెంబర్ 3 (మనసులో మాట):**

జవహర్ నవోదయ విద్యాలయ వరంగల్ జిల్లాలో 2026-27 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో ప్రవేశం కొరకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ పరీక్ష డిసెంబర్ పదమూడు, రెండువేల ఇరవై ఐదు (13.12.2025) వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిర్వహించబడుతుందని విద్యాలయ ప్రధానాచార్యులు బి. పూర్ణిమ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు మొత్తం ఐదు వేల ఆరు వందల నలభై ఎనిమిది (5648) మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థుల కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఇరవై ఎనిమిది (28) కేంద్రాలలో పరీక్ష నిర్వహించుటకు కావాల్సిన ఏర్పాట్లు అన్నియు జవహర్ నవోదయ విద్యాలయ, వరంగల్ వారు పూర్తి చేసినట్లు ఆమె వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ప్రవేశ పత్రాలను (హాల్ టికెట్లను) ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవలయును. ఇందుకు గాను అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునేటప్పుడు వచ్చిన రిజిస్ట్రేషన్ నెంబర్ మరియు పుట్టిన తేదీని సమర్పించి ప్రవేశ పత్రాన్ని పొందవచ్చు. ఆన్‌లైన్ చిరునామా: డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ నవోదయ డాట్ జీఓవీ డాట్ ఇన్ ప్రత్యక్షంగా (ఆఫ్‌లైన్‌లో) దరఖాస్తు చేసుకున్నవారు విద్యాలయ సహాయక కేంద్రం నెంబరు 9110782213కు ఫోన్ చేసి తమ వివరాలు తెలిపి ప్రవేశ పత్రాన్ని పొందవచ్చునని ఈ సందర్భంగా ప్రధానాచార్యులు బి. పూర్ణిమ పేర్కొన్నారు.

# సరిహద్దు చెక్‌పోస్టులను తనిఖీ

**అక్రమ రవాణా నిరోధానికి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు**

**నారాయణపేట మండలం, డిసెంబర్ 3 (మనసులో మాట):**

గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా నారాయణపేట జిల్లా కర్ణాటక సరిహద్దు ప్రాంతాలలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ బుధవారం రోజు ఆకస్మికంగా పలు చెక్‌పోస్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ నారాయణపేట మండలంలోని జలాల్పూర్ చెక్‌పోస్ట్ (కర్ణాటక సరిహద్దు), దామరగిద్ద సమీపంలోని కాన్కుర్తి సరిహద్దు చెక్‌పోస్టను ప్రత్యక్షంగా సందర్శించారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది, ఎస్.ఎస్.టి. (స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్) బృందాలను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల సందర్భంలో అక్రమ రవాణా, మద్యం, డబ్బు మరియు ఇతర విలువైన వస్తువుల ప్రవేశాన్ని నిరోధించేందుకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. వాహనాల వివరాలను రిజిస్టర్లలో తప్పనిసరిగా నమోదు చేయాలి. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అవసరమైతే వీడియో రికార్డింగ్‌తో తనిఖీలు కొనసాగించాలని ఎస్పీ తెలిపారు. జిల్లా పరిధిలో మొత్తం 06 సరిహద్దు చెక్‌పోస్టులు మరియు 05 ఎస్.ఎస్.టి. బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ పేర్కొన్నారు. సరిహద్దు మార్గాలన్నింటిలోనూ మరియు గ్రామ పరిధిలోని మార్గాలను కూడా నిరంతరం నిఘా ఉంచి తనిఖీలు చేయాలని తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగడానికి పోలీసు శాఖ పూర్తి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ఎస్పీ స్పష్టం చేశారు.

# ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- హనుమకొండలో ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం




**హనుమకొండ, డిసెంబర్ 3 (మనసులో మాట):**

దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో జీవితంలో ముందుకు సాగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, జిల్లా సంక్షేమ అధికారి జె. జయంతి అధ్యక్షతన సమావేశం జరిగింది.

**దివ్యాంగుల ప్రదర్శనల అభినందన**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ, దివ్యాంగుల నుండి నేర్చుకోవాల్సిన చాలా విషయాలు ఉన్నాయని, ఇక్కడ వారు చేసిన ప్రదర్శనలతో అది తెలుస్తుందని పేర్కొన్నారు. "ఏదో కావాలి అనుకునే మిగతా వారి కంటే ఉన్నంతలోనే మీరంతా ఎంతో సంతోషంగా ఉన్నారు," అని ఈ కార్యక్రమం ద్వారా తెలుస్తుందన్నారు. మిగతా వారితో దయ, కరుణ, సహానుభూతి, ఆత్మ గౌరవం, ఆత్మవిశ్వాసంతో ఉంటారని, ఇలాంటి లక్షణాలు అందరిలో ఉంటే పరస్పర గౌరవం సమాజంలో ఇంకా పెరుగుతుందని అన్నారు.

**సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి**

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తోందని కలెక్టర్ తెలిపారు. పెన్షన్లు, భవిత కేంద్రాలు, స్కాలర్‌షిప్పులు, ప్రత్యేక స్వయం సహాయక సంఘాలు, విద్యా, ఉపాధి, గృహ కల్పనలో ప్రత్యేక కోటా ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. "మనమున్న ఈ సమాజంలో మీరు కూడా ఎంతో ముఖ్యమైన భాగం," అని పేర్కొన్నారు. సమాన గౌరవం ఇస్తే దివ్యాంగులు అందరికన్నా చాలా వేగంగా ముందుకు వెళ్తారనే ఉద్దేశంతోనే వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు కృషి, పట్టుదలతో రాణిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని, వారి శక్తి సామర్థ్యాలకు ఎలాంటి పరిమితులు, హద్దులు లేవని అన్నారు. జిల్లా యంత్రాంగం తరఫున దివ్యాంగులకు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆమె హామీ ఇచ్చారు.

**అంబేద్కర్ భవన్‌లో ర్యాంపు సౌకర్యం**

దివ్యాంగుల సౌకర్యార్థం కోసం అంబేద్కర్ భవన్ మరియు కలెక్టరేట్‌లలో ర్యాంపు సౌకర్యం ఏర్పాటు చేయుటకు తక్షణ చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి జయంతి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం డిసెంబర్ 3వ తేదీన అంతర్జాతీయ దినోత్సవ వేడుకలను నిర్వహించుకుంటామని తెలిపారు. దివ్యాంగులకు బ్యాంకు రుణాలు మంజూరు అవుతాయని, ప్రతి ఒక్కరూ వారికి ప్రోత్సాహం అందించాలని కోరారు.

**సాంస్కృతిక ప్రదర్శనలు, బహుమతులు**

వేడుకలలో భాగంగా బన్ను, వికాస్, లిటిల్ ఫ్లవర్ స్కూల్, స్పందన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమం ముగింపు సందర్భంగా వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలతో పాటు మెడల్స్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.వో. మేన శ్రీను, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఇసంపెల్లి జోనా, డి.ఎం.హెచ్.వో. డాక్టర్ అప్పయ్య, కే.యూ. పాలకమండలి సభ్యులు డాక్టర్ కె. అనితా రెడ్డి, విద్యా ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ల మహేందర్, దివ్యాంగ సంఘం ప్రతినిధులు, సి.డి.పి.వో. విశ్వజ, తదితరులు పాల్గొన్నారు.

# వైకల్యం శరీరానికే.. మనసుకు కాదు

**చట్టాలపై అవగాహన అవసరం: అదనపు జూనియర్ సివిల్ జడ్జి**

**నారాయణపేటలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవంపై న్యాయ విజ్ఞాన సదస్సు**



**నారాయణపేట, డిసెంబర్ 3 (మనసులో మాట):**

జాతీయ న్యాయ సేవ సంస్థ ఆదేశాలకు అనుగుణంగా, నారాయణపేట జిల్లా న్యాయ సేవ సంస్థ (లీగల్ సర్వీసెస్ అథారిటీ) ఆధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా "రొనాల్డో మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల" ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీ కే. అవినాష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, చట్టాలపై ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబరు 3వ తేదీన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహించబడుతుందని గుర్తు చేశారు. మన సమాజంలో దివ్యాంగులకు ఎదురయ్యే సవాళ్లను, వైకల్యాలను అర్థం చేసుకొని వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. "వైకల్యం అనేది శరీరానికే గానీ మనసుకు కాదు, పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే" అని నొక్కి చెప్పారు. వైకల్యాలను వారి జీవితాలకు, సామర్థ్యాలకు పరిమితం చేయకూడదన్నారు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరంగా వికలాంగుల ఎదుగుదలను ప్రోత్సహించేలా ఈ దినోత్సవం ప్రయత్నిస్తుందని తెలిపారు. వికలాంగుల సమస్యలను పరిష్కరించి, వారికి ఆసరా ఇచ్చి, వారు గౌరవంగా జీవిస్తూ, సాధారణ జనజీవనంలో భాగమై అన్ని హక్కులు పొందేలా చూడాలన్నారు. వికలాంగులకు సమాన అవకాశాలు, హక్కులు కల్పించి వారందరూ సమాజ అభివృద్ధిలో భాగం అయ్యేలా చూడాలని సూచించారు.

**ప్రభుత్వ వైద్యం ముద్దు**

ఆరోగ్యం గురించి మాట్లాడుతూ, ప్రతీ ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి తమ ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని, నాటు వైద్యం వద్దు ప్రభుత్వ వైద్యం ముద్దు అని తెలిపారు. వైకల్యం అడ్డుకోలేని సామర్థ్యాలపై దృష్టి పెట్టాలి తప్ప, అది జోక్యం చేసుకునే విషయాలపై దృష్టి పెట్టవద్దని హితవు పలికారు. వికలాంగుల పట్ల గౌరవం, సానుభూతి, అవగాహనతో వ్యవహరించాలని, వారిని ప్రోత్సహించేందుకు మనందరం కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. వికలాంగులకు విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి జీవితాలను మెరుగుపరచాలి అని, వికలాంగులందరినీ సమాజంలో సమానంగా చూడాలని కోరారు. జిల్లా స్థాయి దివ్యాంగుల ఆటల పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జడ్జిగారు అభినందించారు. దివ్యాంగులు 15100 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఉచిత న్యాయ సేవలను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ కే. సురేష్, లీగల్ ఎయిడ్ కౌన్సెల్ శ్రీ కే. లక్ష్మీపతి గౌడ్, డాక్టర్ బి. వెంకటయ్య (జిల్లా శిక్షణ నిర్వాహకులు), శ్రీమతి నాగలక్ష్మి (పాఠశాల ప్రిన్సిపాల్), శ్రీ డి. నర్సిములు (జిల్లా మిషన్ సమన్వయకర్త), శ్రీ ఆంజనేయులు (ఏ.ఎస్.ఐ.), పారా లీగల్ వాలంటీర్లు, విద్యార్థులు, మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వద్దు

**అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ ఆదేశాలు**

**నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని సూచన**

**మల్హార్‌రావు, డిసెంబర్ 3 (మనసులో మాట):**

బుధవారం మల్హార్‌రావు మండల పరిధిలోని రుద్రారం, యద్లపల్లి, కొయ్యూరు, కొండంపేట్, వల్లంకుంట, తాడిచర్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను (పి.పి.సి.లు) రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ సందర్శించారు. ఈ పరిశీలనలో ఆయన వెంట డి.సి.ఎస్.ఓ. కిరణ్‌కుమార్, తహసీల్దార్ రవికుమార్, వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు. సందర్శన సందర్భంగా అదనపు కలెక్టర్ పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు ప్రక్రియను సమగ్రంగా పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ ఎఫ్.ఏ.క్యూ. గ్రేడ్ (నిర్ణీత నాణ్యత) వరిని మాత్రమే కొనుగోలు చేయాలని ఇన్‌చార్జీలను ఆదేశించారు. తక్కువ ప్రమాణాల ధాన్యాన్ని స్వీకరించరాదని స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగ్ చేసిన రైస్ మిల్లులకు ఆలస్యం లేకుండా తరలించాలని, కొనుగోలులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పి.పి.సి. కేంద్రంలో రోజువారీ వరి కొనుగోలు వివరాలు, తరలింపు వివరాలు, రైతులకు చెల్లింపుల పురోగతిని ట్యాబ్‌లో ప్రతిరోజూ తప్పనిసరిగా అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఆలస్యం లేదా తప్పిదాలకు సంబంధిత ఇన్‌చార్జ్ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రతి కేంద్రంలో అధికారిక సమాచారం, రోజువారీ కొనుగోలు గణాంకాలు, రేట్లు, రైతుల వివరాలు నోటీసు బోర్డు మీద స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. కొనుగోలు రిజిస్టర్, రైతుల సమాచార రిజిస్టర్‌లను సక్రమంగా, ప్రతిరోజూ అప్‌డేట్ చేయడం తప్పనిసరి అని పేర్కొన్నారు. పి.పి.సి.ల వద్ద తాగునీరు, నీడ, కొలతల యంత్రాలు, పారదర్శక తూకం పరికరాలు వంటి సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా, కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని ఇన్‌చార్జీలకు స్పష్టం చేశారు. కొనుగోలు కార్యక్రమంలో పారదర్శకత, సత్వర స్పందన, రైతులకు సేవాభావం పి.పి.సి. ఇన్‌చార్జీల ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. సందర్శనలో గుర్తించిన చిన్నపాటి లోపాలను తక్షణమే సరిదిద్దాలని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాల ఇన్‌చార్జీలు బాధ్యతతో సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

# ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం ముగింపు

- దేశభక్తిని పెంపొందించుకోవాలని వక్తల పిలుపు



**మహబూబ్‌నగర్, డిసెంబర్ 3 (సమయం న్యూస్):**

తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ (నేషనల్ కేడెట్ కార్ప్స్) ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక శిక్షణ శిబిరం ఏటీసీ - ఎక్స్‌ఎల్ (యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ - 11) జేపీఎన్‌సీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నాడు విజయవంతంగా ముగిసింది. నవంబర్ 25 నుంచి ప్రారంభమైన ఈ పది రోజుల శిబిరంలో వివిధ పాఠశాలలు, కళాశాలల నుండి మొత్తం ఐదు వందల పందొమ్మిది (519) మంది కేడెట్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. శిబిరంలో పాల్గొన్న కేడెట్లకు పలు విభాగాల్లో ప్రత్యేక శిక్షణను అందించారు: మ్యాప్ రీడింగ్ (పటాల అధ్యయనం), డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (విపత్తు నిర్వహణ), కమ్యూనికేషన్ (సమాచార వ్యవస్థ), ఫీల్డ్ క్రాఫ్ట్ (క్షేత్ర నైపుణ్యం), ఫైర్ ఫైటింగ్ (అగ్నిమాపకం), ఫైరింగ్ (కాల్పుల శిక్షణ), క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు భావన పెంపొందించే విధంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. అంతేకాక, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన కార్యక్రమంలో అనేక మంది కేడెట్లు రక్తదానం చేసి తమ సేవాభావాన్ని ప్రదర్శించారు. శిబిరాన్ని 8వ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్.కె. సింగ్ పర్యవేక్షించారు. అలాగే హైదరాబాద్ గ్రూప్ ఎన్‌సీసీ కమాండర్ కల్నల్ ప్రశాంత్ కుమార్ శిబిరాన్ని సందర్శించి, శిక్షణ కార్యక్రమాలను పరిశీలించారు. కేడెట్లతో ముచ్చటించిన ఆయన, దేశసేవలో ఎన్‌సీసీ పాత్రను వివరించి, కేడెట్లు దేశభక్తి మరియు సేవాభావం పెంపొందించుకోవాలని, నిబద్ధతతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. ఈ శిబిరం ద్వారా కేడెట్లు శారీరక దృఢత్వంతో పాటు సేవాభావం, నాయకత్వ నైపుణ్యాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే సామర్థ్యాలను అలవర్చుకున్నారని నిర్వాహకులు తెలిపారు.

# దివ్యాంగులకు అండగా ఉంటాం

- ఉన్నత చదువులకు ప్రోత్సహిస్తాం
- ఇందిరమ్మ ఇళ్లలో ఐదు శాతం కేటాయింపు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**కరీంనగర్, డిసెంబర్ 3 (మనసులో మాట):**

దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, వారు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా సహాయ సహకారాలు అందిస్తామని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం శాతవాహన యూనివర్సిటీ సమీపంలో ఉన్న ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా జరిగింది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితోపాటు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనితా రామచంద్రన్, వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

### సంక్షేమానికి యాభై కోట్ల కేటాయింపు

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. దివ్యాంగులైన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, నిపుణులైన అధ్యాపకులను నియమించి సైన్ లాంగ్వేజ్ ద్వారా తరగతులు బోధిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ళ మంజూరులో ఐదు శాతం దివ్యాంగులకు కేటాయించేలా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఆర్.టి.సి. బస్సు పాసుల సమస్యను కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. దివ్యాంగులు ఉంటున్న పాఠశాలల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమను సంప్రదించాలని ప్రిన్సిపల్ సెక్రెటరీకి సూచించారు. వచ్చే ఏడాది (దివ్యాంగుల దినోత్సవం) కల్లా దివ్యాంగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దివ్య దృష్టి యూట్యూబ్ ఛానల్‌ను ఆవిష్కరించారు.

### అద్భుతాలు సృష్టించే సత్తా

దివ్యాంగుల శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్ మాట్లాడుతూ, మన చుట్టూ ఉన్న దివ్యాంగులలో అద్భుత ప్రతిభ ఉంటుందని, వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు. స్కిల్ ట్రైనింగ్ ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. యు.పి.ఎస్.సి. వంటి ఉన్నత ఉద్యోగాల్లో దివ్యాంగులు రాణిస్తున్నారని, చదువును నమ్ముకుని ముందుకు సాగాలని సూచించారు. వయో వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ మాట్లాడుతూ, రాష్ట్రంలో దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యం పెంచుకోవాలని సూచించారు. దివ్యాంగుల కో-ఆపరేటివ్ చైర్మన్ వీరయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులతో ఇప్పటికీ స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. 40 శాతం వైకల్యం ఉన్నవారికి ఉపకరణాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

### బాలుడి కుటుంబానికి అండగా..

హైదరాబాదులో వీధి కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని మంత్రి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. అతని కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, తమ శాఖ ద్వారా మెరుగైన వైద్య సేవలు, చదువు బాధ్యతలు చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దివ్యాంగులైన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అతిథులను అధికారులు, సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, మెప్మా పి.డి. స్వరూప రాణి, అధికారులు, వికలాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

# పాలకుల విధానాలతో తెలంగాణ వినాశనం

- ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సోమయ్య



**ఖమ్మం, డిసెంబర్ 3 (సమయం న్యూస్):**

మలిదశ తెలంగాణ ఉద్యమంలో శ్రీకాంతాచారి ఆత్మహుతితో ఉద్యమం ప్రజ్వలించి, దాని ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కల సాకారం చెందిందని, అయితే పాలకులు విస్తరిస్తున్న విధానాలే నేడు మన తెలంగాణ వినాశానికి కారణాలు అవుతున్నాయని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సోమయ్య అన్నారు. శ్రీకాంతాచారి వర్ధంతిని పురస్కరించుకొని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం అమరవీరుల స్థూపం దగ్గర ఘనంగా నివాళు లర్పించి కార్యక్రమాన్ని నిర్వహించారు.

### ఉద్యమకారులకు న్యాయం చేయాలి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలి మలి దశల త్యాగాలు, బలిదానాల కారణంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. తొలుత బి.ఆర్.ఎస్. పాలనలో తెలంగాణ ద్రోహులకు అందలం దక్కిందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులకు తప్పనిసరిగా న్యాయం చేస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు సంవత్సరాలు గడిచిపోతున్నా దానిపై ఎలాంటి కార్యాచరణ ప్రకటించకపోవడం విచారకరమన్నారు. శ్రీకాంతాచారి వంటి ఎందరో ఉద్యమకారుల కృషి ఫలితమే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. ఇతర రాష్ట్రాలలో ఆయా రాష్ట్రాల సాధనకు పాటుపడ్డ వారిని వారు సన్మానించుకుని, తగిన ప్రాతినిధ్యం కల్పించారని, కానీ మన పాలకులు మాత్రం అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా, లేనప్పుడు మరో విధంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు.

### మరోసారి ఉద్యమించాల్సిన అవసరం

తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా కృషి చేస్తుందని, ఆ దిశగా నిర్మాణాత్మక కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ముందుకు పోతుందన్నారు. ఉద్యమకారులంతా సంఘటితంగా మరోసారి పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఉద్యమకారులతోపాటు త్యాగాలు, బలిదానాలు చేసిన కుటుంబాల సభ్యులు ఇందుకు సన్నద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి కృష్ణ, జంపాని అంజయ్య, తునికిపాటి చారి, కుక్క సత్యం, వడిత్యా రాజేష్ నాయక్, ఉల్లోజు వెంకన్న, బొలికొండ పాపయ్య, కుర్రి ముత్తయ్య, ఎల్. రామస్వామి, సీతమ్మ, రామాంజనేయులు, మీగడ రామారావు, కాలింగ్ గురవయ్య, కూరపాటి కృష్ణమూర్తి, భువనగిరి నరసింహారావు, కట్టేగోల వెంకటేశ్వర్లు, తెలగమళ్ళ గోవిందు, అంబల రామారావు, మందడి వెంకటేశ్వర్లు, బోయిన రామనాధం, పందిటి వెంకటేశ్వర్లు, ఉల్లంగి పద్మ, కలకోట అరుణ, వడ్డేబోయిన వెంకటేశ్వర్లు, కారింగుల లక్ష్మీ, కెక్కెర్ల శ్రీనివాస్ రావు, పాల్గొన్నారు.

# కేంద్రం తక్షణ సహాయం కావాలి

- ఎంపీ డా. కడియం కావ్య



**న్యూఢిల్లీ/నర్సంపేట, డిసెంబర్ 3 (సమయం న్యూస్):**

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి ఒకవైపు ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో కేంద్రాన్ని డిమాండ్ చేయగా, మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నర్సంపేటలో రూ. 1000 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య బుధవారం లోక్‌సభలో జీరో అవర్‌లో వరంగల్ నగరంలో అక్టోబర్‌లో మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలు, తుఫాను వల్ల కలిగిన భారీ నష్టంపై గళమెత్తారు. నష్టం వివరాలు: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జి.డబ్ల్యు.ఎం.సి.) పరిధిలో 200 మిల్లీమీటర్లకు పైగా వర్షం కురవడంతో శివనగర్, ఎన్.ఎన్. నగర్, డి.కె. నగర్ సహా 45 కాలనీలు తీవ్రంగా మునిగిపోయాయని ఎంపీ వివరించారు. పోతన రోడ్, ములుగు రోడ్ వంటి ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిని గుంతలతో నిండిపోయాయి. ఆ సమయంలో 1,200 మందిని సహాయక శిబిరాలకు తరలించాల్సి వచ్చిందని, డ్రైనేజీ పనులు అమృత్%-%స్మార్ట్ సిటీల కింద 66 శాతం మాత్రమే పూర్తికావడంతోనే ఈ దుర్ఘటన మరింత పెరిగిందని, ఇది పూర్తిగా ప్రణాళికా వైఫల్యం అని ఆమె వ్యాఖ్యానించారు. ఎంపీ డిమాండ్లు: వరంగల్ అభివృద్ధిని తన ధ్యేయంగా పేర్కొన్న డాక్టర్ కడియం కావ్య, కేంద్ర ప్రభుత్వాన్ని ఈ కింది డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. 'వరంగల్‌కు తక్షణ సహాయం అందించాలి. అమృత్ 2.0 కింద ప్రత్యేక నిధులు మార్చి 2026లోగా విడుదల చేయాలి. జి.డబ్ల్యు.ఎం.సి. మౌలిక వసతులపై ఉన్నత స్థాయి ఆడిట్ ఆదేశించాలి. రోడ్లు%-%డ్రైనేజ్ పునరుద్ధరణకు ప్రత్యేకంగా రూ.100 కోట్లు మంజూరు చేయాలి. హెరిటేజ్, స్మార్ట్ సిటీ అయిన వరంగల్ ప్రతి సంవత్సరం వర్షాలతో విధ్వంసం కాకుండా, కేంద్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కార దిశగా మౌలిక వసతులు కల్పించాలి.' ఏఅని కోరారు.

### నర్సంపేట.. రూ. 1000 కోట్ల అభివృద్ధి

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 5వ తేదీన (శుక్రవారం) నర్సంపేటలో పర్యటించనున్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రకటన మేరకు, ముఖ్యమంత్రి రూ. వెయ్యి కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ముఖ్యమంత్రి శుక్రవారం ఒంటిగంటకు నర్సంపేట మెడికల్ కాలేజ్ ప్రాంతంలో భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. గతంలో ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి మధ్య సయోధ్య కుదరడంతో, మొట్టమొదటిసారిగా సి.ఎం. రేవంత్ రెడ్డి నర్సంపేటకు వస్తూనే రూ.1000 కోట్ల అభివృద్ధి పనులకు జీఓ కూడా విడుదల చేశారు. నర్సంపేట పట్టణం, నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధికి: రూ.228 కోట్లు, ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు: రూ.200 కోట్లు, మెడికల్ కాలేజ్‌కు: రూ.150 కోట్లు, నర్సింగ్ కాలేజ్‌కు: రూ.25 కోట్లు, మున్సిపాలిటీ విలీన గ్రామాలకు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, సెంట్రల్ లైటింగ్‌కు: రూ.20 కోట్లు, వరంగల్ నుండి ధర్మారం మీదుగా నర్సంపేట వరకు 4 లైన్ రోడ్డు నిర్మాణానికి (రూ.83 కోట్లు), డబుల్ రోడ్డు నిర్మాణాలు, నర్సంపేట నుండి పాకాల (10 కి.మీ.): రూ.17.28 కోట్లు, నెక్కొండ కే సముద్రం (12.10 కి.మీ.): రూ.38.74 కోట్లు, నర్సంపేట నుండి నెక్కొండ (18.47 కి.మీ.): రూ.56.40 కోట్లు, నెక్కొండ గూడూర్ (10 కి.మీ.): రూ.33 కోట్లు, నర్సంపేట పోలీస్ స్టేషన్ నుండి నాగూర్ల పల్లె మాదన్నపేట వరకు, నర్సంపేట నుండి మాగ్దం పురం- రాజపల్లె వరకు, మహేశ్వరం లోపలికి సెంట్రల్ లైటింగ్‌తో కూడిన డబుల్ రోడ్డు నిర్మాణాలు కూడా ఈ పనుల్లో భాగం. కాంగ్రెస్ పార్టీ నాయకులు సి.ఎం. సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ పనులను వేగంగా పూర్తి చేయడానికి సన్నద్ధమవుతున్నారు.

## తాగునీరు, సీవరేజ్ సమస్యలపై
# అప్రమత్తంగా ఉండాలి

**జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశం**

**నెలవారీ సమీక్షలో అధికారులకు కీలక సూచనలు**




**హైదరాబాద్, డిసెంబర్ 3 (మనసులో మాట):**

నగరంలో ఎలాంటి తాగునీరు, సీవరేజ్ (మురుగునీటి) ఇబ్బందులు లేకుండా అన్ని రకాలుగా ముందస్తు చర్యలు చేపట్టాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఉన్నతాధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. నెలవారీ నిర్వహించే ఈ సమావేశంలో పలు కీలక సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. నగరంలోని అన్ని ప్రధాన రహదారులపై ఎటువంటి ఆటంకాలు, ఇబ్బందులు కలగకుండా: వాటర్ లీకేజీలు లేకుండా చూడాలి. సీవరేజీ ఓవర్‌ఫ్లోలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలి. అన్ని ముఖ్య ప్రాంతాల్లో మ్యాన్‌హోల్ మూతలను పరిశీలించి అవసరమైన చోట్ల మరమ్మత్తులు చేయించాలి. మ్యాన్‌హోళ్ల నుంచి తీసిన వ్యర్థాలను (సిల్ట్) ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ఎయిర్ టెక్ యంత్రాలు, సిల్ట్ కార్ట్ వాహనాలు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఎం.సి.సి. (మై వాటర్ బిల్లు) ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎండీ అన్నారు. ముఖ్యంగా కలుషిత నీరు సమస్యలను పరిష్కరించడానికి ప్రాముఖ్యతనివ్వాలని సూచించారు. పగటి పూట ప్రధాన రహదారుల్లో ఏదైనా సమస్యల పరిష్కారానికి చేపట్టే మరమ్మతులతో ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా ఉండేందుకు వీలుగా, వీలైనంత వరకు రాత్రిపూట పనులను చేపట్టాలని అధికారులకు సూచించారు.

# దౌల్తాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ

**వైద్య సేవలను పరిశీలించిన ఉన్నతాధికారులు**



**దౌల్తాబాద్ మండలం, డిసెంబర్ 3 (మనసులో మాట):**

వికారాబాద్ జిల్లా, కొడంగల్ నియోజకవర్గం, దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డి.ఎం.హెచ్.ఓ.) డాక్టర్ స్వర్ణ కుమారి, డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ. డాక్టర్ రవీంద్ర యాదవ్తో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను, రికార్డులను వారు పరిశీలించినట్లు దౌల్తాబాద్ వైద్యాధికారి అమూల్య ప్రియదర్శిని తెలిపారు. ఈ తనిఖీ సమయంలో సూపర్ వైజర్ రఫీ, హెల్త్ అసిస్టెంట్ మధు, ఎల్.టి. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ జయంతి



**కొడంగల్ మున్సిపల్, డిసెంబర్ 3 (మనసులో మాట):**

కొడంగల్ పట్టణ కేంద్రంలోని నవీన ఆదర్శ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం బుధవారం రోజున భారతదేశపు తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో భాగంగా ముందుగా డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. వి. నరేష్ రాజ్ మాట్లాడుతూ, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ జీవిత చరిత్ర, దేశానికి ఆయన అందించిన సేవలు, ఆదర్శవంతమైన వ్యక్తిత్వం గురించి విద్యార్థులకు వివరించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్లు ధాన్యంలో తరుగు తీయొద్దు

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**మిల్లర్ల తీరుపై రైతు ఫిర్యాదుల నేపథ్యంలో సమీక్ష**



**హనుమకొండ, డిసెంబర్ 3 (మనసులో మాట):**

రైతులు విక్రయించిన ధాన్యంలో తరుగు (కోత) తీయకుండా రైస్ మిల్లర్లు ధాన్యాన్ని దింపుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ స్పష్టం చేశారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సి.ఎం.ఆర్.), ధాన్యం కొనుగోలు అంశాలపై పౌర సరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సందర్శించినప్పుడు, రైస్ మిల్లర్లు ధాన్యం బస్తాలలో ఎక్కువగా తరుగు తీస్తున్నారని, దీనివల్ల నష్టపోతున్నామని రైతులు ఆమె దృష్టికి తీసుకువచ్చిన నేపథ్యంలో ఈ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ, రైతులు విక్రయించిన ధాన్యంలో ఎక్కువ తరుగు తీస్తున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. తరుగు లేకుండానే ధాన్యపు బస్తాలను రైస్ మిల్లర్లు తమ మిల్లుల వద్ద దింపుకోవాలన్నారు. తరుగుతో రైతులను మిల్లర్లు ఇబ్బంది పెట్టొద్దని ఆదేశించారు. సన్న, దొడ్డు రకాలు అనే వ్యత్యాసం లేకుండా ధాన్యాన్ని మిల్లర్లు దింపుకోవాలన్నారు. 2024-25 నిర్దేశిత సి.ఎం.ఆర్. లక్ష్యాన్ని మిల్లర్లు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మిల్లర్లు ధాన్యం దింపిన వెంటనే ఆన్‌లైన్‌లో అక్నాలెడ్జ్‌మెంట్‌ను (ధ్రువీకరణ పత్రాన్ని) ఇవ్వాలన్నారు. జిల్లాలో ఏ మిల్లుకు ఎంత ధాన్యం కస్టమ్ మిల్లింగ్‌కు ఇచ్చారనే వివరాల జాబితాను మిల్లర్లకు అందజేయాలన్నారు. ధాన్యం కేటాయింపు పారదర్శకంగా చేయాలని అధికారులకు సూచించారు. ఏయే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏయే మిల్లులకు అలాట్ అయ్యాయనే వివరాలు మిల్లర్లకు తెలియాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎండి. వాజిద్ అలీ, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# సైబర్ మోసం జరిగితే 'గోల్డెన్ అవర్'లో 1930కి కాల్ చేయాలి

**వికారాబాద్‌లో 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' పేరుతో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన**



**వికారాబాద్, డిసెంబర్ 3 (మనసులో మాట):**

తెలంగాణ డీజీపీ ఆదేశాల మేరకు, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం తరఫున సైబర్ నేరాల నివారణ మరియు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, బుధవారం వికారాబాద్ పట్టణంలోని విశ్వభారతి కళాశాలలో "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" అనే ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డి.టి.సి. డి.ఎస్.పి. శ్రీనివాస్ మరియు వికారాబాద్ డి.ఎస్.పి. శ్రీనివాస్ రెడ్డిలతో పాటు వికారాబాద్ ఎస్.హెచ్.ఓ. (స్టేషన్ హౌస్ ఆఫీసర్) హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు కళాశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్లు ఏ విధంగా కొత్త పద్ధతుల్లో లింకులు, సందేశాలు, నకిలీ మెయిల్స్ పంపి మోసాలకు పాల్పడుతున్నారో సవివరంగా తెలియజేశారు. నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు కాల్ చేయడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. మోసం జరిగిన వెంటనే, నిధులను నిలిపివేసేందుకు ఉపకరించే కీలక సమయమైన గోల్డెన్ అవర్ గురించి, పి.ఓ.హెచ్. గురించి వివరించారు. ఈ గోల్డెన్ అవర్‌లో వెంటనే ఫిర్యాదు చేస్తే, మోసపోయిన నగదును రికవరీ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమం ముగింపులో, సైబర్ నేరాలపై ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటామని, ఎటువంటి మోసాలకు గురికాబోమని విద్యార్థులు మరియు కళాశాల సిబ్బందితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల ఆవరణలో క్షుద్ర పూజలు

**పోలీసులకు ఫిర్యాదు చేసిన ఉపాధ్యాయులు**



**కోస్గి, డిసెంబర్ 3 (మనసులో మాట):**

పాఠశాల ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు నిర్వహించిన సంఘటన కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మండలం మీర్జాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో చోటుచేసుకుంది. బుధవారం ఉదయం పాఠశాలను శుభ్రం చేసేందుకు వచ్చిన అటెండర్ కృష్ణయ్య ఈ విషయం గమనించి ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించారు. గ్రామస్థులు విద్యార్థుల తల్లితండ్రులు అప్పటికే పాఠశాలకు చేరుకొని ఈ సంఘటన పై ఆరా తీశారు. పాఠశాలలోని10 వ తరగతి గది ముందు ముగ్గు వేసి అందులో నిమ్మకాయలు, మిరపకాయలు, ఉంచి కుంకుమ పసుపు తో పూజలు నిర్వహించడం తరగతి గది తాళనికి బొట్లు పెట్టడం గ్రామంలో కలకలం రేపింది. మంగళవారం రాత్రి ఈ సంఘటన జరిగినట్లు బావిస్తుండగా ప్రధానోపాధ్యాయులు జనార్ధన్ రెడ్డి పిర్యాదు మేరకు పోలీసులు ఈ విషయం పై దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఈ విషయం పై జిల్లా విద్యాధికారికి సమాచారాన్ని అందించానని ప్రధానోపాధ్యాయులు జనార్ధనరెడ్డి తెలిపారు. ఎవరో ఆకాతాయిలు ఇలా చేసి ఉంటారని ఉపాధ్యా యులు విద్యార్థులకు సర్ది చెబుతూ ధైర్యం చెప్పి తరగతులు నిర్వహించేలా చొరవ చూపారు. పిల్లలను భయభ్రాంతులకు గురించేసే ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, గ్రామస్తులు కోరుతున్నారు.

# రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు అల్ఫోర్స్ విద్యార్థులు ఎంపిక

**విద్యార్థులు పరిశోధనాత్మక ఆలోచనలు పెంచుకోవాలి: డా. వి. నరేందర్ రెడ్డి**



**కొత్తపల్లి, డిసెంబర్ 3 (మనసులో మాట):**

విద్యార్థులకు వైజ్ఞానిక శాస్త్రం పట్ల సంపూర్ణ అవగాహన కలిగించాలని, తద్వారా వారు నూతన ఆవిష్కరణలు చేయడానికి ఆసక్తిని ప్రదర్శిస్తారని, విషయాలలో పట్టు సాధించడం ద్వారా విజయాలను సైతం సులభంగా నమోదు చేయగలుగుతారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో, ఇటీవల జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమ స్థానం సాధించి, రాష్ట్రస్థాయికి ఎంపికైన అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులను అభినందించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, వైజ్ఞానిక శాస్త్రం చదవడం ద్వారా విద్యార్థులకు విశేష అవగాహన లభిస్తుందని, పలు విషయాలలో పట్టు సాధిస్తారని, ప్రత్యేకంగా వారిలో నూతన ఉత్సాహాన్ని నింపుతుందని తెలిపారు. విద్యార్థులకు నిపుణులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఇప్పిస్తున్నామని, వైజ్ఞానిక శాస్త్రంలోని విషయాలను పరిశోధనాత్మకంగా, ప్రత్యక్షంగా బోధించడం ద్వారా వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తున్నామని చెప్పారు. పాఠశాలల్లో ప్రాథమికంగా పరీక్షలు నిర్వహించి, చక్కటి ప్రతిభ చాటిన విద్యార్థులను వివిధ దశల్లో నిర్వహిస్తున్న పోటీ పరీక్షలకు ఎంపిక చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో జిల్లా స్థాయి ప్రదర్శనలో తమ పాఠశాలలకు చెందిన ఈ కింది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనారని ఆయన తెలిపారు: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరాంమొండయ్య, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, డి.సి.ఇ.బి. కార్యదర్శి భగవంత రావు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. విజేతలందరికీ పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థుల్లో నూతన ఉత్సాహం నింపి, అత్యుత్తమ నమూనాలతో ప్రదర్శనకై కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందిస్తూ, జాతీయస్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ చాటే విధంగా ప్రోత్సాహం అందించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని
- పోస్టల్ బ్యాలెట్, వేలం నిరోధం, స్వీప్ కార్యక్రమాలపై సమీక్ష




**పెద్దపల్లి, డిసెంబర్ 3 (మనసులో మాట):**

రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. పెద్దపల్లి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, డి.సి.పి. రాంరెడ్డి, ఎన్నికల సాధారణ పరిశీలకులు నరసింహారెడ్డితో కలిసి ఈ సమీక్షలో పాల్గొన్నారు. పోస్టల్ బ్యాలెట్: ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు అందేలా రిటర్నింగ్ అధికారి చర్యలు తీసుకోవాలి. ప్రలోభాల నిరోధం: ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న గ్రామీణ ప్రాంతాలలో ఎటువంటి ప్రలోభాలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలి. నామినేషన్లు, గుర్తులు: నామినేషన్ల గడువు ముగిసిన తర్వాత పోటీ చేసే అభ్యర్థుల గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్ల ముద్రణ నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలి. వేలం ప్రక్రియ: సర్పంచ్ పదవుల వేలం ప్రక్రియ ఎక్కడ జరగకుండా చర్యలు చేపట్టాలి. సింగిల్ నామినేషన్ వచ్చిన గ్రామాలు ఉంటే అండర్ టేకింగ్ తీసుకోవాలని సూచించారు. ఓటరు అవగాహన: ఓటర్ స్లిప్పుల పంపిణీకి షెడ్యూలు తయారు చేయాలని, ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాలలో అవసరమైన వసతులు ఉన్నాయని, నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరుగుతోందని, నిబంధనల ప్రకారం స్క్రూటిని ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లాలో మొదటి రెండు విడుదలలో ఎక్కడ కూడా సింగిల్ నామినేషన్ దాఖలైన స్థానాలు లేవని తెలిపారు. డిసెంబర్ 6న పోలింగ్ సిబ్బందికి శిక్షణ, పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ జా మాట్లాడుతూ, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం జరిగిందని, జిల్లాలో 4 అంతర్ జిల్లాల చెక్ పోస్టు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సి.ఈ.ఓ. నరేందర్, జిల్లా నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం గ్రానైట్ మార్కర్ యూనియన్ ప్రమాణ స్వీకారం



**ఖమ్మం, డిసెంబర్ 3 (మనసులో మాట):**

అత్యంత ఉత్సాహ భరిత కోలాహలం మధ్య బుధవారం ఖమ్మం గ్రానైట్ మార్కర్ యూనియన్ నూతన పాలక వర్గ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. గ్రానైట్ మార్కర్ యూనియన్ కొత్త పాలకవర్గ సభ్యుల్ని యూనియన్ పెద్దలు వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులు ఉపేంద్ర లు కొత్త పాలకవర్గం నాయకులను సభ్యులను ప్రమాణ స్వీకారం చేయించారు. ఖమ్మం గ్రానైట్ మార్కర్ యూనియన్ కొత్త అధ్యక్షులుగా కిషన్ , ఉపాధ్యక్షులు పాషా, ట్రెజరర్ గా సైదులు, సెక్రటరీగా షేక్ జానీ, ఉపాధ్యక్షులు 1. గిరి, ఉపాధ్యక్షులు 2. భద్రం, ట్రెజరర్ 2. రామ్మూర్తి, జాయింట్ సెక్రెటరీ నామాల నరసింహారావు, జాయింట్ సెక్రెటరీ 2. హనుమంతు, ఈసీ మెంబర్స్ వడ్లకొండ శీను శ్రీకాంత్, వెంకటేష్, అంజి, ఫయాజ్,దిలీప్, హలీం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన అధ్యక్షుడు కిషన్ మాట్లాడుతూ గ్రూప్ అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ పాటు పడతానని , గ్రూపులో ఉన్న సభ్యులకు ఏ సమస్య వచ్చినా వెనువెంటనే స్పందించి, ప్రతి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు . ప్రతి సభ్యునికి నా సహాయ సహకారాలు అందిస్తానని , అధ్యక్ష పదవికి న్యాయం చేస్తానని తెలిపారు.

# వికారాబాద్ జిల్లాలో వారానికి రెండు రోజులు 'ప్రజావాణి' కార్యక్రమం

**ప్రతి మంగళవారం, గురువారం ఎస్పీ స్నేహ మెహ్రాతో నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం**

**వికారాబాద్, డిసెంబర్ 3 (మనసులో మాట):**



వికారాబాద్ జిల్లా ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు, ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న మరియు 'అడ్వర్స్' (ప్రతికూల) పిటిషన్లపై ప్రత్యేక దృష్టి సారించేందుకు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఒక ముఖ్యమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ గారిని ప్రజలు వారంలో అన్ని రోజుల్లోనూ కలవడానికి, ఫిర్యాదు చేయడానికి అవకాశం ఉన్నప్పటికీ, పెండింగ్ మరియు అడ్వర్స్ ఫిర్యాదుదారుల కోసం ప్రత్యేకంగా వారానికి రెండు రోజులు "ప్రజావాణి" కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రోజులు: ప్రతి మంగళవారం మరియు గురువారం. సమయం: ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు. ఈ రెండు రోజుల్లో పెండింగ్, అడ్వర్స్ లేదా ఇతర ఏమైనా ఫిర్యాదులు ఉన్నా, ఫిర్యాదుదారులు తమ సమస్యలను నేరుగా ఎస్పీ దృష్టికి తీసుకురావచ్చు అని జిల్లా ఎస్పీ తెలియజేశారు. వికారాబాద్ జిల్లా ప్రజలు ఈ అద్భుత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఎలాంటి సంకోచం లేకుండా, ధైర్యంగా తమ సమస్యలను విన్నవించుకోవాలని ఎస్పీ స్నేహ మెహ్రా కోరారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

**డీజేఎఫ్ (డబ్ల్యూ) డిమాండ్**

**జిల్లా పరిపాలన అధికారికి వినతి పత్రం అందజేత**

**పెద్దపల్లి, డిసెంబర్ 3 (మనసులో మాట):/**



పెద్దపల్లి జిల్లాలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ వెంటనే ఇండ్ల స్థలాలు కేటాయించాలని డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (వర్కింగ్) – డీజేఎఫ్ (డబ్ల్యూ) జిల్లా అధ్యక్షులు కన్నూరి రాజు డిమాండ్ చేశారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా పరిపాలన అధికారి (డి.ఏ.ఓ.) బండి ప్రకాష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కన్నూరి రాజు మాట్లాడుతూ, జిల్లాలో గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిస్టులు వివిధ పత్రికలు, ఛానళ్లలో పనిచేస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వ్యవహరిస్తున్నారని గుర్తు చేశారు. అయితే, వీరిలో చాలామంది నిరుపేద కుటుంబాలకు చెందినవారని, కనీసం సొంత ఇల్లు లేక కిరాయి ఇళ్లలో ఉంటూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని ఆదాయంతో అద్దెలు చెల్లించడం వారికి భారంగా మారిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని, ఇండ్ల స్థలాలు అందిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జిల్లాలో అర్హులైన జర్నలిస్టులను గుర్తించి, వెంటనే ఇండ్ల స్థలాలు కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో డీజేఎఫ్ (డబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షులు కోల శ్రీనివాస్, జాతీయ పి.ఆర్.ఓ. మామిడి స్వామి, మహిళా అధ్యక్షురాలు వోడ్నాల లత, ప్రధాన కార్యదర్శి కన్నూరి జేష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు వెన్నంపల్లి శ్రీనివాస్, బంధాల రాజశేఖర్, బడికెల కృష్ణ, వోడ్నాల తిరుపతి, రాజకుమార్, ప్రచార కార్యదర్శి మాదాసి శ్రావణ్ కుమార్, ఎం.లక్ష్మణ్, అసంపల్లి స్వామి, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

# సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో అరుదైన చికిత్స


- 5 కిలోల భారీ అండాశయ గడ్డ తొలగింపు
- 75 ఏళ్ల వృద్ధురాలిపై విజయవంతంగా శస్త్రచికిత్స చేసిన వైద్య బృందం

**వరంగల్, డిసెంబర్ 3 (మనసులో మాట):**

వరంగల్‌లోని సి.కె.ఎం. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి (గవర్నమెంట్ మేటర్నిటీ హాస్పిటల్) వైద్య బృందం ఒక అరుదైన, క్లిష్టమైన శస్త్రచికిత్సను బుధవారం విజయవంతంగా నిర్వహించింది. దాదాపు 75 ఏళ్ల వృద్ధ మహిళపై ఈ బృందం భారీ అండాశయ గడ్డ (ఓవరియన్ సిస్టు) తొలగింపు ఆపరేషన్‌ను పూర్తి చేసింది. దాదాపు రెండేళ్లుగా పొత్తికడుపు ఉబ్బరంతో బాధపడుతూ, వయసు అధికం కారణంగా అనేక ఆసుపత్రులు శస్త్రచికిత్సకు నిరాకరించడంతో, చివరకు ఆ రోగిని సి.కె.ఎం. ఆసుపత్రికి రిఫర్ చేశారు. తొలగించిన అండాశయ గడ్డ సుమారు 30 ఐ 35 సెంటీమీటర్ల పరిమాణం, దాదాపు 5 కిలోల బరువు ఉంది. ప్రసూతి అండ్ స్త్రీరోగ విభాగాధిపతి డా. స్వరూప గారి మార్గదర్శకత్వంలో, హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. లక్ష్మీదేవి పర్యవేక్షణలో ఈ శస్త్రచికిత్స జరిగింది. అసోసియేట్ ప్రొఫెసర్ డా. జ్యోతిర్మయి నాయకత్వంలో సీనియర్ రెసిడెంట్లు డా. జారా, డా. స్నేహ మరియు రెసిడెంట్లు డా. మౌనిక, డా. అఖిల, డా. నమ్రత, డా. సుష్మిత, డా. చిన్మయి, డా. షబీనాలు, స్క్రబ్ నర్సులు శ్రీమతి సౌజన్య, శ్రీమతి సుగుణలతో కూడిన బృందం ఆపరేషన్‌ను పూర్తి చేసింది. ప్రొఫెసర్ డా. బేబీ రాణి నేతృత్వంలో డా. యాస్మిన్ అంజుమ్, డా. సైఫ్, డా. రమేష్‌లతో కూడిన అనస్థీషియా బృందం



శస్త్రచికిత్స సమయంలో రోగిని నిశితంగా పర్యవేక్షించింది. శస్త్రచికిత్స తరువాత రోగి పరిస్థితి స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆమె ఐ.సి.యు.లో వైద్యుల పర్యవేక్షణలో ఉండి, ఆరోగ్యం మెరుగుపడుతోందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఈ విజయవంతమైన శస్త్రచికిత్స ద్వారా సి.కె.ఎం. ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న మెరుగైన వైద్య సేవలు మరోసారి నిరూపితమయ్యాయి.



# తిరిగి టీంలోకి వచ్చిన శుభ్‌మన్

## టీ20 సిరీస్‌కు ఇండియా జట్టు ప్రకటన

దక్షిణాఫ్రికాతో జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు బీసీసీఐ భారత జట్టును ప్రకటించింది. మెడ గాయం కారణంగా దక్షిణాఫ్రికాతో జరిగే వన్డే సిరీస్‌కు దూరమైన వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తిరిగి జట్టులోకి వచ్చాడు. సూర్యకుమార్ యాదవ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. దక్షిణాఫ్రికా ప్రస్తుతం టీమిండియా వన్డేలు ఆడుతోంది. రెండో వన్డే రాయ్‌పూర్‌లో జరుగుతోంది. మూడో వన్డే ఆరో తేదీ విశాఖలో జరగనుంది. ఈ సిరీస్‌కు రాహుల్ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ డిసెంబర్ 9 నుంచి డిసెంబర్ 19 వరకు జరుగుతుంది. డిసెంబర్ 9 నుంచి ప్రారంభమయ్యే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు బీసీసీఐ 15 మంది సభ్యుల భారత జట్టును ప్రకటించింది. 2025 ఆసియా కప్‌లో ఆడిన జట్టునే సెలక్టర్లు ఎంపిక చేశారు. వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ నలుగురు స్పిన్నర్లు. అదనంగా, 15 మంది సభ్యుల జట్టులో ముగ్గురు ఫాస్ట్ బౌలర్లు ఉన్నారు: జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా. బ్యాటింగ్ విభాగంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జితేష్ శర్మ, సంజూ శాంసన్ ఉన్నారు. జితేష్, శాంసన్ ఇద్దరు వికెట్ కీపర్లు. దక్షిణాఫ్రికాతో జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు భారత జట్టు - సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివం దూబే, అక్షర్ పటేల్, జితేష్ శర్మ, సంజు శామ్సన్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్ భారత్–దక్షిణాఫ్రికా మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్ డిసెంబర్ 9న కటక్‌లో జరుగుతుంది. రెండో టీ20 మ్యాచ్ డిసెంబర్ 11న న్యూ చండీగఢ్‌లో, మూడో టీ20 మ్యాచ్ డిసెంబర్ 14న ధర్మశాలలో జరుగుతుంది. నాలుగో టీ20 మ్యాచ్ డిసెంబర్ 17న లక్నోలో, చివరి, ఐదవ టీ20 మ్యాచ్ డిసెంబర్ 19న అహ్మదాబాద్‌లో జరుగుతుంది.



# మోహిత్ శర్మ క్రికెట్‌కు వీడ్కోలు

టీమిండియా వెటరన్ పేసర్ మోహిత్ శర్మ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు అన్ని ఫార్మాట్స్‌కు అధికారికంగా రిటైర్మెంట్ ప్రకటిస్తున్నానని తెలిపాడు. బుధవారం ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా 37 ఏళ్ల మోహిత్ శర్మ తన నిర్ణయాన్ని వెల్లడించాడు.'ఈ రోజు నేను అన్ని ఫార్మాట్లకు వీడ్కోలు పలుకుతున్నాను. హర్యానాకు ప్రాతినిథ్యం వహించడం నుంచి భారత్ జెర్సీ ధరించి ఐపీఎల్ ఆడేవరకు సాగిన నా ప్రయాణం నాకు దక్కిన వరం.'అని మోహిత్ శర్మ పేర్కొన్నాడు. మోహిత్ శర్మ రిటైర్మెంట్‌పై తన చివరి ఐపీఎల్ టీమ్ ఢిల్లీ క్యాపిటల్స్ స్పందించింది. 'మీ బ్యాక్-ఆఫ్-ది-హ్యాండ్ స్లోయర్ బంతులతో డెత్ ఓవర్లలో బౌలింగ్‌ను విప్లవాత్మకం చేశారు. గొప్ప కెరీర్‌కు అభినందనలు, మోహిత్ భాయ్' అని ప్రశంసించింది.అంతర్జాతీయ క్రికెట్‌లో మోహిత్ శర్మ సుదీర్ఘ కాలం ఆడకపోయినప్పటికీ బౌలర్‌గా తనదైన ముద్ర వేసుకున్నాడు. హర్యానాతో దేశవాళీ క్రికెట్ కెరీర్ ప్రారంభించిన మోహిత్ శర్మ.. భారత్‌కు కూడా ప్రాతినిథ్యం వహించాడు. కానీ ఐపీఎల్ 2013లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున మెరుగైన ప్రదర్శన చేయడంతోనే అతనికి గుర్తింపు లభించింది. ముఖ్యంగా డెత్ ఓవర్ల స్పెషలిస్ట్‌గా అతనికి ప్రత్యేక గుర్తింపు ఉంది. భారత్ తరఫున 2013లో జింబాబ్వేతో జరిగిన వన్డే మ్యాచ్‌తో మోహిత్ శర్మ అరంగేట్రం చేశాడు. 2015 వన్డే ప్రపంచకప్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. భారత్ తరఫున 26 వన్డేలు ఆడి 31 వికెట్లు, 6 టీ20ల్లో 6 వికెట్లు తీసాడు. 2015లోనే మోహిత్ శర్మ అంతర్జాతీయ కెరీర్ ముగిసింది. ఆ తర్వాత అతనికి అవకాశాలు రాలేదు. చివరిసారిగా అతను సౌతాఫ్రికాతో 2015లో వన్డే మ్యాచ్ ఆడాడు. ఐపీఎల్‌లో మోహిత్ శర్మ చెన్నై సూపర్ కింగ్స్ (2013-2015, 2019), పంజాబ్ కింగ్స్ (2016-2018), ఢిల్లీ క్యాపిటల్స్ (2020), గుజరాత్ టైటాన్స్ (2023-2024) తరఫున ఆడాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిథ్యం వహించాడు. ఐపీఎల్‌లో మొత్తం 120 మ్యాచ్‌లు ఆడిన మోహిత్.. 134 వికెట్లు పడగొట్టాడు.

# కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్ స్వైరవిహారం



రాయ్‌పూర్‌లో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో వన్డేలో రుతురాజ్‌గైక్వాడ్, విరాట్ కోహ్లీ సెంచరీలతో రెచ్చిపోయారు. మొదట్లో బ్యాటింగ్ చేయడానికి భారత్ బ్యాట్స్‌మెన్ కాస్త ఇబ్బంది పడ్డారు. అదే టైంలో సఫారీలు మాత్రం వైడ్‌ల రూపంలో పరుగులు సమర్పించుకోవడంతో భారత్‌పై ఒత్తిడి పడలేదు. అయితే 62 పరుగుల వద్ద భారత్ రెండు వికెట్లు కోల్పోయింది. అప్పుడు కోహ్లీకి గైక్వాడ్ జత కలిసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఈ మ్యాచ్‌లో రుతురాజ్ గైక్వాడ్ 77 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. 105 పరుగులు వద్ద అవుట్ అయ్యాడు. తర్వాత విరాట్ కోహ్లీ 90 బంతుల్లో సెంచరీ చేశాడు. తర్వాత స్కోరు పెంచే క్రమంలో 102 పరుగులకు అవుట్ అయ్యాడు. తన ఇన్నింగ్స్‌లో 7 ఫోర్‌లు, రెండు సిక్స్‌లు కొట్టాడు. మూడు మ్యాచ్‌ల ద్వైపాక్షిక సిరీస్‌లో భారత్ vs దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న రెండవ 50 ఓవర్ల మ్యాచ్‌లో ఆడుతూ విరాట్ కోహ్లీ తన 53వ వన్డే సెంచరీని సాధించాడు. ఈ ఇన్నింగ్స్‌తో, అతను చరిత్రలో అత్యధిక వన్డే సెంచరీల రికార్డును తానే బద్దలు కొట్టాడు, 49 సెంచరీలతో రెండో స్థానంలో ఉన్న సచిన్ టెండూల్కర్ కంటే నాలుగు సెంచరీలు ముందంజలో ఉన్నాడు. ఈరోజు కోహ్లీ 90 బంతులు ఎదుర్కొని, రెగ్యులర్ స్ట్రైక్ రొటేషన్, హిట్టింగ్‌తో అద్భుతమైన సెంచరీ సాధించాడు. టాప్ 5లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మాత్రమే యాక్టివ్ ప్లేయర్లు, ఇప్పట్లో విరాట్ నెమ్మదించే సూచనలు కనిపించడం లేదు. అతను తన ఆటను ముగించే సమయానికి ఈ సంఖ్యను మరింత పెంచే అవకాశం ఉన్నట్టు స్పష్టమవుతోంది. మూడో స్థానంలో ఉన్న రోహిత్ కూడా తన సెంచరీల సంఖ్యను ఎంత పెంచినా మూడో స్థానం దాటి వెళ్లే అవకాశాలులేవు. రుతురాజ్ గైక్వాడ్ జాతీయ జట్టు తరపున తన తొలి సెంచరీని నమోదు చేయడం ద్వారా వ్యక్తిగత మైలురాయిని చేరుకున్నాడు. ఇండియా A తరపున ఇంతకు ముందు సెంచరీలు చేశాడు, కానీ సీనియర్ జట్టు తరపున ఇది అతని తొలి సెంచరీ. న్యూ రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో 77 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సర్లు బాది ఈ ఘనతను సాధించాడు. ఈ చిరస్మరణీయ సెంచరీ సాధించడంలో, గైక్వాడ్ విరాట్ కోహ్లీతో కలిసి 150 పరుగుల భాగస్వామ్యాన్ని కూడా నెలకొల్పాడు. వీరు ఇద్దరూ కలిసి భారత్‌ను స్థిరమైన రన్‌రేటుతో భారత్ స్కోరు పెంచడంలో కీలక పాత్ర పోషించారు. ఈ పిచ్‌పై విజయం సాధించాలంటే 300 పరుగుల మార్కును దాటాల్సి ఉంటుంది. రాంచీలో జరిగిన తొలి ODI మ్యాచ్‌లో 350 పరుగుల లక్ష్యాన్ని ఇచ్చినా ప్రోటీస్ జట్టుకు గట్టి పోటీనిచ్చింది. ఈరోజు గెలిస్తే భారత్‌కు సిరీస్ విజయం లభిస్తుంది, ఇది ఆస్ట్రేలియాతో జరిగిన 2-1 ODI సిరీస్‌ను కోల్పోయిన తర్వాత, దక్షిణాఫ్రికాతో జరిగిన 2-0 టెస్ట్ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన తర్వాత కూడా వారికి మంచి బూస్ట్‌లా మారుతుంది.

# స్వదేశంలో కోహ్లీ 6,500 వన్డే పరుగులు

దక్షిణాఫ్రికాతో జరుగుతోన్న రెండో వన్డేలో టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ మరో ఘనత సాధించాడు. మొన్న రాంఛీలో జరిగిన తొలి వన్డేలో సెంచరీ సాధించిన కోహ్లీ.. ఇప్పుడు రెండో వన్డేలోనూ సెంచరీతో అదరగొట్టాడు. దీంతో వన్డేల్లో అత్యధిక శతకాలు సాధించిన రెండో బ్యాటర్‌గా ఘనత సాధించడం సహా స్వదేశంలో 6,500 వన్డే పరుగులు చేసిన రెండవ బ్యాటర్‌గానూ నిలిచాడు. రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ స్టేడియంలో దక్షిణాఫ్రికాతో జరిగిన 2వ వన్డేలో కోహ్లీ ఈ మైలురాయిని చేరుకున్నాడు. అయితే కోహ్లీ కంటే ముందు అత్యధిక సెంచరీలు, స్వదేశంలో 6,500 పరుగులు రాబట్టిన బ్యాటర్ల లిస్టులో మాస్టర్ బ్లాస్టర్ సచిన టెండూల్కర్ ముందున్నాడు. ఆ తర్వాత రెండో స్థానంలో విరాట్ కోహ్లీ నిలిచాడు. రాయ్‌పూర్‌లో జరుగుతోన్న వన్డేలో కోహ్లీ తన 40వ పరుగుతో సచిన్ టెండూల్కర్ మైలురాయిని చేరుకున్నాడు. అయితే విరాట్ కోహ్లీ మాత్రం తన 126 మ్యాచ్ (123 ఇన్నింగ్స్)లో స్వదేశంలో జరిగిన వన్డే మ్యాచ్‌ల్లో 6,500 పరుగులు రాబట్టిన ఈ ఘనత సాధించడం గమనార్హం. అయి-ంతే సచిన్ టెండూల్కర్ మాత్రం తాను ఆడిన 164 స్వదేశీ వన్డేల్లో 48.11 సగటుతో 6,976 పరుగులు రాబట్టి ఆ జాబితాలో తొలిస్థానంలో ఉన్నాడు. సచిన్ కేవలం 20 సెంచరీలు, 38 హాఫ్ సెంచరీలు సాధించాడు. మరోవైపు విరాట్ కోహ్లీ ఇప్పటికే 25 సెంచరీలు సాధించి.. స్వదేశీ వన్డేల్లో అత్యధిక సెంచరీలు సాధించిన బ్యాటర్‌గా నిలిచాడు. విరాట్ కోహ్లీ, సచిన టెండూల్కర్ తప్ప మరెవరూ టీమ్‌ఇండియా బ్యాటర్లు స్వదేశంలో జరిగిన వన్డేల్లో 5,500 పరుగులు చేయకపోవడం గమనార్హం. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ 5,406 రన్స్ చేసి ఈ జాబితాలో కోహ్లీ కంటే వెనుక స్థానంలో ఉన్నాడు. అదే విధంగా స్వదేశంలో 5,000 కంటే ఎక్కువ పరుగులు చేసిన మరో ఆటగాడిగా జాక్వెస్ కల్లిస్ కూడా ఈ జాబితాలో ఉన్నాడు. క్రికెట్ గణాంకాల ప్రకారం.. స్వదేశంలో వన్డేల్లో విజయవంతమైన రన్-ఛేజింగ్‌లలో కోహ్లీ అత్యధిక పరుగులు సాధించాడు. ఈ విషయంలో అతను 82.12 సగటుతో (11 సెంచరీలు) 2,710 పరుగులు సాధించాడు. సచిన్ 2,308 పరుగులతో కోహ్లీ తర్వాతి స్థానంలో ఉన్నాడు.

# చిక్కుల్లో పేసర్ హర్షిత్ రాణా



టీమిండియా స్టార్ పేసర్ హర్షిత్ రాణా చిక్కుల్లో పడ్డాడు. సౌతాఫ్రికాతో తొలి వన్డేలో అత్యుత్సాహం ప్రదర్శించిన హర్షిత్ రాణాపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) కఠిన చర్యలు తీసుకుంది. ఐసీసీ రూల్స్‌కు విరుద్ధంగా ప్రవర్తించినందుకు గట్టిగా మందలించడంతో పాటు ఓ డీ మెరిట్ పాయింట్ కేటాయించింది. రాంచీ వేదికగా గత ఆదివారం జరిగిన తొలి వన్డేలో హర్షిత్ రాణా ప్రత్యర్థి ఆటగాళ్లను ఔట్ చేసిన తర్వాత అతిగా సంబరాలు చేసుకున్నారు. ముఖ్యంగా డెవాల్డ్ బ్రెవిస్ వికెట్ తీసి పెవిలియన్‌కు వెళ్లిపోవాలంటూ సైగలు చేశాడు. ఈ ఓవరాక్షన్‌పై అంపైర్లు మ్యాచ్ రిఫరీకి ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి చర్యలు తీసుకున్నారు. ఈ నేరాన్ని హర్షిత్ రాణా అంగీకరించడంతో వార్నింగ్‌తో పాటు ఓ డీ మెరిట్ పాయింట్ కేటాయించింది. ఈ మేరకు ఐసీసీ ఓ ప్రకటనను విడుదల చేసింది.'గత 24 నెలల్లో హర్షిత్ రాణాకు ఇది డీమెరిట్ పాయింట్. ఈ కుడిచేతి వాటం పేసర్ తన తప్పిదాన్ని అంగీకరించాడు. మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ విధించిన శిక్షకు సమ్మతం తెలిపాడు. హర్షిత్ రాణా ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్లేయర్స్ అండ్ ప్లేయర్ సపోర్ట్ పర్సనల్ నిబంధనల్లోని ఆర్టికల్ 2.5 రూల్‌ను ఉల్లంఘించాడు. ఈ రూల్ ప్రకారం అంతర్జాతీయ మ్యాచ్‌లో బ్యాటర్ ఔటైనప్పుడు రెచ్చగొట్టేలా ప్రవర్తించడం, సైగలు చేయడం చేయవద్దు.'అని ఐసీసీ తమ ప్రకటనలో పేర్కొంది. రెండేళ్ల కాలంలో ఒక ఆటగాడి ఖాతాలో నాలుగు డీమెరిట్ పాయింట్స్ చేరితే ఓ టెస్ట్ మ్యాచ్ లేదా రెండు వన్డేలు, రెండు టీ20లు ఆడకుండా నిషేధం విధిస్తారు. ప్రస్తుతం హర్షిత్ రాణా ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్ చేరింది. మరో రెండేళ్ల కాలంలో మరో మూడు డీమెరిట్ పాయింట్స్ చేరితే హర్షిత్ రాణాపై నిషేధం పడనుంది. ఐపీఎల్‌లో హర్షిత్ రాణా ఫ్లయింగ్ కిస్ సెలెబ్రేషన్స్‌తో ఓ మ్యాచ్ నిషేధం ఎదుర్కొన్నాడు. మూడు సార్లు తన తప్పిదాన్ని రిపీట్ చేయడంతో ఐపీఎల్ నిర్వాకులు అతన్ని ఓ మ్యాచ్ ఆడకుండా నిషేధం విధిస్తూ కఠిన చర్యలు తీసుకున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లోనూ అతనే అదే శైలిని కొనసాగిస్తున్నాడు. రాంచీ వన్డేలో హర్షిత్ రాణా అద్భుతమైన బౌలింగ్‌తో భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. 10 ఓవర్లు బౌలింగ్ చేసి 65 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో భారత్ 17 పరుగుల తేడాతో విజయం సాధించి మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచిన సంగతి తెలిసిందే.



# టీమిండియా టీ20 జెర్సీ ఆవిష్కరణ

అప్‌కమింగ్ ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా ధరించే జెర్సీని మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఆవిష్కరించాడు. బుధవారం సౌతాఫ్రికాతో రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో వన్డే విరామ సమయంలో ఈ జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితుడైన రోహిత్.. ముఖ్య అతిథిగా హాజరై భారత జెర్సీని ఆవిష్కరించాడు. రోహిత్ శర్మతో పాటు టీమిండియా టీ20 ప్లేయర్ తిలక్ వర్మ కూడా ఈ కార్యక్రమంలో భాగమయ్యాడు. బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియాతో పాటు టీమిండియా జెర్సీ స్పాన్సర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ మ్యాచ్‌లో భారత బ్యాటింగ్ ముగియగానే భారీ సైజ్ టీ20 ప్రపంచకప్ జెర్సీని మైదానంలో ప్రదర్శించారు. అనంతరం తిలక్ వర్మతో కలిసి రోహిత్ శర్మ ఈ జెర్సీలను బ్రాడ్‌కాస్టర్స్‌తో పాటు మీడియాకు చూపించాడు. నీలిరంగులో ఉన్న ఈ జెర్సీ.. రెండు వైపులా వైబ్రెంట్ ఆరెంజ్ ప్యానెల్స్ ఉన్నాయి. జెర్సీపై వర్టికల్ బ్లూ స్ట్రైప్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా రోహిత్ శర్మ మాట్లాడుతూ.. టీమిండియా రెండో టీ20 ప్రపంచకప్ గెలుచుకునేందుకు 15 ఏళ్ల నిరీక్షించాల్సి వచ్చిందని చెప్పాడు.'ఇది సుదీర్ఘ ప్రయాణం. మేం 2007లో మా తొలి ప్రపంచకప్‌ను గెలిచాం. ఆ తర్వాత మరో ప్రపంచకప్ గెలవడానికి 15 ఏళ్ల కంటే ఎక్కువ కాలం వేచి ఉండాల్సి వచ్చింది. ఎన్నో ఒడిదుడుకులతో ఈ ప్రయాణం సాగింది. కానీ మళ్లీ ట్రోఫీని ఎత్తడం గొప్ప అనుభూతిని ఇచ్చింది. ఇప్పుడు భారత్‌లో ప్రపంచకప్ జరుగుతుండటం ఉత్సాహపరిచే విషయం. భారత జట్టుకు నా మద్దతు శుభాకాంక్షలు ఎప్పుడూ ఉంటాయి. జట్టులోని ప్రతీ ఒక్కరు విజయం కోసం కృషి చేస్తారని భావిస్తున్నా.'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

## ప్రియాంక చోప్రాకు కల్కిలో ఆఫర్?



ప్రపంచవ్యాప్తంగా స్టార్‌డమ్ సంపాదించిన గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రాకు తెలుగు ప్రేక్షకులలోను ప్రత్యేక గుర్తింపు ఉంది. మోడల్‌గా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత బాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకు తనదైన ముద్ర వేసుకున్న ఆమె మహేష్ బాబు-ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం వారణాసిలో మందాకిని అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. మహేష్ బాబు కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఈవెంట్‌లో ప్రియాంక తన లుక్‌తో ఆకట్టుకుంది. అయితే ఒకవైపు వారణాసి చిత్రం చేస్తున్న ప్రియాంక చోప్రా ఇప్పుడు మరో తెలుగు సినిమాకి సైన్ చేసిందని అంటున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న కల్కి 2 కోసం ఆమెని సంప్రదించగా దానికి ప్రియాంక గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని అంటున్నారు. కల్కి తొలి పార్ట్‌లో నటించిన దీపికా పదుకొణెళి పలు కారణాల వలన తప్పుకోవడంతో ఆ స్థానంలో ప్రియాంకని తీసుకుంటున్నట్టు టాక్.సీక్వెల్‌లో కమల్ హాసన్ విలన్‌గా కనిపించి తన నటనతో ప్రేక్షకుల మైండ్ బ్లాక్ చేయనున్నాడు. సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. మరి ప్రియాంక ఇందులో నటించనుందని వస్తున్న వార్తలలో నిజం ఎంత ఉందనేది తెలియాల్సి ఉంది. 2000లో మిస్ వరల్డ్‌గా కిరీటాన్ని గెలుచుకున్న ప్రియాంక, తర్వాత హిందీ చిత్రాల్లో వరుస విజయాలు సాధించారు. ఫ్యాషన్ చిత్రంతో జాతీయ ఉత్తమ నటి అవార్డును గెలుచుకుని దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందారు. ఆ తర్వాత హాలీవుడ్‌లో క్వాంటికో, బేవాచ్, సిటాడెల్ వంటి ప్రాజెక్టులతో అంతర్జాతీయ స్థాయిలో స్టార్‌డమ్ సంపాదించారు. రామ్ చరణ్‌తో కలిసి ఆమె నటించిన జంజీర్ రీమేక్‌తో టాలీవుడ్ ప్రేక్షకులకు సుపరిచితురాలయ్యారు. ఆ చిత్రం తెలుగులో తుఫాన్‌గా విడుదలైంది.

# వర్కింగ్ అవర్స్‌తో సినిమా నడవదు

### ఔట్‌పుట్ రావాలంటే..సమిష్టిగా పనిచేయాల్సిందే... తాజాగా నటులు రానా, దుల్కర్ సల్మాన్ వ్యాఖ్యలు



బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణెళి ఇటీవల వర్కింగ్ అవర్స్‌పై చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీశాయి. రోజుకు ఎనిమిది గంటల పని చాలు..అతిగా వర్క్ చేయడం ఆరోగ్యానికి మంచిది కాదు అని ఆమె చెప్పిన మాటలు హాట్ టాపిక్ అయ్యాయి. ఈ వ్యాఖ్యల కారణంగా ఆమెను 'స్పిరిట్', 'కల్కి 2' ప్రాజెక్టుల నుంచి తప్పించేశారని వచ్చిన వార్తలు మరింత వివాదాన్ని రేకెత్తించాయి. జీవితం-పని మధ్య బ్యాలెన్స్ చాలా అవసరం అని దీపిక చెప్పిన మాటలకి పలువురు సెలబ్రిటీలు ఆమెకు మద్దతు తెలిపారు. మనసు, శరీరం ఒత్తిడిలో ఉన్నప్పుడు మంచి అవుట్‌పుట్ సాధ్యం కాదని కూడా ఆమె స్పష్టం చేశారు. అయితే ఈ వివాదంపై నటుడు దగ్గుబాటి రానా తాజాగా స్పందించారు. సినిమా ఇండస్ట్రీ సాధారణ ఉద్యోగం కాదు. నటన ఒక లైఫ్‌స్టైల్. ఎనిమిది గంటలు కూర్చొని అద్భుతమైన అవుట్‌పుట్ ఇచ్చే ఫీల్డ్ ఇది కాదని రానా వెల్లడించారు. ఒక మంచి సీన్ రావాలంటే కెమెరా నుంచి లైటింగ్ వరకు, నటీనటులు నుంచి టెక్నీషియన్ల వరకూ అందరూ సమయం పట్టించుకోకుండా అంకితభావంతో పని చేస్తారని ఆయన అన్నారు. ఇక్కడ 8 గంటల రూల్ ప్రాక్టికల్‌గా చాలా కష్టం అని స్పష్టం చేశారు. నటుడు దుల్కర్ సల్మాన్ కూడా ఈ విషయంపై తన అభిప్రాయం వ్యక్తం చేశారు. వివిధ పరిశ్రమలలో వర్క్ మోడల్ ఒక్కో రకంగా ఉంటుంది. తెలుగులో మహానటి చేస్తున్నప్పుడు కొన్నిసార్లు సాయంత్రం ఆరు గంటలకే షూటింగ్ అయిపోయేది. తమిళంలో పరిస్థితి కొంచెం వేరుగా ఉంటుంది. ఆదివారాలు కూడా సెలవు ఇస్తారు. ఒక రోజు అతిగా పనిచేయడం కంటే, రోజూ కొంచెం అదనంగా పనిచేయడం బెస్ట్ అని దుల్కర్ స్పష్టం చేశారు. ఇండస్ట్రీ ధోరణి, ప్రాజెక్ట్ డిమాండ్స్ మీద వర్కింగ్ అవర్స్ ఆధారపడి ఉంటాయి అని ఆయన స్పష్టం చేశారు. మలయాళంలో షూటింగ్ ప్రారంభించిన తర్వాత ఎప్పుడు పూర్తి చేస్తారో కూడా తెలియదు.. ఇక తమిళంలో ఈ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంటుంది. ఒక రోజు అదనపు షూటింగ్ కంటే.. రోజూ కొన్ని గంటలు అదనంగా పనిచేయడం సులువే కదా' అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీపికా పదుకొణెళి వ్యాఖ్యలపై రానా,దుల్కర్ స్పందించడంతో సినీ పరిశ్రమలో వర్కింగ్ అవర్స్‌పై చర్చ మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది.

## సమంతకు నిడుమోరు గృహంలోకి ఆహ్వానం

### ఎమోషనల్ పోస్ట్ పంచుకున్న రాజ్ సోదరి శీతల్



అగ్ర కథానాయిక సమంత, దర్శకుడు రాజ్ నిడిమోరు జంటకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఇక డిసెంబర్ 2న సమంతకు అత్త వారింట్లో గ్రాండ్ వెల్‌కమ్ లభించింది. ఈ మేరకు రాజ్ సోదరి శీతల్ ఈ జంటకు విషెస్ చెబుతూ ఒక ఎమోషనల్ నోట్ పంచుకున్నారు. నిడిమోరు ఫ్యామిలీలోకి సమంతను ఆహ్వానిస్తూ ఎప్పుడూ ఆమెకు అండగా ఉంటానని అన్నారు. ప్రస్తుతం ఈ ఫ్యామిలీ ఫొటోను అభిమానులు షేర్ చేస్తున్నారు. ఆనందంతో మాటలు రావడం లేదు. గొప్ప భక్తుడు ఆర్తితో నిండిన హృదయంతో శివలింగాన్ని ఆలింగనం చేసుకుంటే ఎంత ఆనందంగా ఉంటాడో ఈరోజు నేను అలా ఉన్నాను. ఆనందబాష్పాలతో నా హృదయం ఉప్పొంగుతోంది. నేడు మా కుటుంబం పరిపూర్ణమైంది. సమంత- రాజ్ ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ముందుకుసాగుతుండడం చూసి మాకెంతో గర్వంగా ఉంది. ఒకరిపై ఒకరికి గౌరవం, నిజాయతీతో రెండు హృదయాలు ఒకే మార్గాన్ని ఎంచుకున్నప్పుడు వారి జీవితం ప్రశాంతతో నిండిపోతుంది. మేము వీరికి ఎప్పుడూ అండగా ఉంటాము' అని రాసుకొచ్చారు. ఈషా ఫౌండేషన్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు.



## ఐటమ్ సాంగ్‌లతో
# పూజ అదుర్స్

### అల్లు అర్జున్-అట్లీ సినిమాలో ఛాన్స్ వచ్చినట్లు ప్రచారం

తెలుగు సినీ పరిశ్రమలో ఒకప్పుడు టాప్ హీరోలందరి సరసన వరుసగా నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పూజా హెగ్డే, గత కొన్నేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఆమె నటించిన కొన్ని పెద్ద సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడకపోయినా స్టార్ ఇమేజ్ ఏమాత్రం తగ్గలేదు. గ్లామర్, డాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్ లాంటి అంశాల్లో పూజాతో సరితూగే వారు లేరని చెప్పాలి. అల్లు అర్జున్, మహేశ్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, ప్రభాస్, రామ్ చరణ్ వంటి అగ్రనటులతో నటించటం ఆమె కెరీర్‌కే ప్రత్యేక గుర్తింపునిచ్చింది వరుస ఫ్లాప్‌ల వల్ల లీడ్ రోల్స్ తగ్గినా, పూజా మాత్రం వెనక్కి తగ్గలేదు. హీరోయిన్‌గా కాకపోయినా, స్పెషల్ సాంగ్స్, స్పెషల్ రోల్స్ చేసుకుంటూ తన స్టార్ ప్రెజెన్స్‌ను కొనసాగించాలని నిర్ణయించుకుంది. 'కూలీ' సినిమాలో 'మౌనిక' సాంగ్ విజయంతో పూజా మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఆమె డాన్స్, లుక్స్, గ్లామర్ ఆ పాటను దక్షిణాది వ్యాప్తంగా వైరల్ చేశాయి. ఈ సాంగ్ హిట్ తర్వాత పూజాకు స్పెషల్ సాంగ్ ఆఫర్లు వరుసగా వస్తున్నాయి. ఇండస్ట్రీ టాక్ ప్రకారం, అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ ప్రాజెక్ట్‌లోని ప్రత్యేక గీతం కోసం పూజా హెగ్డేను ఫైనల్ చేసినట్లు సమాచారం. ఈ సాంగ్ కోసం ఆమెకు రూ.5 కోట్లు పారితోషికం ఆఫర్ చేసినట్లు టాలీవుడ్ సర్కిల్స్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.. ఒక ఐటెమ్ సాంగ్‌కి ఇది అరుదైన భారీ రేమ్యునరేషన్. ఇది పూజా మార్కెట్ ఇంకా బలంగానే ఉందని మరోసారి నిరూపిస్తోంది. సినిమా అవకాశాలు తగ్గినా, సోషల్ మీడియాలో మాత్రం పూజా హాట్ ఫేవరెట్. 2010లో మిస్ ఇండియా పోటీలో రెండోస్థానం సాధించి గ్లామర్ రంగంలోకి అడుగుపెట్టిన పూజా హెగ్డే 2012లో తమిళం 'ముగమూడి' ద్వారా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. 2014లో వరుణ్ తేజ్ సరసన 'ముకుంద' తో టాలీవుడ్‌కి పరిచయం కాగా, ఆ తర్వాత 'ఒక లైలా కోసం', బాలీవుడ్‌లో 'మోహెంజో దారో' వంటి సినిమాలతో ప్రయాణం కొనసాగించింది. ప్రస్తుతం ఆమె ప్రధాన పాత్రలకంటే స్పెషల్ సాంగ్‌లపైనే దృష్టి పెడుతుంది. స్పెషల్ సాంగ్‌లతో తన మార్కెట్‌ను తిరిగి పదిలం చేసుకుంటున్న పూజా, త్వరలోనే మళ్లీ స్టార్ హీరోల సరసన హీరోయిన్‌గా కనిపించే అవకాశాలు బలంగా ఉన్నాయని టాక్.

# ఐఎండీబీ పాపులర్ నటులు, దర్శకుల జాబితా

### సైయారా నటులు, దర్శకుడికి తొలిస్థానం

### తెలుగు నుంచి చోటు దక్కించుకోని తెలుగు స్టార్స్



సినిమాలకు సంబంధించి రేటింగ్ పరంగా అత్యంత విశ్వసనీయత కలిగిన ఆన్‌లైన్ వేదికగా పేరున్న ఇంటర్నెట్ మూవీ డేటా బేస్ ఐఎండీబీ ప్రతి ఏడాది సినిమాలతో పాటు తారలకు సంబంధించి వివిధ కేటగిరీలలో ప్రేక్షకాదరణ పొందిన జాబితాను ప్రకటిస్తున్నది. తాజాగా ఈ ఏడాది పాపులర్‌గా నిలిచిన తారల జాబితాను విడుదల చేసింది. ఇందులో తెలుగు నుంచి ఒక్కరు కూడా చోటు దక్కించుకోకపోవడం విశేషం. సైయారా సినిమాతో సూపర్ హిట్ అందుకున్న బాలీవుడ్ యువ నటులు ఆహన్ పాండే, అనిత్ పడ్డా.. వరుసగా మొదటి రెండు స్థానాలను కైవసం చేసుకున్నారు. మోహిత్ సూరి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌ను అందుకుంది. ఇక కూలీ కామియోతో మెరిసిన ఆమిర్ ఖాన్ ఈ ఏడాది మోస్ట్ పాపులర్ తారల జాబితాలో మూడవ స్థానంలో నిలిచాడు. హోమ్ బౌండ్ సినిమాతో మెప్పించిన ఇషాన్ ఖట్టర్ నాలుగవ స్థానంలో నిలువగా.. బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్ సినిమాతో అలరించిన నటుడు లక్ష్య ఐదవ స్థానంలో దక్కించుకున్నాడు. రష్మిక మందన్నా ఆరో స్థానంలో నిలువగా.. లోక చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న కళ్యాణి ప్రియదర్శన్ ఏడో స్థానం దక్కించుకుంది. ధడక్ సినిమాలో నటనకు గాను తృప్తి డిమ్రి ఎనిమిదో స్థానంలో నిలువగా.. రుక్మిణి వసంత్ 9వ స్థానం, రిషబ్ శెట్టి 10వ స్థానం దక్కించుకున్నారుదర్శకుల జాబితాలో ఐఎండీబీ విడుదల చేసిన డేటా ప్రకారం ఈ ఏడాది మోస్ట్ పాపులర్ దర్శకులు ఎవరు అనేది చూసుకుంటే. సైయారాతో సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు మోహిత్ సూరి ఈ ఏడాది మోస్ట్ పాపులర్ దర్శకులలో అగ్ర స్థానంలో నిలిచాడు. బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్‌తో ఎంట్రీ ఇచ్చిన షారుఖ్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ ఈ ఏడాది రెండో స్థానంలో నిలిచాడు. కూలీ సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న లోకేష్ కనకరాజ్ మూడో స్థానంలో నిలువగా.. నిశాంఛీతో హిట్ అందుకున్న అనురాగ్ కశ్యప్ నాలుగో స్థానంలో, ఎల్ 2 ఎంపురాన్ సినిమాతో హిట్ అందుకున్న పృథ్వీరాజ్ సుకుమారన్ ఐదో స్థానంలో నిలిచారు. ఆమిర్ ఖాన్‌తో సితారే జమీన్ పర్ లాంటి సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు ఆర్.ఎస్. ప్రసన్న ఆరో స్థానంలో నిలువగా.. మెట్రో ఇన్ డినోతో అనురాగ్ బసు ఏడో స్థానంలో నిలిచాడు. మలయాళం కొత్త లోక సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న దర్శకుడు డొమినిక్ అరుణ్ ఎనిమిదో స్థానంలో చోటు దక్కించు కోగా.. ఛావా దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ 9వ స్థానం, హోమ్ బౌండ్ చిత్రంతో నీరజ్ ఘైవాన్ 10వ స్థానంలో చోటు దక్కించుకున్నాడు.

CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861